
# జయకాంతన్ కథలు



మూలం: తమిళం

అనువాదం: ఏండీ సుందరేశన్

# JAYAKANTHAN KATHALU

(Anthology of Telugu Short Stories)

తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

ISBN: 978-1-61584-140-0

First Edition, 2018
© D. Jayakanthan/Andy Sundaresan

***Cover Design:***

DeAndre Thomas (Dre Productions)

***Photo Credits:***

Jayakanthan’s Photo on the front cover:
    Source: Jayakanthan Pavazamalar, 2008
    Nakkeeran Publications, Chennai 600 014, India
    Used with permission

**Printed at:**

The Copy World
2001 3rd Street,
San Francisco, CA 94107
Phone: 800.930.COPY

# జయకాంతన్ కథలు

## మూలం: తమిళం

## అనువాదం: ఏండీ సుందరేశన్

**Published By**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue # 610**
**El Cerrito, CA 94530, USA**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

# ఇందులో . . . .

## కధలు

1. నిజం నిప్పులాగ
2. తర్కంకి లొంగని అనుభవం . . .
3. రేఖలు దాటని ముగ్గులు
4. నేనేం చెయ్యాలి చెప్పండి!
5. తప్పులు, నేరాలుకావు!
6. దెయ్యం వేదం వల్లించనీ!
7. అంధకారంలో ఆశ్రయం
8. లక్షాధిపతులు
9. ఛందస్సు మీరిన పద్యం
10. పాత జ్ఞాపకాలు

# నిజం నిప్పులాగ

ఆ దృశ్యం చూసి సోమనాధన్ కన్నులు గుచ్చుకున్నాయి. పరమహంస, వివేకానందా రెండుపక్కలా కనిపిస్తున్నారు. ఆ వరుసలో తన పటమా? ముఖం చిట్లించుకుంటూ, కళ్ళద్దాలని బాగా ఎత్తి, లేచి, గోడదగ్గరకి వెళ్ళి బాగా పరిశీలించారు.

అప్పుడు లోపలికి హార్లిక్స్ తయారుచెయ్యడానికి వెళ్ళిన అతని మేనకోడలు కోదై చెయిలో cup and saucer తో హాలుకి వచ్చింది. సోమనాధన్ ఆమెను తిరిగిచూసారు.

“ఇది ఎవరి పని?” అని అతను తన పటాన్ని చేతివేలుతో చూపుతూ అడిగారు.

చెయిలోనిది టీపాయిమీద పెట్టి అతనిపక్కన నిలబడి కోదై మాట్లాడింది: “నేను ఈ ఇంటికి రావడానికి ముందే అది అక్కడవుంది. తను ఆరాధించే మేధావులు మీరు అని మావారు అందరికీ పరిచయం చేస్తారు. నాదగ్గరకూడా అలాగే చెప్పారు,” అని ఆమె చెప్తూంటే సోమనాధన్ కళ్ళద్దాలు తీసి, తను కప్పుకున్న శాలువతో తుడుచుకుంటూ గిలి గిలి నవ్వుతో అన్నారు: “ఎంత విచిత్రమైన కలయిక! ఈ ఆస్తిక మహనీయులమధ్య నిరీశ్వరుడైన నా పటమా?” అని గొణుక్కుంటూ ముంజెయిలోవున్న చేతికర్రను కుడిచెయిలో మార్చుకొని మెల్లగా నడిచి సోఫాలో కూర్చున్నారు.

కోదై అతనికి హార్లిక్స్ అందించింది; వృధ్యాప్యంలో నీరసించిన చేతులు వొణుకుతూ అతను దాన్ని తాగారు. ఆ వేడి పానీయం తాగడంతో అతని నుదుట చెమటపోవడం గమనించి కోదై electric fan మీట నొక్కింది. వెంటనే ఆ గాలిలో తల నెఱసి గుబురుగా పెరిగిన అతని జుత్తు నుదుటమీద దొర్లాడింది. సోమనాధన్ చూపు ఆ హాలుచుట్టూ వ్యాపించి అక్కడున్న రేడియో; ఆ మూలను అలంకరిస్తున్న బుద్ధుని విగ్రహం; కిటికీలని మూసిన నీలరంగు తెర; ఆఖరికి కోదై ముఖంమీద స్థిరపడింది. అతను అనురాగంతో ఒక పసిపాపలాగ ఒక చిరునవ్వు నవ్వారు.

ఆ చిరునవ్వుకి అర్థం, “అమ్మాయీ! నువ్వు చాలా బుద్ధిమంతురాలివి; నీ ఇంటిని ఎంత చక్కగా చూసుకుంటున్నావు!” అని పొగడుతున్నట్లు, “నువ్వెలాగ ఉన్నావు?”

అని అడుగుతున్నట్లు, “నిన్ను చూసి నాకు చాలా తృప్తిగావుంది,” అని గర్వపడుతున్నట్లు, ఉంది.

అన్ని అర్థాలకి జవాబు చెప్తున్నట్టు కోదై కూడా అణకువతో ఒక చిరునవ్వు నవ్వింది. సోమనాథన్ తన వాచీ చూస్తూ “ఓ. టైము ఐదుగంటలు అవబోతుందే, అతను కాలేజినుంచి రావడానికి ఇంత ఆలస్యమా? నాకు ఏడుగంటలకి ట్రెయిన్ . . . ” అంటూ తల వంచి బయటకి చూసారు.

అదే సమయం ఎవరో కాంపవుండు గేటు తెరిచే సందడి విని కోదై ఆతురతతో బయటకి వెళ్ళింది. పరమేశ్వరున్ని రెండు చేతులతో కౌగిలించుకోడానికి సోమనాథన్ లేచి నిలబడ్డారు.

“అతను కాదు, postman . . . అతనుకేదో ఉత్తరం వచ్చింది” అని చెప్పి దాన్ని పదే పదే చూస్తూ కోదై లోపలికి వెళ్ళింది. సోమనాథన్ పక్కనేవున్న ఫోటో ఆల్బం చూసుకుంటూ పరమేశ్వరన్ని ఎదురుచూస్తున్నారు.

** ** **

పరమేశ్వరన్ ప్రస్తుతం తమిళ ప్రొఫెసరుగా పనిచేస్తున్న అదే కాలేజీలోనే పది సంవత్సరాలముందు సోమనాథన్ ఇంగ్లీషు ప్రొఫెసరుగా ఉద్యోగం చేసారు. అతనిదగ్గర విద్యార్థిగా చదివి అతను రిటైరు అవడానికి ముందే అదే కాలేజీలో ప్రొఫెసరుగా ఒక లెక్చరరుగా చేరే ఆ ఎడబాటులో వాళ్ళిద్దరిమధ్య మంచి స్నేహమూ, బంధమూ చోటుచేసుకున్నాయి.

సోమనాథన్ పదవీ విరామణతో తన సొంత ఊరికి తిరిగివెళ్ళిన తరువాతకూడా వాళ్ళిద్దరిమధ్య అన్యోన్యత కొన్నిసమయాల్లో తపాలుమూలంగా జరిగింది. రెండు సంవత్సరాలముందు సోమనాథన్ ఏదో పనిమీద చెన్నై వచ్చినప్పుడు పదిసంవత్సరాల తరువాత వాళ్ళు కలుసుకున్నారు. పరమేశ్వరన్ని చూడగానే సోమనాథన్ ఒక క్షణం ఉలికిపడ్డారు. దానికి కారణం విద్యార్థిగా ఉండి లెక్చరర్ గా అతనికి లభించిన పదోన్నతి మాత్రమే కాదు. ఒక బుష్ కోటు, కళ్ళద్దాలు, చెవుల తుమ్మెలలో నెఱసిన జుత్తు - వీటితో అతనెదురు చూడని పరమేశ్వరన్ ఆకారం. అంతకన్నా ముఖ్యమైన కారణం నలభై సంవత్సరాలు నిండినా పరమేశ్వరన్ ఒక బ్రహ్మచారిగా జీవించడం.

తన అభిమానం, మర్యాదకి అర్హులైన గురువుని చూడగానే పరమేశ్వరన్ అతని చెయి పట్టుకొని కళ్లతో ఒత్తుకున్నారు. సోమనాధన్ అనురాగంతో పరమేశ్వరన్ వీపుని మెల్లగా తట్టి, "మీ బ్రహ్మచారి జీవితం చూసి నాకు నానగావుంది; దానికి అర్థం లేదంటారా మీరు?" అని అడిగారు.

సోమనాధన్ ఎప్పుడైనా సరే మొహమాటం లేకుండా తన అభిప్రాయం ఇతరులకి చెప్తారు; అంతేకాదు, దానితో ఆగరు. ఎవరి దగ్గర తన అభిప్రాయం చెప్పారో వాళ్ళుకూడా తను చెప్పినది అంగీకరించాలని లేక రాజీ పడాలని ఎదురుచూస్తారు; ఇది అతనిలోవున్న ఉత్తమ గుణం.

పరమేశ్వరన్ కి తల్లిదండ్రులో లేక సన్నిహిత బంధువులెవరూ లేరు. అతనొక ఏకాంత జీవి. అటువంటి వ్యక్తికి పెళ్ళి అనే ఒక సంఘటన జరగాలంటే అందుకు బాధ్యత, అంతస్తు కల మిత్రుల ఆదరణ కావాలి. అది అటువంటి మిత్రులూ, మార్గదర్శి ఐన సోమనాధన్ ధర్మం కదా? అవన్నీ ఆలోచించే సోమనాధన్ తన్ను అడుగుతున్నారని పరమేశ్వరన్ కి బోధపడింది.

"ఏం, బ్రహ్మచర్యం ఒక నేరమా?" అని నవ్వుతూ అతనడిగారు.

"అది నేరం కాదు; ఐతే అది ఉచితమైన జీవితమూ కాదు. నిర్దోషమైన ఒక పురుషుడు బ్రహ్మచర్యం అనుసరించాలంటే దానికి ఒక లక్ష్యం కావాలి. అప్పుడే బ్రహ్మచర్యం ఒక సన్మార్గ జీవితమౌతుంది. అలా కాకుండా బ్రహ్మచర్యంకోసమే ఒక పురుషుడు బ్రహ్మచారిగావుంటే అది సరికాదు, తదనంతరం అది నేరంకూడా కావచ్చు. మనం ఎదిచేసినా దానికి ఒక గురి ఉండాలి, లేకపోతే దానికి పేరు అనర్థం! మీ బ్రహ్మచర్యంకి ఒక అర్థం ఉందంటే నేను నా అభిప్రాయం మార్చుకుంటాను," అని అన్నారు సోమనాధన్.

పరమేశ్వరన్ ఒక క్షణం ఆలోచించారు; అది ఆలోచన కాదు. ఒక విధమైన దిగ్భ్రమ; ఆ తరువాత ఒక చిరునవ్వు. అది చిరునవ్వుకాదు; ఒక విధమైన శరణాగతి!

ఆ కలయిక తరువాత వాళ్ళిద్దరూ చాలా సేపు మాటాడారు. పది సంవత్సరాలముందు పరమేశ్వరన్ తన గురువుని ఎంత బాగా అర్థం చేసుకున్నారో

దానికంటే ఈ పది సంవత్సరాల ఎడబాటులో తన అనుభవం, పరిపక్వతవలన ఇంకా బాగా అర్థం చేసుకొని అతని దగ్గర పూర్తిగా శరణుకోరారు.

పరమేశ్వరన్ దగ్గర శెలవు పుచ్చుకొని తన గ్రామంకి తిరిగివెళ్ళేముందు సోమనాథన్ అతన్ని తన ఊరుకి ఆహ్వానించారు.

“ఇది నా ధర్మం అని భావించి నా ఉరుకి మీరు రావాలంటున్నాను. చిన్నవయస్సులోనే తల్లీ తండ్రీ ఎరుగని నా మేనకోడలు నా సంరక్షణలోవుంది; అదికూడా తనకి పెళ్ళివద్దు అనేది. కాని ఇప్పుడు దాని మనస్సు మారినట్టుంది. ఏదైనా సరే, మీరు ఒక సారు మా ఊరుకి రండి. పరస్పరం ఇష్టమంటే ఈ పెళ్ళికి ఏర్పాటు చెయ్యడం నా బాధ్యత.”

తన కులగోత్రాలేవీ అడక్కుండానే ఒక మిత్రుని స్నేహమూ, గుణమూ ముఖ్యమని భావించి ఆ పెళ్ళిగురించి మాట్లాడుతున్న సోమనాధన్ని పరమేశ్వరన్ కొనియాడారు.

రెండు సంవత్సరాలముందు ఆ పెళ్ళి జరిగింది; పెళ్ళికిముందు పరమేశ్వరన్ ఒక సంగతి గురించి బాధ పడ్డారు: అదేమంటే కోదైకి వయసు ఇరవై. పరమేశ్వరన్ కి నలభై.

పరమేశ్వరన్ జంకు చూసి సోమనాధన్ అతనికి చెప్పారు: “ ‘వయస్సులో ఇంత తేడా ఉండకూడదు’ అంటే అది మీ సొంత అభిప్రాయం; దానికి మించి ఏమైనా కారణంవున్నా సరే, అది మీ ఇష్టం. ఆఖరికి మీరే ఆలోచించి దానికి తీర్పు చెప్పాలి.”

ఖరారుగా ఏంచెప్పాలో పరమేశ్వరన్ కి తెలియలేదు. సోమనాధన్ తన్ను నిర్బంధించడం లేదు. తను అతని సలహా నిరాకరిస్తే అతను తప్పార్థం చేసుకోరు. అందువలనే అతనికి ఏం చెయ్యడమా అని ఆరాటం కలిగింది.

పరమేశ్వరన్ మనసులో అంగీకారం, బయట కనిపించే తత్తరపాటు అర్థం చేసుకున్న సోమనాధన్ అతన్ని నిదానంగా అడిగారు: “అసలు మీ మొహమాటం ఎందువలన అని చెప్తారా?”

పరమేశ్వరన్ - తన నలభై ఏళ్ళ వయస్సు మరిచిపోయి - ఒక యువకునిలాగ - సిగ్గుతో జవాబు చెప్పారు. “మా వయస్సులోని తేడావే . . . ”

“ఓ, అలాగా?” అని అంటూ సోమనాధన్ నవ్వారు. “నేను ముందే చెప్పానుగా? ఆ తేడా ఎక్కువ అని అనిపిస్తే మీరు ఈ ప్రయత్నం మానేయండి. కాని మీ మనస్సుకి

ఇష్టమై ఇతరులు ఏమంటారో అని మీరు బాధపడడంలో ఎటువంటి అర్థమూ లేదు; అది మంచిదీ కాదు . . . "

"మరి ఈ ప్రపంచం ఎలావుందని కొంచెం చూడాలికదా?" అని అరజెయిలో గీటుకుంటూ పరమేశ్వరన్ అడిగారు.

"నిజమే, కొంచెం ఎందుకు? ఇంకా బాగానే, పూర్తిగా మనం ప్రపంచాన్ని గమనించాలి. కాని, పరమేశ్వరన్, ప్రపంచమనేది మన చుట్టుపక్కల ఉండే చిన్న వర్గం మాత్రం కాదు. అది ఖండాలు ఖండాలుగా, దేశదేశాలుగా వ్యాపించివుంది. ఇంకా చెప్పాలంటే మీరు చెప్పే ఆ వయస్సు తేడాకి ఆ ప్రాంతాల్లో ఎటువంటి ముఖ్యతా లేదు. మీ అనుకూలంకోసం ఈ ప్రపంచాన్ని కుదుటపరచుకోవాలి అని అంటే - అది ఈ పొల్లు కబుర్లు చెప్పే ప్రపంచం అని అనుకోకండి. మీ దగ్గరే, మీ హృదయం పక్కనేవుండే ఉండే ప్రపంచం ఏం చెప్తుందో వినండి, తరువాత ఏం చెయ్యాలో ఆలోచించండి" అని చెప్పి సోమనాథన్ ఏదో ఆలోచనలో పడ్డారు.

'ఇతను ఎంత అద్భుతంగా ఇంకొకరి మనస్సులో దూరి ఎంత దీర్ఘంగా పరీక్ష చేస్తున్నారు!' అని పరమేశ్వరన్ ఆశ్చర్యపడ్డారు.

కన్నులు తెరవకుండానే సోమనాథన్ మళ్ళీ మాటాడారు: "ఒక మగవాడు పెళ్ళిచేసుకున్నప్పుడు అది తనకోసమే అని భావిస్తాడు; ఒక ఆడదికూడా అదే మనోభావంతో పెళ్ళికి ఒప్పుకుంటుంది. తన మేలు మాత్రమే చూసుకొని చేసే ఏ పనైనా దానివలన ఆఖరికి అసంతృప్తి కలుగుతుంది. వివాహంకి అసలు తాత్పర్యం ఏమిటి? ఒక స్త్రీ లేక పురుషుడు తనకోసం జీవించడం ఆపి ఇంకొక జీవికోసం జీవితం ప్రారంభించడం అన్న మాట. మానవ జీవితంలో పెళ్ళి ఒక ప్రధానమైన ఘట్టం; ఒకరికోసం ఇంకొకరు త్యాగం చెయ్యడంవలనే సమాజం ప్రకాశవంతంగా వర్ధిల్లుతుంది, ధగధగలాడుతుంది. అంతేకాని 'నాకోసం, నా సుఖంకోసం' అనే వంకలో ఒక ఆడ మగ సంపర్కం ఏర్పడితే, ఆ ప్రత్యేక వ్యక్తి జీవితం, ఆ సమాజం రెండూ వ్యర్థమౌతాయి. ఇప్పుడు మీరు చేసుకునే వివాహం మీకోసం కాదు. ఆమె కోసం. నేను ఇదే మాట నా మేనకోడలికి చెప్పాను . . . దాంపత్యంకి ప్రధానమే ఈ పరస్పర నిబద్ధత అని మీరు ఒప్పుకుంటారా?"

పరమేశ్వరన్ ఒక క్షణం ఆలోచించారు; అది ఆలోచన మాత్రమే కాదు . . .

ఈ రెండు సంవత్సరాల దాంపత్యంలో అతను తన జీవితాన్ని బాగా అర్థం చేసుకున్నారు. కోద్రై లేకుండా తను ఇక జీవితం గడపలేను అనే భావన అతనిలో రూపొందింది. తన్ను ఒక చెక్కుచెదరని మనిషిగా మార్చినది సోమనాధన్, తన జీవితానికి ఒక లక్ష్యం ఇచ్చినది కోద్రై అనే తలపుతో పరమేశ్వరన్ సోమనాధన్ని తన మార్గదర్శిగానూ, కోద్రైని తన అమూల్యమైన ప్రాణనాయకిగానూ కొనియాడారు.

తమ దాంపత్యం పరస్పర ప్రేమ, అనుభూతితో సాగడం, తమ తమ వయస్సులోని తేడా గురించి పరమేశ్వరన్ ఒకరోజు కోద్రైతో మాటాడారు. ఆమె చెప్పిన జవాబు విని అతను ఆమె స్వభావం గ్రహించుకున్నారు.

ఆ మెరుపు తగ్గిన వెలుతురులో పడకగదిలో భార్యాభర్తలు ఒంటరిగావున్నప్పుడు కొద్రై అతనిమీద వాలి అతని వక్షంపై ఏమేమో రాస్తూ తన చెవిలో చెప్పిన మాటలు విని అతని వెండ్రుకలు నిక్కపొడుచుకున్నాయి.

“నాకూ మీలాగే అటువంటి ఆరాటం ఉండేది. కాని ఇప్పుడేమో అందరూ మనలాగే వయస్సుతేడాతో పెళ్ళిచేసుకుంటే వాళ్ళ జీవితంకూడా స్వర్గలోకంలా అవుతుందని అనిపిస్తోంది. దంపతులు ఒకే వయస్సులోవుంటే వాళ్ళలో ఏకీభావం, రాజీ పడడం అంత సులభం కాదేమో? . . . ఈ వయసు తేడా . . . నాకు మరేం చెప్పాలో తెలియడం లేదు . . . నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. అంతకంటే మరేం చెప్పాలో నాకు తెలియదు . . . ” అని అతని ప్రశ్నకి కోద్రై తడబడుతూ జవాబు చెప్తూంటే పరమేశ్వరన్ హృదయం విశాలమై ఆనందించింది.

** ** **

కాష్మీరు మడుగులనుంచి కన్యాకుమారి సముద్రం వరకూ ఆ దంపతులు కలసి ఆనందించిన దృశ్యాలు ఆల్బంలో చూసి వారి ఆనందమైన కుటుంబం సోమనాధన్ కి బోధపడింది.

ఆల్బంలో ఆఖరి ఫోటో చూసి దాన్ని మూసినప్పుడే తన ఎదుట నిలబడి “మీరు ఎప్పుడు వచ్చారు?” అని అడిగే పరమేశ్వరన్ని ద్వారం దగ్గర గమనించి, రెండుచేతులూ చాపి, సోమనాధన్ పసిపాపలాగ నవ్వారు; తరువాత పక్కనే వచ్చి కరచాలనం చేసి భుజాన మెల్లగా తట్టారు.

“ఉన్నట్టుండి ఒక పనిమీద వచ్చాను . . . ఇప్పుడు ఏడుగంటల ట్రెయినులో తిరిగివెళ్ళాలి,” అని అతను చెప్పగానే పరమేశ్వరన్ ముఖం చిన్నబోయింది. “ఇప్పుడే టైము ఐదున్నరైపోయింది. సరే, నేనూ మీతో స్టేషన్ వరకూ వస్తాను,” అని చెప్పి అతను తన వాచీ చూసుకున్నారు.

“అలాగే, ఏం తొందర? ఇంకా గంటన్నర టైముంది . . . మీరు బట్టలు మార్చుకొని కాఫీ తాగండి.”

ఆ ఉన్న సమయంకూడా వ్యర్థం చెయ్యడానికి మనసొప్పక పరమేశ్వరన్ హాలులో నిలబడి కోటు విప్పారు. అతనిపక్కనే సిద్ధంగావున్న కోదై దాన్ని తీసుకొని లోపలికి వెళ్ళింది. తిరిగివచ్చినప్పుడు ఒక తువ్వాలుతో వచ్చింది. దాన్ని భుజాన వేసుకొని సోఫాలో కూర్చొని బూట్సు విప్పుతున్న పరమేశ్వరన్ తో ఆ గోడమీదున్న పటాల్ని చూస్తూ సోమనాథన్ పలికారు: “ఈ విచిత్రమైన కలయిక చూసి నాకు తమాషాగా ఉంది.”

పరమేశ్వరన్ తలెత్తి చూసారు: “ఇందులో ఏం తమాషా? ఒకతను నాకు దేవుడిమీద నమ్మకం, భక్తి కలిగించారు; ఇంకొకరు బ్రహ్మచర్యంలో అర్థం నాకు బోధపరిచి జీవితానికి మార్గదర్శిగావున్నారు. తల్లిదండ్రులు లేని నాకు మీరు ఇద్దరు గురువులు. నా తల్లిదండ్రుల పటం లేని కొరత మీ పటంమూలంగా నాకు తీరింది. ఈ ముగ్గురూ నా అభిమానంకీ, మర్యాదకీ అర్హులైన జ్ఞానులు.”

“Oh, that’s too much! మీరు నన్ను ఎక్కువగా పొగడుతున్నారు!” అని సోమనాథన్ అణకువతో అన్నారు.

“కాదు. నేను మిమ్మల్ని అణకువతో ఆరాధిస్తున్నాను,” అని చెప్పి పరమేశ్వరన్ మర్యాదతో లేచి నిలబడ్డారు.

“ఆరాధనా? అందులో నాకు నమ్మకం లేదు!”

“ఎవరికి ఆరాధించాలనివుందో వాళ్ళకే కదా నమ్మకమూ, భక్తి కావాలి? దానిమూలం నా మనస్సుకి బలం కలుగుతోంది. దానికి మీ అభ్యంతరమా?” అని అడుగుతూ పరమేశ్వరన్ లోపలికి వెళ్ళారు.

‘ఇతను చాలా ఆవేశపడుతున్నారు!’ అని సోమనాథన్ తనలో గొణుక్కున్నారు.

కొంత సమయం తరువాత పరమేశ్వరన్ ఒక తెల్ల పంచె, చేతులు పూర్తిగా కప్పుకున్న చొక్కాయి ధరించి, నుదుటమీద మెరిసే విబూతితో సోఫాలో మళ్ళీ కూర్చున్నారు. కోద్తై అతనికి ఇంతకు ముందు వచ్చిన ఉత్తరం, హార్లిక్స్ తో అందించింది. అతను నెమ్మదిగా అది తాగుతూ ఆ ఉత్తరం చదివారు.

"ప్రియమైన ప్రొఫెసరు పరమేశ్వరన్ గారికి:

ఇదొక అనామక - పేరు తెలుపని - ఉత్తరం అని తోసి పారేయడానికి ముందు ఇలాంటి ఉత్తరాలు కూడా సత్యం పలుకుతాయని మీరు అర్థం చేసుకోవాలి.

మీ జీవితం పెద్ద అబద్ధం అనే పునాదిపై నిలబడివుంది. మీరు పూజ్యులని నమ్మే సోమనాధన్ ఎటువంటి మనిషని మీకు తెలియదు. కోద్తైవంటి స్త్రీ మీ భార్యగావుందని మీరు ఆనందిస్తున్నారుకదా, కాని కోద్తై గతకాల జీవితంగురించి మీకేమీ తెలియదు. పెళ్లికి ముందే ఆమె ఒక మగవాడి ప్రియురాలుగా గర్భవతైన తరువాత నిరాకరించబడిన ఒక యువతి. దేవుడి కృపవలనో లేక ఆ పెద్దమనిషి సలహావలనో అదొక మృతుశిశువుగా జననమైంది. మీ గురువుగారే మిమ్మల్ని మోసగించి ఈ పెళ్ళికి ఏర్పాటు చేసారు. మీరు ఆమెతో సంతోషంగా జీవించగలరు కాని మీరు మిమ్మల్నే మోసం చేసుకోవడంవలనే ఆ సంతోషమంతా . . ."

ఎవరో పేరు చెప్పకుండా రాసిన ఆ ఉత్తరాన్ని చింపి పారేయాలని పరమేశ్వరన్ చేతులు శ్రమతో తొందరపడ్డాయి; కాని ఒక క్షణం ఆగి, ఆ ఉత్తరాన్ని మడిచి, తన చొక్కాయి జేబులో దోచుకున్నారు.

"ఏమైనా ముఖ్యమైన సంగతులా?" అని సోమనాధన్ అడిగారు.

"హూం, ఇందులో ఏమీ లేదు . . . " అని పరమేశ్వరన్ అబద్ధం చెప్పారు; దాన్ని అలాగే తన మనసునుండి తీసి పారేయాలని అతను ప్రయత్నించారు. అతని చూపు ఆ హాలు గోడలోనున్న పటాలమీద; గోడ పక్కనే ఒక చెయిలో సంచికతో దేవతలా కనిపించే కోద్తై మీద; తరువాత తన మౌనం, బాధ, కలత - వీటిని పరిశీలించే సోమనాధన్ మీద; - మారి మారి వాలుతూంటే ఎక్కడ తన మనస్సులోని ఆరాటం సోమనాధన్ కి తెలిసిపోతుందో అనే భయం అతనికి కలిగింది.

భర్త ముఖంలో తటాలున కలత చూసి కోద్దై అతని దగ్గరకి వచ్చి నెత్తిమీద చెయి పెట్టి "ఏం, మీకు తలనొప్పిగా ఉందా?" అని అడిగింది. "మీ కళ్ళు ఎర్రబడివున్నాయే?" అని అడుగుతూ అతని నెత్తిమీద చెయి పెట్టి చూసింది. "కొంచెం జ్వరం అనిపిస్తోంది."

సోమనాధన్ కూడా లేచివచ్చి నెత్తిమీద చెయి పెట్టి పరమేశ్వరన్ తో "మరేం లేదు, మీరు అలసిపోయారు. కొంచెం రెస్టు తీసుకోండి; మనం ఇంకొక వారం కలుసుకుందాం. అప్పుడు నేను రెండురోజులు ఇక్కడ ఉంటాను," అని చెప్పి భుజాన తట్టారు.

"నాకేం లేదు . . . కొంచెం బయటికి వెళ్తే బాగానే ఉంటుంది . . . నేనూ మీతో స్టేషన్ కి వస్తాను . . . టైము ఇంకావుంది . . . ఇదో . . . ఇప్పుడే వస్తాను," అని శ్రమతో నవ్వుతూ, లేచి, పరమేశ్వరన్ అద్దంలో మొహం చూసుకున్నారు. ఆ తరువాత కొంచెసేపు ఒంటరిగావుండాలని మేడమీదకి వెళ్ళి డాబాలో నిలబడి ఆకాశాన్ని కళ్ళు అప్పగించి చూసారు. జేబులోవున్న ఆ ఉత్తరాన్ని తీసి ఇంకొకసారి చదివారు: 'అనామక ఉత్తరాలుకూడా సత్యం పలుకుతాయని మీరు అర్థం చేసుకోవాలి', 'మీ జీవితం పెద్ద అబద్ధం అనే పునాదిపై నిలబడివుంది' అనే రెండు వాక్యాలు ఆ ఉత్తరంని నమ్మడమా లేక తిరగగొట్టడమా అని తెలియక అతన్ని చిత్రవధ చేసాయి.

ఉన్నపాటుగా అతను ఆ ఉత్తరాన్ని అడిగారు:

'కానీ, అది నిజమే కానీ. కోద్దై గతకాల జీవితం గురించి నాకెందుకు ఆరాటం? ఇప్పుడు ఆమె నాకు తగిన భార్య; మేమిద్దరం ఏకక్య దాంపత్యం గడుపుతున్నాం. ఒక తప్పు జరిగితే దానివల్ల ఒకరి జీవితం నశించిపోవాలా ఏమిటి?' అని పట్టుదలతో అతను అడిగినప్పుడు ఆ ఉత్తరం గాలిలో రెపరెపలాడింది. అతని చేతివేళ్ళు దాన్ని గట్టిగా అణచి పట్టుకున్నాయి. వేళ్ళని కొంచెం విప్పివుంటే అది గాలిలో ఎగిరిపోయివుంటుంది, కాని అవి దాన్ని అడిమి పట్టుకున్నాయి. ఆ ఉత్తరాన్ని తునకలు తునకలుగా చింపి పారేయాలని ఒక వెర్రితనమూ, అదే సమయం అలాగేమీ చెయ్యకూడదనే పట్టుదల అతనిలో పుట్టాయి.

'ఈ ఉత్తరం నా భార్యగురించి నాకు చెప్తోంది; ఇది చెప్పేది నిజమైనా, అబద్ధమైనా, మా బంధుత్వానికి ఏ హానీ రాదు. అవును, కోద్దై లేకుండా నేను జీవించలేను! ఇంతకుముందు జరగిన సంఘటన గురించి నాకేం కలత లేదు!' అని దృఢమైన

మనస్సుతో పరమేశ్వరన్ తలెత్తి చూసారు. కాని ఆ మరుక్షణమే అతని నుదుటమీద మడతలు పడ్డాయి; కళ్ళు ఇరుక్కున్నాయి; రహస్యంగా ఒక కంఠధ్వని అతనిలో వినిపించింది:

'కాని ఏంజరిగిందో తెలియాలి కదా? ఏది నిజం అని నాకు తెలియవద్దూ?' అనే ప్రశ్న విని అతని మనస్సు అవమానంతో కూలిపోయింది. 'ఛీ, ఛీ, నాకందుకీ అల్ప బుద్ధి? ఎవడో పలుగాకి రాసిన ఈ ఉత్తరం నన్నెందుకు ఇలా నిలకడలేకుండా చేసింది?' అని తన్నే నోచుకుంటూ ఆతను ఆ ఉత్తరాన్ని చింపారు. పరమేశ్వరన్ దాన్ని చింపుతుంటే సగంలో అతని చేతులు ఆగాయి; ఉత్తరం సగం భాగంలో ఒక పావు చిరిగివుంది. అందులో . . .

"అనామక ఉత్తరాలుకూడా సత్యం పలుకుతాయని . . . "

'హూం, అలాగా? నువ్వు చెప్పేదంతా అసూయవలనే అని తెలిసిన తరువాత నేనూ, కోదై కలిసి నిన్ను పూర్తిగా చింపుతాం! లేకపోతే ఈగతకాల సంఘటన మా జీవితంనుంచి ఆ జ్ఞాపకాన్ని కాలుస్తాం!' అని పరమేశ్వరన్ శపధం చేసుకున్నారు.

'ఐతే ఆ సత్యాన్ని ఎలా గ్రహించడం? ఆ ఉత్తరం చెప్పేది నిజంకాదని ఋజువు చెయ్యడానికి అతనిప్పుడు వచ్చారా?' అనే తలపుతో పరమేశ్వరన్ త్వరగా మెట్లు దిగి కిందకి వచ్చారు.

ఒక టాక్సీలో స్టేషన్ కి ప్రయాణం చేస్తున్నప్పుడు పరమేశ్వరన్ తన మౌనం పగులగొట్టి మాటాడారు:

"మీకు బాగా తెలుసు. నేనూ, కోదై మీ ఆశీర్వాదం వలన పవిత్రమైన జీవితం గడుపుతున్నాం . . . " అని అంటూ తన జేబులోనుంచి ఆ ఉత్తరం బయటకు తీసారు.

సోమనాథన్ కి ఒకటే ఆశ్చర్యం.

పరమేశ్వరన్ టాక్సీలోనున్న చిన్న మీటని నొక్కి ఆ వెలుతురులో ఆ ఉత్తరం చూపిస్తూ పలికారు: "మీరు డొంకతిరుగుడుగా కాకుండా 'ఇది నిజం, ఇది అబద్ధం' అని రెండులో ఒకటి చెప్తే చాలు. మీరు చెప్పే సత్యం - అది ఎలాగున్నా - ఎవరినీ బాధించదు . . . " అని అతను ఆ ఉత్తరం అందించినప్పుడు అతని చేతులు వొణకడం సోమనాథన్ గమనించారు.

తరువాత నిదానంగా ముఖంలో ఎటువంటి చలనమూ లేకుండా ఆ చిరిగిన సగం ఉత్తరాన్ని సోమనాథన్ చదివారు. ఆ ముఖాన్ని రెప్పలార్చకుండా చూస్తున్న పరమేశ్వరన్ “నాకు నిజం ఏమిటో తెలియాలి . . . ” అని గాభరాతో పలికారు.

సోమనాథన్ అతన్ని చూసి ఒక పసిపాపలాగ నవ్వారు. ఆ నవ్వు ‘నాకు నీ బలహీనత నిజం తెలుసుకునే ఆతురతలో అర్ధమైంది!’ అని అన్నట్టుంది.

సోమనాథన్ పరమేశ్వరన్ని నెమ్మదిగా తాకి సమాధానం చెప్పారు: “మీరు ఇంతగా ఆవేశపడతారని నేను ఎదురుచూడలేదు. ఇది మీ ఆరోగ్యానికి మంచిది కాదు . . . ఇలా ఉంటే మీకు blood pressure వచ్చేస్తుంది.”

“నాకు నిజం తెలియాలి . . . నేను దాన్ని వెదకడంవలనే ఇలాగ బాధ పడుతున్నాను!”

“నిజాన్ని వెదుకుతున్నారా? అది అన్నీ త్యాగం చేసిన జ్ఞానుల పనికదా?” అని చెప్పి సోమనాథన్ నవ్వారు.

పరమేశ్వరన్ కి ఆ పిల్లతనపు మాటలువిని సోమనాథన్ మీద కొంచెం కోపంకూడా వచ్చింది; మరేం అనకుండా ఊరుకున్నారు.

“మిస్టర్ పరమేశ్వరన్, ముందు ఈ ఉత్తరం రాసిన వ్యక్తి గుణం నీచమని మీరు గ్రహించాలి . . . ” అని సోమనాథన్ ఇంకా ఏమో చెప్పబోతుంటే దానికి అడ్డుగా, మొండిగా పరమేశ్వరన్ అడిగారు: “దీనిగురించి నాకు మీ జవాబు ఒక మాటలో కావాలి: నిజమా? అబద్ధమా?”

ఆ కంఠధ్వనిలోవున్న మూర్ఖమైన పట్టుదల, అతని మనస్సు అర్థం చేసుకొని “ఒక మాటలో మీకు జవాబు కావాలా?” అని సోమనాథన్ పరమేశ్వరన్ ముఖం చూస్తూ అడిగారు.

“అవును. ఒకే ఒక మాట. మీ జవాబు నేను తప్పకుండా నమ్ముతాను.”

ఒక పిల్లవాడో లేక ఒక తాగుబోతో ఇచ్చే మాటలాగ దాన్ని భావించి, సోమనాథన్ నమ్మకం వదలుకొని మళ్ళీ నవ్వారు.

"నాకు మీ అవస్థ చూసి చాలా బాధగావుంది. ఈ ఉత్తరం వలన మీలో ఇంత మార్పు రావడం . . . ఇక నా జవాబు ఒక మాటలో చెప్తాను, వినండి. ఇది అబద్ధం!" అని పెదిమలు అదురుతూ సోమనాధన్ ఆ ఉత్తరం అతనికే తిరిగి ఇచ్చేసారు.

ఆ తరువాత వాళ్ళిద్దరూ ఏమీ మాటాడలేదు.

సోమనాధన్ని ట్రెయిన్ లో సాగనంపినప్పుడుకూడా అతను పరమేశ్వరన్ దగ్గర ఆ ఉత్తరం గురించి అబద్ధం అనేమాట తప్ప మరేం చెప్పలేదు.

కాని పరమేశ్వరన్ కి సోమనాధన్ తనకు చెప్పిన మాటల్లో ఆ ఆబద్ధం అన్న పదమే అబద్ధమని తోచింది. ఆ తలపు వచ్చిన వెంటనే అతను తన్నే నొచుకున్నారు.

"ఈ ఉత్తరం నన్ను ఎంత అల్పుడుగా మార్చేసింది! నేను దానిగురించి అతనితో మాటాడినది తప్పు. అతను నాగురించి ఒమనుకున్నారో?" అని కలవరపడుతూ పరమేశ్వరన్ ఇంటికి తిరిగివచ్చారు.

అతను ఇంట్లోకి ప్రవేశించినప్పుడు కోదై మేడమీద తన గదిలోవుంది. మామూలుగా అటువంటి సమయం పరమేశ్వరన్ తిన్నగా మేడమీదకి వెళ్తారు. కాని ఇవాళ హాలులోనే కూర్చొని గోడమీదున్న పటాలమీద కళ్ళప్పగించి చూసారు.

అతను మేడమీజకి రాకపోవడంతో కోదై కిందకి దిగి వచ్చింది.

"ఏమైంది మీకు?" అని అతని నెత్తిమీద చెయిబెట్టి చూసింది: "జ్వరం లేదు." పరమేశ్వరన్ గభీమని ఆమె చెయి పట్టుకున్నారు.

"ఏమైంది మీకు?" అని ఉలికిపడి కోదై అతని ముఖం చూడగానే అతని పెదిమలు అదిరాయి; ఏడ్పు వచ్చేస్తున్నట్టుంది. అతని మనస్సులో ఒక ఆశకూడా చోటుచేసుకుంది: 'నేను ఒక మూర్ఖుడిని. ఇదిగో, ఇక్కడ నా పక్కనే సత్యస్వరూపిణిగా నా భార్యవుంది; ఆమెకి ఈ ఉత్తరం చూపించి నిజం తెలుసుకోవచ్చుగా? నేనెందుకిలా బాధపడాలి?'

ఇప్పుడు పరమేశ్వరన్ ముఖంలో ఒక కాంతీ, ఉల్లాసమూ కనిపించాయి. "నాకేం లేదు . . . ఇలా రా . . . నా పక్కనే వచ్చి కూర్చో . . . నాకొక ప్రశ్న, అది నువ్వే తీర్చగలవు . . . నీకు నన్ను బాగా తెలుసు . . . నువ్వు లేకుండా నేను జీవించలేను! . . . " అని అంటూనే అతను ఉక్కిరిబిక్కిరియైపోయారు. "ముందు ఈ

ఉత్తరం చదువు, ఆ తరువాత అరమరిక లేకుండా ఈ ఉత్తరంలో చెప్పినది నిజమా అబద్ధమా అని నాకు చెప్పు; అది చాలు. నీ జవాబు ఎలావున్నా అది ఎవరినీ బాధించదు. . . . నేను నీకు మాట ఇస్తున్నాను . . . నాకు నిజమేమిటో తెలియాలి. నా జీవితంకి ఆధారం అబద్ధంకాదని నాకు తెలియాలి," అని అతను అంటూంటే కోద్దై ఆ ఉత్తరాన్ని నిదానంగా చదివి, మనస్సు దృఢపరచుకొని, వినయంతో చెప్పింది: "నిజం."

పరమేశ్వరన్ అలాగే స్తంభించిపోయారు. కోద్దై నిష్కపటమైన ధ్వనిలో ఇంకా చెప్పింది:

"అది నా జీవితంలో ఒకానొకప్పుడు జరిగిన తప్పు; అందుకోసం నేను మరెవరిపైనా నిందమోపను. 'ఇక నా జీవితం నశించిపోయిందని, ఇక అలాగే జీవించాలి' అని నిశ్చయం చేసుకున్నాను. అది సరికాదని మామయ్య అనేవారు. అలాంటి సందర్భంలోనే నేను మీతో పెళ్ళికి ఒప్పుకున్నాను.

మామయ్య అనేవారు: 'ఒక అబద్ధానికి మనం ప్రాణం పొయ్యకూడదు; గతకాల సంగతులు గతకాలంలోనే ఉండనీ. నిజం చెప్పే వంకలో మనం ఇంకొక అబద్ధంకి ప్రాణం పొయ్యవద్దు. నిజం నిప్పులాగ. దాన్ని భరించడానికి పరిపక్వత కావాలి. మరి నిప్పు ప్రకృతి అదేకదా? దాన్ని భరించడానికి అందరికీ సాధ్యం కాదు,' అని అతను అనేవారు. ఆ ఉత్తరంలో రాసినట్టు మిమ్మల్నో లేక మరెవరినో మోసగించాలనే ఆలోచన ఎవరికీ లేదు. నేను మీ భార్య; ఇది తెలిసిన తరువాత మీ దగ్గర ఏదీ దాచకూడదని అంతా చెప్పేసాను. ఈ నిజం మిమ్మల్ని కాల్చవచ్చు అని నాకు తెలుసు. దాన్ని భరించడానికి తగిన బలం మీకుంది," అని కోద్దై చెప్తూంటే పరమేశ్వరన్ ధారధారగా కన్నీరు కార్చారు. ఇప్పుడు కోద్దై మాటలు విని, అదిరిపడి, సోమనాథన్ అబద్ధం చెప్పి తనకి ద్రోహం చేసి తన గుండెని కాల్చేసారని గొంతుచించుకొని అరిచారు. కోద్దై, నిన్ను నేను క్షమించగలను. కాని ఒక గంటముందు నేను ఈ ఉత్తరం చూపి అడిగినప్పుడు సోమనాథన్ మనసార అబద్ధం చెప్పారే? . . . ఆ పెద్దమనిషి చేసిన ద్రోహం నేను క్షమించలేను!" అని అంటూ సోఫానుంచి లేచి పరుగెత్తారు. గోడమీదున్న పటాల వరుసలో తన అభిమానంకీ, ప్రేమకీ అర్హులైన సోమనాథన్ పటాన్ని తీసి పారేసారు;

అది వెళ్ళి హాలు మూలన ఎక్కడో పడింది. 'ఛీ, ఛీ, వీడేమో పెద్ద మేధావి, జ్ఞాని అంట!' అని తనలో గొణుక్కుంటూ పరమేశ్వరన్ మేడమీదకి పరుగెత్తారు.

అతను తన గదికి వెళ్ళి తటాలున తలుపు మూడడం కోదైకి వినిపించింది.

'సరే, నిజం అతన్ని కాల్చేసింది!' అని కోదై మనస్సులో చెప్పుకుంది.

దిగ్భ్రమతో, ఇక ఈ లోకంలో బయటకి తళుకుబెళుకుగా కనిపించే కుయుక్తి, టక్కరి, మోసం - వీటిలో విరక్తి చెంది, ఎవరినీ చూడడానికి ఇష్టం లేక, ఒంటరిగా పరమేశ్వరన్ మంచంమీద ఒక శవంలాగ వాలారు.

అప్పుడు ఎవరో మెల్లగా తలుపు తట్టారు.

అది విని పరమేశ్వరన్ అలాగే కదలకుండా లోకప్పు చూస్తూ పడుకున్నారు; మళ్ళీ తలుపు తట్టబడుతుందని ఎదురుచూసారు. కాని అలాగేమీ జరగకపోవడంతో తనే లేచి తలుపు తెరిచారు.

అక్కడ చెయిలో ఒక చిన్న పెట్టెతో అతనికి వీడ్కోలు చెప్పడానికి కోదై వచ్చి నిలబడివుంది. ఇద్దరూ దీర్ఘంగా ఒకరినొకరు చూసుకున్నారు; కోదై స్పష్టంగా అతనికి చెప్పింది: "మీకు మామయ్యమీద అర్థంలేని భక్తి అని నేను అనుకునేదాన్ని. కాని మీరు అతని పటం తీసి పారేసిన తరువాతే అతనొక మేధావి, జ్ఞాని అని నాకు ఋజువైంది. అతను మానవ హృదయంలోని గూఢమైన, అజ్ఞాత రహస్యాలు అర్థం చేసుకున్న మహనీయులు. 'నిజం నిప్పులాగ' అని నాకు చెప్పిన మేధావికి మీరు నిజం భరించలేరు అని బాగా తెలుసు. మీరు చెప్పారుగా మీరు నన్ను క్షమించగలరు అని? అంటే మీరే మిమ్మల్ని మోసం చేసుకుంటున్నారన్న మాట. నేను చేసినది తప్పంటే మీరు నన్నేకదా శిక్షించాలి? కాని అది మీకు చేతకాదు; మీ హృదయానికి ఆ బలం లేదు. ఐతే దీనికి మీరు ఎవరినైనా శిక్షించి తీరాలి; అందువలనే ఒక తల్లి దగ్గర దెబ్బతిన్న అబ్బాయి తన చెల్లెల్ని గిల్లినట్టుంది మీ ధోరణి. అది మీ బలహీనత, స్వార్థం కోరి మీరు చేసే పని. ఇక మనిద్దరం కలిసివుంటే అది మనిద్దరికీ ఒక శిక్షలాగ. నాకు మీపై ఎటువంటి విచారమూ లేదు. 'నిజం నిప్పులాగ' అని నాకు బోధించిన ఆ మహనీయుడు దగ్గరకి వెళ్లి 'మీరు అన్నారుగా నిజం నిప్పులాగ అని? ఆ నిజం కొందరిని కాల్చివేస్తుందని తెలియక నేను ఒకరిని కాల్చివేసి ఇప్పుడు వచ్చాను' అని

చెప్పి అతని దగ్గర క్షమాపణ కోరడానికి వెళ్ళుకున్నాను" అని అంటూ కోదై మరేం జవాబు ఎదురుచూడక మెట్లు దిగి వెళ్ళడం పరమేశ్వరన్ గమనించారు.

"నిజం వెదుకుతున్నారా? అది అన్నీ త్యాగంచేసిన జ్ఞానులపని కదా?" అని సోమనాధన్ తమాషాగా చెప్పిన మాటల్లోని అర్థం ఏమిటని ఇప్పుడు పరమేశ్వరన్ ఆలోచించారు.

అది ఆలోచనకాదు; అది ఒక దిగ్భ్రమ; తరువాత అతనొక చిరునవ్వు నవ్వారు. అది చిరునవ్వు కాదు; అదొక శరణాగతి.

త్వరగా మెట్లు దిగి అతను కిందకి వచ్చారు.

అప్పుడే కోదై ద్వారం దగ్గర తలుపు తెరిచి నిలబడియుంది.

"కోదై!" సుస్వరమైన అతని పిలుపు విని ఆమె తిరిగి చూసింది.

గోడపై ఖాళీగావున్న ఆ జాగాన్ని తనకు పూజ్యులు, మార్గదర్శియైన సోమనాధన్ పటంతో పరమేశ్వరన్ మళ్ళీ అలంకరించారు.

పరమేశ్వరన్ తన జీవితంకి ఒక పునాది అని తను భావించిన ప్రశ్నకి అబద్ధం చెప్పిన సోమనాధన్ని తిరిగి తన గురువుగా స్వీకరించగలరు అంటే అదే ప్రశ్నకి నిజం చెప్పిన కోదైని అతను నిరాకరించగలరా ఏమిటి?

********

*(మూలం ప్రచురణ: ఆనంద వికటన్, **1963**)*

# తర్కానికి లొంగని అనుభవం. . .

అసలు విజయం అనేమాటకి అర్థం లేదు; మనం ఎదురుచూసినది సఫలమవుతే విజయం అని అంటాం. 'ఇదేం లాభం లేదు, మనం ఓడిపోతాం!' అని అనుకుంటూ ఓడిపోతే అదీ విజయంకిందే లెక్క; నేను నా జీవితంలో తరచుగా అటువంటి 'విజయం' అనుభవించి ఉన్నాను.

నా జీవితాన్ని నిర్ణయించే ఒక ముఖ్యమైన పనిమీద నేను పక్కనేవున్న ఒక ఉరుకి వెళ్ళాను. ఎప్పటిలాగే 'ఇందులో నాకు అపజయమే దొరుకుతుంది' అనే అభిప్రాయంతోనే నా ప్రయాణం సాగింది. కాని దానికి విరుద్ధంగా నేను 'ఒడిపోయాను!' అంటే అపజయం నిశ్చయం అని అనుకున్న నా జీవితం పూర్తిగా మారిపోయింది!

నా కల్పనకి మితిమీరిన ఒక యువతిని నేను రహస్యంగా ప్రేమించాను. ఆమెను నేరుగా చూసి, సాహసంగా నా ప్రేమ వెల్లడించాలని, ఆమె నిరాకరిస్తే మరేం అనక సిగ్గుమాలిన మొహంతో అంగీకరించానే ఉద్దేశంతో వెళ్ళాను. కాని ఏం ఆశ్చర్యం! యుగయగాలుగా నాకోసం కాచుకొని తపస్సు చేస్తున్న ధోరణిలో ఆమె సరే అనేసింది; నా ముద్దులకోసం పెదిమలు వొణుకుతూంటే ఆతురతతో నా భుజంపై వాలింది!

ఆ అపజయం, లేక ఆ విజయం నేను వెంటనే కొనియాడాలి! ఉరుకి తిరిగివెళ్ళిన తరువాత కాదు, ఇప్పుడే! నాకన్నీ వెంటవెంటనే జరగాలి . . .

కొనియాడడం అనే మాటకొస్తే అదేం పెద్ద పనికాదు; అంటే మన మనసుకి తగినట్టు అనుభవించడం అన్నమాట. అందువలన కలిగే బహిర్గత విషయాలేవీ ముఖ్యం కాదు. కొందరు పటాకీలు పేల్చి సంబరాలుగా కొనియాడతారు; మరికొందరు విందుభోజనాలతో ఆనందిస్తారు. అది వ్యక్తిగత పరిస్థితిపై ఆధారపడివుంటుంది; కాని మనస్సులో కలిగే అనుభవం అందరికీ ఒకటే . . .

ఇప్పుడు నా పరిస్థితి . . . జేబులోవున్నది ఒక రూపాయి నాణెం. అది చాలదా? ఊహూం, చాలదు! ఊరుకి తిరిగి వెళ్ళడానికి రైలు టికెట్టు పన్నెండణాలు; మిగిలింది పావలా . . . అది చాలదా? అది చాలు . . .

శంకరయ్యర్ హోటల్లో డిగ్రీ పాలు, డికాషన్, మితంగా పంచదారతో రెండణాలకి కాఫీ తాగినవెంటనే నాకు త్రాణ, బలం వచ్చినట్టనిపించింది. ఇక మిగిలిన రెండణాలు ఏం చెయ్యడం? 'చిట్టచివరకున్న చిల్లరనికూడా రాజులాగ ఖర్చుచెయ్!' అనే సామెతకూడా నాకు జ్ఞాపకం వచ్చింది.

"అయ్యా . . . ధర్మ దొర . . . కళ్ళులేని కబోది అయ్యా!" అనే కూత . . . స్టేషన్ కి వెళ్ళేదారిలో, ఒక మూల ఒక గుడ్డి పిచ్చగాడు కూర్చొనివున్నాడు; ముసలివాడు. వాడి ఎదుటవున్న చిన్న అలుమినియం గిన్నెలో కొన్ని ఇత్తడి నాణెలు కనిపించాయి. నేను వేసిన బేడ తెల్లధాళువుగా అందులో పడడంచూసి నేను ఆనందించాను. బిచ్చగాడు దాన్ని తీసుకొని, తడుముకుంటూ, నేను నడచివెళ్తున్నాననే భావనతో ఆ దారిని చూస్తూ, తన రెండు చేతులు జోడించి, "బాబూ, మీరు వెళ్ళే అన్ని మార్గాల్లోనూ మీకు పుణ్యం దొరుకుతుంది" అని నన్ను మనసార దీవించాడు; పావలాతో నేను ఆ రోజుని గొప్పగా కొనియాడాననే తృప్తి నా మనస్సులో నిజంగానే చోటుచేసుకుంది.

బుక్కింగ్ కౌంటర్ దగ్గరికివెళ్లి నేను వెళ్ళవలసిన ఊరుపేరు చెప్పి చిల్లర అందించాను; టిక్కెట్టు ఎదురుచూస్తున్న చెయిలో మళ్ళీ చిల్లరే వచ్చిపడింది.

"ఇంకో అణా ఇవ్వండి సార్!"

"టిక్కెట్టు పన్నెండణాలే కదా?"

"అది నిన్నటి వరకూ; ఇవాళనుంచి చార్జి ఎక్కువైంది."

చిల్లరతో నా చెయి బయటకి వచ్చేసింది. గభీమని అగాధంలో పడినట్టు నివ్వెరపాటు కలిగింది: 'ఒక అణాకి ఎవరిని అడగడం?'

'అదో, అక్కడ ఒక పెద్దాయన పేపరు చదువుతున్నారే, అతని దగ్గర . . . ఒక అణాపే కదా?' - అనే ఆలోచన రాగానే అడిగితే ఏమౌతుందని నాకు వెంటనే బోధపడింది. అతని దగ్గరకి ఎవడో వెళ్ళాడు; ఎదో అడిగాడు. అతని జవాబు లోకమంతా వినిపించింది, అది నాకూ కఠినంగా కనిపించింది. నేను రెండణాలు ధర్మం చేసి ఐదు నిమిషాలే అయ్యాయి; ఇప్పుడు ఒక అణా యాచించే నిర్బంధం నాకు వచ్చేసింది. మనస్సులోని తర్కవితర్కాలు ఎన్ని రకాలు!

‘అదో, ఆ అలుమినియం గిన్నెలో ఆ ఇత్తడి కాసులమధ్య నిగనిగలాడుతున్న ఆ బేడ నాకు సొంతం కాదా?’

‘అదెలాగ నీకు సొంతం? నువ్వు దాన్ని దానమిచ్చేసావు, వాడు నిన్ను దీవించేసాడు.’

‘ఇప్పుడు నా గతి ఏంకాను? అందులో ఒక అణా నాకు సొంతం కాదా? వాడి గిన్నెలోవున్నా అది నా డబ్బే కదా? అడిగితే ఇస్తాడా? ఇవ్వడా? ఆ బేడ నేనిచ్చానని వాడికి తెలియదే?’

‘అది దొంగతనం కాదా?’

‘దొంగతనమా? వాడికి ఎలాగైనా నా ధర్మం ఒక అణా దొరుకుతుంది. నాకా పుణ్యం చాలు; నా బేడ నేను తీసుకుంటాను!’ అని ఆర్థిక ధోరణిలో వాదించినా నా చెయి వొణుకుతూనేవుంది.

ఒకణా గిన్నెలో పడేసాను. ఆ బేడని తీసుకొని తిరిగాను.

“దుర్మార్గుడా! . . . ” నేను తిరిగి చూసాను. బిచ్చగాడి కళ్ళు నా మీద నిలకడగా పడ్డాయి. ఇంతకుముందు నన్ను దీవించిన నోరు ఇప్పుడు నన్ను శపించుతున్నట్టు అడిగాడు:

“అయ్యా, ఇదేం ధర్మం? ఎవరో ఒక పుణ్యాత్ముడు బేడ ఇచ్చారు. దాన్ని తీసుకొని ఒకణా వేస్తావా? . . . గుడ్డివాడిని మోసం చెయ్యకు . . . నరకంలో పడి చస్తావు!”

నిప్పుని తాకినట్టు వెంటనే చెయిలోని బేడని గిన్నలో దులిపేసాను. ఇప్పుడు నా ధర్మం మూడణాలకింద లెక్క.

“తెలియక పొరబాటు చేసాను,” అని చెప్పినా కపటం వలన నా కంఠం వొణికింది.

ఒక అమ్మాయి ఒక పఊక వేసి, ఒక అణా తీసుకుంది; బిచ్చగాడు వెంటనే ఆ బేడవుందా అని తడుముకుంటూ మళ్ళీ ఖాయపరచుకున్నాడు.

వాడికి అది అక్కడ లేదు అని తెలిసినప్పుడే నేను చిక్కుకున్నాను; అది వాడికి ఎదురుచూడక దొరికిన భాగ్యం, దాన్ని కోల్పోవడమంటే ఎలాగ?

నేను మళ్ళీ ఆలోచించాను:

‘అది వాడి డబ్బా?’

‘అవును.’

‘నేనేగా ఇచ్చాను?’

‘డబ్బుని అప్పు ఇవ్వచ్చు; కాని ధర్మంని అప్పివ్వడం సాధ్యమా? ధర్మం కావాలంటే మనం ఒకరిని యాచించాలి, వాళ్ళు ఇస్తే పుచ్చుకోవాలి.’

నేను చాలాసేపు అక్కడే కాచుకొని నిలబడ్డాను. నేను వెళ్ళవలసిన రైలు వచ్చి, వెళ్ళిపోయింది. తరువాత వచ్చే రైలుకు చాలా సమయముంది. నా ధర్మం ఫలాన్ని తరువాత వచ్చే స్టేషన్ వరకూ నడుస్తూ, కాళ్ళు నొప్పుతూ, అనుభవించాను.

కొన్ని సంవత్సరాలముందు తమిళనాడులో జరిగిన ఒక రైలు  ప్రమాదం గురించి మీరు వినివుంటారు. అది నేను ఆ రోజు ప్రయాణం చెయ్యదలచుకున్న రైలే.

నేనెలా ఆ దుర్ఘటన నుంచి తప్పించుకున్నాను? నా ధర్మం నన్ను కాపాడిందా?

నాకు తెలియదు; ఇవన్నీ కర్మానికి లొంగే అనుభవాలు కావు.

********

# రేఖలు దాటని ముగ్గులు

అది చాలా అందమైన ఊరు; ఆ ఊరుకి సొగసు ఇచ్చేది ఆ అగ్రహారమే. ఏకధాటిగా యాభై ఇళ్ళు ఉండవచ్చు. పెద్ద వసారాలూ, అంగణాలూ ఉన్న ఇళ్ళు అవి. కొన్ని ఇళ్ళు చిన్నవిగావున్నాకూడా వాళ్ళ వసారాలు పెద్దవిగానేవుంటాయి. వీధికూడా వెడల్పు ఎక్కువగానేవుంటుంది. ఎన్నడూ తారుపోయని వీధి అది. పలకాలం జనులు వాడడంవలన వీధి మెత్తగా ఐపోయింది; నడవడానికికూడా చాలా హాయిగావుంది. పండుగ సంబరాల్లో ఈ వీధిలోనే రథం వస్తుంది. సంవత్సరానికొకసారే రథం వచ్చినా వీధి ఎప్పుడూ విశాలంగానేవుంది. రెండు పక్కలా, ఇళ్ళచుట్టూ వేప చెట్లూ, అరటిచెట్లూ, వరుస వరుసగా నిలబడి నీడనిస్తున్నాయి.

వీధి చివరలో ఒక గుడి. దానికి సాయంకాలం స్త్రీలు వస్తారు. పగటిపూట ఆవులు మేపే యువకులూ, వ్యాధితో బాధపడే బికారీలూ, అక్కడ ఆడుకుంటూ లేక నిద్రపోతూ కాలం గడుపుతారు. కోవిలకి పక్కనేవున్న ఏకాంతమైన చెరువులో ఆ ఊరుకి జీవనాడిగా ఎప్పుడూ బట్టలు ఉతికే శబ్దం వినిపిస్తుంది. ఊరుకి ఆ చెరువే నాభి; ఆ తరువాత చెరువుకి కింద భాగంలో ఆ కోవిలా, దానితోబాటు అగ్రహారమూ ఏర్పడ్డాయి.

చెరువుకి దక్షిణ ప్రాంతంలో రైతులు, వర్తకులు, అగ్రహారవాసులకంటే కొంచెం ఎక్కువ అంతస్తులోవున్న ఇతరజాతులవారు కాపురమున్నారు. ఉత్తరదిశలో ఒక నియమం, నిర్మలత లేనట్టు చిన్న సందులూ, గుడిశెలూ నిండిన ఆ ప్రాంతంలో ఎప్పుడూ హడావిడీ, సందడి. అక్కడే చేపల దుకాణం, తురకవాళ్ళ వీధివుంది. అక్కడ ఎప్పుడూ ఆర్భాటమే. అంగడులూ, సినిమారంగాలూ, కచేరీలు, ఆఫీసులూ, బస్ స్టాండూ, అన్నీ ఆ పక్కనే. ఆ ప్రాంతంలో పెరిగిన జనసమర్ధంవలన ఊరికి చివరన రైతు భాగంకీ అగ్రహారంకీ మధ్యవున్న మైదానంలో ఎక్కడనుంచో ఈ ఊరుకి వచ్చిన తురకలు ఇళ్ళు, డేరాలు, కట్టుకున్నారు. వాళ్ళలో మందులు అమ్మేవారు, మాంత్రికం చేసేవారు, కసాయివాళ్ళు ఉన్నారు. అక్కడ నివసించే ప్రజలకంటే వాళ్ళు పెంచుతున్న మేకలే ఎక్కువ.

అగ్రహారంలో ఉన్నవాళ్ళకి వీళ్ళనిచూస్తే ఒకటే భయం; వీళ్ళు తప్పకుండా దిమ్మరులే అని ఒక మూఢ నమ్మకం. ఆ భయంతో కలిసిన ఆత్రుతతో బడిలేని శెలవు రోజుల్లో ఆ అగ్రహారంలోని కుర్రవాళ్ళు ఆ మైదానంకివచ్చి వాళ్ళని తమాషా చూస్తూవుంటారు. మైదానంలో ఉన్నవాళ్ళుకూడా 'మీకు మేకమాంసం కావాలా? లేక గోమాంసం కావాలా?' అని ఎగతాళిగా ఆ బ్రాహ్మణ పిల్లకాయలని బెదిరిస్తారు. పగటిపూట అక్కడ మగవాళ్ళెవరూవుండరు; తమ పిల్లల్ని పిలుస్తూ, నేలను తాకినట్టు బరువుగా కనిపించే మేకల పొదుగులనుండి పాలు తీస్తూ, చెట్టడుగున వంట చేస్తూవున్న స్త్రీలమధ్య కలుపుగోలుతనం కనిపిస్తుంది. నడుస్తున్నప్పుడు వాళ్ళ కాళ్ళలోని కడియాలు, స్త్రీల వస్త్రాలు వినోదంగా కనిపిస్తాయి. ఈ ఊరుకి ఆకర్షణ ఇచ్చేదే ఈ మైదానంలోని దిమ్మరులూ, అగ్రహారంలోని బ్రాహ్మణ కన్యలే అని చెప్పవచ్చు.

ఇంత ఆకర్షణీయంగావున్న మైదానవాసులని చూపించే అగ్రహారంలోని తల్లులు ఏడుస్తున్న తమ బిడ్డలని భయపెడతారు. భోజనం చెయ్యడానికి అల్లరిచేసే పిల్లలకి "చూడు, ఆ పెద్ద మీసాలవాడు వస్తున్నాడు!" అని ఒక మాట చెప్తే చాలు; ఆ గిన్నెలోవున్న అన్నమంతా ఆ బిడ్డ గొణుక్కోకుండా అలాగే ఖాళీ చేసేస్తుంది.

ఆ పెద్ద మీసాలవాడు ఆ మైదానంలో జీవించే కసాయివాడు.

వాడిగురించి అగ్రహారంలోవున్న పిల్లల కల్పనలో ఎన్నో భయంకరమైన కథలు; వాళ్ళకి అతన్ని పరిచయం చేసినది వాళ్ళ తల్లులే. వాడిగురించి ఏంచెప్పినా ఆ పిల్లలు నమ్మినట్లు ఉంది వాడి వాటం. ఆ పిల్లలు రోజు మెలిగే పెద్దలకంటే ఇంకా పెద్ద ఆకారం అతనిలో కనిపిస్తోంది. వీధిచివరన తాటిఆకులతో మేయబడిన పైకప్పుతో భూమిలో పాతుకుపోయిన రథాన్ని - సంవత్సరానికొకసారి నూరుమంది కలిసి దాన్ని లాగుతారు - వాడు ఒక్కడే ఈడ్చగలడు - అని ఆ పిల్లలు నమ్ముతారన్నట్టు కనిపిస్తుంది వాడి దేహబలం.

వాడు రోజూ ప్రొద్దున తన తుప్పుపట్టిన ఒక పాత సైకిలుమీద ఆ అగ్రహారాన్ని దాటి వెళ్తాడు. అగ్రహారం చివరన, తూర్పుదిశలో, వెదురు పొదలవెనుక, ఆకాశం ఎఱ్ఱగా మారి సూర్యుడు కనిపించే సమయం వాడి సైకిలు ఆ మైదానంనుంచి అగ్రహారంలో ప్రవేశిస్తుంది. అగ్రహారంలో ప్రవేశించడానికి ముందు ఆ చివరలో నిలబడే వాడి ఎత్తుకి ఆ

సైకిలు చాలా చిన్నదిగా కనిపిస్తుంది. వాడు ఇలాగా అలాగా కొంచెంకూడా ఆనుకోకుండా తన రెండుకాళ్ళనూ చాటి నేలమీద పెట్టి సైకిలుమీద నిలబడతాడు. చేతిలోనున్న చుట్టని తొందరగా, ఘాటుగా ఒక రెండుసార్లు పీల్చి, పారేసినతరువాతనే, అగ్రహారంలోకి ప్రవేశిస్తాడు.

వాడు వచ్చేటప్పుడు అగ్రహారంలోని యువతులు ఇంటిముందు నీళ్ళు జల్లి ముగ్గులు వేస్తుంటారు. అందులో చాలామంది తమ బిడ్డల్ని బెదిరించడానికి వాడిని మీసాలవాడని పిలుస్తారు, కాని వాడిని చూడాలనే తలపు వాళ్ళకెప్పుడూ తోచదు.

అలాగే ఒకరోజు ఉదయం వీధిలో ముగ్గులు పెడుతున్న శంకర శాస్త్రుల కూతురు మీనా సైకిలు ధ్వని విని, తలెత్తక, తన కనుబొమ్మలుమాత్రం లేవనెత్తినప్పుడు వాడి పాదాలు చూసి, తరువాత వాడిని చూడాలని నిలబడింది. సైకిలుమీద వెళ్ళేవాడు ఏవడో అగ్రహారంకి చెందినవాడనే తలపుతో వాడిని ధైర్యంగా చూసిన మీనాకి వాడు వేరే మతస్తుడని తెలియగానే మొహం జంకింది. కాని ఆ వినోదమైన అన్యపురుషుని గాంభీర్యం, అతను ఆ వీధి చివర తిరిగినవెంటనే ఆమె మళ్ళీ చూడడానికి కారణమైంది.

ఊరి మైదానంలో నివసించే దిమ్మరుల గుంపు గురించి మీనాకి ఏమీ తెలియదు. ఆమె ఇంతకాలమూ అత్తవారింటి చాకిరీలో చిక్కి, కష్టపడి, శాస్వతంగా పుట్టింటికి వచ్చేసింది. అందులో ఆమెకు కొంచెం సంతోషంకూడా. తన అంతరంగ జీవితంలో ఏర్పడిన శాపంవలన ఆమె చాలా అన్యపురుషులని చూసింది; కొన్నిసార్లు చూసి చూసి నిట్టూర్పు విడిచింది.

పది సంవత్సరాలు జీవించి, ఒక ఎనిమిదేళ్ళ పిల్లవాడికి తల్లి ఐన ఆమెను ఆమె భర్త 'ఇంటికి రావొద్దు!' అని పరాధీనం చేసేసాడు. శంకర శాస్త్రుల భార్య ఇటీవల కన్నుమూయడంతో, అతనికి ఇంట్లో తోడుగా ఉంటూ, అన్నం వడ్డించడానికి తగిన మనిషిగా మీనా రోజులు గడుపుతోంది. తండ్రికి కూతురుగా, ఒక పిల్లవాడికి తల్లిగా, ఒక కొంపనుంచి ఇంకొక కొంపకి మారే ఈ భ్రష్టం మీనాకి నింపాదిగా కనిపించింది; అందుకు కారణం ఈ కొంపకూడా ఆమెకి అలవాటైన పాతకొంపే . . .

అంతేకాక మీనా అత్తవారిల్లు తంజావూరులో ఉండేది. తంజావూరు సందులకి పేరు పోయిన ఊరు. ఆ సందులు చిన్నవిగావుంటాయి. ఉల్లు రాజగృహంలావుంటుంది.

మీనాకి ముగ్గులు వేయడం ఆమె జీవిత ఆశయం. ఆమె దగ్గరవున్న ముగ్గుల పుస్తకాలకి అగ్రహారంలో ప్రసిద్ధి ఎక్కువ. ఆమె ఎప్పుడూ తన మనసులోని భావాలు కొత్త కొత్త ముగ్గులుగా ఆ పుస్తకంలో చిత్రించేది. వృద్యాప్యంలోవున్న స్త్రీలనుంచి బాలికలవరకు, అందరూ, మీనా రాసిన ముగ్గులు చూసి ఆమెను పొగడేవారు.

అగ్రహారంలో విశాలమైన వీధిలో ముగ్గులు వెయ్యడానికి తగిన చోటు దొరకదు. అందువలన మీనా తనింటికీ, పక్కింటికీ మధ్య ఒక హద్దు ఉన్నట్టు ముందు తన ముగ్గులగొట్టంతో ఒక పొలిమేర కట్టుకుంటుంది. ఆమె ముగ్గులు వేసి తల ఎత్తేసరికి సూర్యుడు ఆ చెరువుగట్టునవున్న ఆ వెదురుపొదలు దాటి మీదకు వచ్చేస్తాడు.

అటువంటి సుఖానుభవంకి తంజావూరు సందుల్లో వీలుకాదు.

పుట్టినిల్లుకి రాగానే 'ఇక హాయిగా మనం ముగ్గులు వేసుకుందాం!' అని ఆనందంతో మీనా నిట్టూర్పు విడిచింది.

వండే సమయం తప్పిస్తే ఆమె రోజంతా వాకిలిలో, ఉయ్యాలమీద కూర్చొని ముగ్గులు రాసేది. కొన్నిసార్లు వసారాకివచ్చి, స్తంబందగ్గర నిలబడి తను ఉదయం వేసిన ముగ్గుని చూస్తూ, దాన్ని ఎంతమంది తమ కాళ్ళతో తొక్కారని తెలిసినట్టు అలాగే చూస్తూవుంటుంది.

ఆ ముగ్గుకి మాత్రమేనా ఆ గతి?

అగ్రహారంలో బాల్యంలో ఆమెతో ఆటలాడి, మెలిగి, ఆమెను ఏడిపించిన అబ్బాయిలందరూ ఇప్పుడు ఎలాగ ఒక్కొక్క స్త్రీకి మంచి భర్తలుగా మారిపోయారు! తన కర్మం తన్నిలాగచేసి ఈ గతికి తీసుకువచ్చిందనే వ్యాకూలంతో ఆమె వాళ్ళని తలచుకొని నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పే ఈ కొంపలో ఆమె ఒంటరి జీవితానికి ఒక మనశ్శాంతి ఇచ్చింది; ఆ తలపుతోనే ఆమె తల ఎత్తి ఆ వేరే మతస్తుని చూసి, ఎటువంటి నిట్టూర్పులేక దాన్ని ఒక వేడుకగా ఆనందించింది.

ముప్పదేళ్ళలోనే ఆమె దాంపత్య జీవితం సమాప్తం అనే తీర్పుతో పుట్టినిల్లు తిరిగివచ్చిన మీనాకి తక్కినవాళ్ళని తల ఎత్తి చూడడానికికూడా త్రాణ లేదా ఏమిటి? కాని బ్రాహ్మణకులంలో పుట్టిన ఒక ఆడది వేరే మతస్తునిచూసి నిట్టూర్పు విడవచ్చా?

అందువలన ఆ మీసాలవాడిని చూసి మీనాకి ఎన్నటికీ నిట్టూర్పు రాలేదు; కాని ఆమె అతన్ని చూసింది.

ముగ్గులిడుతూ, తలెత్తకుండా, ఆ సైకిలు పెడల్ని తొక్కుతున్న పాదాలు; ఆ భారీ బూట్సులు; గుదికాలుమీద మరకబోయిన లుంగీ; కాలులోని రోమాలు - ఇవన్నీ ఆమె చూస్తుంది. తన్ను దాటి వెళ్ళిన తరువాత నిలబడి ఆ చిన్న సైకిలులో ఆజానుబాహువుగా వెళ్తున్న అతని వీపుని మాత్రం చూస్తుంది. అతనెప్పుడూ బూడిదరంగులో ఒక సిల్కు షర్టుతో కనిపిస్తాడు. లోపలున్న తెల్ల బనియను అతని భుజాల వెడల్పుని అందరికీ చూపిస్తుంది. నాలుగు అంగుళాల వెడల్పుతో అతని బెల్టుకూడా కనిపిస్తుంది. ఆడవాళ్ళు చీరలు కట్టుకున్నట్లు అతను ఒక్కొక్కరోజు ఒక్కొక్క రంగు లుంగితో కనిపిస్తాడు.

కొన్నిరోజులు చెరువులో స్నానంచేసి ఇంటికి వచ్చే మార్గంలో అతని రూపాన్ని మీనా పూర్తిగా చూస్తుంది. అందుకు కారణం అప్పుడు అతని దృష్టి ఆమెమీద వుండదు; అందువలనే ఆమె అతన్ని చూడగలదు. అతను వేరే మతస్థుడైనా ఏదో ఒక గుడిని దాటి వెళ్తున్నట్లు మర్యాదగా ఆ అగ్రహారం దాటి వెళ్తాడు. ఆసైకిలు హేండిల్ బార్ లాగ అతని మీసంకూడా పెరిగివుంటుంది; అతని వయస్సు ముప్పైనుండి నలభైలోగా ఉండవచ్చు అనే రహస్యం ఆ మీసాలవెనుక దాచుకొనియున్న అతని జుత్తులో నిదర్శనమవుతుంది; తలనిండా ఉంగరాల జుత్తు; మీసంలాగే అతని కనుబొమ్మలూ పెద్దవే; కన్నులుకూడా పెద్దవే అన్నట్టు పడీ పడని కన్నురెప్పలు; దట్టమైన నరాలు కనిపించే అతని కంఠంలో, వెండిలో అర్ధచంద్రాకృతిలో, చిన్న కాసులు, దాయత్తుతో కట్టబడిన ఒక నల్ల దారం. అతని విశాలమైన ఛాతీలో రోమాలు. అతను ఎర్రటి మనిషీ కాదు, నల్లటి మనిషీ కాదు; అతని ఛాయ పసుపు. అతను సైకిలులో వస్తున్నప్పుడు ఎదుటనుంచి చూస్తే వినోదంగా ఉంటుంది. అతని పొడుగాటి చేతులు హేండిల్ బారుని నిత్యమూ తగులుతూవుంటాయి. అందువలన అతను తన కాళ్ళని బాగా విడదీసి సైకిలు తొక్కుతాడు.

ఆ సైకిలు హేండిల్ బారులో రక్తపు మరకతో ఒక సంచి - ముసురుకునే కొన్ని ఈగల మధ్య - వేలాడుతుంది. దానిలోపలనుంచి, సంచి మొనలో అతని కసాయి కత్తి

- చెక్కతో చేసినది - కనిపిస్తుంది. అది చూసేవారికి వెంటనే కల్పనలో ఆ కత్తిగురించి భయంకరమైన ఆలోచనలు వస్తాయి.

అగ్రహారంలోవున్న యువతులను దాటి వీధి చివరకి వెళ్ళగానే మళ్ళీ ఏ దిశా చూడకుండా, రెండు కాళ్ళనూ బాగా విడదీసి, నేలమీద పెట్టి, అతను నిలబడతాడు. ఒక చుట్ట కాల్చినవెంటనే ఆ అగ్రహారంలోనివారి దృష్టినుంచి మాయమవుతాడు.

సాయంకాలం అతను తిరిగివస్తున్నప్పుడు అగ్రహారంలోని పిల్లలు ఆటలాడుతుంటారు; అప్పుడుకూడా యువతులు నీళ్ళబిందెలతో కనబడతారు. ఆటలాడుతున్న కుర్రవాళ్ళు వాడిగురించి తమ తమ కల్పనలో ఉన్నవన్నీ రహస్యంగా పరివర్తన చేసుకుంటారు.

వాడు మేకని ఒక చెయితో దాని చెవులు పట్టుకొని చరక్ అని కత్తితో కోస్తాడట. ఆ మేక దేహం అలాగే వాడి కాళ్ళముందు పడి వొణుకుతుందట. వాడు కోసిపారేసిన మేకల తలలు గుంపులు గుంపులుగా చేరిపోతాయట. ఒక రోజుకి వాడు వెయ్యి మేకలు చంపుదాటడ; అసలు మేకలు మాత్రమేకాదు, ఆవులనుకూడా అలాగే చంపుదాటడ; వాడి దేహం ఇలాగ ఉండడానికి కారణం అతను ప్రతీ రోజు మూడు మేకలిని తింటాడట; వాడితో దెబ్బలాడి ఎవరూ గేలవలేరట!

ఇలాగ అతనిగురించి వాళ్ళు తమ కల్పనలో తోచినవన్నీ కబుర్లుగా చెప్పుకుంటారు. అతను అగ్రహారం దాటి వెళ్ళేముందు ప్రతీ రోజు ఏదో ఒక ఇంటిలో “ఏ సాయబూ, ఈ అబ్బాయిని పట్టుకుపో!” అని పిల్లల్ని బెదిరించే మాటలు వినకుండా ఉండవు. కొన్నిసార్లు వాకిలిలో స్తంభాన్ని బిగించి పట్టుకొని “రాను!” అని బొబ్బపెట్టే పిల్లవాడిని లాగి “చూడు, ఇవాళ నిన్ను ఆ సాయబుకి ఇచ్చేస్తాను . . . ఇదిగో, సాయబూ, రా!” అని బెదిరించే తల్లులని అతను చూస్తాడు. తనలో నవ్వుకుంటూ వెళ్ళిపోతాడు; కాని అతని మొహంలో ఆ నవ్వు కనిపించదు.

మీనా కొడుకు బాబూకికూడా ఆ మీసగాడంటే విపరీత భయం; వీధిలో ఆటలాడుకుంటున్నప్పుడు ఆ మీసగాడు వస్తే “ఇదిగో అమ్మా, ఆ మీసాలవాడు వస్తున్నాడు!” అని అరుస్తూ ఇంటిలోకి వచ్చేస్తాడు. వాడి భయాన్నీ, కూతనీ విని,

నవ్వుతూ, మీనా బయటకి వచ్చి నిలబడుతుంది; ఆమె నవ్వడం చూసినాకూడా అందుకు జవాబుగా అతనెప్పుడూ నవ్వలేదు.

తన దిమ్మరవాళ్ళ గుంపులో ఎక్కడో, ఎప్పుడో, తను చూసిన ఒక స్త్రీ ఛాయని ఆ మీసాలవాడు ఆమెలో సరిపోల్చుకున్నాడు. ఎటువంటి పొత్తూలేని ఆ పోలిక చూసి అతను ఆశ్చర్యపడ్డాడు.

ప్రతి దినం తమ పిల్లలు చేసే అల్లరి ఆపడానికి "ఏ సాయబూ . . . ఏ సాయబూ" అని పిలుపులు వచ్చినా ఏ వైపూ చూడనివాడు  ఇప్పుడు శంకర శాస్త్రిగారి ఇల్లు దాటినప్పుడు ఎటువంటి పిలుపు లేకుండానే తల తిప్పి చూస్తాడు. అప్పుడు మీనా అక్కడ నిలబడివుంటుంది.

తను ఎప్పుడో దిమ్మరవాళ్ల గుంపులో కలుసుకున్న యువతి . . .

అది శంకర శాస్త్రిగారి ఇల్లు అని అతనికి తెలియదు. ఆ ఇంటికి గుర్తు మీనాపే; ఏ కారణంవలనో ఆమె అక్కడ లేకపోవడంతో అదే ఇల్లని తెలియక కంగారపడ్డాడు. తరువాత ఆ ఇంటికి వచ్చి ఆమెను చూసినప్పుడే స్తంభంమీద కట్టబడిన ఎర్రటి తపాలుపెట్టెని గుర్తుగా జ్ఞాపకంలో ఉంచుకున్నాడు.

కొన్నిసార్లు మీనా తనలో అనుకుంటుంది: 'ఇతన్ని చూసి ఎందుకు ఈ పిల్లలు ఇలాగ భయపడుతున్నారు?'

అతని పెద్ద మీసాలు గుర్తురాగానే ఆమె తన ఆశ్చర్యం మార్చుకొని ఆ పిల్లలకి ఏర్పడే భయం న్యాయమే అని ఒప్పుకుంటుంది.

ఆమె ఇంకా ఆలోచిస్తుంది: 'అతనికి ఈ మీసాలు లేకపోతే? ఎవరైనా ఆ మీసాలని తీసేయమని అతనికి సలహాయిస్తే అస్తమానం భయపడి చస్తున్న ఈ పిల్లలకి ఎంత హాయిగా ఉంటుంది! అవకాశం వస్తే దీన్ని అతనికి చెప్పేయాలి!' కాని వెంటనే 'ఒసే, వెర్రిదానా, నీకున్న ఇన్ని సమస్యలలో వీడి మీసంగురించి నీకెందుకు ఇటువంటి ఆలోచన!" అని నవ్వుతూ తనకే సమాధానం చెప్పుకుంటుంది.

ఒక రోజు అగ్రహారంలోని కుర్రవాళ్ళు కొందరు గుంపు చేరి మైదానంకి తమాషా చూడడానికి వెళ్ళారు. ఆ గుంపులో బాబూకూడావున్నాడు. రసమైన, విరసమైన సంగతులంటే అందరికీ ఇష్టమే, ఐతే పెద్దవాళ్ళు విరసంలో తమకున్న ఇష్టతను

దాచుకోడంలో సమర్థులు. పిల్లలకి అది చేతకాదు. అందువలనే మైదానం మధ్య ఒక తాటాకు చాపమీద ఒక ముసలివాడు మాంసపిండాలని చిన్న చిన్న దిబ్బల్లాగ పరచి జనులకి అమ్మడం చూసి ఆ బ్రాహ్మణ పిల్లకాయలు దాన్ని తమాషాగా చూస్తున్నారు. ఆ అనుభవం వాళ్ళకి ఊరటగా, పరవశంగా కనిపించింది.

అదేం మాంసం - మేకదా లేక ఆవుదా - అనే రహస్యమైన పరివర్తన వారిలో జరిగింది.

"దీన్ని అలాగే నిప్పులో వేసి తింటారా?"

"కాదురా, మనింటిలో కూరగాయలు వండుతారే, అలాగ వండుతారు . . . "

"ఛీ, ఛీ! నాకు తెలుసు, వీళ్ళు మసాలా వాడుతారు."

"కంపు కొట్టదూ?"

"వీళ్ళెందుకు ఇలా చేస్తున్నారు?"

"ఇది పాపం కదూ?"

"వాళ్ళకి నచ్చుతుంది కాబోలు!"

"నీకు కావాలంటే వెళ్ళి తిను, పో!"

అప్పుడే బాబూని వెదుక్కుంటూ మీనా అక్కడికి వచ్చింది. అగ్రహారంలోని పిల్లలు ఆ కర్మకాండం చూడడంతో ఆమెకు పట్టరాని కోపం వచ్చింది.

"వెధవల్లారా, ఇక్కడ నిలుచొని ఇదేం తమాషా? ఇంటికి వెంటనే వెళ్ళండి! ఏరా మణి, వాళ్ళు పిల్లలు, నీకేం బుద్ధి ఇలా పోయింది? ఉండు, ఉండు, మీ ఇంటికి వచ్చి మీ అమ్మగారితో చెప్తాను!" అని అక్కడవున్న పిల్లల్ని తరిమి బాబూచెవిని పట్టుకొని తిప్పింది.

"మంచి వేళ, నువ్వు ఆ చెరువు దగ్గర నిలబడ్డావేమో అని అక్కడకి వెళ్ళాను; మధ్యాహ్నం ఇంట్లోనుంచి బయటకి వెళ్ళినవాడివి ఊరంతా తిరగడం ఆరంభించావు. ఇంటికి రా, చెప్తాను!" అని వాడి చెవిని మెలిక పెట్టగానే బాబూ ఏడవడం ఆరంభించాడు.

ఆ సమయం ఒక డేరానుంచి ఒక స్త్రీ వచ్చింది.

"మీరందరూ అయ్యరింటి పిల్లలు. 'ఇవన్నీ చూడకూడదు!' అని ఎన్నిసార్లు చెప్పానో తెలుసా? వింటేనా మరి?" అని అంటూ ఆమె మీనాదగ్గరకి వచ్చింది.

మీనాకూడా ఆమెను చూసింది.

మీనా కళ్ళకి వేరే మతానికి చెందిన ఆ స్త్రీ వినోదంగానే కనిపించింది. 'ఈ జాతిలో మగవాళ్లు, ఆడవాళ్ళు ఎంత అందంగా ఉన్నారు!' అని మీనా ఆశ్చర్యపడింది.

మీనా ఆమెమీద పడిన తన కళ్ళని ఆమె మొహంనుంచి పాదాలవరకూ వాల్చింది.

ఆ స్త్రీ తొడుక్కున్న పరదా కొంచెం జరగడంతో కలువపువ్వుల రేఖల్లాగ ఆమె ఎర్రని చెవి చుట్టూ వరుస వరుసగా చిన్న బంగారు వలయాలు కనిపించాయి; వాటిలోనుంచి అక్కక్కడా బంగారు ఆభరణాలు వేలాడాయి. ఆ విశాలమైన ముఖంలో ధాటీగా గీసినట్లు ఎర్రగా రెండు కన్నులు నల్ల కనుబొమ్మలిని కలుసుకొని మీనాని చనువుగా చూసాయి. ఆ మీసాలవాడులాగ ఆమెకూడా పెద్ద ఆకారంతో కనిపించింది; ముంజెయ్యి ఒకటే గాజులమయం, అదీ ఆమెకి అందంగానేవుంది. ఛాతీని మాత్రం కప్పుకున్న ఆమె రవిక చేతులు మోచెయివరకూ వ్యాపించివున్నాయి. ఆమె నడుస్తున్నప్పుడు, ఆమె నడుం ఆడుతున్నప్పుడు, ఒక రథం మెలికలు తిరిగినట్లుంది. ఆమె నడుస్తూంటే - భూమిమీద పెద్ద ముద్రలు పడినట్లు - ఆ పాదాలలోవున్న వెండి కడియాల ధ్వని మధురంగా వినిపిస్తోంది.

'ఈమె తొడుక్కున్న ఈ నగలన్నీ అసలు బంగారమేనా?' అనే అనుమానం మీనాకి కలిగింది. దాన్ని అడిగేద్దామా అనే తన ఆతురతని ఒక క్షణం సంశయించి ఆపుకుంది.

మీనా ఎలాగ ఆమెను అభినందించిందో, అలాగే ఆ స్త్రీకూడా మీనాని అభినందించివుండాలి. మీనాలోని సాధారణ ఆకృతి, ముక్కు, చెవుల్లో ప్రకాశించే ఆభరణాలకంటే నుదుటమీదవున్న పెద్ద బొట్టు మీనాని అందగత్తెగాచేసి ఆమెను ఆకర్షించింది. బలహీనంగా కనిపించే ఈమె శరీరంలో ఎలాగ ఈ బ్రాహ్మణ కట్టు చీర సాధ్యమైంది అని ఆశ్చర్యంగా ఆమె కళ్ళు మీనామీద వాలాయి. వాళ్ళిద్దరూ రెండు గొడ్ల కొంపలో ఉండే పశువులులాగ ఒకరినొకరు చూసుకొని ఆత్మీయులయ్యారు.

అప్పుడు ఒక మేకపిల్లని తరుముకుంటూ ఆమె వెనుక ఒక పిల్లవాడు పరుగెత్తుకొని వచ్చాడు. ఆ శబ్దం విని, తిరిగి, ఆ తల్లి తన బాషలో ఆ పిల్లవాడిని

తిట్టింది. ఆమె తిరిగినప్పుడు ఆమె వెనకభాగం నగ్నంగావుండడంవలన మీనాకి ఆ స్త్రీ దేహమంతా నగ్నంగా మనసులో కనిపించింది. ఆమె మీనాని చూసి చెప్పింది: “ఈ పిల్లలకి అమ్మ అంటే ఎటువంటి భయమూ లేదు; నాన్న అంటేనే భయం!”

ఆమె మాటలు బోధపడినా మీనాకు నవ్వొచ్చింది.

“అవును. వీడుకూడా నా మాటలు వినడు!” అని మీనా అనగానే, ఆమె మళ్ళీ చెప్పింది: “మీరెందుకమ్మా ఇంత దూరం రావాలి? వాళ్ళ నాన్నగారిదగ్గర ఒక మాట చెప్తే చాలదా? ఆడవాళ్ళు చెప్తే ఈ అబ్బాయిలు వినరు.”

ఆమె మాటలు విని మీనా కళ్ళలో చూచాయగా ఏర్పడిన శోకాన్ని ఆమె గమనించివుండాలి.

“ఇది మీ పిల్లవాడా?” అని ఆ మేకపిల్ల వెంట పరుగెత్తిన పిల్లవాడిని చూపి మీనా అడిగింది.

“అవును. వాళ్ళ నాన్నతో నాకు తలాక్ ఐపోయింది” అని ఆమె అంటూ తిరిగినప్పుడు, బయట తన భార్య ఎవరితోనో మాటాడడం విని ఆ మీసాలవాడు డేరానుంచి బయటకు వచ్చాడు.

అతన్ని చూసినవెంటనే ఆ స్త్రీ తన పరదాని కొంచెం లాగుకొని “ఆ తరువాత నేను ఇతన్ని నిక్కా చేసుకున్నాను!” అని గర్వంతోనూ, సిగ్గుతోనూ, చెప్పింది.

మీనాకి ఆమె చెప్పేది బోధపడినా కొన్ని మాటలకి అర్థం తెలియలేదు.

“తలాక్కంటే? . . .” అని అడుగుతూ మీనా డేరానుంచి వెలుబడిన అతని కళ్ళు చూసింది.

ఐయ్యో. ఆ కళ్ళు ఎంత తీక్షణంగా కనిపిస్తున్నాయి!

అతను లుంగి, బనియను తొడిగివున్నాడు. మీనాను చూడగానే నోటిలోవున్న చుట్టని కింద పారేసి, దాన్ని కాలుతో అణచి, ముందే పరిచయమున్నవాడిలాగ శలాంచేసి ఆమె దగ్గరకి వచ్చాడు.

“అమ్మగారు ఎందుకు ఇంత దూరం వచ్చేసారు?” అని అడిగాడు. మీనా జవాబేం చెప్పక చిరునవ్వు నవ్వింది.

అప్పుడు అతని భార్య తలాక్ అంటే ఏమిటని వివరించి చెప్పింది. అంతవరకూ ఆ అగ్రహారం బయట ప్రజలూ, వాళ్ళ జీవితాలూ చాలా అద్భుతంగా మారివున్నాయి అని అనుకున్న మీనాకి జీవితమనేది ఆడవాళ్ళందరికీ ఒక గొడ్డ కొంపే అని అనిపించింది.

మీసాలవాడిని చూడగానే మీనా వెనుక దాక్కొన్న బాబూ, అతను దగ్గరకి రాగానే, "అమ్మా, మనం ఇంటికి వెళ్దాం!" అని తల్లి చీరకొంగుని పట్టుకొని లాగాడు.

పిల్లవాడి తల జుత్తుని తడుముతూ  బాబూకి మీనా సమాధానం చెప్పింది: "నీకు ఈ సాయిబును చూస్తే ఎందుకురా భయం? వీళ్ళందరు మంచివాళ్ళే కదా? నిన్నేం చెయ్యరు!" తరువాత ఆ మీసాలవాడిని చూసి ఆమె చెప్పింది.  "నీ మీసం చూసి పిల్లలకి భయం. నువ్వు దాన్ని తీసేస్తే పిల్లలందరూ పిల్లలందరూ నీ వెనుకనే వస్తారు." ఈ మాటలు చెప్పినప్పుడు మీనా మొహమంతా ఎర్రబడిపోయింది.

"ఏమ్మా, ఈ మీసం నాకు బాగా లేదా?" అని అతను అమాయకత్వంతో అడిగాడు.

'నాయనా, ఇలాగ అడుగుతున్నాడే, నేనేం జవాబు చెప్పడం?' అని సిగ్గుతో మీనా తలవంచుకుంది. "బాగా లేదని ఎవరన్నారు. పిల్లలు భయపడుతున్నారని అన్నాను."

"ఈ మీసంకోసం ఇది నన్ను నిక్కా చేసుకుంది," అని భార్య భుజాన్ని పట్టుకొని, ఒక స్త్రీ ప్రాణాన్ని అపహరించినట్టు అతను నవ్వాడు. తన భజంమీదనున్న అతని చెయి తోసి, వాళ్ళ బాషలో ఫిర్యాదుచేసి, అతని భార్య కొంచెం జరిగి నిలబడింది.

'ఏ సాయిబూ, నువ్వొక పెద్ద తుంటరి!' అని మీనా తన చూపుతో అతనికి చెప్పింది.

ఆ సంఘటన తరువాత, ఆ సంబాషణనీ, అనుభవాన్ని గుర్తుచేసుకొని మీనా సంతోషపడింది; ఒకనాడు ఆ మీసాలవాడిని తన కలలోకూడా చూసింది: కలలో అతని భార్యలాగ బట్టలు వేసుకొని మీనా నిలబడివుంది; అతను అగహారంలోని మనిషిలాగ దంజెంతో, పట్టు పంచెతో ఎదురింటి వసారాలో కూర్చొనివున్నాడు. కాని ఆ మీసం మాత్రం అలాగేవుంది!

'ఇదేం గ్రహచారం? ఎక్కడైనా ఒక బ్రాహ్మణుడు ఇలాగ మీసం పెట్టుకుంటారా?' అని మీనా ఆశ్చర్యపడుతూంటే అతని వేషం గభిమని మారినట్టు అతను మీసం తీసేసాడు!

అంతేకాదు. మీనాను ఆమె భర్త పరాధీనం చెయ్యడానికిముందు, సంతోషంగావున్న రోజుల్లో పిలిచినట్టు 'మీను!', 'మీను!' అంటూ అతను ఆ ఇంటి మెట్లెక్కి లోపలికి వస్తున్నాడు; అతనిదగ్గరనుంచి మీనా దూరంగా వెళ్ళిపోతోంది.

అతనలా పిలుస్తూనే ఉయ్యాలమీదవున్న ఆమె పడకపక్క కూర్చున్నాడు; తనే ఉయ్యల ఊపుతూ ఆమెకి చెప్పాడు: "ఏ మీను, నా మాట విను, ఇదంతా ఒక వేషం! నేనొక వేషం, నువ్వొక వేషం వేసుకొని మనం ఒక నాటకం ఆడుతున్నాం!" అని స్త్రీలను ఆకర్షించే నవ్వుతో అతను మాటాడుతుంటే మీనాకి ముక్కుమీద కోపం వచ్చింది.

"నేనేం వేషం వెయ్యటం లేదు! నువ్వే వేషం వేస్తున్నావ్! నీ వేషంతో ఊరంతా తిరుగు! నేను ఉత్తికే తమాషా చూస్తుంటాను; ఇంటిలోకి నువ్వు రావోద్దు!" అని ఆమె కటువుగా చెప్పగానే అతను రోషంతో లేచివెళ్ళిపోవడంచూసి ఆమె బాధపడింది.

నిద్రనుంచి లేచిన మీనా దేవుని పఠంముందు "నిలబడి ఈశ్వరా, ఇక నాకు ఇటువంటి కలలు రాకుండా కాపాడు!" అని ప్రార్థించింది.

మరునాడు పొద్దున్న ఆమె ఇంటిముందు ముగ్గులు వేస్తూంటే, వంచినతల ఎత్తకుండా, కనిబొమ్మలుమాత్రం లేవనెత్తి, అతను ఆ సైకిలి పెడలు తొక్కుతూంటే. అతను తొడుక్కున్న భారీ బూట్సులూ, మడమకిపైగా మరకబొయిన లుంగి, కాలులోని రోమాలు - ఇవన్నీ మీనా చూసింది.

అతను తన్ను దాటి వెళ్ళిన తరువాత నిలబడి ఆ చిన్న సైకిలులో ఆజానుబాహువుగా వెళ్తున్న అతని వీపు చూసింది.

కొన్నిరోజుల తరువాత, ఒకనాడు చెరువులో స్నానం చేసి ఇంటికి వస్తున్నప్పుడు అతని స్వరూపం నిండుగా చూడలేక ఆమె తలవంచుకొని నడిచింది.

********

*(మూలం ప్రచురణ: కళైమగళ్ (1969)*

# నేనేం చెయ్యాలి చెప్పండి!

నలభై సంవత్సరాలైపోయాయి ఈ ఇంటికి నేను కోడలుగా వచ్చి . . . చేతినిండా ఒక గంప పిడతలతో నాన్నగారు నన్ను తీసుకొచ్చారు. అప్పుడు అమ్మ - అంటే మా అత్తగారు - ఉండేవారు, అత్తగారికి అత్తగారుగా, తల్లికి తల్లిగా . . . కన్నతల్లితో నేనున్నది ఐదు సంవత్సరాలేకదా? ఆ తరువాత అత్తగారికి కోడలేకదా? నాన్నగారు చావడిలో నన్ను దింపేసి అక్కడే నిలబడి తువ్వాలుతో మొహం కప్పుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు . . . నాకేం బోధపడలేదు . . . అప్పుడు పెరడులో నిలుచొని - అప్పుడే మొండితనం అతనిలో బాగా కనిపిస్తోంది - నాలికని బయటకి తీసి, చేతివేళ్ళని తెంచుతూ, ఆ పచ్చి ఇటిక నేలమీద బొంగరం వదలుతానని హఠం చేస్తున్న అతనే నా భర్త అని తెలియడానికి చాలా రోజులు పట్టాయి . . . ఐతే, దానికోసం అతను నా తలమీద కొట్టాలా? నేనుకూడా 'సరేరా' అని ఒకసారి బాగా వాయించాను. వంటగదిలోనున్న మా అత్తగారు పరుగెత్తుకొని వచ్చారు: "ఐయయ్యో, ఏమిటే ఇది? వాడు వీడు అంటున్నావు . . . " "మరి వాడెందుకు నన్ను కొట్టాలి?" ఆవిడకి ఒకటే నవ్వు . . . నన్ను కౌగిలించుకొని మా బంధుత్వం ఏమిటో వివరించి చెప్పారు . . . అన్ని సంగతులూ బోధపడే కాలం వస్తే అవే బోధపడతాయి. ఆలోచించిచూస్తే నాకే ఆశ్చర్యంగా ఉంది . . . నాకు మావారిమీద ఎందుకు ఇంత భయం వచ్చింది? భయం అంటే అది ఒక సంతోషమైన భయం . . . మర్యాదతో వచ్చే భయం . . . భయం అని కూడా అనలేం, అది ఒకవిధమైన భక్తి . . . ఎలాగో వచ్చేసింది . . . నలభై సంవత్సరాలుకి పైగా ఐపోయింది . . .

'ఇతన్ని పెళ్ళిచేసుకొని నేనేం సుఖపడ్డాను? నాకు ఇది ఉందా? అది ఉందా?' అని వాపోతూ ఎందమంది ఉన్నారు! అస్తమానం - ఈ చెరువుగట్టునుంచి ఆ కోవిల ప్రాకారం వరకూ మొరబెట్టుకొని తిరిగే వీళ్ళందరూ ఏం మనుషులో అమ్మా!

నాకెటువంటి కొరతా లేదు. అవును . . . కావాలంటే ఏ కోవిలలోనైనా మడి కట్టుకొని ఖచ్చితంగా చెప్తాను: నాకు ఎటువంటి కొరతా లేదు. ఐతే చూసినవాళ్ళు

అంటారు, నాకు పిల్లలు లేరనే సంగతి పెద్దగా చెప్తారు, చెప్తున్నారు. నేనుకూడా విన్నాను, ఎందుకు అబద్ధం చెప్పాలి? ఒకప్పుడు నేనుకూడా దానిగురించి బాధపడేదాన్ని, కాని అది ఎంత అజ్ఞానమని అర్థం చేసుకున్నాను. నేనే తెలుసుకోలేదు, మావారు నాకు బోధపరిచారు. అతనికే అది సాధ్యం; నోరు తెరిచారంటే ఎక్కడనుంచి ఆ సూత్రాలన్ని చెయ్యికట్టుకొని అతనిముందు నిలబడతాయో? మన శాస్త్రాలనుంచి, వేదాలనుంచి నిదర్శనాలు చూపించి ఎటువంటి ప్రశ్న ఐనా, ఎటువంటి అజ్ఞానులు తెలుసుకోవాలన్నా, తన మాటలతోనే ఇతను వాళ్ళకి జవాబు చెప్తారు. అలాంటి వాక్చాతుర్యం . . . అలాంటి జ్ఞానం . . . అది అతనికే సాధ్యం . . . ఏమో మావారి గురించి నేనేమో గొప్పగా పొగడుతున్నానని అనుకోకండి . . . అతన్ని పొగడడానికి తగిన జ్ఞానం నాకు లేదు . . . అటువంటి విద్వాంసుడికి నాలాంటి నిరక్షరకుక్షి భార్యగా వచ్చి చేరాను చూసారా? నేను దీనిగురించి అతనికి చెప్పాను, అతనొక ప్రసంగమే చేసేసారు . . . అతనికి నేను భార్యగావుండడం ఎంత ఉచితమని, అతనికి నావల్ల ఎంత సంతోషమో అని అతను నాకు చెప్పినదంతా నేను మీకు చెప్పగలనా? నేను అతనికి భార్యగా ఉండనీ, అందువలన అతన్ని పొగడడానికి నాకు అర్హతవుందని చెప్పగలమా?

మహా విద్వాంసులు శ్రీ ________________ అని చెప్తే ఈ రాజధానిలో అందరికీ తెలుసు. ఇతని ఖ్యాతి ఈ చెన్నపట్ణంనుంచి కాశీవరకూ వ్యాపించివుంది.

ఇతనిదగ్గర చదువుకున్నవాళ్ళు - నాతో ఇంటిపనులు చేసినవాళ్ళు - ఎంతమంది కలెక్టరులుగాను, పెద్ద పెద్ద పనుల్లోనూ ఉన్నారు తెలుసా?

మనమే కని, మనమే పెంచి, పిల్లి కుక్కల్లా జీవించాలా ఏమిటి?

ఇదిగో, ఇప్పుడుకూడా ఈ శంకరమఠం వాసరాలో పిల్లల్ని వరుసగా ఎదుట కూర్చోపెట్టుకొని ఇతను వాళ్ళకి విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇతని నాభినుంచి వెలుబడే ఆ గంభీరమైన ధ్వని వింటే నా దేహం పులకరిస్తోంది! ఆ తరువాత ఆ పిల్లలందరూ సమశృతితో వల్లించుతుంటే . . . ఆ పిల్లలు అంత శ్రద్ధతో, భక్తితో, మృదువైన కంఠంతో, అతనిలాగే చెప్పాలని ప్రయత్నించి ఆ గాంభీర్యం లేక ఆ స్థాయిని మాత్రం అందుకోవాలని కడుపు కట్టుకొని, ఛాతీమీద చేతులువేసి ఉచ్చారణ చేస్తున్నారే . . .

అది చెవిలో పడితే నాకు కడుపులో ఏమో చేస్తుంది . . . ఇదేం కన్నవాళ్ళకి మాత్రం ఏర్పడుతుందా?

ఇతను అనేవారు: 'పిల్లల్ని కనడం ఏం పెద్దపని కాదు; వాళ్ళ కడుపు నింపడం ఏం పెద్దపని కాదు; పాండిత్యం, శీలం ఇచ్చి, ఒక పిల్లవాడిని జ్ఞానస్తుడుగా చేయడమే ఒక పెద్ద పని. మనందరం సాధారణ పిల్లల్ని కన్నవాళ్ళం అనే పేరుకంటే ఇటువంటి జ్ఞానస్తులని ఉత్పత్తి చేసేవాళ్ళం అనే పేరే శ్రేష్టమైనది.' ఇంకా ఏమేమో చెప్తారు, నాకు అవన్నీ తిరిగిచెప్పడం చేతకాదు. కాని అతను చెప్పేది ఎంత సత్యం అని నా మనసుకి అర్ధమవుతోంది . . .

ఇతనిదగ్గర చదువుకొని ఇప్పుడు చెన్నపట్ణంలో ఏదో కాలేజీలో సంస్కృత ప్రొఫెసరుగా ఉన్నాడే చీమాచ్చు -వాడికి ఇప్పుడు పండితులు శ్రీనివాస శాస్త్రి అని పేరట! వినడానికి ఎంద ఇంపుగా ఉంది! కంటేనా? కన్న తల్లి ఈ ఊరులోనేవుంది . . . తన కొడుకు తన్ను సరిగ్గా చూడటంలేదని నిత్యమూ శపిస్తోంది . . .

మావారు ఒక్కొక్క సంగతి చెప్తున్నప్పుడు చమత్కారంగా వాదిస్తున్నట్టు అనిపిస్తుంది. ఐతే, గభీమని, అవాళ అతను ఎంత చక్కగా, ఉచితంగా చెప్పారన్నట్లు ఒక్కొక్క సంఘటన జరుగుతుంది.

ఆరోజు కోవిలకి వెళ్ళి వచ్చే దారిలో చీమాచ్చు తల్లి నన్ను ఆపి చీమాచ్చు తన్ను తిరిగికూడా చూడకుండా తన అత్తగారింటికి వెళ్ళిపోయాడని, వాడిని పెంచి, చదివించడానికి తను పడిన కష్టాలని కృతజ్ఞత లేకుండా మరిచిపోయాడని, ఏడుస్తూ వాడిని శపించుతూంటే నాకు అనిపించింది: 'ఇలాగ కనడం ఎందుకు? శపించడం ఎందుకు? ఏమో ఆవిడకి సమాధానంగా నా తల ఊపాను కాని నాకంతా అర్ధమైంది: ఈ ముసలమ్మకి ఒకటే అసూయ! ఆవిడకి ఇక్కడ ఎటువంటి కొరతా లేదు, సౌఖ్యంగానేవుంది . . . కాని తను కన్న కొడుకు మూలం తక్కినవాళ్లు సుఖపడుతున్నారనే కోపమే ఈవిడ మనసుని బాధిస్తోంది . . . బాధ్యత కోరేవారు ఎందుకు మమకారం చూపలేక పోతున్నారు?

అన్నీ ఇతను చెప్తేనే నాకు బోధపడతాయి. లేకపోతే నేనుకూడా ఆ ముసలమ్మతో కలిసి ఆ చీమాచ్చుమీద ఒక పాటపాడి ఉంటాను . . .

ఇతను అన్ని విషయాలూ ఎంత కరాఖండిగా, దీర్ఘంగా ఎలాగ విమర్శిస్తున్నారు! అందువలన తవకి నష్టమా, లాభమా అని కొంచెంకూడా ఆలోచించరు. ఎంతమంది తనతో ఒప్పుకుంటారు లేక ఒప్పుకోరు అనే విచారం అతనికి లేదు. అతని వాదానికి సరిరాని ఒక పనిని ఈ ప్రపంచమే అతని నెత్తిపై రుద్దుతే దాన్ని అలాగే తోసి పారేస్తారు. ఆ తరువాత తను అలా నిరాకరించడం ఎంత న్యాయమని ఈ ప్రపంచాన్నే లాగి పక్కన పెట్టుకొని వాదించడానికి సిద్ధమౌతారు. నేనూ ఇన్ని సంవత్సరాలుగా చూస్తున్నానుగా . . . ఒక్కరైనా సరే 'అదేమో స్వామి, మీరు చెప్పేది సరిగ్గా లేదు' అని ఇంతవరకూ అనలేదు . . .

వాళ్ళందరితో వసారాలో కూర్చొని ఇతను మాటాడుతుంటే నేను ఇతని వీపు వెనుక ఇంకొక గదిలోనుంచి వింటూవుంటాను. ఆతను చెప్పే చాలా మాటలు నాకు అర్థం కావు. ఇతను ఎలా ఇంగ్లీషు మాటాడుతున్నారు! నాకు తెలిసి ఇతను తన ఇరవై వయస్సులో ఇంగ్లీషు చదివారు. ఒకతనికి ఇతను సంస్కృత పాఠాలు నేర్పిస్తూ - అతనికి మావారికంటే వయసు కొంచెం ఎక్కువ -అతని దగ్గర ఇంగ్లీషు నేర్చుకున్నారు. ఇక్కడనుంచి కుంటకోణం వెళ్ళి ఏవేవో పరిక్షలుకూడా రాసారు.

ఇప్పుడు ఇతను రాసిన పుస్తకాలు అక్కడ విద్యార్థులకి పాఠపుస్తకాలుగా ఉన్నాయట.

పది సంవత్సరాలముందు కాశీలో ఏదో ఒక సదస్సుకి ఇతను వెళ్ళినప్పుడు నేనుకూడా వెళ్ళాను. ఇతన్ని గౌరవించి ఏమేమో బిరుదులు ఇచ్చారు. అదిచూసి నేను గర్వపడ్డాను; ఒక వెండి బిందెలో గంగా జలం తీసుకొనివచ్చి ఊరిలో అందరికీ ఇచ్చాను. నాకేం తక్కువ?

అప్పుడే కాశీనుంచి తిరిగివచ్చేటప్పుడు మేం చెన్నపట్ణంలో చీమాచ్చు ఇంటిలో కొన్నిరోజులు గడిపాం. వాడు తన పెద్ద కారులో మమ్మల్ని రెయిల్ స్టేషన్ లో వచ్చి చూసాడు; మమ్మల్ని ప్లేట్ ఫారంలో నిలబెట్టి నమస్కారం చేసాడు; చెన్నపట్ణంలో కారు లేకుండా ఏమీ వీలవదట. అప్పుడుకూడా ముందులాగే మావారి ఎదుట చేతులు కట్టుకొని మర్యాదగా ఏమేమో ప్రశ్నలు అడిగితే ఇతను బోధపరిచారు. కాని వాడు

కాలేజీకి బయలుదేరినప్పుడు చూస్తే నాకే భయం వేసింది. దొరలాగ ఏమేమో తొడుక్కున్నాడు; ఇతనేమో వాడినిచూసి హోరున నవ్వారు.

తరువాత ఒకరోజు మా ఇంటిముందు ఒక పెద్ద కారు వచ్చి ఆగింది. ఎవరెవరో పెద్దమనుషులు - చీమాచ్చు ప్రొఫెసరుగా ఉన్నాడే ఆ కాలేజీలో పనిచేసేవారు - అందరూ వచ్చి మా ఇంటి వసారాలో కూర్చున్నారు. చీమాచ్చు మాత్రం తన సొంతయిల్లులాగ వంటగదివరకూ వచ్చేసాడు. నేను వాడిని "నువ్వెందుకు అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి మీ అమ్మని చూసుకోకూడదు?" అని అడిగాను. "అదేం నాకు చేతకాదు. 'నాతో వచ్చేయ్' అని అంటే అమ్మ వినదు" అని విచారంతో అన్నాడు. ఆ తరువాత తను వచ్చిన పనిగురించి చెప్పాడు:

వీడు పనిచేస్తున్న ఆ కాలేజీలో మావారిని పెద్ద ఉద్యోగంలో నియమించడానికి అక్కడ తపస్సు చేస్తున్నారట; కాని ఇతన్ని నేరుగా అడగడానికి వాళ్ళకి భయం. 'సరే, నేను మాటాడి అతను ఒప్పుకున్నట్లు చేస్తాను' అని ధైర్యం చెప్పి చీమాచ్చు ఇక్కడికి వాళ్ళని తీసుకొచ్చాడట . . . ఇంకా ఏమేమో చెప్పాడు . . . నాకుకూడా మావారు ఒప్పుకుంటారేమో అని ఒక ఆశ . . .

అతను రాగానే అందరూ వసారాలో కూర్చొని మాటాడారు, మాటాడారు, అలాగ మాటాడారు. నేను గదలోనుంచి వింటూనేవున్నాను. ఇతను చెప్పేది నాకు బోధపడలేదు. కాని ఒకటి అర్థమైంది. ఇతనిదగ్గర వాళ్ళ పప్పు ఉడకలేదు . . .

ఆఖరికి వాళ్ళందరూ వెళ్ళిన తరవాత నేను మావారిని అడిగాను: "మీరు ఈ ఉద్యోగంకి ఎందుకు సమ్మతించకూడదు? అక్కడ చదివేవారూ విద్యార్థులేకదా? మీకెందుకీ మొండితనం? పాపం చీమీచ్చు చాలా ఆశతో, నమ్మకంతో వచ్చాడు!"

నా మాటలు విని ఇతను నవ్వారు.

ఈ నవ్వు ఇతనికి పుట్టుకతో వచ్చినది; అందులోనూ నా దగ్గరే ఆ నవ్వు.

అతను నవ్వుతూ చెప్పారు.

"చీమాచ్చులాగ నేనుకూడా వేషాలు వేసుకొని తిరగాలని నీకు ఆశగావుందా? నీకు తెలియదూ విద్యాభ్యాసం చేసేవాళ్ళు జీతం పుచ్చుకోకూడదని? పాఠం చెప్పేవాడికి కూలీ ఇచ్చినతరువాత శిష్యుడికి అతనిమీద ఎలాగ మర్యాద ఉంటుంది? ఆ

గురువుకూడా కూలీకోసం పనిచేసే మనిషైపోతాడు . . . అంతేకాదు; ఒక జండా పట్టుకొని, గోల పెట్టడానికి నన్ను పిలవకపోయినా, నన్ను ఆ గుంపుకి ఒక నాయకుడుగా ఉండమంటారు . . . నేనలాగ ఉండగలనా, నువ్వే చెప్పు . . . "

నేనేం చెప్పను? ఏమీ అనకుండా అతను చెప్పేది నోరుమూసుకొని విన్నాను.

నా ఊహలో అతను ఒక చొక్కా తొడుక్కొని నిలబడితేనే నాకు నవ్వు వస్తోంది! ఆ తలపే అర్థంలేకుండా ఉందికదా? నేనుకూడా ఇతనితోపాటు నవ్వేసి ఆ సంగతి వెంటనే మరిచిపోయాను.

ఇతనిగురించి ఇంతతెలిసికూడా నేను అవాళ అతన్ని అలాగ అడిగినందుకు నేను సిగ్గు పడ్డాను; అవును, ఈ నలభై సంవత్సరాలూ నేను జడ్డిగానే ఉన్నాను . . . అప్పుడప్పుడు ఏమైనా ఒక పిచ్చిపని చెయ్యడం . . . అదిచూసి ఇతను నవ్వడం . . . నా జన్మ ఇలాగే ఐపోయింది . . .

చూడండి . . . పదిరోజులముందు – ఇలాగే . . . ఇతనిదగ్గర చదువుకుంటున్న ఒక అబ్బాయి ఒక చీటీని నాదగ్గర తీసుకొని వచ్చాడు. "ఏమండీ, ఇది గవర్ణమెంటు నడిపే లాటరీ పోటి . . . ఒక రూపాయి మాత్రమే . . . ఇది దొరకడం కష్టం, నేను మీకోసం కొని తీసుకొని వచ్చాను' అని చెప్పాడు. నేనుకూడా ఏమీ ఆలోచించక 'పాపం, అబ్బాయి మనకోసం శ్రద్ధగా తెచ్చాడుకదా?' అని ఒక రూపాయి ఇచ్చి పుచ్చుకున్నాను.

ఆ అబ్బాయి దాని గురించి ఒక ప్రసంగమే చేసేసాడు; చాలామంది ఆ లాటరీ పోటిలో గెలిచి లక్షాధిపతులూగా మారిపోయారట. అందులో పేదవాళ్ళే గెలుస్తున్నారట. ఇంకా ఏమేమో చెప్పాడు. నేను ఊరికే తమాషాకోసం కొన్నాను. కాని ఆ సాయంకాలమే మావారు వసారాలో ఐదుగురో, ఆరుగురో మధ్య కూర్చొని ఆ లాటరీని ఖండించడంవిని నేను ఉలిక్కిపడ్డాను.

గదిలోనుంచి ఇతని మాటలు వింటూంటే నాకు అలాగే నా రెండు బుగ్గలమీద ఎవరో బాగా వాయించినట్టనిపించింది.

అందులోనూ అవాళ అతను మాట్లాడడం మామూలుగా అతను నిదానంగా వాదం చేసేలాగ లేదు. ఈ ప్రపంచాన్నే శపిస్తున్నట్లు అతను ఆవేశంతో అరిచారు:

"ఈ దేశంలో ఇది జరగవచ్చా? జూదరి జూదం ఆడనీ, రంకుతనం చేసేవాళ్ళు రంకుతనం చెయ్యనీ. కాని రాజరికంలోనివారు, రాజ్యమేలేవారు ఇలా చెయ్యవచ్చా? ఈ కలియుగంలో మనం నాశమవడానికి ఇదే నిదర్శనం! నీతి తప్పకుండా పరిపాలన చేసిన ఆ ధర్మరాజు ఎలాగ నాశమయ్యాడు? బాగా ఆలోచించండి . . . ధర్మరాజే జూదంవలన నాశమైపోయాడు. 'జూదంలో గెలిచినా, ఓడిపోయినా, వాళ్ళ జీవితాలు వృధా!' అనే సత్యాన్నేకదా మహాభారతం మనకి చెప్తోంది? జూదంలోనూ ఒక ధర్మం ఉంది, వినండి; సమ అంతస్తులో ఉన్నవాళ్ళే జూదమాడవచ్చు. అదీ ఒక పాపమే, కాని ఆ పాపానికి ఒక హద్దు ఉంది. రాజరికం చేసేవారూ, రాజ్యపరిపాలనకి బాధ్యత కలవారూ పామరజనులని ఇటువంటి మాయాజాలం చేసి జూదం ఆడుతున్నారే, ఇది న్యాయమేనా? అంతే, ఇక ప్రజల మధ్య ఎటువంటి వ్యవస్థా ఉండదు! ఇక దారిద్ర్యం వలన నాశమవడానికి బదులు జూదం మూలంగా ప్రజలు నాశమవుతారు! . . . తిరువళ్ళువర్ పేరులో వీధికి వీధికి శిలలు పెట్టి ప్రతిష్టచేస్తే సరిపోతుందా? అతనే జూదంగురించి రాసివున్నారే?" అని అంటూ ఇతను ఆ పది పద్యాలని వల్లించి అర్థంకూడా చెప్పారు; మహాభారతంనుంచికూడా శ్లోకాలు చదివారు. "ఖర్మ, ఖర్మ, . . . ఇక మీ బ్రతుకు అంతే!" అని నెత్తిమీద కొట్టుకున్నారు.

నాకు కడుపు తిప్పింది. ఎందుకురా ఈ వెధవ లాటరీ టికెట్టు కొన్నానని వాపోయాను. ఐనాకూడా ఇతను ఎందుకు ఇంత ఆవేశంగా దీన్నిగురించి వాదిస్తున్నారని నాకు బోధపడలేదు; ఇతను చొక్కా తొడుక్కోరు; అందువలన ఈ ప్రపంచంలో అందరూ ఇతనిలాగే చొక్కా లేకుండా, పిలకతో, పంచాంగం చూసే క్షవరం చేసుకోవాలని ఇతను వాదిస్తారా?నేను చేసిన పనికి నేనుకూడా సరైన వాదం నా మనసులో తయారుచేసుకున్నాను.

ఆ చీటీని పుచ్చుకొని ఇప్పుడు నాదగ్గర అదివుంటే దానివలన ఏం కష్టం? కాని మన దురదృష్టం వలన మనకి ఒక నూరు రూపాయలు వస్తే . . . అదు ఊరంతా తెలియదూ?

అంతేకాదు. ఇతను ఇలాగ మాటాడుతుంటే నేను లాటరీ టికెట్టు కొన్నది తెలుస్తే అందరూ మావారి చిత్తశుద్ధిని అనుమానించరూ? అప్పుడు నేనేం చేస్తాను?

ఆ అబ్బాయి - నాకు చీటీ ఇచ్చినవాడు - చెప్పాడు. పత్రికలవాళ్లు, ఫోటోగ్రాఫర్లతో ఎటువంటి గ్రామమైనా వెదకి ఆ లాటరీలో గెలిచినవారిని కనుక్కుంటారట. చెన్నపట్టంలో దీనికోసం పెద్ద ఉత్సవం జరిపి ఒక పెద్దమనిషి మూలంగా ఈ పురస్కారం ఇస్తారట. ఇదేం ఖర్మ, దేవుడా!

'సరే, ఏమో కొనేసాం, ఎందుకీ ఉత్త కల్పన?' అని అతని దగ్గర దీనిగురించి నేను ఏమాటా అనలేదు.

కావాలనే ఒకరోజు ఇతనికి అన్నం వడ్డించినప్పుడు నేనే ఆరంభించాను.

"అదేమిటి? ఏదో ప్రైజ్ టికెట్టు అంటున్నారు . . . ఒక రూపాయి ఇచ్చి కొన్నవాళ్ళకి ఒక లక్షరూపాయలు దొరుకుతాయట . . . గవర్ణమెంటులో ఉన్నవారే నడపడంవల్ల అందులో ఎటువంటి మోసం, దగా లేదంటున్నారు . . . పక్కింటి అమ్మాయి పది టికెట్టులు ఒకేసారి కొందట . . . అది . . . అదేమిటి?" అని అడిగాను.

"ఈ సంగతి మన వంటగదివరకూ వచ్చేసిందన్న మాట! అది ప్రభుత్వం జరిపే జూదం! అంతే, మరేం కాదు. కలరాలాగ ప్రజలని పీడించే ఒక వ్యాధి అది. కలరా, మసూచి వంటి వ్యాధులని నివరించడానికి పనిచేసే ప్రభుత్వమే ఇదికూడ చేస్తోంది. అందువలన వాళ్ళకి డబ్బు వస్తోందట . . . పేదలు లక్షాధిపతులవుతున్నారట . . .ఎలాగో పోనీలే . . . నువ్వూ, నేనూ లక్షాధిపతులనలేదని ఏడుస్తున్నామా? మనకేం దారిగురించి గొడవ?" అని అన్నారు.

"ఎవరైనా మీదగ్గర వచ్చి లక్షరూపాయి ఇస్తే, 'వొద్దు!' అని చెప్పేస్తారా?" అని అడిగాను.

అతను నవ్వు చూసి నవ్వారు; నాకు ఒకటే అవమానం; నా దేహం వొణుకుతోంది.

'నలభై సంవత్సరాలు నాతో కాపురం చేసిన నీకా ఇటువంటి సందేహం?' అని అడుగుతున్నట్టింది అతని చూపు . . . నేను తల వంచుకున్నాను.

"మీరు 'వొద్దు!' అని చెప్తారు, అది నాకు తెలుసు . . . కాని ఎందుకు అలాగ చెప్పాలి అని నేను అడుగుతున్నాను. మీ ముత్తాతలకి మాన్యంగా వచ్చిన ఈ ఇంటిలో, వర్షం వచ్చినప్పుడు పడమటి భాగం మూడు సంవత్సరాలుగా పగులు బారిన గోడలమధ్య పరదలో మునిగిపోతోందికదా - దాన్ని సరిచెయ్యడానికి దారి తెలియక

మనం ఉన్నాం. మనకి డబ్బు అవశ్యకమేకదా? 'మనం ఎందుకు అదృష్ట లక్ష్మిని నిర్లక్ష్యం చెయ్యాలి?' అని ఆలోచిస్తున్నాను. అది తప్పంటారా?" అని అడిగాను.

"ఓ, నువ్వు మాటాడడం చూస్తే నీకు ఆ లాటరీ టికెట్టు కొనాలని ఆశ. అవునా?"

నేను బదులు చెప్పలేదు.

"పెర్రిదానా . . . పేర్రిదానా, ఆశ మానవునికి శత్రువు. లాటరీలో మనకి బహుమానం రాదనే కారణంవలన నేను అది తప్పు అని అనలేదు; అది అధర్మంగా చాలామంది కడుపుమంటతో సంపాదించిన డబ్బు అని అంటున్నాను. యోగ్య మార్గంలో కాకుండా వచ్చే డబ్బు పాపాలమూట కదా? నువ్వు మా ముత్తాతలగురించి చెప్పావు . . . వాళ్ళందరూ ఉంఛవృత్తి చేసి మహా మేధావులుగా జీవించారు . . . నాకు బాగా జ్ఞాపకముంది . . . మా నాన్నగారు ఇదే శంకరమఠంలో పగలంతా పిల్లలకి విద్యాభ్యాసం చేసేవారు; సాయంకాలం కాలక్షేపం చేసేవారు; ప్రొద్దూనే ఉంఛవృత్తికి వెళ్ళేవారు . . . ఇంకొక పేళకి మిగిలేటట్టు కాకుండా ఆ పాత్ర ఉంటుంది. శ్లోకాలు వల్లించుతూ వీధిలో నడుస్తారు . . . ఆ ఆ ఇంట్లోనుంచి పిల్లలు తమ చేతుల్లో బియ్యం తీసుకొనివచ్చి అతనికి బిక్ష ఇస్తారు . . . ఎందుకో తెలుసునా పిల్లలే బిక్ష ఇవ్వాలని నియమం పెట్టారు? పెద్దవాళ్ళ చేతులైతే ఒక నాలుగిళ్ళ తరువాత ఆ పాత్ర నిండిపోతుంది . . . తక్కినవాళ్ళందరూ వాళ్ళ వాళ్ల ఇంట్లో కాచుకొని ఉంటారే? వాళ్ళ కానుకని అడ్డగించిన పాపం వచ్చేస్తుంది కదా? అందువలనే ఆ పాత్ర నిండిన తరువాత ఎవరైనా బిక్ష ఇస్తే దాన్ని తీసుకోరు . . . బిక్ష ఇచ్చినవారిమీద అందులోనుంచి రెండు మూడు అక్షింతలు తీసి వాళ్ళ తలమీద పోసి ఆశీర్వాదం చెస్తారు . . . ఆ వంశంలో పుట్టిన పుణ్యం వలనే నాకు ఈ జ్ఞానం వచ్చింది . . . ఇంతకంటే మరే అదృష్టం కావాలని నాకు తెలియదు. ఈ నెమ్మదిని, ఆరోగ్యవంతమైన మనసుని ఎన్ని లక్షలు ఇవ్వగలవు? జూదం మూలంగా, డబ్బు ద్వారా ఈ ప్రభుత్వం లక్షాధిపతులని ఉత్పత్తి చేయవచ్చు కాని ఒక జ్ఞానస్తుడిని, ఒక చదుర్వేద పండితుడని వీళ్ళు ఇవ్వగలరా?" అని రోజంతా నాదగ్గర మాటాడారు.

ఇదంతా జరిగి పదిరోజులైపోయాయి. నేను చీటీగురించి పూర్తిగా మరిచిపోయాను.

నిన్న, ఆ పిల్లవాడు - నాకు ఆరోజు టికెట్టు అమ్మిన అబ్బాయి - ఒక పేపరుని తీసుకొనివచ్చి "ఇందులో గెలిచినవాళ్ల నంబర్లు వచ్చాయి . . . మీ టికెట్టు తీసుకురండి . . . చూద్దాం . . . " అని ఉత్సాహంతో అరుచుకుంటూ వచ్చాడు. మంచి వేళ! అతను అప్పుడు ఇంట్లో లేరు . . .

నాకు కడుపు తిప్పింది.

'దేవుడా, నన్ను కాపాడు!' అని నేను ప్రార్థించడంతో ఒక యుక్తి తోచింది.

"దాన్ని ఎక్కడపెట్టానో జ్ఞాపకం లేదురా," అని వాడితో ఒక అబద్ధం చెప్పేసాను. ఆ నంబరుకి ఏమైనా బహుమానం వస్తే ఈ ఊరులో అందరూ గుంపుగా మా యింటిముందు పుంజుకోరూ?

ఆ పిల్లవాడి మొహం అలాగే వాడిపోయింది. వాడు కోపంతో నన్ను చూస్తున్నట్టు ఆ పేపరుని పడేసి వెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళిన తరువాత నేను ఆ పేపరుని తీసుకొని నా గదికి వెళ్ళి ఒంటరిగా దాన్ని చూసాను.

కు చదవడం తెలియదుగాని సంఖ్యలు అర్ధమౌతాయి. ఒ సంఖ్యలముందు ఏవో అక్షరాలున్నాయి; అవేమో నాకు తెలియదు. కాని అదేలాగ నా చీటీలోవుందా అని వెదికిచూసాను.

దేవుడా! మొట్టమొదటే అదేలాగ రెండు అక్షరాలు! తరువాత అదేలాగ . . . మూడూ, ఏడు, సున్నా, ఒకటి, ఒకటి, ఆరు!

అంటే . . . ఆ లక్షరూపాయల బహుమానం నాకే వచ్చిందా . . . ఐయయ్యో, నేను ఇప్పుడు ఏం చేస్తాను?

మధ్యాహ్నం ఆయన రాగానే ఆ చీటీని తీసుకొనివెళ్ళి అతనికాలుకిందపెట్టి "నన్ను క్షమించండి!" అని ఏడ్చాను.

"నేనేమో ఏదో తమాషాకి ఆ అబ్బాయి అడిగాడని కొనేసాను; దీనిగురించి మీరు ఇంత కోపంగా ఉన్నారని నాకు కొన్నతరువాతే తెలిసింది. 'ఇందులో మనకేం బహుమానం వస్తుంది?' అని నేను అజాగ్రత్తగా ఉండిపోయాను. నాకు బహుమానం

రాకూడదని దేవున్నికూడా ప్రార్థించుకున్నాను . . . మరి ఇప్పుడు ఇలా ఐపోయింది. మీరు నన్ను క్షమించి దీన్నీ, నన్నూ ఏలుకోవాలి . . ." అని బతిమాలాను.

అతను మళ్ళీ నవ్వారు. నవ్వుతూనే నన్ను ఎత్తి నిలబెట్టారు. మొహంలో నవ్వు మారనేలేదు. అతను అన్నారు:

"ఏమే, నువ్వు ఇప్పుడు లక్షాధిపతి ఐపోయావ్ . . . సభాష్! ఇది నాకు సంబంధం లేకుండా నువ్వే సంపాదించుకున్న ధనం; నువ్వెందుకు దీన్ని నా కాలుకిందపెట్టి ఈ పాపాన్ని నా తలలో రుద్ది నన్ను మోయమంటున్నావ్? నేను ఈ లక్షరూపాయలు వొద్దు అని చెప్పినది తమాషాకి కాదు; నిజంగానే నాకది వొద్దు. నాకిప్పుడు ఉన్న బెంగ అంతా ఇదే: ముందులాగ, అంటే ఇరవై సంవత్సరాలముందు ఉన్నట్లు, ఇప్పుడంతా వేదాభ్యాసం చేసేవాళ్ళు తగ్గుతూ వస్తున్నారు. ఇంకొక పది విద్యార్థులు దొరికితే నాకు చాలు . . . వాళ్ళు డబ్బువలన రాకూడదు, డబ్బుకోసమూ రాకూడదు . . . అది నీకు బోధపడదు . . . సరే, అది నీ ప్రశ్న. నేనెప్పుడూ ఉంఛవృత్తి చేసి జీవించే బ్రాహ్మణున్ని. మా నాన్నగారూ, తాతగారూ, ముత్తాతలూ - అందరూ ఆ మార్గంలోనే వచ్చారు. ఒక లక్షాధిపతికి భర్తగావుండే అంతస్తు నాకు లేదు . . . " అని ఏమేమో అంటున్నారు ఇతను.

"ఎందుకు మీరు మన ఇద్దరినీ ఇలా విడదీసి మాటాడుతున్నారు? . . . ఇప్పుడు నేనేం చెయ్యాలి అని చెప్పండి, అది నేను తప్పక చేస్తాను . . . నాకిలా జరుగుతుందని తెలియదు . . . జరిగిపోయింది . . . ఇక నేను ఏం చెయ్యాలి?" అని మళ్ళీ మళ్ళీ అతన్ని అడుగుతున్నాను . . .

ఎటువంటి దయా, దాక్షిణ్యం లేనట్టు అతను మళ్ళీ నవ్వుతూ చెప్పారు:

"ఈ లాటరీ టికెట్టుని ఉపయోగించుకోవాలి అని నువ్వు నిశ్చయిస్తే అది నీ ఇష్టం. తిన్నగా వెళ్ళి ఫోటో తీసుకొని పత్రికలలో అది ప్రచారమై నువ్వు హాయిగా ఉండవచ్చు. నువ్వు ఎవరి భార్యవని చెప్పకూడదు . . . నీ తృప్తికోసం ఆ అబద్ధం చెప్పుకొని కాలం గడుపుకో . . . లేకపోతే 'ఈ మాయ వలలో నేను చిక్కకుండా ఉంటాను!' అని ఈ వెధవ టికెట్టుని చింపేయ్, అవును, దాన్ని చింపి పారెయ్! మరెవరికైనా ఇచ్చి దానికి వడ్డీ తీసుకొని జీవించితే అదీ పాపమే! పాపిష్టి మనసుకి ఇటువంటి ఆలోచనలు

వస్తాయి. వాటికి బలి అవకుండా ఎటువంటి కుటిలమైన దారిలోనూ పడకుండా ఆ టికెట్టుని చింపి పారెయ్. ఈ రెండు దారులూ నీ ఇష్టం. పాపమా, భాగ్యమా అని నిరణయించేది నువ్వే. ఇక నేను వెళ్ళాలి . . . అని అంటూనే వెళ్తున్నారే ఇతను . . .

ఇప్పుడు నేనేం చెయ్యను చెప్పండి . . . దేవుడా! ఒక లక్ష రూపాయలు! ఈ ఒక లక్ష రూపాయల్ని, అదృష్ట లక్ష్మిని ఎటువంటి దాక్షిణ్యం లేకుండా తోసి పారేయడం ఎలాగ? అతని చెయిలో పడితే చింపి పారేస్తారు అదు జ్ఞానులకి సులభం.

మనలాంటి అజ్ఞానులకి అది వీలవుతుందా, చెప్పండి!

ఎన్నో లక్షలకంటే ఇతను పెద్దవారే, నేను కాదనను. ఈ లక్ష రూపాయలని కాలి ధూలితో సమానంగా భావిస్తూ, ఉంఛవృత్తి చేసే ఇతనికి ఏ లోపమూ రాదు. అటువంటి మహనీయులతో సంసారం చేసి ఉంఛవృత్తి హీవితంలో పాల్గొన్న నాకుకూడా ఖ్యాతి లభిస్తుంది . . .

ఎది గొప్ప - డబ్బా, జ్ఞానమా? అది నాకు తెలియదు. కాని డబ్బు ఎలాగ, ఎంతవున్నా శాస్వతం కాదో అలాగే మానవులు, ఎంత జ్ఞానులైనా వాళ్ళ జీవితం శాస్వతం కాదే . . .

అలాగ తలచడమే, చెప్పడమే పెద్ద పాపం. కాని ఈ రోజుల్లో ఎటువంటి పతివ్రతకూడా తన భర్తతో తనూ దహనమవడం లేదే? ఒక వేళ నేను అలాగ ఉండవలసి వస్తే? శివ శివా . . .

ఇతను ఉంఛవృత్తి చేస్తే నాకేం గొప్ప? అందరూ నన్ను ఒక ముష్టిదనే అంటారు; కట్టిన భార్యని వీధుల్లో బిచ్చగత్తెగా వదిలేసారని ఈ మహా పండితుడుగురించి పోచికోలు కబుర్లు చెప్తారు . . .

ఇతనైతే దీన్ని చింపి పారేస్తారు, కావి నేనలా చెయ్యగలనా? కాని, అతనలా చెప్పి వెళ్ళిపోయారు . . .

ఇప్పుడు నేను ఆ చీటీతో నిలబడివున్నాను. ఇది నా చెయిలో బరువుగావుంది. నేనేం చెయ్యాలి చెప్పండి!

********

*(మూలం ప్రచురణ: ఆనంద వికటన్, 1969)*

# తప్పులు, నేరాలు కావు!

అసలు అలా చూస్తే, తెరసా మాటల్లో ఏదీ నిష్టూరంగా లేదు. ఆమె వాటిని చెప్పినప్పుడు  ఆమె ధ్వని కఠినంగా లేదు. శాంతమైన స్వభావం కల తెరసా పలికిన మాటల్లో  వినయం కూడా చోటుచేసుకుంది. అతనిగురించి ఆమెకి విలాపమే, కాని అతన్ని అవమానించాలని ఆమెకి తలపు ఉన్నట్టు ఎటువంటి గుర్తూ కనిపించలేదు.

'ఛీ!' అని అగ్నిలాగ మండిపడి అతనిమీద ఉమ్మేసినా లేక డామిడ్ అని తిట్టినాకూడా పరవాలేదని నాగరాజన్ కి అనిపించింది. అటువంటి అనుభవాలతో అతనికి మంచి పరిచయముంది.

అటువంటి సమయాల్లో తన్ను ఎలా కాపాడుకోవాలని అతనికి తెలుసు. అతని అంతస్తు, పలుకుబడి, అధికాదం, వయసు, హోదా - వాటిలో ఏదో ఒకటి అతనికి సాయంగా నిలబడుతుంది.

ఐతే, ఇక ఏంచేసి ఏం లాభం. ఈ తలవంపు తను భరించవలసిందేనా నాకెప్పటికీ బుద్ధి రాదే . . .  అని  మనసుకి కలిగే జంకుతో అతను బాధపినప్పుడు అతని కళ్ళు చెమ్మగిల్లాయి.  ఈ అవమానంతో తనకే తనపై ఏర్పడిన ఏవగింపుతో అతను విరక్తి చెంది తనగురించి ఆలోచించారు:

'ఛీ, ఛీ, నేనేం మనిషిని! నాకు యాభైయేళ్ళు నిండబోతున్నాయి; నాకంటే పొడుగాటి కొడుకూ, కాలేజీలో చదివే అమ్మాయివున్నారు! వాళ్ళకే పెళ్ళైవుంటే నేను నలుగురు పిల్లలకి తాతగా ఐవుంటాను! ఛీ, ఛీ, నేనేం మనిషిని!' అని కటువుగా దంతాలు కరుచుకున్నారు. రెండు చేతులూ కోటు పాకెట్లలో దోచుకొని, కన్నులు మూసి, అలాగే కూర్చిలో వాలిపోయి, తన్ను మరచి, " What a shame! " అని ములుగుతూ తలని ఇలా అలా ఊపారు. అతనికి ఇక ఏం చెయ్యాలో తెలియలేదు.

తెరసా మొహం అతని జ్ఞాపకంలో మళ్ళీ వచ్చింది.

కొంచెం సమయం ముందు . . .

మొహం ఎర్రబోయి, ఆమె జుత్తు నుదుటమీద పొరలుతుంటే, పెదిమలు అగ్నిని తాకినట్టు అదురుతుంటే, కళ్ళలో, నీళ్ళతో . . .

"Please! Leave me alone . .  I am sorry for everything!"  అతన్ని విడచి దేహమంతా వొణుకుతూంటే ఆమె నిలబడిన ఆ దృశ్యం . . .

తన కళ్ళనుంచి ప్రవహించే కన్నీరు తుడుచుకోడానికి ఆమె రుమాలు బయటకి తీసేముందే గభీమని ఆ సునుపైన గాజు మేజాపై పడి ఇంకా అలాగేవున్న ఆ రెండు కన్నీరుబొట్టిలు . . .

అతని ఎదుట తను ఏడ్చిన తన అనాగరిగ ప్రవర్తనకి క్షమాపణ కోరుతూ "I am sorry! . . ." అని తనకు తనే చెప్పుకుంటూ ఆ రుమాలుతో మొహం కప్పుకొని అక్కడనుంచి తన గదికి పరుగెత్తుకొని పెళ్ళిందే - అదిగో, ఆ చెప్పులసందడి ఇప్పుడే ఆగి తన కుర్చీలో ఆమె వాలిన శబ్దం . . .

అతని చెవిలో ఆమె పలికిన పలుకులూ, అతని మనసులో ఆమె అవమానంతోనూ, దుఃఖంతోనూ పరుగెత్తిన ఆ దృశ్యమూ - ఈ కొన్ని నిమిషాలలో, మళ్ళీ, మళ్ళీ, గుర్తుకి వస్తున్నాయి.

ఆమెకి ఎంత ఉదారమైన మనస్సు! ఎటువంటి హృదయం! అవన్నీ తలుచుకుంటే అతని మనస్సు ఇంకా ఎక్కువగా బాధపడుతోంది.

'నేను ఇలా ప్రవర్తిస్తాను అని ఆమె కలలోకూడా అనుమానించివుండదు!' అనే తలపు రాగానే అతనికి తన తల రెండుగా చీలిపోవాలనిపించింది.

ఒక నిమిషంలో తనకేర్పడిన ఆ అవమానం అతను భరించలేకున్నారు:

'ఇక తెరసాకి ఎలా సమాధానం చెప్పగలను? ఆమె మనసుని ఎలా మార్చడం? ఆమెకి మళ్ళీ నామీద ఎలా మర్యాద కలుగుతుంది?'

'అంతే, మరేం లాభం లేదు . . . ఎంత పెద్ద నష్టం!' అని నాగరాజన్ మళ్ళీ మళ్ళీ నిట్టూర్పు వదులుతున్నారు . . . దేహమంతా కారుతున్న చెమటని తుడుచుకుంటున్నారు . . . ఎక్కడైనా వెళ్ళి బాగా ఏడవాలనిపిస్తోంది . . .

కొన్నిరోజులుగా తనకి ఆమెపై ఏర్పడిన చాపల్యానికి - ఆమె వైఖరి, నడవడి, చిరునవ్వులు, ఆతిథ్యం, అన్నిటికంటే తన వయసు, ఆమె తనపై చూపిన సానుభూతివల్ల ఆమె తన్ను ఒక తండ్రిగా భావించి తన జీవితంలోని నష్ట కష్టాలని

బహిరంగంగా చెప్పినప్పుడు  దాన్ని అపార్థం చేసుకొని ఆమెకి తనపై వాంఛ ఉన్నట్లు భావించి తను చేసిన వక్రచేష్టని తలుచుకుంటే అతని మనసు మళ్ళీ మళ్ళీ కలవరపడుతోంది.

అటువంటి ఒక పిచ్చి నమ్మకంతోనే ఆమె అడ్డం చెప్పదు అనే భావంతో అతనలా ప్రవర్తించారు.

ఈ పాత పదిరోజులూ మామూలుగా అతనికి భోజనం తీసుకువచ్చే కన్నయ్యా చెప్పకుండా పారిపోయాడే - ఆ రోజునుంచే - ప్రతీదినం, లంచుటైములో - తెరసా, నాగరాజన్ కలిసి భోజనం చేస్తున్నారు.

మధ్యాహ్నం ఆఫీసులోనే నాగరాజన్ భోజనం చేసే అలవాటుకి కారణం కన్నయ్యావే; వాడు అతని ఇంట్లో పనిచెయ్యడానికి రావడానికిముందు - రెండు సంవత్సరాలవరకూ - నాగరాజన్ లంచుకోసం మధ్యాహ్నం ఇంటికి వెళ్ళేవారు. ఐతే, ఇంటికి వెళ్తే, 'సరే, బభోజనం ఐంది, ఇక వెళ్దాం!' అని వీలవుతుందా? కొంచెం రెస్టు తీసుకోవాలి; కొంతసేపు నిద్రపోవాలి; మళ్ళీ ఆఫీసుకి రావడమంటే టైము నాలుగుగంటలు ఐపోతుంది.

ఐతే, నాగరాజన్ ఎన్నిగంటలకైనా ఆఫీసుకి రావచ్చు, వెళ్ళవచ్చు; ఆతన్ని ఎవరూఅడగరు. ఆ కంపెనీ యజమానుడితరువాత అతనికే అధికారం - కాని కొన్ని విషయాలలో యజమానుడికంటే అతనికి బాధ్యత ఎక్కువే. ఇరవై ఐదు సంవత్సరాలుగా ఈ కంపెనీ ప్రధాన కార్యాలంలో పనిచేస్తూ ఈ రాష్ట్రమంతా ఆనేక శాఖలను సృష్టించి ప్రస్తుతం కంపెనీ అనుభవించే ప్రతిష్టకి కారణం నాగరాజనే అని చెప్తే అతనిమీద యజమానుడికి ఎటువంటి నమ్మకం, అభిమానం అని బోధపడుతుంది.

కన్నయ్యా నాగరాజన్ ఇంట్లో నివాసంవున్నప్పుడు ప్రతీదినం ఆఫీసుకి వచ్చి అతనికి తనే భోజనం వడ్డించేవాడు. నాగరాజన్ ఇంటికివెళ్ళి భోజనం చెయ్యడానికి కారణం అతనికి స్వయంగా వడ్డించుకోవడం అలవాటులేదు;అది నచ్చదుకూడా.

కన్నయ్యా నాగరాజన్ ఇంటి నౌకరు లేక వంటవాడు అని అందరూ అనుకుంటున్నారు, కాని వాడు అతని అత్తకొడుకనో, అతని బాల్యస్నేహితుడనో చాలామందికి తెలియదు; కన్నయ్యా ప్రవర్తన చూస్తేకూడా అది ఎవరికీ తెలియదు.

కన్నయ్యాకి - కుటుంబం, పెళ్ళి, ఇల్లు, బంధువులు - ఇవేమీ లేవు.

బంధువుల ఇళ్ళలో - అతన్ని బంధువు అని స్వీకరించినవారిదగ్గర - కొన్నిరోజులుంటాడు. అక్కడ ఉన్నంతవరకూ ఒక పక్కబలంగా పనిచేస్తాడు. పిల్లలకి పరిచారికలాగ పిలుస్తే వెంటనే వస్తాడు; తోటలో మొక్కలు పాతుతాడు;బట్టలుతుకుతాడు; బజారుకి వెళ్తాడు; కట్టలు కొట్టుతాడు; మూటలు మోస్తాడు; వినోదంగా మాటాడుతుంటాడు.

'ఏమీ చెప్పకుండా పారిపోయాడే ఈ రాస్కల్!' అని ఇప్పుడు దంతాలు కరచుకుంటున్న నాగరాజన్ ఇంతకుముందు తను చేసిన పనికి మూలకారణం కన్నయ్యావే అని వంకరటింకరగా తన నేరాన్ని వాడిమీడ మోయడానికి ప్రయత్నిస్తున్నారు.

'ఆ వెధవ వాడుకగా లంచు తెచ్చివుంటే తెరసా ఇంత చనువుగా నాతో మెలగివుండదే? . . . ' అని ఆలోచన రాగానే కన్నయ్యాగురించి పాత జ్ఞాపకాలు అతనికి గుర్తులోకి వచ్చాయి . . .

రెండు సంవత్సరాలముందు - ఒక రాత్రి - తనింటికి తిరిగివచ్చిన నాగరాజన్ కారుని షెడ్డులో నిలపడానికి తిరిగినప్పుడు షెడ్డు మూల గడ్డం, మీసాలు, చింపిరి తలతో ఒక మనిషి లేచి నిలబడడం చూసారు. కారు సైటు ఆర్పకుండా "ఎవరక్కడ?" అని బెదిరిస్తునట్టు అడిగారు.

"నేనే . . . కన్నయ్యా . . . నన్ను పోల్చుకోలేరా అల్లుడుగారూ?" అని వాడు తన్ను రహస్యంగా పరిచయం చేసుకోవడంచూని అతను బాధపడ్డారు.

"ఇదేం వేషంరా . . . రా . . . రా . . . " అని వాడిని ఇంట్లోకి తీసుకొనివెళ్ళి అందరికీ పరిచయంచేసి తమతో ఉండమన్నారు. కొన్నిరోజుల్లోనే కన్నయ్యా ఆ కుటుంబానికి అవశ్యకమైన మనిషిగా మారిపోయాడు.

ప్రారంభంలో వాడిని తమ కుటుంబంలో చేర్చుకోవడంగురించి నాగరాజన్ బంధువులు అతన్ని హెచ్చరించారు.

కాని నాగరాజన్ వాటిని లెక్కచెయ్యలేదు; అంతేకాక కన్నయ్యాని తన ఇంట్లో చేర్చుకోవడం తన బాధ్యత అని అతనికి తోచింది; కాని ఆ కారణాలు అతను బహిరంగంగా ఎవరితోనూ చెప్పలేదు.

ఆ పాతకాలపు బాల్యస్నేహితులమధ్య ఏర్పడిన అనుభవాలు తను ఒంటరిగావున్నప్పుడు నాగరాజన్ కన్నయ్యాతో పంచుకొని ఆనందించేవారు.

ఆ రోజుల్లో కన్నయ్యా చాలా అమాయకుడుగా ఉండేవాడు; ఏ పాపమూ ఎరుగనివాడికి సిగరెట్టు కాల్చడం, సారాయి తాగడం - ఇటువంటి చేష్టలలో వాడు అలవాటు పడడానికి నాగరాజనే కారణం. ఐతే అవన్నీ ఒక వయసులో ఏర్పడే అవలక్షణాలు అని అతను గ్రహించి వాటిని వదలిపెట్టిన తర్వాత, తనవలన పాడైన కన్నయ్యా వాటితో ఇంకా లోతుగా మునిగి పెనుగులాడడంచూసి నాగరాజన్ తను తప్పుచేసానని ఆవేదన పడుతున్నారు.

ఐతే ఇవన్నీ మహా పాపాలు అనే దృష్టితో నాగరాజన్ కన్నయ్యాగురించి బాధపడలేదు; ఇటువంటి కళంకంకి బలి అవుతున్న మనుషులు తమ జీవితంలో అన్ని మర్యాదలూ పోగొట్టుకొని నాశమవుతున్నారని అతనికి వాడిమీద సానుభూతి ఏర్పడింది.

ఇప్పుడుకూడా నాగరాజన్ ఎప్పుడైనా పార్టీలలో లేకపోతే ఇంటిలోకూడా సారాయి తాగుతారు; అది ఎవరికీ తెలియదు. నాగరాజన్ సిగరెట్టు కాలుస్తారు; పరస్త్రీలను కామోద్రేకంగా చూస్తారు; అన్నిటిలోనూ ఒక హద్దు, పరిమితి లేకపోతే మనిషన్నవాడు తలకిందుగా పడిపోవడం తప్పదు.

అలాగ పడపోయినవాడు కన్నయ్యా; వాడి గతికి ఒకవిధంగా తనే కారణమా అని నాగరాజన్ అప్పుడప్పుడు వాడినిచూసి నిట్టూర్పు వదులుతారు. తక్కినవారి దృష్టిలో లేక సామాజిక రంగంలో వాడికి ఏమాత్రం మర్యాద లేకపోయినా నాగరాజన్ కన్నయ్యాని తన మనస్సులో తన సమానంగానే చూసేవారు. వాడుకూడా ఆ హద్దుని దాటకుండా అతనితో సమానంగా మెలుగుతున్నాడు.

ఎప్పుడైనా తను సారాయి తాగుతున్నప్పుడు నాగరాజన్ వాడిని పిలిచి సారాయి ఇస్తారు; వాడు దాన్ని పెద్ద గౌరవంగా భావిస్తాడు. ఐతే, అప్పుడుకూడా, సిగ్గుతో, ఒకమూల నిల్చొని, గ్లాసులో రహస్యంగా తాగుతాడు. “ఇక చాలు . . . చాలు . . . ” అంటూ గ్లాసుని పెట్టేసి పరుగెడతాడు.

అడిగితే "ఇవన్నీ నాకు వొద్దు . . . ఒక రెండురూపాయలు ఇవ్వు . . . ఎందికిలా నాకోసం డబ్బు పాడు చేస్తావ్?" అని బదులుచెప్పి డబ్బుతో బయటికి వెళ్ళినవాడు రాత్రి ఎప్పుడు తిరిగివచ్చి షెడ్డులో నిద్రపోయాడని ఎవరికీ తెలియదు.

ఎవరికీ తెలియక నాగరాజన్ అప్పుడప్పుడు వాడికి డబ్బుకూడా ఇస్తారు.

వాడు అతనికి అన్నం వడ్డించినప్పుడు అతనికి చాలా తృప్తిగావుంటుంది. ఇంటిలోకూడా కొన్ని సమయాల్లో వాడే అతనికి వడ్డిస్తాడు.

నాగరాజన్ గారి భార్య లాపుగావుంటుంది. ఆమెకి గభీమని వ్యాధి వచ్చేస్తుంది. వీలైనంతవరకూ ఆవిడ ఈజీఛేర్ నుంచి లేవకూడదు అని నాగరాజన్ కోరిక.

కొన్నిసార్లు డ్రైవరు లేకపోతే కన్నయ్యాతో నాగరాజన్ కారులో వెళ్ళినప్పుడు వాడితో తమాషాగా మాటాడుతారు. అటువంటి సమయాల్లో వాడు అతన్ని రా అనికూడా పిలుస్తాడు. అది చాలా సహజంగా, శ్రుతి తప్పకుండా ఉంటుంది.

"ఒరే కన్నయ్యా, మన సెక్రెటరీ అమ్మగారు ఎలావున్నారు?" చీరకట్టని ఆ ఏంగ్లో-ఇండియన్ యువతి కనిపించినప్పుడు వాడు సిగ్గుతో నిలబడడం అతను చాలారోజులు గమనించారు.

అటువంటి సమయాల్లో వాడు ఉత్తికే నవ్వుతాడు.

"చెప్పు . . . నీకేం అనిపిస్తుంది - దాన్ని చూస్తే?"

"నాకేం అనిపిస్తుందా?" వాడు గడ్డం ఛాతీని తాకుతున్నట్లు తల వంచి, ఒక పిచ్చినవ్వు నవ్వి "నువ్వేం ఊరుకుంటావా? . . . నాకన్నీ తెలుసురా?" అని మోజెయిని తాకుతూ బొలబొలా నవ్వాడు.

"ఛీ, ఛీ, అలాగేంకాదు! నువ్వేంటి నేనా పాతరోజుల మనిషి అనుకుంటున్నావా? నేను ముసలివాడైపోయానురా!" అని నిరసించుతారు నాగరాజన్.

"అంటే . . . దానికి నీమీద ఒక కన్ను ఉంది . . . నాకు తెలుసు!" అని కన్నుకొట్టి వాడు అతన్ని సంతోషపెట్టాడు.

'ఆ వెధవే నాకు ఈ ఐడియా ఇచ్చాడేమో?'

ఇంతకీ ఇంత అంతరంగంగా మాటాడే మనిషి ఆమె ఎదుట తను నడుములో కట్టుకున్న తువ్వాలుని తీయకుండా, తల ఎత్తక, అతనికి అన్నం వడ్డిస్తాడు.

అతను భోజనంచేసే పళ్ళేంని చూస్తూ అతని నోటికి ఎది రుచిగావుందని అర్ధంచేసుకొని అతను అడగడానికిముందే వడ్డిస్తాడు.

కన్నయ్యా అతనికి సేవచెయ్యడం తెరసా గమనించింది.

అందువలనే ఒకసారి కన్నయ్యా రాలేదని నాగరాజన్ డ్రైవరు అన్నం వడ్డించడం తెలియక తికమకలు పడుతుంటే . . . నాగరాజన్ వేసిన కూతలో భయపడి, చెయిలో ఉన్నదేమో కింద పడేసిన తరువాత, అతను ఏమీ తినక, 'మరేం వద్దు, దీన్ని తీసుకొనిపెళ్ళు!' అని కేకలు వేసి, ఆ రోజు హోటలునుంచి టిఫను ఆర్డరు చెయ్యడం చూసిన తెరసా, మరునాటి మధ్యాహ్నం అతను తనే అన్నం వడ్డించుకోడంచూసి . . .

"మీకు అభ్యంతరం లేదంటే మీకు నేను అన్నం వడ్డించనా?" అని వినయంతో అడిగింది.

అప్పుడుకూడా నాగరాజన్ కి కన్నయ్యా జ్ఞాపకంలో వచ్చాడు: "దానికి నీమీద ఒక కన్నుంది . . . నాకు తెలుసు!"

నాలుగు సంవత్సరాలుగా తనదగ్గర స్టెనోగా పనిచేస్తున్న తెరసాని అవాళే అతను అలాగ ఒక చూపు చూసారు.

"You look nice today!" అని ఆమెను పొగడారు.

"Thank you!" అని ఆమె బదులు చెప్పింది.

అవాళ తనతో లంచు టైములో కూర్చోమని అతను ఆమెను పిలిచారు,

తను టిఫనుబాక్సులో తెచ్చిన తుల్యమైన ఆహారాన్ని అతనితో కూర్చొని తినడానికి తెరసా వెనకాడింది. కాని అతను నొక్కిచెప్పడంతో అతనిన ఎదుట కూర్చొని ఒకే మేజామీద భోజనం చేసింది. అప్పుడే ఆమె కన్నయ్యాగురించి అడిగింది: "Where's that man?"

"ఆ వెధవ ఐదువందల రూపాయలు దొంగలాడి, ఏమీ చెప్పకుండా పారిపోయాడు!" అని కోపంతో నాగరాజన్ కేకలు పెట్టారు.

"ఐదువందల రూపాయలా? అంత సొమ్ముని మీ నౌకరులు చూసేలా పెట్టవచ్చా?"

"వాడేం నౌకరు కాదు. నా cousin!"

“Oh, I am sorry!”

“పరవాలేదు. దొంగవెధవకి నౌకరు అనే టైటిలు కొంచెం ఎక్కువే . . . ”

“Poor man!” అనివాడికోసం ఆమె బాధపడడం అతనికి వింతగా తోచింది. “He was very nice and helpful . . . ” అని తెరసా తనలో తనే చెప్పుకుంది.

నాగరాజన్ ఒక నిట్టూర్పు వదిలారు.

నాగరాజన్ అతనికి వచ్చిన భోజనం ఆమెతో పంచుకున్నారు. అతను ప్రేమతో ఇచ్చినిది ఆమె కృతజ్ఞతతో పుచ్చుకుంది. ఆమెకూడా కన్నయ్యలాగే చాలా కనికరంతో అతని రుచి, ఇష్టం తెలుసుకొని వడ్డించింది. అతనుకూడా అధికారంతో ఆమె టిఫినుబాక్సునుంచి కావలసినది అడిగి తీసుకున్నారు.

ఆఫీసు విషయాలు తప్పిస్తే మరేమీ మాట్లాడని వారిద్దరూ ఈ లంచుటైములో సర్వసాధారణమైన సంగతులు, సొంతప్రశ్నలూ పరివర్తన చేసుకోడం మొదలుబెట్టారు.

ఇంతకుముందు ఎయిర్ కండిషన్ రూములో అతనికోసం వేసిన ఈజీ చెయిర్లో ఆనుకొని మేజాదగ్గర కూర్చున్న తెరసాతో నాగరాజన్ ఏమేమో మాటాడుతున్నారు.

ఆమె తనగురించి ఏమీ దాచక, తన నమ్మకానికీ, మర్యాదకీ పాత్రమైన పెద్దమనిషికి కృతజ్ఞత చూపుతున్నట్టు మనసువిప్పి మాట్లాడింది; పసిపాపలాగ నవ్వింది; తన నవ్వు, సంభాషణవల్ల అతనికి సంతోషమని అతన్ని ఇంకా సంతోషపెట్టాలని బాగా నవ్వింది; తనకి సహృదయులు దొరికారని పరవశపడింది; అతను ఆమె మాటలుమాత్రం కాదు, ఆమెను పూర్తిగా ఆనందించారు. ఆమె నవ్వు, సౌమ్యం, సరళమైన ప్రవర్తనని అతను ఒక యువతి మోహంలోపడి సాహచించుస్తున్నట్లు భావించి, మెల్లమెల్లగా, క్రమంగా ఆమె ప్రేమలో తన్ను పోగొట్టకోడానికి సిద్ధమైయ్యారు.

కొన్నిరోజులముందు ఇక రాబోయే వారంలో తన పుట్టినరోజు పార్టీకి తెరసా అతన్ని ఆహ్వానించింది. ఈ నాలుగు సంవత్సరాలలో అతనికి ఒక స్వీట్ ఇచ్చి అతనిదగ్గర ఆశీర్వచనం తీసుకోడం తప్ప అతన్ని ఆమె ఎప్పుడూ విందుకి పిలవలేదు. అందుకు కారణం ఈ నాలుగు సంవత్సరాలు ఆమెకు యజమానుడి

స్థానంలోవున్న మనిషి ఇప్పుడు ఆమెకు మంచి స్నేహితుడుగా ఉన్నాడు అనే సహజమైన తలపే. కాని దాన్ని నాగరాజన్ అపార్థం చేసుకున్నారు.

"Will it be a cocktail party?" అని అతను కన్ను కొట్టి అడగ్గానే -

"Of course! మా అమ్మా, నాన్నగారు - ఇద్దరికీ తాగడానికి పెర్మిట్ ఉంది" అని తెరసా చెప్పింది.

"నువ్వెందుకు పెర్మిట్ తీసుకోకూడదు?"

"No! నేను తాగను!"

"చూడు, నీ పుట్టినరోజు పార్టీలో నేను నిన్ను తాగించుతాను!" అన్నారు నాగరాజన్.

తెరసా నవ్వుతూ "అలాంటి పార్టీలలో for the same of company నేనుకూడా తాగుతాను" అని చెప్పి ఇక క్రిస్టుమస్ పండుగ రోజుల్లో ఆమె తండ్రి ఎలాగ ఇంటిలో పిల్లలందరికీ వైను ఇస్తారని వివరంగా చెప్పింది,

వాళ్ల ఆచారంలో తాగడం, ఆడవారూ, మగవారూ కలిసి డాన్సు చెయ్యడం ఎంత పరవశమైన అనుభవమని ఆమె కన్నులు మూసుకొని వర్ణించింది; అది చెప్తూనే గత సంవత్సరం తన పుట్టినరోజు పార్టీలో జరిగిన ఒక సంఘటన గుర్తుచేసుకుంది. తన ప్రేమకూ, మర్యాదకూ పాత్రమై, చివరకి ఆమెను వదులుకున్న boy friend గురించి అతనికి చెప్పింది. అప్పుడామె ఆవేశంతో మాటాడింది; కాని ఆ తరువాత సర్దుకొని ఒక చిరు నవ్వు నవ్వింది.

ఇవన్నీ వేరే కోణంలో నాగరాజన్ అర్థం చేసుకున్నారు.

ఆ కారణం వలనే కొంచెం సమయం ముందు ఉల్లాసంగా, అలవాటుగా భోజనం చేసిన తరువాత  ఆమె మేజాపక్కన కూర్చొని, తన హేండ్ బేగ్ నుంచి ఒక చిన్న అద్దం తీసుకొనితన పెదిమల రంగుని సరిదిద్దుకున్నప్పుడు తువ్వాలుతో తన చెయి తుడుచుకుంటూ ఆమె వెనుక వచ్చిన నాగరాజన్ . . .

కొంచెం సమయం ముందు  . . . మొహం ఎర్రబోయి, ఆమె జుత్తు నుదుటమీద పొరలుతుంటే, పెదిమలు అగ్నిని తాకినట్లు అదురుతుంటే, కళ్ళలో నీళ్ళతో . . .

“Please leave me alone! I am sorry for everything!”అని అతన్ని విడిచి దేహమంతా వొణుకుతుంటే ఆమె నిలబడిన దృశ్యం . . .

తెరసా మొహం అతని మనసులో వచ్చి నిలబడింది.

టైము రెండయింది.

మధ్యాహ్నం లంచుకి వెళ్ళి తిరిగివచ్చే వేళకి ఉద్యోగుల రాకపోకలు, ఆఫీసులోని టైప్ రైటర్ల సందడి, నాగరాజన్ ఉన్న ఎయిర్ కండిషన్ రూముని నింపాయి.

ఈ ఒక గంటలో నాగదరాజన్ ఏడో ఎనిమిదో సిగరెట్లు కాల్చి పారేసారు.

అతను తెరసాను పిలిచే కాలింగ్ బెల్ నొక్కారు.

వెంటనే తెరసా అతని ఎదుటవచ్చి నిలబడింది. నాగరాజన్ కి తల ఎత్తి ఆమెను చూడడానికి ధైర్యం లేదు; అతని తల వొంగియేవుంది.

“Teresa, I am sorry!”

ఆమె ఏం జవాబు చెప్పిందని అతనికి అర్థం కాలేదు; ఆమె ఇంకా ఏడుస్తూనేవుందా? తను ఉద్యోగాన్ని రాజీనామా చేస్తున్నానని చీటీ రాసి అతని మొహంమీద విసరడానికి సిద్ధంగావుందా? కలవరపడుతూ నాగరాజన్ తలెత్తి చూసారు.

ఆమె ఎప్పటిలాగే, ఏమీ జరగనట్టు, కొంచెం సమయంముందు రుమాలుతో మొహం కప్పుకొని పరుగెత్తిన యువతి తను కాదన్నట్టు, ఒక చిరునవ్వుతో, చెయిలో shorthand notebook, పెన్సిల్ తో నిలబడి అతన్ని చూస్తోంది.

ఆమె రాజీనామా చెయ్యదు అని అతనికి బోధపడింది. ఆమె తీరు చూస్తే డిక్టేషన్ కి తయారుగావున్నట్టు తెలిసింది. ఆరోజు చాలా పనులు - ఎన్నో ఉత్తరాలు రాయవలసివున్నాయి - అని ఆమెకు తెలుసు. ఐతే అన్నిటికీ ముందుగా ఒక ఉత్తరం తప్పకుండా డిక్టేట్ చెయ్యాలని నాగరాజన్ కి ఇప్పుడే తటాలున తోచింది.

“Dear Miss Teresa . . . ” అని అతని మాటలు విని . . .

“Yes, Sir?” అని చెప్పి ఆమె తలెత్తింది,

“Put it down! This is a letter . . . ” అని అతను చెప్పగానే తెరసా మౌనంగా రాయడం ఆరంభించింది. అతను తన తల తిప్పుకొని, తన వీపు మాత్రం ఆమెకు కనిపిస్తున్నట్లు చెప్పారు:

“మిస్ తెరసా, ఒక కూతురులాగ నిన్ను భావించక, నీ దగ్గర తగనిరీతిగా ప్రవర్తించినందుకు నేను సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించడం లేక దండించడం నీ మనసే నిరణయించాలి. నేను నీ లెక్కలో ఒక ఉన్నత స్థాయినుంచి ఒక క్షణంలో కిందకి జారిపోయాను. అదే నాకు పెద్ద శిక్ష.

నేనెందుకు అలా ప్రవర్తించానని ఆలోచిస్తున్నాను . . .

నేనిలా తప్పు చెయ్యడం - ఇది మొదటిసారి కాదు. ఇప్పుడు నా బలహీనతని ఒప్పుకోవడంవలన ఈ నిమిషమే నన్ను పట్టుకున్న వ్యాధి నన్ను విడిచి వెళ్ళిపోయిందని నేను నమ్ముతున్నాను. వయస్సులో నువ్వు నాకంటే చిన్నదానివి, కాని నాకంటే గౌరవంలోనూ, ఘనతలోనూ, నీవే గొప్పదానివని నేను నమ్ముతున్నాను. అందువలనే పాపపరిహారంలాగ నేను నీ దగ్గర confession చేసుకుంటున్నాను.

నీ దగ్గరలాగే నేను ఇతరులవద్ద చాలా సార్లు తగనిరీతిగా ప్రవర్తించివున్నాను.

ప్రయాణాల్లో, సినిమారంగాల్లో, కిక్కిరిసిన ప్రజల గుంపుని నెపంగా పెట్టుకొని నేను తప్పుపనులెన్నో చేసాను. కాని వాళ్ళందరూ భయం, అనుమానం లేక మర్యాద వలన  ఏమీ చెయ్యక ఊరుకుంటే దాన్ని వాళ్ళ అంగీకారమని నమ్మేవాడిని. ఇప్పుడే నాకు అర్థమైంది; ఇది ఒక వ్యాధి. ఈ వ్యాధినుంచి నీ ఘసతవల్ల నాకు స్వస్థత కలిగింది. నువ్వు దీన్ని మరచి ఒక తండ్రి మీ సంప్రదాయంలో ఒక కూతురుకి ప్రేమతో ఇచ్చే ఒక ముద్దుగా  భావించాలని వేడుకొంటున్నాను. ఐతే నా అపరాధంకి తగిన శిక్షగా నాకేర్పడిన పతనం చాలదు అంటే నువ్విచ్చే ఏ శిక్ష ఐనా సరే, నేను అంగీకరించడానికి సిద్ధంగావున్నాను” అని చెప్పి ఆయాసంతో ఒక బాటసారి తను మోస్తున్న భారాన్ని దింపినట్టు నాగరాజన్ ఆమెను చూసారు.

తెరసా కళ్లను రెండుమూడుసార్లు  తన రుమాలుతో ముట్టుకుంది; ఆమె కన్నులూ, బుగ్గలూ బాగా ఎర్రబడ్డాయి.

“దీన్ని టైపుచేసుకొని రా . . ” అని ఆమెను పంపించిన తరువాత ఒక సిగరెట్టు కాల్చుతూ ఆ చోటనే నాగరాజన్ కూర్చున్నారు; తెరసా టైపు చేసే శబ్దం వినిపించింది.

తెరసా టైపుచేసిన కాగితాలని తెచ్చి మేజామీద పెట్టి అతని మొహాన్ని చూస్తూ నిలబడింది. అతను కళ్ళద్దాలను తీసుకొని ఆ ఉత్తరంలో మొదటి వాక్యం, My Respected Friend, చదవగానే ఆమెను చూసారు.

తెరసా వినయంతో తలవంచుకుంది.

అతను ఇంకా చదివారు:

“మీరు నాకు డిక్టేట్ చేసిన ఉత్తరం టైపు చెయ్యక వేరొక ఉత్తరం టైపు చేసి మీకు ఒప్పగించినందుకు నన్ను క్షమించండి. మీరు మీ మనస్సు విప్పి మాటాడాలనే నెపంతో నాకు ఈ ఉత్తరం డిక్టేట్ చెసారు. నాదగ్గర క్షమాపణ కోరుతున్న ఉత్తరం నా మూలంగానే మీరు రాయడంతో మీ నిజాయితీ నాకు బోధపడింది. మీ ఉత్తరంలో అర్థయుక్తంగా నాకనిపించిన వాక్యం - నా ఊహని ప్రతిఫలించిపజేసినది - ఇదే: *ఒక తండ్రి మీ సంప్రదాయంలో ఒక కూతురుకి ప్రేమతో* . . . అనే వాక్యమే. నేన అలాగే భావించి శాంతి పొందినతరువాత మీరూ అలాగే అనడం నాకు సంతోషంగావుంది. ఇది మీ పతనం కాదు; ఇదొక జారు. . .”

ఇక్కడ తెరసా రాసివ ఆంగ్లపదాల్ని మెచ్చుకున్నట్లు నాగరాజన్ ‘Just a slip, not a fall’ అని తనలో చెప్పుకొని, ఆమెను చూసి, ఇంకా ఆ ఉత్తరంలో ఏముందో చదవసాగారు:

“మీరు చెప్పినట్టు మిమ్మల్ని పీడుస్తున్నది ఒక వ్యాధి అంటే అందుకు మనం ఇవ్వవలసినది చికిత్స, శిక్ష కాదు. అటువంటి లోపాలు తప్పులేకాని, నేరాలుకావు. నేరాలకే శిక్ష ఇవ్వాలి; తప్పులు సరిదిద్దుకోవాలి; తప్పులు క్షమించబడాలి. నేను క్రీస్తుమతాన్ని అనుసరించే వ్యక్తిని. క్షమించినవారికే క్షమాపణ లభిస్తుంది. నేను మిమ్మల్ని బతిమాలుకొంటాను. దీన్ని మరచిపోండి; ఇక దీనిగురించి బాధ పడకండి.

మనం ఇంతకుముందు మాట్లాడుకున్నట్టు మీరు నా పుట్టినరోజు పార్టీకి వస్తున్నారు. అవాళ నేను మీ ఆరోగ్యంకోసం తాగుతాను.

మీ నిజమైన . . . .”

‘తెరసా . . . నీకెంత ఉదారగుణం! . . . ’

రాత్రి ఎనిమిది గంటలకి ఇంటికి తిరిగివచ్చిన నాగరాజన్ షెడ్డులో కారు వదలడానికి తిరిగిచూసినప్పుడు షెడ్డుమూల గడ్డం, మీసాలతో, చింపిరి తలతో కూర్చున్న కన్నయ్యా నిలబడడం చూసారు. కొంచె సేపు కారు లైటు ఆర్పకుండా వాడిని తీవ్రంగా చూసారు. ఆ వెలుతురు వలనో లేక సిగ్గో కన్నయ్యా తన మొహం కప్పుకున్నాడు.

ఇంటి వసారాలో నాగరాజన్ భార్యా, కూతురూ, ద్వారపాలకులలాగ నిలబడివున్నారు.

“వాడు వస్తే లోపలికి రావొద్దని చెప్పండి!” అని నాగరాజన్ వాళ్ళకి ముందే చెప్పివున్నారు.

నాగరాజన్ కారులోనుంచి దిగినవెంటనే కన్నయ్యా అతనిదగ్గర వచ్చి ఏడ్చాడు.

“ఏమో తెలియక చేసేసాను . . . ఎందుకు చేసేనని నాకే బోధపడదు . . . ఆ తప్పు చేసిన తర్వాత ఒక్కొక్క నిమిషమూ దానిగురించే విచారం . . . ఎటువంటి తృప్తి లేదు! . . . ” అని వాపోతూ నెత్తిలో మొత్తుకున్నాడు.

నాగరాజన్ మౌనంగా తన టైని వదులుకుంటూ వసారాలోవున్న పేము కుర్చీలో కూర్చున్నారు.

అతని భార్యా, కూతురూ లోపలికి వెళ్ళారు. కన్నయ్యా వెలుతురులో వచ్చి అతని ఎదుట నిలబడ్డాడు.

వాడు ఏమీ అనకుండా తలవంచి నిలబడడంచూసి నాగరాజన్ కి వాడిమీద జాలి కలిగింది. అతను ఆలోచించారు.

“వీడు అసలు దొంగ ఐతే ఇప్పుడెందుకు తిరిగవచ్చాడు? ఈ ఇంటిలో పని చేసినట్టు మరెక్కడ పనిచేసినా వీడు బతకగలడు; అంటే, ఉత్తి జీవనోపాయంకోసం వీడిక్కడికి తిరిగి రాలేదు. ఇదిగో, నిన్నటినుంచి ఇక్కడవుండే మల్లె చెట్టులో పువ్వులు కనిపిస్తున్నాయి . . . దాన్ని తీసుకొనివచ్చి ఇక్కడ నాటి దానికి నీరు పోసిన ప్రేమ వీడిని మళ్ళీ ఇక్కడకి తీసుకువచ్చిందేమో? . . . నేను రోజూ భోజనం

చేస్తున్నప్పుడు వీడిగురించి ఆలోచిస్తున్నాను; వాడుకూడా అలాగే నాగురించి చింతిస్తున్నాడేమో? . . . ఐతే, వాడెందుకు ఆ డబ్బుకి ఆశపడి దాన్ని దొంగలాడి పారిపోయాడు? . . .”

“ఏంరా, నువ్వు నన్ను అడిగివుంటే నేను నీకు డబ్బు ఇవ్వనా? ఎందుకు దొంగలాగ అలా చేసావ్?” అని ఇంటిలోవున్నవాళ్ళ తృప్తికోసం అతను కొంచెం గట్టిగానే వాడిని అడిగారు.

“అదే నేనూ పదే పదే ఆలోచిస్తున్నాను; ఆ బీరువాలో ఆ డబ్బుని చూసినప్పుడు పక్కన ఎవ్వరూ లేరు; ఎవ్వరూ చూడని జాగాలో డబ్బు కనిపిస్తే తీసుకుందాం అనే దొంగబుద్ధితో చెక్కేసాను. ఇదేం మొదటిసారా? . . . ఛీ, ఛీ, ఎన్నిసార్లో . . . ” అని కన్నయ్యా తన్నే తిట్టుకున్నాడు.

ఆ రోజు మధ్యాహ్నం తను అదే పరిస్థితిలో ఉన్నది నాగరాజన్ గుర్తుచేసుకున్నారు.

“ఇది ఒక వ్యాధిరా!” అన్నారు అతను.

“అవును ఇది ఒక వ్యాధి,” అని కన్నయ్యా మళ్ళీ నెత్తిలో కొట్టుకున్నాడు. “నువ్వు ఏ శిక్ష అచ్చినా తీసుకుంటాను,” అని చేతులు పిసుకుతూ నీళ్ళు కార్చాడు.

నాగరాజన్ ఉత్తికే నవ్వారు.

“వ్యాధికి కావలసింది చికిత్స, శిక్ష కాదు.” ఆ మాటలు చెప్తూంటే అతని కన్నులు చెమ్మగిల్లాయి.

“నీ వ్యాధి పోయింది. నేను నిన్ను మనసార క్షమించాను, అదే నీకు చికిత్స. దీన్ని ఇదివరకూ ఎవరూ నీకు చెయ్యలేదు . . . లోపలికి వెళ్ళు . . . నువ్వు చేసినది తప్పు, దానికి శిక్ష ఇవ్వనక్కరలేదు!”

అతని మాటలు విన్న అతని భార్యా, కూతురూ “ఇతను ఎంత పెద్ద మనిషి, ఎంత ఉదార గుణం ఇతనికి!” అని అతన్ని పొగడారు.

వాళ్ళకేం తెలుసు, క్షమింపబడినవారే క్షమిస్తారు అని?

********

*(మూలం ప్రచురణ: ఆనంద వికటన్, 1963)*

# దెయ్యం వేదం వల్లించనీ . . .

మధ్యాహ్నం మూడుగంటల తరువాత, రెండుగంటలు నిద్రపోయి, స్నానం చేసి, కొత్తబట్టలు తొడుక్కొని, దువ్వుకున్న జుత్తులోని తడి ఆరడానికిముందే ‘అది’ ఆయనకి కావాలి! ఒక పరిచారకుడుగా అతన్ని పోషించే నౌకరు అప్పుకుట్టన్ కి అది సారాయిమాత్రం కాదు అని తెలుసు. ఐతే, తక్కినవాళ్ళకి తెలిసినదంతా మధుసూదనరావు ఒక తాగుబోతు అనే!

బంగళా మేడమీద మండువాలో గుండ్రపు మేజాచుట్టూ మూడు కుర్చీలు కనబడతాయి. ఐతే రావుగారు కూర్చున్నది తప్పిస్తే తక్కిన రెండూ ఎప్పుడూ ఖాళీగానే కనబడతాయి; కాని ఆ కుర్చీలు అక్కడ కావాలి అని అప్పుకుట్టన్ కి తెలుసు.

మేజామీద ఒక కొత్త సారాయి బుడ్డీ, దానిపక్కనే ఒక నాజూకైన గ్లాసు, రావుగారికోసం ప్రత్యేకంగా చుట్టలున్న ఒక పెట్టె - వీటికి ఎదురుగా రావుగారు తనే ఎన్నుకున్న పశ్చిమ సంగీత రికార్డులు పేర్చబడి ఉన్నాయి.

యూడికొలాన్ వాసన గమగమలాడుతుంటే కొంచెం గట్టిగానే కాండ్రించుకుంటూ మధుసూదనరావు మండువాలో కాలుపెట్టగానే అతన్ని ఆహ్వానిస్తున్నట్లు అక్కడవున్న ఒంటరి గుమ్మటంలోని దీపం ప్రకాశించింది. ఆ స్వాగతం అంగీకరిస్తునట్టు ఒక నిమిషం సరే అనే తృప్తితో ఆ మూడు కుర్చీలలో బంగళాకి ఎదుటగావున్న దానిలో అతను కూర్చున్నారు. ఎప్పుడూ ఆ దిశలో కూర్చోడమే అతనికి అలవాటు. అక్కడనుంచి చూస్తే గేటుదగ్గర ఆయుధంతో కాపలాకాసే సేవకుడూ, రావుగారిని చూడడానికి వచ్చే మనుషులు - వాళ్ళతోబాటు - వెన్నెల రాత్రులలో, చంద్రోదయమూ కనిపిస్తుంది.

అతను కూర్చున్నవెంటనే స్వచ్ బోర్డు దగ్గర నిలబడివున్న అప్పుకిట్టన్ చరచరమని తక్కిన మీటలు నొక్కి బంగళాతోటలోవున్న అన్ని దీపాలనీ వెలిగించి ఆ ప్రదేశాన్ని ఒక స్వప్నలోకంగా మార్చుతాడు.

ఇవాళ వెన్నెలరాత్రి కాదు. అందువలనే అతనికి ఎది ఇష్టమని అప్పుకిట్టన్ కి తెలుసు; ఇక అతనికి ఏం సేవ కావాలో అని పక్కనేవచ్చి నిలబడ్డాడు. మేజామీదవున్న రికార్డులని దేనికిదానిగా చెయిలో తీసుకొని, వెలుతురులో పరీక్షించి, ఎది ఇప్పుడు విందాం, ఎది తరువాత విందాం అని నిశ్చయించి, అతను వాటిని వరుసపరిచారు; పని ఐనతరువాత ఒక చిరునవ్వు నవ్వారు.

మధుసూదనరానుకి నవ్వడంకూడా తెలుసు అని చెప్పడానికి ఈ దృశ్యంమాత్రమే సాక్షి. ఆ చిరునవ్వుకి కృతజ్ఞత తెలుపుతున్నట్టు Yes, Sir! అని చెయ్యెత్తి అతన్ని నమస్కరించి ఆ రికార్డులని మోసుకొని వెళ్ళి హాలులో రేడియోగ్రాం దగ్గరకి అప్పుకుట్టన్ వెళ్తున్నాడు.

 గట్టిగా మళ్ళీ కాండ్రించుకుంటూ నెరసిన తన పెద్ద మీసాన్ని సర్దుకున్న తరువాత చుట్టపెట్టెని తెరచి ఒక చుట్ట బయటకి తీసి, దాని లెబిల్ని పీకి పారేసి, ముక్కుదగ్గర వాసనచూసి, తృప్తితో దాని కొనని పళ్ళతో నమలి ముక్కని తలవంచి పక్కనే తుప్పారు. ఇంతలో అప్పుకుట్టన్ వచ్చి సిరాయి బుడ్డిని తెరచి గ్లాసులో నింపాడు.

అప్పుడే ఆరంభమైంది సంగీతం; అతను మళ్ళీ చిరునవ్వుతో సారాయి తాగుతున్నారు.

రావుగారికి సారాయి తాగడానికి పెర్మిట్ ఉంది, అతను గుఱ్ఱాల పందయాలకి వెళ్తున్నారు అనే కారణం వలన అతనేమో అనుమతించిన పనులే చేస్తారని అర్థం చేసుకోకూడదు. అతనికి ఉద్యోగంనుంచి రిటైరవడానికి దగిన వయస్సు వచ్చినాకూడా అతని నడత, ప్రవర్తనలు చూస్తే అవన్నీ ఒక యవ్వన సరసుడు, వ్యభిచారికేవుంటాయని ఊరులో అందరూ చెప్పుకుంటున్నారు.

కాని రావుగారికి దానిగురించి ఎటువంటి విచారమూ లేదు; అతన్ని ఎవరేం చెయ్యగలరు? అతనొక ఆఫీసరు - నూరుమైళ్ళ విస్తీర్ణమున్న జిల్లా నిర్వహణకి అధికారమూ, బాధ్యతా అతనికున్నాయి. పదవికి ఎంత కరారూ, పర్యవేక్షణ కావాలో అవన్నీ అతనికున్నాయి.

అతని ఆత్మీయ జీవితం ఎలావుంటే ఏమిటి? కాని అతన్ని ఒక చండశాసనుడని అనడంకంటే గడసరి అని అందరూ నమ్మారు. అతన్నిగురించి

ఎవరికీ మంచి అభిప్రాయం లేకపోవడానికి కారణం ఉంది. అతనెవరి ఆదరణా ఎదురుచూడలేదు. అందరూ తన్నుచూసి భయపడాలనే అతను ఎదురుచూసారు. వాళ్ళూ అలాగే ప్రవర్తించారు. అతనికి కావలసింది అంతే. అతని కార్యాలయం అతనుదగ్గర మరేం ఎదుదచూడలేదు. అతను ఎలా ఉంటే ఏం? అతని పేరంటే ఒక హెచ్చరిక, అతని దర్శనమంటే ఒకటే భయం!

ఈ సంఘటన తప్పిస్తే మరెప్పుడూ అతని మొహంలో చిరునవ్వుని ఎవరూ చూసివుండరు.

ఇప్పుడు హాలునుంచి సముద్రకెరటాల్లాగ వస్తున్న సంగీతం విని - హృదయకమలంలో ఎక్కడో ఒకమూల గడ్డకట్టుకున్నప్రాంతాన్ని ఒక దెబ్బతో చురుక్కుమని కోస్తున్నట్టు అతని దేహం అల్లాడుతోంది. కళ్ళు మిరుస్తున్నాయి. అతనూ ఒక మనిషే అని తెలియడానికి ఇది ఒక నిదర్శనం.

సంగీతం వింటూ ఒక ఘట్టానికీ ఇక అనంతర ఘట్టానికి మధ్య కలిగే నిశబ్దంలో - తన ఆనందం భరించలేక - అనుభూతితో పకపకమని నవ్వుతున్నారే - ఇప్పుడు అతనొక పసిపాప!

ఇటువంటి సమయాన్నే ఒక ముహూర్త సమయం అని పొగటుతూ ఈ రహస్యం తెలుసుకున్న కొందరు మహనీయులు మధుసూదనరావుగారిని చూడడానికి వస్తారు; అతనుకూడా ఎవరువచ్చినా 'సరే, రానీ' అని అనుమతి ఇస్తారు; వచ్చేవారిలో అధిక పక్షంవారు లారీ, బస్సుల యజమానులు, వర్తకులు, వానిజ్యవేత్తలు - ఇటువంటి రకమే ఉంటారు. అతనివలన వారికీ, వారివలన అతనికీ సహకారమూ, లాభమూ కలుగుతాయి.

ప్రతీనెలా అతనికి మాఫీ చెయ్యడానికి - డబ్బూ, వస్తువులూ, పారితోషికాలూ - ఇచ్చి తమ ప్రార్ధనలు తీర్చుకొనేవారున్నారు.

అవును, దానికి పేరు లంచం!

లేకపోతే, మరెలా రావుగారు ఇటువంటి జీవితం గడపగలరు?

అతనికి నెలా వచ్చే జీతం వెయ్యిరూపాయలేకదా? మరెలా అతని ఇద్దరు పిల్లలు కాలేజీలో చదువుతున్నారు? అతని భార్య పోయిన తర్వాత ఇరవై సంవత్సరాలవరకూ వాళ్ళు హాస్టల్లోనేవుంటున్నారు; పెర్మిట్ ఉన్నాకూడా ఇతను

అనుమతికి మించే తాగుతున్నారు; ఇతను సారాయికి చేసే ఖర్చులే కొన్ని వెయ్యిలకి పైగా ఉంటాయి.

లంచం లేకపోతే ఇదెలా సాధ్యం? మధుసూదనరావు ఒక లంచగొండి; తాగుబోతు; అతనికి చాలా దురలవాటులున్నాయి; అతనొక జూదరికూడా.

ఐతే అతని కార్యాలయంలో, అతని కింద పనిచేసేవాళ్ళెవరూ లంచం పుచ్చుకోడమో లేక అతని నిర్వహణకి చెడ్డపేరు వచ్చినట్టు ఓమైనా జరిగితే అతనది అనుమతించరు.

అతను అప్పుడప్పుడు తనలో చెప్పుకుంటారు: 'నేను లంచగొండితనంకి విరోధి!' అని.

అలా అంటున్నప్పుడెల్లా అతని అంతరాత్మలో ఒక ప్రతిధ్వని వినిపిస్తుంది: 'దెయ్యం వేదం వల్లించుతోంది!'

ఎది ఏమైనా ఒకటిమాత్రం ఖాయం; రావుగారికి ఎంత చెడ్డపేరున్నా అతని కార్యలయంలో ఒక ఉద్యోగికూడా ఎటువంటి అపనిందకి పాలవకుండా మధుసూదనరావుగారి కాఠిన్యం కాపాడిందని చెప్తే అందులో సందేహమే లేదు.

మధుసూదనరావు కళ్ళు మూసుకొని చెయిలోవున్నదేమో తాగడం మరచిపోయినట్టు కనిపించారు. దూరంలోనుంచి వినిపించే సంగీతంలో - వయలిన్ లు సుస్వరంగా మళ్ళీ మళ్ళీ చెవులకి ఇంపుగా వాయించుతుంటే - తన్ను మరచిపోయి అతని కళ్ళు కొంచెం సేపు ముందు గేటులో కాంతితో ప్రవేశించిన ఒక కారుని చూసాయి. అప్పుడే అప్పుకిట్టన్ ఎదుట కనిపించాడు; అన్నీ తెలిసినా నాదయోగ ఉపాసనలో మునిగిపోయిన అతనికి దాన్ని కోల్పోవడానికి మనసు రాలేదు.

అతని ఆహ్లాదం పాడుచెయ్యకూడదని అప్పుకుట్టన్ మౌనంగా నిలబడ్డాడు.

తన ఎర్రకళ్ళను కొంచెం తెరిచి, అతను వాడిని చూసారు; చెయితో సైగ చేసి అతన్ని రమ్మను అని తెలియపరచి మళ్ళీ కళ్ళు మూసుకోవడానికిముందు సారాయి తాగుతూ సంగీతంలో మునిగిపోయారు.

ఇప్పుడు అప్పుకుట్టన్ నిలబడిన చోటులో చేతివేళ్ళలో నవరత్నాలు మెరిసే ఉంగరాలు, మస్లిన్ పంచె, సిల్కు జిబ్బా ధరించి ఒక పెద్దమనిషి కనిపించారు.

కళ్ళు తెరవగానే ఆ పెద్దమనిషిని చూసి, కన్నులు చిటిలుస్తూ రావుగారు అన్నారు: "ఈ సంగీతం ఉందే - ఇది ఒక జడమైన వస్తువులో ప్రాణం పోస్తుంది; ప్రాణంలో ఆత్మని కలుపుతుంది; ఆత్మలో . . . ఓ, మీరొక పక్కా business man కదూ? మీకెందుకు ఆత్మవిచారం?" అని చెప్పి నవ్వారు. వచ్చిన మనిషి ఇదేం బోధపడక 'హీ . . హీ . . హీ . . ' అని నవ్వుతూ, వేళ్ళు పిసుకుతూ నిలబడ్డారు.

మధుసూదనరావుగారు ఎప్పుడూ, ఎవరినీ, కూర్చోమని చెప్పరు; ఎవరూ కూర్చోరు కూడా. ఇతనూ మామూలు మనిషే. ఇతనికి తెలుసు ఇటువంటి సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలని.

"ఒకవారంగా మీరు ఊరులో లేరు!" అని అతను ఉత్తికే సంభాషణ ఆరంభించారు.

"అవును . . ." అని బదులు చెప్పి నిదానంగా ఆలోచించి "నేను బెంగళూరికి రేసుకి వెళ్ళాను" అని అన్నప్పుడు రావుగారి చెవులలో ఆ పందెంలోని గుర్రాల గిట్టల శబ్దం వినిపించింది; అతని కళ్ళలో మొదటి గుర్రంగా వచ్చి చివరికి నాలుగవ స్థానంలో పడి వ్యర్థమైన ఆ Golden Herald ని చూసి, ప్రేమతో సానుభూతి తెలుపుతున్నట్టు అతను తనలో తనే చెప్పుకొని "హా. . హా . . . It's all right! మరి రేస్ అంటే అలాగే కదా?" అని తన చెయి ఎత్తి మొహంముందు చూపి తన ఆలోచనలతో కలుపుకున్నారు: "ఏం, నేను లేనప్పుడు నన్ను వెతుక్కుంటూ వచ్చారా మీరు?"

"అవును సార్! . . . లైసెన్సు గురించి . . . మీరు సంతకంచేసి వెళ్ళారు, Head Clerk కూడా పాస్ చేసేసారు . . . కాని చివరకి ఒక సర్వసాధారణమైన Clerk నా కొంప ముంచేసాడు . . . అందులోనూ మీ డిపార్ట్ మెంటులో, మీ ఆఫీసులోనే! . . . జోసఫు . . . 'నూరు రూపాయలు ఇచ్చితీరాలి, లేకపోతే ఒక వారం వరకు కాచుకొని ఉండాలి!' అని గట్టిగా చెప్పాడట. నా Accountant నా పేరూ, మీ పేరూ చెప్పినాకూడా అతను లెక్కచెయ్యలేదు . . . చూడండి, మన బిజినెస్ లో ఒక వారం అంటే ఎన్ని వెల రూపాయలు నష్టం! 'సరేలే, మీరు వచ్చినతరువాత చూసుకుందాం!' అని వాడికి నూరురూపాయలు పారేసాను; మీ Head Clerk దగ్గర ~ఒక complaint రాసి చేసాను . . . "

మధుసూదనరావు చూపుడువేలుతో గడ్డం రుద్దుతూ, అంతా విని, ఒక నిట్టూర్పు వదిలారు: 'ఇలా జరిగివుండకూడదు!' అని తనలో గొణుక్కున్నారు.

"వందరూపాయలు ఏం పెద్ద సంగతికాదు; మీరు ఇటువంటివి అనుమతించరు. మీకు ఈ సంగతి తెలుస్తే నాగురించి నొచ్చుకుంటారని నేనే రిపోర్టు రాసియిచ్చాను . . . లేకపోతే నూరురూపాయలకేం లేక్క?"

'ఈ సంగతి జరిగిన రెండురోజులతరువాత నా చెవికి అందింది; రేపు ఆఫీసులో దీనిగురించి నిర్ణయించాలి!' అని మధుసూదనరావు తనలో చెప్పుకున్నారు; వచ్చిన మనిషికి అది బోధపడింది.

"ఐతే, ఇక నేను సెలవు తీసుకుంటాను!" అని చెప్పి తన చెయిలోవున్న ఒక కవరుని మేజామీద పెట్టి, తల వంచి, నమస్కరించి, అతను బయటకి వెళ్ళారు; రావుగారు మళ్ళీ గానంలో మునిగారు.

అతను వెళ్ళిన అర్ధ గంట తరువాత మధుసూదనరావు కవరుని తెరిచి చూసారు; అందులో ఐదు నూరురూపాయలనోట్లున్నాయి; అదే అతని మామూలు. అది చూసి రావుగారు నోరువిప్పి నవ్వారు: 'దెయ్యం వేదం వల్లించుతోంది!'

అప్పుడు అప్పుకుట్టన్ వచ్చి అతని ఎదుట నిలబడ్డాడు. రావు తన ఎర్రకళ్ళతో వాడిని చూసారు.

"ఎవరో జోసఫ్ అని పేరట; మీ ఆఫీసు క్లార్కట; మిమ్మల్ని చూడాలని వచ్చారు . . . "

రావు కళ్ళు మూసుకొని ఆలోచించారు. అతని మొహం చింతనతో నల్లబడింది; నుదుటమీద మడతలు కనిపించాయి.

"ఆఫీసులో వచ్చి నన్ను చూడమను."

ఇప్పుడు హాలులోనుంచివచ్చే సంగీతంలో ఒక వయలిన్ మాత్రం అపస్వరంగా ఏడుస్తున్నట్టు వినిపించింది.

అప్పుకుట్టన్ వచ్చిన మనిషిని తిరిగిపంపించడానికి మేడమెట్లు దిగుతూంటే వాడిని బలవంతంగా ఒక ధ్వని ఆపింది: "అప్పూ. . . "

"సార్!" అని వాడు పరుగెత్తుకొనివచ్చి నిలబడ్డాడు.

అతను చుట్టతాగడానికి సిద్ధంగావున్నారు; అగ్గిపుల్ల పూర్తిగా కాలేవరకూ తన చుట్టని దానిలో వెలిగుంచుకొని పొగ అల్లుకున్న తరువాత కన్నురెప్పలెత్తి అప్పుని చూసి "అతన్ని రమ్మను!" అని పలికారు.

అప్పు వెళ్ళినతరువాత అతను ఆ క్లార్క్ గురించి ఆలోచించారు: 'వీడెందుకి వచ్చాడు? తనగురించి అందరూ అన్యాయంగా మొరపెడుతున్నారని చెప్పి ఓడవడానికా? లేకపోతే 'ఏమో తెలియక ఇలాంటి తప్పుచేసాను!' అని నా కాలు పట్టడానికా? ఈ వెధవలగురించి నాకు తెలుసుగా? హూం, ఏడ్చినా, కాళ్ళో పడినా ఏ లాభమూ లేదు . . . " అని చింతిస్తుంటే జోసఫ్ వచ్చి అతన్ని నమస్కరించాడు.

"నువ్వు ఈ ఉద్యోగంకివచ్చి ఎన్ని సంవత్సరాలయ్యాయి?" అని వాడి మొహం చూడకుండానే చెయిలోవున్న చుట్టని మళ్ళీ మళ్ళీ చూస్తూ అతనడిగారు.

"ఎనిమిది సంవత్సరాలు సార్ . . . "

"నీ మీద లంచం పుచ్చుకున్నావని ఆరోపణ వచ్చిందే?"

"అవును సార్ . . . "

"ఏమిటి అవును సార్? అని అంటూ తలెత్తి చూసారు. అతని కళ్ళు చిరాకు, కోపంవలన ఎర్రబడివున్నాయి; మొహం గభీమని మారిపోయింది.

"అవును సార్, నేను లంచం తీసుకున్నాను, అది నిజమే. అందుకోసం ఏం జరుగుతుందో నాకు తెలుసు . . . నాకు మరేం దారి తెలియలేదు, అందువలనే అలాగచేసాను. ఇప్పుడేమో నా ప్రశ్న తీరిపోయింది, ఇక మీరు నాకు ఎటువంటి శిక్ష విధించినా సరే . . ." అని జోసఫ్ అంటూంటే వాడి మొహాన్ని అతను బాగా పరిశీలించారు.

"ఐతే మరెందుకు ఇక్కడికి వచ్చావ్?" అని తన చూపుని మళ్ళీ వాడి మొహంమీద వాల్చారు; వాడి మాటలు అతను ఇంకొకసారి తనలో ఆలోచించారు.

వాడికే తనెందుకు వచ్చానని బోధపడలేదా? ఒక నిమిషం మౌనంగా కళ్ళప్పగించి చూసాడు; పొంగివస్తున్న దుఃఖాన్ని మింగుతూ మెల్లగా మాటాడాడు:

"సార్, నేను లంచం పుచ్చుకున్నాను; కాని డబ్బుకోసం ఆశపడి, దుబారా ఖర్చులకోసం నేనాపని చెయ్యలేదు. ఇంతవరకూ నేను లంచం తీసుకోలేదు, లంచం పుచ్చుకొనే అలవాటువలన తీసుకోలేదు. ఇక నేను మళ్ళీ ఉద్యోగం చేస్తే

అప్పుడుకూడా లంచం తీసుకోను . . . ఇది సత్యం సార్! . . . ఇది మీకు చెప్పడానికే వచ్చాను. ఇక మీరు నాగురించి ఎటువంటి తీర్పు నిశ్చయించినా సరే, నేను దానికి అర్హుడని."

*"ఇంతవరకూ నేను లంచం తీసుకోలేదు, లంచం పుచ్చుకొనే అలవాటువలన తీసుకోలేదు . . ."*

వాడిమాటలు దీర్ఘంగా ఆలోచిస్తూనే మేజామీదున్నకవరుని - ఇంతకుముందు వచ్చిన ఆ వర్తకుడు ఇచ్చినది - అతను చూసారు; ఒక క్షణం తనగురించి ఆలోచించారు.

"Nonsense!" అని మొహంకి ఎదురుగా చెయ్యూపి లేనిపోని ఆలోచనలని తోసిపారేసారు.

"నీ Personnel File ఇవాళ చూసాను; నువ్వు మంచి బుద్ధిమంతుడివి. మరెందుకు ఎటువంటి ఆలోచనా లేకుండా ఇలా చేసావ్? . . . ఎమైనా నువ్వు చేసినది తప్పేకదా?" అని తనలో మాటాడుతున్నట్టు అతనడిగారు.

"అవును సార్ . . ."

"ఐతే ఎందుకలా చేసావ్? నా పేరు చెప్పినా Head Clerk పాస్ చేసిన పనికి అడ్డంగా నిలబడి నువ్వు లంచం పుచ్చుకున్నావని ఆ మనిషే నీకెదురుగా సాక్ష్యం చెప్తున్నాడే?" అని అంటూనే గ్లాసులో సారాయి పోసారు; అతని మొహంలో చెమట కారుతోంది. నుదుటని తుడుచుకొని చుట్ట తాగారు. అప్పుకుట్టన్ వచ్చి అతని గ్లాసులో సోడా కలిపాడు. వొంగి నిలబడిన అప్పుకుట్టన్ వీపుకి పైగా తల ఎత్తి జోసఫ్ ని బెదిరిస్తున్నట్టు రావు అడిగారు: "ఇటువంటి అపచారం చెయ్యడానికి ఏమిటి కారణం? What is it?"

జోసఫ్ ఏడుస్తూ బదులు చెప్పాడు: "అది నా బిడ్డ సార్ . . . ఇవాళ పొద్దున్న చనిపోయిన నా పిల్లవాడు . . వాడే సార్ . . . "

రావు ఉలికిపడ్డారు. "Joseph, I am sorry . . . " అని తల వంచారు; మళ్ళీ తలెత్తి చూడడానికి కొంచెం సమయం పట్టింది. అతని వెనుకనుంచి వచ్చే సంగీతంలోకూడా ఏదో శోకంవున్నట్లు అనిపించింది.

రావు ఒక నిట్టూర్పు వదిలి, తలెత్తి చూసారు. అప్పుడే జోసఫ్ తన మొహం తుడుచుకుంటున్నాడు.

“జోసఫ్, ఇలా కూర్చో . . . ” అని తన ఎదుటవున్న ఒక కుర్చీని చూపారు.

“పరవాలేదు సార్ . . . ఇలాగే . . . ” అని అంటూ జోసఫ్ కొంచెం జరిగి నిలబడ్డాడు. రావు వాడిని తరిచి అడిగారు.

“నీ పిల్లవాడికి ఎంత వయస్సు?”

“రెండేళ్ళు సార్ . . . ”

“ఏమైంది అబ్బాయికి?”

“Diphtheria అని అన్నారు; గవర్ణమెంటు ఆసుపత్రికి తీసుకొని వెళ్ళాను . . . చాలా ప్రియమైన సూదిమండట. ఇంకొక కేసులో వేయడంవలన చేతిలో లేదన్నారు. వెంటనే ప్రైవేటు డాక్టరు దగ్గరకి వెళ్ళమన్నారు. నా దగ్గర ఒక పైసాకూడా లేదు. ఇదేమో ఒక క్లార్క్ అబ్బాయికి రావలసిన వ్యాధి అని నాకు తెలియలేదు . . . ఎవరినెవరినో అడిగి చూసాను; ఇప్పుడు నేను లంచం పుచ్చుకున్నాను అని అంటున్నవాళ్ళనికూడా అడిగాను; వాళ్ళదగ్గరా డబ్బు లేదు. మరి వాళ్ళేం లంచం తీసుకునే మనుషులా - నాకెలా వంద రూపాయలు ఇవ్వగలరు? అప్పుడే నేను - మొండిగా, మూర్ఖంగా అతన్ని నూరు రూపాయలు ఇమ్మని నిర్బంధించాను. ‘నేను చేసినది తప్పు, రేపు నా ఉద్యోగంకి హాని రావచ్చు’ అని తెలిసే అలా చేసాను. ఐతే ఆ కరుణించే దేవుడు  నా బిడ్డ ఒక లంచగొండి క్లార్కుకి కొడుకుగా ఉండవద్దని . . . ”

జోసఫ్ చెప్పి ముగించడానికి ముందే “ No, no . . . అలా అనకు జోసఫ్,” అని రావు అతని నోరు మూసారు; కొంచెం సేపు మౌనంగా ఉన్నారు. ఆ మౌన క్షణాల్లో - తను తాగుబోతుగా మారని రోజుల్లో, తనొక నిజాయితీ Class III ఆఫీసరుగా ఉద్యోగం చేసినప్పుడు తనతో జీవించిన తన భార్యను ఎందుకో అతను తలుచుకున్నారు. ఆమె పోయిన తరువాతనే శోకంలో మునిగిపోయి ఒక తాగుబోతుగా, స్త్రీలోలుడుగా, లంచాలు తీసుకుంటూవున్న తన్ను విడచి జీనిస్తున్న తన ఇద్దరు కొడుకులని అతను గుర్తుచేసుకున్నారు. ఒకసారి బాగా దగ్గి, తన్ను సర్దుకొని అతను అన్నారు: “జోసఫ్, నీకేర్పడిన దుర్ఘనకి నేను

బాధపడుతున్నాను. నాకు నిన్ను పొగడాలనివుంది - నీ ధైర్యంకోసం. 'నేను లంచం పుచ్చుకున్నాను' అని నువ్వు చెప్పావుగా, ఆ నిజాయితీ కోసం . . . అందువలనే 'నేను మళ్ళీ ఉద్యోగం చేస్తే, అప్పుడుకూడా లంచం తీసుకోను' అని నువ్వు చెప్పే మాటలు నెను మనసార నమ్మగలను" అని అన్నారు.

ఇప్పుడే జోసఫ్ కి చేతులూ, వొళ్ళూ వొణకడం ఆరంభించాయి.

మధుసూదనరావుగారు మేజామీదున్న కవరుని దీర్ఘంగా చూసారు. తరువాత ఒక వెర్రి నవ్వుతో అన్నారు: "నాకూ నీలాగే లంచగొండితనం అంటే అసహ్యమే; ఇప్పుడుకూడా నేను లంచానికి విరోధి. ఐతే నేనలా అంటే 'దెయ్యం వేదం వల్లించుతోంది!' అని నీకనిపిస్తుందేమో?" అని అడిగారు. కాని వెంటనే 'నేనలా అడిగివుండకూడదు,' అని తనలో చెప్పుకున్నారు.

జోసఫ్ జవాబేమీ చెప్పలేక నోరుమూసుకొని నిలబడ్డాడు.

అతను మళ్ళీ చుట్ట కాల్చుకొని మాటాడారు. ఆ మాటకి వస్తే ఎవరూ లంచం తీసుకోవాలని ఆశపడి దాన్ని పుచ్చుకోరు. ఎప్పుడైనా ఒక అత్యవసర పరిస్థితిలో లంచం పుచ్చుకుంటారు. కాని అందరికీ అలా ఒప్పుకోడానికి మగతనమో, గుండెధైర్యమో లేదు" అని చెప్పి ఆగారు; తనగురించే మళ్ళీ ఆలోచించారు.

మళ్ళీ ఒక నిట్టూర్పు. "అవును, 'ఇది కావాలి. అది కావాలి' అని ఒక మనిషికి ఆశ వస్తే దానికేం అంతువుందా? అందువలనే నా దగ్గర పని చేసే ఉద్యోగులను నెనెలా దండించుతానని నీకు తెలిసివుండవచ్చు. మీరు అవన్నీ చెయ్యడానికి నేను అనుమతించను!" అని క్రోధంగా చుట్టని జోసఫ్ పక్క చూపిస్తూ మళ్ళీ అన్నారు: "అవును. నేనది అనుమతించను!"

ఉన్నపాటున అతని మనసులో శాంతి చోటుచేసుకుంది. మళ్ళీ తాగడం ఆరంభించారు. జోసఫ్ ని చూస్తూ చెప్పారు.

"ఒక అత్యవసర పరిస్థితిలో లంచం పుచ్చుకున్నా లంచగొండితనం ఈ సమాజంలో పెరిగిపోవడానికి కారణం అత్యవసరం మాత్రం కాదు; అది ఒక అలవాటుగా మారిపోవడం వలనే! అవును, ఇవన్నీ అలవాటులేకదా? నేను చుట్టలు కాలుస్తున్నాను. బ్రాండీ తాగుతున్నాను. ఇవన్నీ మొదట అలవాటుగానే వచ్చాయి. దేనికైనా అలవాటుపడితే అందులోనుంచి తప్పుకోవడం చాలా కష్టం!

మరి నాకు కష్టమంటే నేను చేసేదంతా సరే అని నేను చెప్పవచ్చా? తరువాత నా పిల్లల గతి ఏమౌతుంది? నేనెందుకు వాళ్ళు నన్ను విడిచి జీవించాలని నిశ్చయించాను? వాళ్ళు చెడిపోకూడదనే. నా కథ ఇంకా కొన్ని సంవత్సరాల్లో ఐపోతుంది; నాతో నా దురలవాటులూ రిటైరయిపోతాయి . . . మీరందరూ ఇక పలకాలం జీవించాలి . . . అందువలనే మీరు తప్పు చెయ్యడం నేను అనుమతించను!" అని చెప్పి, లేచి హుందాగా నిలబడ్డారు. అతని హృదయాన్ని ఉర్రూతలూగించినట్టు ఆ నేపథ్య సంగీతంలో వయలిన్ లు కిందకీ, మీదకీ పోటాపోటీలో పాల్గొన్నాయి.

జోసఫ్ శెలవు తీసుకోవాలని అతనికి నమస్కరించాడు. ఆదేమో చూడనట్టు రావుగారు ఆకాశాన్ని చూస్తూ అన్నారు: "దెయ్యం వేదం వల్లించనీ! అప్పుడే కొత్త దెయ్యాలు తోచవు. దానితో ఆ దెయ్యంకి పట్టుకున్న పాపంకూడా కొంచెం తగ్గుతుందికదా?" అని చెప్పి తనలో నవ్వుకున్నారు.

"సరే, నేను శెలవు తీసుకుంటాను," అని జోసఫ్ మళ్ళీ అన్నాడు.

"సరే . . . " అని ఎక్కడో చూస్తూ జవాబిచ్చిన రావుగారు గభీమని తిరిగి "ఉండు . . . " అని చెప్పి మేజామీదున్న కవరు తీసారు. ఒక క్షణం నవ్వి, ఒక నూరురూపాయలనోటుని తీసి వాడికి అందించారు. "జోసఫ్, నువ్వేం లంచం తీసుకోలేదు; నువ్వు తీసుకున్నది అప్పుమాత్రమే. రేపు దీన్ని అతనికి ఇచ్చేయ్ . . . ఇక నువ్వు వెళ్ళవచ్చు."

వొణికిన చేతులతో అది అందుకొని కళ్ళు చెమ్మగిల్లుతుంటే జోసఫ్ బయటికి నడిచాడు. వెళ్ళుతూనే రాపుగారికోసం ప్రార్థించుకున్నాడు: 'దేవుడా! నన్ను తలధరించే వాళ్ళని నేను క్షమిస్తాను; నువ్వు నన్ను క్షమిస్తావా?'

మధుసూదనరావు వాడివీపు చూస్తూ నిలబడ్డారు. హాలులోనుంచి వచ్చే గానంలో ఒక వయలిన్ కమాను కొనమెరుపులో ఒక సుస్వరమైన రాగాన్ని అతని ఆత్మలో చోటుచేసుకొని గుసగుసలాడింది.

గభీమని అనేక వయలిన్ లు ఒకేసారి ఉచ్చస్థాయిలో నిదానించి, నాలుగు సార్లు ఏదో సందేశం ప్రకటన చేసాయి.

** ** **

మరునాడు మధుసూదనరావు ఆఫీసునుంచి అతని సంతకంతో వచ్చిన ఫైళ్ళలోనుంచి చాలా ఆతురతతో జోసఫ్ personnel file ని తీసి చదివారు Head Clerk రామభద్రన్.

అందులో 'ఈ కార్యాలయంలో పని చేసేవారిలో నిజమైన ఉద్యోగస్తుడు' అన్న వాక్యం చదివి అతని మొహం నల్లబడింది; అతనికి ఒక విధమైన ఆశ్చర్యమూ, నిరుత్సాహమూ కలిగాయి. 'ఇదొక తాగుబోతు ఆఫీసరు వాగుడు!' అని తనలో చెప్పుకొని అతను మొహం చిట్లించుకున్నారు.

అప్పుడు  మధుసూదనరావు తాగివుండలేదు అనడానికి ఒక నిదర్శనం: ఇదిగో, నవ్వడమంటే ఎరుగని, ఒక విగ్రహంలాగ, ఎవరినీ లెక్కచెయ్యకుండా, అహంకారంతో, ఆఫీసునుంచి బయలుదేరి తన కారికి వెళ్తున్న అతని నడక!

అతను కారులో ఏక్కి వెళ్ళిపోయిన తరువాత ఆ దిశనే చూస్తూ కూర్చున్నారు రామభద్రన్, ఇంకో మూల జోసఫ్.

ఇద్దరూ అతన్ని చూసారు; కాని వేరే వేరే కోణాలనుంచి.

********

# అంధకారంలో ఆశ్రయం

పది సంవత్సరాల తరువాత - తటాలున, ఉన్నపాటుగా - ఇటీవల చెన్నపట్ణం వీధుల సందడిలో యువతులు రుక్కూ, పట్టూ. కలుసుకున్నారు. ఆ తరువాత ఇద్దరూ ఈ హోటల్ కి వచ్చారు. కాఫీ తాగడానికి, మనసువిప్పి మాటాడడానికి ఒప్పైన జాగా అది.

జీవిత ప్రవాహంలో ఇద్దరు యువతులు కలుసుకోవడం ఎంత సామాన్యంగా జరుగుతోందో, అలాగే వాళ్ళిద్దరూ కలుసుకొని విడిపోవడం కూడా.

ఈ పది సంవత్సరాల్లో ఇద్దరికీ చాలా కొత్త కొత్త స్నేహితులు దొరికివుంటారు. వాళ్ళ జీవితాల్లో ఏన్నో మార్పులు ఏర్పడివుంటాయి. ఈ ఎడబాటువలన వాళ్ళ స్నేహంలోని పాత జ్ఞాపకాలు కొంచెం కొంచెంగా వెలసిపోయి - ఇక కొత్త అనుభవాలూ, చేరికలు మూలంగా అంతరాత్మలో ఎక్కడో పాతుకుపోయినవి ఇప్పుడే గభీమని - వాళ్ళిద్దరూ హెచ్చరిక లేకుండా కలుసుకోవడంలో -బయటికి వచ్చేసాయి. వాళ్ళు ఇంతకుముందు చూసి ఎరుగని ఎందరో ప్రజలు - వందలు వందలుగా - ఈ జనసముద్రంలో యంత్రాలులాగ మెలుగుతుంటే ఇప్పుడు యధేచ్ఛంగా ఢీ కొట్టుకొని ఇద్దరూ ముఖాముఖిగా చూసుకున్నారు.

యంత్ర యుగంలో చిక్కుకున్న కారణం వలన మనుషులుకూడా యంత్రాలుగా మారిపోతారా ఏమిటి?

ఆ చూపుల కలుపునుండి తప్పించుకోవాలని, తనకే తెలియక, పట్టు మొహం తిప్పుకొని, ఒక అర నిమిషంలో సర్దుకొని, సంతోషంగా మనసు మార్చుకుంది. అదే ఆమెకు వీలయింది; తను అలా వెనుకాడినందుకు తనలో బాధపడింది కూడా.

ఐతే రుక్కు దాన్ని సంతోషంతో ఏర్పడిన ఆశ్చర్యమని అర్థంచేసుకుంది; ఆ నిమిషం అదే నిజం.

మాటలేమీ రాక, ఇద్దరూ ప్రేమతో ఒకరినొకరు చేతులు పట్టుకున్నారు.

"పట్టూ!", "రుక్కూ!" అని ఇద్దరూ మౌనంగా పేరులు పరివర్తన చేసుకున్నారు; ఇద్దరి ముఖాల్లో నవ్వు, ఆనందం కనిపించాయి; ఇద్దరి చేతులూ బిగువుగా కలుసుకున్నాయి.

కొంత సమయం ముందు ప్రజల గుంపునుంచి బయటకివచ్చి ఒకరినొకరు పరిచయం చేసుకున్నట్లు ఏవేవో మాటలు చెప్పుకొని, తమ ఇద్దరికీ ప్రస్తుతం ఎటువంటి తొందరలేదని గుర్తుచేసుకొని, వసతిగా మాట్లాడుకోవాలని ఇద్దరూ ఈ హోటల్ కి వచ్చారు.

ఆ హోటలు ప్రత్యేక గదిలో ఎదురెదురుగా కూర్చొని నిదానంగా ఇద్దరూ ఒకరినొకరు సరిచూసుకున్నారు; ఆ గదిలోవున్న ఒక పెద్ద అద్దంలో తమ తమ మొహాలు సరిపోల్చుకున్నారు.

ఇద్దరూ గభీమని ఒకేసారి పెద్దగా నవ్వారు; నవ్విన తరువాత ఇద్దరి మొహాల్లో గూఢమైన శోకమే మిగిలింది.

వాళ్ళిద్దరిలో ఆహ్లాదకరమైన మార్పులేవీ లేవు. రుక్కు మెడ - చీర కొన బాగా లాగ్గొని మూసిన చోట - బోసిగావుంది. పట్టు మెడలో సొగసైన కాని చవుకైన ఒక ముత్యాల హారం. రుక్కు నుదుటమీద ఒక పెద్ద గుండ్రమైన కుంకుమబొట్టు. పట్టు నుదుటమీద ఒక ఎర్రని తిలకం. ఇద్దరూ వాయిల్ చీరలే కట్టుకున్నారు, కాని వాటిని ధరించడంలో ఎంత తేడా! వెలిసిపోయిన తన నీలి రంగు చీరతో తన దేహం కప్పుకున్నరుక్కు నడుములో దోచుకొనివున్న చీర కొనని తీసి తన మెడ, జుత్తుకిందవున్న చెమటని తుడుచుకున్న తరువాత తన చేతిలో చుట్టబడివున్న ఒక కాగితాన్ని టేబులుమీద పెట్టి తలకి మీద తిరుగుతున్న electric fan గాలిని అనుభవించింది; ఆమె మొహం నిర్మలంగా, తెల్లగా కాని కాంతి లేకుండా ఉంది.

పట్టు మొహంలో పూసిన పౌడరు చెమట వలన మొహమంతా వాపులు కనిపించాయి. ఆమె కట్టుకున్న ఆ నల్ల చీరలో వెండి పువ్వులు ప్రకాశించాయి. పట్టు జుత్తు చూస్తే రుక్కులాగ తీరుగా లేదు; చింపిరి జుత్తుని ఇలాగా అలాగా దువ్వినట్టుంది. చెవుల దగ్గర మాత్రం జుత్తు జాగ్రత్తగా చక్కదిద్దినట్టుంది. మెడలోనుంచి బాగా కిందకి దిగిన చోళీ; పొట్టా, భుజాలూ బయటకి తెలిసినట్లు చీరకట్టు; ఇవే ఇద్దరికీ భేదాలు.

కాని ఇద్దరు మొహాల్లో ఎటువంటి శోకంవున్నా ఇద్దరికీ మారని బంగారంలాంటి దేహం; ఇరవైయైదు సంవత్సరాలలో మెరుస్తున్న మొహం; ప్రకాశించే కన్నులు; చుట్టలు చుట్టలుగా జుత్తు - ఇవే ఇద్దరికీ పోలికలు.

పట్టుకి అందమిచ్చేది ఆమె దీర్ఘమైన గడ్డం; ఒయ్యారమైన, ఎదిగిన ఆకారం.

రుక్కుకి ఆకారంకి తగినట్టు తీర్చిదిద్దిన పెదిమలు; ఆకర్షించే నవ్వు; ఒక శిల్పంలాంటి ఆకృతి; ఒక వితంతువులో కనిపించే సరళత.

మాట్లాడానికి ఎన్నో విషయాలున్నా ఏమిటి మాటాడడం అనే భ్రమతో మౌనంగా ఇద్దరూ ఒక్కరినొక్కరు పరిశీలుంచుకుంటున్నారు.

రుక్కు ప్రేమతో సంభాషణ ఆరంభించింది: "నీ అమ్మమ్మ. . . ?" అని ఆమె లాగ్గానే, పట్టు, రెండు భుజాలూ పైకెత్తి, పెదిమలు ఇరుకించింది: "రెండు సంవత్సరాలైపోయాయి."

"నువ్విప్పుడు ఒంటరిగానే ఉన్నావా? నువ్వు ఎప్పుడు, ఎవరితో పట్ణంకి వచ్చావ్?" అని రుక్కు చెకచెకగా అడిగింది.

"అమ్మమ్మ పోయినతరువాత అక్కడ ఊరులో నాకెవరున్నారు? నీకు తెలుసుకదా ఆ బోదెచెట్టు అమ్మగారు? ఆవిడ నన్ను వాళ్ళఇంట్లో ఉండమన్నారు. ఒకరితో ఇంపుగా మాటాడి వాళ్ళదగ్గర చెమట కార్చినట్టు పని చేయించుకోడంలో ఆవిడకి ఆమే సాటి. ఐతే ఏం, నేను సరే అన్నాను. రెండుపూట్ల తిండికీ, బట్టలకీ ఏం కొరతలేదు. సరే, గౌరవంగా అక్కడే ఉండిపోదాం అని అనుకున్నాను. కాని వాళ్ళు తల్లడిల్లిపోయారు; ఆ ఇంటి యజమానుడు ఎవరికో జామీనుకోసం సంతకం పెట్టి వాడు అతన్ని మోసం చేసాడట . . . అంతా పోయింది. అప్పుడే ఆవిడ బంధువులు ఎవరో వచ్చి 'ఈ అమ్మాయిని మాతో పంపించండి, సినిమాలో చేర్పిస్తాం' అని అన్నారు . . . ఐతే, ఆదేం కుదరలేదు . . . నేనిప్పుడు ఒక స్నేహితురాలుతో ఒంటరిగావున్నాను." పట్టు మాటలు వింటూంటే ఆమె ఎవరిమీదనో నేరం మోపుతున్నట్టు అనిపించింది.

ఆమె మాటలూ, జంకూ చూసి పట్టు అబద్ధమాడుతుందని రుక్కుకి బోధపడింది.

"ఇప్పుడు నువ్వు ఎవరితోనో ఉంటున్నావే . . . ఎవరా స్నేహితురాలు?"

“నీకు ఆమె ఎవరో తెలియదు!” అని ఖరారుగా, ‘దాన్ని గురించి నీకెందుకు?’ అనే ధోరణిలో పట్టు జవాబు చెప్పింది.

‘ఏమో, ఈ పది సంవత్సరాలలో నాకు తెలియని - నాకంటే అన్యోన్యమైన - స్నేహితులు పట్టుకి పరిచయమైవుంటారు; సరే, అలాగే కానీ! ఐతే ఆమెకు నాగురించి తెలుసుకోవాలని ఉండదా? నేను ఆమెగురించి అడుగుతున్నాను, ఆమెకు నన్ను కలుసుకోవడంలో సంతోషం లేదా?’ అని రుక్కు ఆలోచించినప్పుడు “మీ నాన్నగారికి ఆరోగ్యం ఎలావుంది? ఆయన చికిత్సకోసమేకదా మీ ఇద్దరూ ఊరు వొదిలి ఇక్కడ బంధువుల ఇంటికి వచ్చారు?” అని పట్టు అడగ్గానే తన్ను ఇంత జ్ఞాపకం పెట్టుకొని అడుగుతున్న పట్టుని ఇంత త్వరలో తను అపార్థం చేసుకున్నందుకు రుక్కు బాధపడింది; కాని ఆ క్షణమే పట్టుమొహంలోని చిరునవ్వు చూసి రుక్కు ఆలోచించింది: ‘ఈమె ఎందుకిలా తికమకలాడుతోంది? ఎందుకు ఆమె మొహంలో ఈ విరుద్ధ బావాలు?’

కాని పట్టు అడిగిన ప్రశ్నకి రుక్కు జవాబు చెప్పింది.

“అప్పుడే - మేం వచ్చిన కొన్నిరోజుల్లో - మా నాన్నగారు పోయారు . . . ”

అప్పుడు హోటల్ సర్వర్ గది తలుపుమీద తలయెత్తి వాళ్ళనిచూసి లోపలికి వచ్చాడు.

“ఏమిటి ఆర్డరు చేద్దాం?” అని రుక్కు అడిగింది.

“కాఫీ చాలు . . . ”

“బాగా చెప్పావ్ . . . ఇన్నిరోజుల తరువాత కలుసుకున్నాం . . . ” అని సల్లాపంతో నవ్వుతూ రుక్కు “రెండు special sweets తీసుకురండి” అని సర్వర్ కి చెప్పింది.

రుక్కు సర్వర్ తో మాట్లాడుతున్నప్పుడు ఆ స్వల్పకాలంలో పట్టు తనలో ఏదో ఆలోచిస్తూ తలవంచింది. సర్వరు వెళ్ళినతరువాత రుక్కు ఆమె స్థితిని అర్థం చేసుకోలేక పట్టుని చూసింది.

గభీమని పట్టు తల ఎత్తింది. రుక్కుని చూసి మళ్ళీ ఒక చిరునవ్వి నవ్వి, కల్లబొల్లి ప్రకాశంతో “సరే, నువ్వు ఇప్పుడు అదే బంధువులతో ఉన్నావా?” అని అడిగింది.

“అవును. ఆ ఇంట్లోనే ఉన్నాను. కాని ఒంటరిగా ఉంటున్నాను.”

"ఒంటరిగానా? అంటే నువ్వేం ఉద్యోగం చేస్తున్నావా? అని అడుగుతూ రుక్కు చేతులకి దగ్గరవున్న ఆ పొడుగాటి కాగితంని అందుకొని "ఇది నేను చూడవచ్చా?" అని అడిగింది పట్టు.

సరే అని తల ఊపుతూ రుక్కు పట్టుని పరిశీలించుతున్నట్టు తీక్షణంగా చూసింది.

అప్పుడే సర్వరు లోపలికి వచ్చి వాళ్ళకి sweets పంచాడు; కాఫీ, తెమ్మని రుక్కు అతనికి చెప్పి పంపింది.

ఆ కాగితాన్ని విప్పిచూసిన పట్టు జుగుప్సతో కలవరపడి చెయితో పరచిన ఆ కాగితానికి పైగా తలయెత్తి రుక్కుని చూసింది.

రుక్కు నిమ్మళంగా నవ్వింది.

ఇంతలో ఎవరో వస్తున్నారని సందడి వినగానే పట్టు మళ్ళీ తొందర తొందరగా ఆ కాగితాన్ని చుట్టసాగింది. దాన్ని సగం చుట్టేసరికి ఆమె దొంగలాగ చూస్తూంటే సర్వరు తను తీసుకొచ్చిన తినుబండారాలు పెట్టివెళ్ళాడు.

అతని తల మాయమవగానే పట్టు గప్పుమని అడిగింది: "ఏమిటే ఈ అసహ్యం?"

రుక్కు ఆమెను చూసి, దయతో, నవ్వుతూ చెప్పింది: "ఇది అసహ్యమంటే, నువ్వూ, నేనూ, ఈ ప్రపంచమే అసహ్యమన్నమాట . . . బాగా చూడు. నీకెందుకు దాన్ని చూడడానికే భయం? నిష్కపటమైన మనస్సుతో చూడు."

పట్టు మళ్ళీ కళ్ళు చిట్లించుకొని ఆ కాగితాన్ని పరచి చూసింది.

అందులో వివస్త్రగా, ఒక పక్క ఆనుకొని, మోకరిల్లే ఒక స్త్రీ ఆకారం కనిపిస్తోంది.

మొట్టమొదట చూసినప్పుడు అలవాటులేని కళ్ళకి ఆ చిత్రం కలుషితమైన మనసుకి 'ఛీ' అనిఅనిపించింది. కాని అదే చిత్రాన్ని ఇప్పుడు ఓపికతో చూసినప్పుడు - కూర్చున్న ఆ యువతి భంగిమ; ఎడమపక్క మోకరిల్లే ఆ పొడుగాటి కాళ్ళ తీరు; ఆ నడుము వంపు; కుడిచెయితో కింద ఆనుకొని, మెడని కుడిపక్కగా తిప్పి, మొహాన్ని భుజంమీద కమ్ముకున్న తల; పొట్ట, ఛాతీ, వక్షస్థలంలో కనబడే మడతలు, వాటి తారుణ్యం; ఇక చిత్రంలో ఈ విభేదాలని నొక్కిచూపించే రేఖలూ, నీడలూ. ఇవన్నీ చూస్తూంటే ఆ చిత్రంలోని నిపుణత, అందాలతోపాటు ఆ చిత్రంలో కనిపించే యువతి

రుక్కువే అని పట్టుకి బోధపడింది. పట్టు రెండుసార్లు ఆ చిత్రంలోని మొహాన్ని రుక్కు మొహంతో సరిపోల్చింది.

"ఇది నువ్వే కదూ?" అనే పట్టు ప్రశ్నకి రుక్కు మనసార తృప్తితో తలూపింది.

"దీన్ని చిత్రించినది ఎవరు - ఒక మగవాడా లేక ఆడదా?"

రుక్కు మెల్లగా నవ్వింది: "ఇది చిత్రించినది ఒక ఆర్టిస్టు! అలాగ చెప్తే నీకు తృప్తి ఏర్పడుతుందా?" అని మళ్ళీ నవ్వి "అది ఒక మగవాడే!" అని చెప్పింది.

"దీనికోసం నీకు డబ్బు ఇస్తారా?"

"ఆ . . . ఇస్తారు . . . నేను ఏం పని చేస్తున్నానని నువ్వు అడిగావుగా? నా ఉద్యోగం ఇదే . . . " అని పలికిన రుక్కుని పట్టు దీర్ఘంగా చూసింది. రుక్కు వీపు వెనుకన కనిపించే అద్దంలో తన ఆకారాన్ని చూసింది. 'నాకంటే మంచి గుణమూ, సరళత ఉన్న రుక్కు - తన మెడని, వీపుని బయటకి వెళ్ళినప్పుడు బాగా మూసుకునే రుక్కు - ఇప్పుడు పొట్ట నింపడానికోసం - పరాయి మగవాడి ముందు వివస్త్రగా పని చేస్తుందే!' అన్న తలపుతో పట్టు కళ్ళలో నీళ్ళు నిండాయి.

"అవును . . . మరి నువ్వేం పని చేస్తున్నావ్? . . . ఆ నీ స్వేహితురాలు ఏం ఉద్యోగం చేస్తోంది?" అని రుక్కు అడగ్గానే పట్టుకి దుఃఖం అలాగే కంఠనాళం వరకూ వచ్చేసింది; పెదిమలు కంపించుకొని ఏడవాలనిపించింది.

ప్రారంభంలో - కలుసుకున్నవెంటనే - తనలాగ కాకుండా రుక్కు గౌరవమైన పనిచేస్తూ జీవిస్తుందని పట్టు ఆమెదగ్గర తనగురించి వ్యక్తగతంగా ఏమీ చెప్పకుండా తప్పుకుంది. ఐతే ఇప్పుడు రుక్కుకూడా తనలాగే అగౌరమైన, సిగ్గుపడే వృత్తిలో ఉంది అనే ఆలోచన రాగానే ఆమెకు రుక్కుమీద ఒక విధమైన సానుభూతి కలిగింది. ఆ రోజుల్లో గౌరవంగా విడిచిన తమ ఇద్దరూ ఇప్పుడు ఒక నీచమైన పరిస్థితిలో కలుసుకోవడంతో దిక్కులేని తన వృత్తికి ఒక తోడూ, ఆమెతో మళ్ళీ స్నేహం కల్పించుకోడానికి ఒక సదవకాశం దొరికిందని పట్టుకి బాధతోనే సంతోషమూ కలిగింది.

ఐనాకూడా "ఇప్పుడు నువ్వేం పని చేస్తున్నావ్?" అని రుక్కు అడిగిన ప్రశ్న విని పట్టు అవమానంతో తల వంచింది.

"పట్టు, నువ్వే బాధ పడకు. నేను నిన్ను దుఃఖపెట్టాలని అడగలేదు. నావల్ల నీకేమైనా సహాయం చెయ్యగలనా అని అడిగాను . . . ఇదిగో, నన్ను చూడు . . . " అని అంటూ టేబులికి అడ్డంగా చెయ్యిని చాటి ఆ వొంగిన మొహాన్ని అభినందిస్తూ రుక్కు పట్టు గడ్డం తాకింది; కాటిక పూసిన పట్టు కళ్ళలో నీళ్ళు నిండి లేత రెప్పలు తడిసిపోయాయి.

పట్టు తటాలున మొహం కప్పుకొని ఏడ్చింది. రుక్కుకి ఆమె సంగతి బోధపడింది. కొంత సమయంలో మొహం తుడుచుకొని పట్టు మెల్లగా మాటాడింది. "రుక్కూ, నేను నీ దగ్గర అబద్ధం చెప్పాను; నేను ఎవరి కుటుంబంతోనో వచ్చానని అబద్ధం చెప్పాను. మన ఊరులో ఒక మనిషిని నమ్మి సినిమాలో చేర్దామని ఆ బోదెచెట్టు కుటుంబంతో ఏమీ చెప్పకుండా వచ్చేసాను. ఆ ద్రోహానికి కావలసినదంతా ఈ ఒక సంవత్సరంలో అనుభవించేసాను. నేనేం పని చేస్తున్నానని చెప్పడానికి నాకు నాలిక రాదు; ఒక్కొక్క నిమిషమూ అక్కడనుంచి పారిపోవాలని నా మనసు చెప్తోంది . . . నేను ఎక్కడికి వెళ్తాను చెప్పు! . . . ఇది నా కర్మ . . . " అని మరేం అనలేక పట్టు ఒక నిట్టూర్పు వదిలింది.

రుక్కు మౌనంగా ఏదో ఆలోచనలో పడి తనుకూడా పళ్ళెంనుంచి తినడం ఆరంభించింది. "సరే, నువ్వూ తిను" అని పట్టుకి చెప్పింది; ఇద్దరూ మౌనంగా టిఫను తిన్నారు.

ఉన్నపాటుగా రుక్కు మాటాడింది: "అవును . . . ఇది కర్మ . . . ఎవరేం చెయ్యగలరు? మన కర్మ మనల్ని నిరుపేదలుగా చేసింది; ఒక పూట భోజనానికీ, ఒక మంచి చీరకీ తగవులాడుతూ మనం రోజులు గడుపుతున్నాం. కర్మ వలన ఒక యువతి సాదా జీవితం గడపవచ్చు కాని అగౌరమైన ఏ పనీ చెయ్యకూడదు. 'నా కర్మ ఇది' అనే నెపంతో ఏదీ చెయ్యకూడదు. ప్రస్తుతం నీ పేదరికానికి కారణం నీ కర్మ, కాని నీ అగౌరమైన వృత్తికి అది కారణం కాదు!" అని రుక్కు ఘాటుగా కాని మర్యాదగా చెప్పిన మాటలు విని పట్టు తన పెదిమలని కరచుకొని, తప్పు చేసానన్న తలపుతో తల వంచింది.

రుక్కు ఇంకా చెప్పింది: “పేదరికంలోనే మనిషికి పరిశుద్ధం కావాలి. బలహీనమైన శరీరాన్ని విషక్రిములు దాడిచేసినట్టు మనసుకి బలం లేకపోతే అన్నిరకాల దుర్గుణాలూ వచ్చేస్తాయి. కష్టపడకూడదని చెడ్డదారిలో వెళ్తే మన కష్టాలు తగ్గుతాయా? అలాగ చెడిపోవడం మన దౌర్బల్యమేకదా? ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే ఒకప్పుడు నేనుకూడా అటువంటి సమశ్యలో పడ్డాను . . .” అని ఏమో చెప్పబోతుంటే సర్వరు ఆమెను అడిగాడు.

“ఇక కాఫీయే కదా?” అని గది తలుపు అవతల నిలబడి అడిగిన సర్వరుతో “అవును” అని ఆమె తలూపింది.

అదే సమయం పట్టుకూడా ఆలోచించింది: ‘ఒక యువతి సాదా జీవితం గడపవచ్చు, కాని చెడిపోకూడదు’ అని రుక్కు అంటోంది. కాని ఈమె ఇప్పుడు ఏం చేస్తోంది?’ అలా అనుకుంటూ తన చెయిలోనున్న చిత్రాన్ని ఇంకొకసారి విప్పి చూసి, పెదిమలతో చిరునవ్వు నవ్వడం రుక్కు గమనించింది.

ఆ చిత్రాన్ని రెప్పవాల్చకుండా చూస్తూ పట్టు ఆవేశంతో మాట్లాడింది. “రుక్కూ, నువ్వు ఏదీ బాగా ఆలోచించి చేస్తావు; నెమ్మదిగా మెలగుతావు; నాలాగ తొందర తొందరగా  ఏమీ చెయ్యవు. ఐతే ఇప్పుడు నీ గతికూడా ఒక అగౌరమైన స్థితికి వచ్చేసిందికదా?” అని చెప్పి తన చూపుని - ఆమె మాటల్లో విచారమూ, తుంటరితనమూ కలిసివున్నాయి - రుక్కుమీద విసిరింది.

“నేను అగౌరవమైన పని చేస్తున్నానని నువ్వు చెప్తే దానిగురించి నేను బాధపడను. ఎందుకో తెలుసా? నేనుకూడా ప్రారంభంలో దానిగురించి అలాగే అనుకున్నాను. సామాన్యులు అలాగే చెప్తారు . . .” అని చెప్పి ఆమె ఆగగానే సర్వరు వచ్చి ఆమెకు బిల్లు అందించాడు. ఆ బిల్లుని టేబులుమీద పెట్టి - సర్వరు వెళ్ళిన తరువాత - తను చేసే పని అగౌరనమైనదికాదు, గౌరవమైనదే అని తన మనసులోవున్న దృఢమైన నమ్మకాన్ని ఎలాగ పట్టుకి అర్థమయేటట్లు చెప్పడం - అని రుక్కు ఆలోచించింది; తన ఎడం చెయితో తన రెప్పలనీ, కళ్ళనీ మూసుకుంది.

‘రుక్కు ఏడుస్తుందోమో?’ అనే భయంతో పట్టు ఆమెనే చూసింది; రుక్కు నవ్వుతూ మాటాడింది. నువ్వు ఇంతకుముందు నీగురించి నాతో నిజం చెప్పలేదు అని

అన్నావుగా, జ్ఞాపకం ఉందా అబద్ధంకూడా చెప్పాను అని అన్నావు. కాని నీదగ్గర నేనేదీ దాచలేదు. నేను చేసే పని ఆగౌరవం అంటే నేను నీకు ఈ చిత్రాన్ని చూపించివుండను. అందులోవున్న యువతి నేనే అని చెప్పివుండను. నేను చేసేది గౌరవమైన వృత్తి . . . కాని ముందు . . . నాకెవరో ఈ ఆలోచన ఇచ్చినప్పుడు నా దేహమంతా వొణికింది . . . ఏడవాలనిపించింది." రుక్కు కంఠంలోనుంచి మాటలు రావడం లేదు.

కాఫీని మౌనంగా చల్లార్చి, ఒక మింగు మింగి, మళ్ళీ రుక్కు మాటాడింది:

"నాన్నగారు పోయినతరువాత నేనుకూడా దిక్కులేని పక్షిలాగైపోయాను. 'మీ ఊరికి వెళ్ళి తెలిసినవారు నలుగురింట్లో పనిచెయ్యవచ్చుకదా? ఇక్కడ నీకేముంది?' అని నేనున్న ఇంటిలో చాలామంది నాకు సలహా ఇచ్చారు. నాకే తెలుసు మా ఊరులో ఏమీ లేదని. అప్పుడే నేను ఆలోచించాను: తొందరపడి ఎనిమిదో క్లాసుతో చదువు ఎందుకు ఆపేసాను అని. అటువంటి సమయాల్లో - అనుభవం లేకుండా, తనే పని చేసుకొని జీవించాలంటే - ఒక యువతికి రహస్యంగా దొరికే పని - ఇప్పుడు నువ్వు చేస్తున్న పనే . . . ఒకసారి ఒక ఎగ్జిబిషన్ లో ఒక స్టాల్లో పనిచెయ్యడానికి వెళ్ళాను. జీతం ఒక రోజుకి రెండు రూపాయలు అనగానే చాలా సంతోషపడ్డాను. అక్కడ నాకేం పనిలేదు; స్టాలుకి వచ్చేవారు అడిగిన ప్రశ్నలకి జవాబు చెప్పాలి; అంతే . . .

నేను పని చేసిన స్టాలు ఒక పౌడరు అమ్మే స్టాలు. నేను పనిలో చేరిన మరుసటి రోజు ఆ సేల్స్ మేనేజర్ నాకు చెప్పారు. "మనం అమ్మే స్నో, పౌడరు ఇతరులు ఉపయోగించాలి అని చెప్పడానికి ముందు మనమూ వాటిని వాడాలి" అని సలహా ఇచ్చారు. అందువలన నేను వాటిని వాడాను. అది చూసి నేనున్న ఇంట్లో ఉన్నవాళ్ళు నన్ను అపార్థం చేసుకున్నారు . . . ఆ తరువాత నేను ఆ ఇంటిలోనే ఒక గదిని అద్దెకు తీసుకొని అక్కడే ఒంటరిగా నివసించాలని నిశ్చయం చేసుకున్నాను.

రెండు నెలలవరకూ ఆ ఎగ్జిబిషన్ లో పని చేసాను. ఆ ఎగ్జిబిషన్ మూయడానికి ముందురోజు ఆ సేల్స్ మేనేజర్ వా దగ్గరకి వచ్చి నా గురించి అడిగారు. వయస్సులో పెద్దతను, నాకు తండ్రిలాగ ఉన్నారని నేను నా పరిస్థితిని అతనికి చెప్పాను. అతను నాకొక ఎడ్రసు ఇచ్చి అక్కడకి వెళ్ళమన్నారు. అక్కడకి వెళ్ళిచూస్తే . . . మరేం

చెప్పను? అతను చూపిన దారి ఇప్పుడు నువ్వు చేస్తున్న పనే . . . నేను ఆలోచించాను: 'మరేం దారి లేదా? ఇలాంటి మార్గం తలుచుకుంటే మరేం దారి కనబడదు!' . . . 'తిండిలేక చచ్చినా సరే అటువంటి బతుకు నాకు వొద్దు' అని వచ్చేసాను . . ." అని చెప్పి చల్లార్చిన కాఫీవి తూసుకొని గబ గబ తాగింది.

"నేనుండే ఇంటిలో మేడమీద ఒకతను ఉండేవారు . . ." అని రుక్కు అనగానే ఆమె ధ్వనిలో ఒక మార్పూ, మొహంలో ఒక ప్రకాశమూ, కళ్ళలో ఒక చలనమూ కనిపించాయి.

"నేను ఆ ఇంటిలో దిక్కుతెలియక కష్టపడుతుంటే - వాళ్ళ మాటలు ముళ్ళులాగ నన్ను బాధ పెడుతూంటే - అతను నన్ను చూసిన చూపులోనే అతను నాకు సహాయపడతారనిపించింది. అవాళ ఆ సేల్సు మేనేజరుని చూసి నిరాశతో ఇంటికి వస్తున్నప్పుడు అతన్ని చూసాను. నేను నమ్మినట్లే అతను నాకు సహాయం చెయ్యడానికి వచ్చారు. 'మీరు ఎక్కడికి వెళ్ళవస్తున్నారని నాకు తెలుసు . . .' అని అతను అనగానే నేను "ఓ, భగవంతుడా . . . నాగురించి ఇతను ఇలా అపార్థం చేసుకున్నారే!" అని వచ్చే ఏడ్పుని ఆపుకోలేకపోయాను.

కాని అతను నవ్వుకుంటూ మాటాడారు: 'దానివలన తప్పేం లేదు . . . మీకేమీ తెలియక అక్కడకి వెళ్ళి నిజం తెలిసినవెంటనే తిరిగివచ్చేసారు . . . ఇక మీరు ఏం చెయ్యబోతున్నారు?' అని అడిగారు. నాగురించి ఇంత ఆసక్తి చూపే మనిషిని చూసి 'మీరు చెప్పినట్టు చేస్తాను' అని అనాలనిపించింది - కాని ఏమీ అనలేగ నేను అలాగే నిలబడిపోయాను. అతనే మాటాడారు: 'మిమ్మల్ని, మీ మనస్సుని నేను బాగా అర్థం చేసుకున్నాను; మీకది ఆశ్చర్యంగా కనిపించవచ్చు; నన్ను తప్పెట్టుకోవద్దు. రేపు పొద్దున్నే నాతో వస్తే మిమ్మల్ని ఒక గౌరవమైన ఉద్యోగంలో చేర్పగలను . . .' అని అతను చెప్పగానే నా మనసు ఆహ్లాదించింది" అని చెప్పి రుక్కు ఒక పెద్ద నిట్టూర్పు వదిలింది.

మళ్ళీ సర్వరు రాగానే రుక్కు "పట్టూ, ఇంకొక కాఫీ తాగుదామా?" అని అడిగింది.

"నాకు వొద్దు!" అని పట్టు అన్నవెంటనే "కాపీకోసం కాదు; ఇంకా కొంచెంసేపు మాటాడదాం; ఈ మొదటి కాఫీ చల్లారిపోయింది కూడా . . . ఒక కాఫీని ఇద్దరం

పంచుకుందాం . . . సరే, ఒక కాపీ తీసుకురండి," అని పట్టుని ఒప్పించి రుక్కు సర్వరుకి చెప్పింది.

"మరుసటిరోజు అతనితో ఆ చోటుకి వెళ్ళాను; అంతకుముందు నాకు తెలియదు - అతనొక ఆర్టిస్టు అని; ఆ జాగా ఒక పవిత్రమైన కోవిలలాగవుంది. 'చిత్ర, కల్ప కళాశాల' అనే పేరు నువ్వు విని ఉన్నావా? అదే నేను వెళ్ళినది. బయట, వసారాలో పది పదిహేను విద్యార్థులు మైనంతో బొమ్మలు చేస్తూ కనిపించారు. లోపల, ఒక హాల్లో ఏదో క్లాసు జరుగుతోంది . . . అతను నన్ను మేడమీదకి తీసుకొనివెళ్ళారు. అక్కడ గోడలో వేలాడే చిత్రాలు చూసి నా దేహమంతా వొణికింది . . . "

"ఇవన్నీ చూస్తూవుండండి . . . " అని చెప్పి అతను కిందకి వెళ్ళారు. నేను హాలుని బాగా తిరిగిచూసాను; హాలు మధ్య పెద్ద వేదిక - రంగస్థలంలాగ - కనిపించింది; దానికి నాలుగు దిశాలా పెద్ద పెద్ద దీపాలు; ఆ వేదికని ఇష్టం వచ్చినట్టు, చక్రంలాగ తిప్పవచ్చు. దానిచుట్టూ అలమారాలూ, వాటిలో చిత్రకారునికి కావలసిన రంగులూ, కుంచెలూ, పెన్ సిళ్ళూ, అంకా ఏమేమో ఉన్నాయి. ఆ చిత్రాలన్నీ ఇప్పుడు నువ్వు చూసావే దానికంటే చాలా పెద్దవి - రంగులతోనూ, కందిబొగ్గుతోనూ చేసినవి. ఆడవారూ, మగవారూ అందరూ దిగంబరా ఉన్నారు . . ఆ చిత్రాలు అసహ్యకరంగా కనిపించాయి అని అప్పుడు నాకు తోచినది భ్రమ అని ఇప్పుడే నాకు బోధపడింది. ఐతే . . . ఆరోజు నాకేం బోధపడలేదు. ఆ చిత్రాలకింద 'రుద్రా' అనే పేరు చూసాను. అవును, అదే అతని పేరు . . .

కొంచెం సేపట్లో - రెండు చేతుల్లోనూ మంచుముక్కలు తేలుతున్న కూల్ డ్రింక్సుతో- నవ్వుకుంటూ అతను వచ్చారు; నాకు అతనిగురించి ఏదీ అసహ్యంగా తోచలేదు.

అతను నాకొక గ్లాసు అందించి తన చెయిలోవున్నది తాగుతూ ఆ గోడమీదున్న చిత్రాలని గమనించారు: "వీళ్ళందరు మీలాగ గౌరవమైన యువతులే," అని అన్నారు. నేనేం అనలేదు. అతను చెప్పారు: "ఇదొక దేవాలయంలాగ; ఇక్కడ అందమే దైవం; ప్రకృతిలో మనం చూసేదంతా అందమే; ఒక అందమైన పశువు, ఎద్దు, నెమలి, జింక - వీటికి మనం చీరకట్టి చూస్తే ఎంత అసహ్యంగా ఉంటుందని కల్పన చేసుకోండి!"

మానవ శరీరంకి అందమే అది తొడుక్కున్న వస్త్రంగా మారిపోయింది! వస్త్రాలకి ప్రత్యేకంగా అందమంటూ ఒకటి ఉంది, నిజమే; దానికోసం వేరే క్లాసులున్నాయి. అక్కడ రూప కల్పన, బొమ్మలు చెక్కడం - ఇటువంటివి విద్యార్థులు నేర్చుకుంటున్నారు. మానవ శరీరంకి అందం వస్త్రాలలో లేదు . . . ఇంకా చెప్పాలంటే వస్త్రాలూ, ఆభరణాలూ - అవే అసహ్యం! దేనినైనా చెడగొట్టితే అదేకదా అసహ్యం! నేనిలా చెప్తున్నప్పుడు మీరు ఒకటి అర్థం చేసుకోవాలి: ఈ ప్రమాణాలు అన్నీ ఈ కళాజ్వాల ముందు. అవి ఈ పవిత్రమైన హాలుబయట చెల్లవు . . .

కళాకారుని హృదయం ధగధగలాడుతూవుంటుంది; ఇక ఈ ప్రపంచం చూస్తే దాని హృదయంలో నిత్యమూ మోసం, విద్రోహం, అబద్ధాలే! ఈ తీక్షణమైన అందాన్ని ఆ కన్నులు భరించలేవు; అందువలన కపట హృదయానికి ఈ అందాల్ని వర్ణించడం చేతకాదు. ఇక్కడ అందం ఆరాధనకోసమే అవశ్యం. అక్కడ అవశ్యమని వస్తే అన్నివిధాల అవలక్షణాలు - 'అందంగా' - మారిపోతాయి. బాగా ఆలోచించండి; నగ్నత్వం అసహ్యమా? మీ శరీరాన్ని, దాని అందాన్ని మీరు హర్షించలేదా - మీరు ఒంటరిగా ఉన్నప్పుడు? ఆ అభిరుచిలో ఏమైనా అసహ్యం ఉందంటారా? లేదే? ఆ అవగాహన మీ ప్రపంచంతో ఆ కళాకారుడు అలవరచుకున్నాడు. ఆ తరువాత 'నువ్వు', 'నేను' అనే భేదమే లేదు. అనిత్యమైన ఒక బూటకమైన అందంలోనుంచి ఒక నిత్యమైన ప్రతిమ సృష్టించడానికే కళాకారుడు అందాన్ని పూజిస్తున్నాడు. మీ శరీరంలోని అందం ఒక శాస్వతం లేని అబద్ధం; కాని అబద్ధంమని తోచే ఆ చిత్రం - శాస్వతమైన - ఒక సృష్టి! మీరు దేవుని సృష్టి - కాని దేవుడు సృష్టించినది ఒక అసత్యమే. అందులోనుంచి సత్యాన్ని పెంచినది కళాకారుని చేతులు . . . మనిషి సృష్టించిన కళ మాత్రం సత్యం! ఇటువంటి ఉత్తమమైన కృషిలో నీచమైన ఆలోచనలకి చోటులేదు. అవన్నీ అగ్నిజ్వాలలో పడిన ఎండ ఆకుల్లా మండి పోతాయి . . .

అదిగో, ఆ వేదికమీద ఎక్కి నిలబడినవెంటనే మీరు ప్రకృతిలో ఒక అంశంగా మారిపోతారు! అప్పుడు మీరు వస్త్రాలలోవుండవచ్చు లేక వివస్త్రగావుండవచ్చు, అదేం ముఖ్యంకాదు. ఇక్కడ అందమే ఒక వస్త్రంలాగ. కళాకూరుని బాధ్యత దానిమీద ఆశ పడక ఆ అబద్ధంనుంచి ఒక సత్యాన్ని సృష్టించడమే . . . ఆ సమయంలో లైంగిక

ఆలోచనలు తోచవు . . . మీరు ఏమీ తెలియని పసి పాపలాగ కూర్చొనో లేక పడుకోనో ఉన్నారనుకుందాం; శిశువు నగ్నంగానేవుంటుంది; శిశువు అసహ్యంకాదు. మీ రూపాన్ని సృష్టించే కళాకారులలో ఎవరైనా ఒకరు పరిపూరితమైన కళాకారుడుగా లేక నీచమైన తలపులతో ఉంటే మాత్రం? ఈ ప్రపంచంలో దేనివలన తప్పులు జరగడం లేదు? ఒక శిశువుని చూసి కొందరు వక్రబుద్ధితో అశ్లీలమైన పవులు చెయ్యవచ్చు. కాని అది ఆ శిశువు ప్రశ్నకాదు; అది ఆ శిశువుని బాధించదు, అది ఆ వ్యక్తినే బాధించుతుంది . . . ”

ఇలాగ అతను చాలా సంగతులు మాటాడారు - నేనేం అనలేదు. ఐతే వచ్చినవెంటనే తల వంచుకొని నిలబడినట్లు కాకుండా, ఇప్పుడు తల ఎత్తి ఆ చిత్రాలన్నీ బాగా చూసాను. నా దేహం వొణకలేదు. వాటిలోవున్న అందం నాకు బోధపడింది.

ఆఖరికి అతను చెప్పారు: ‘ఇది ఒక పని కాదు; ఇక్కడ కళకి సేవ జరుగుతోంది. అందువలనే అటువంటి మహనీయ సేవకి మిమ్మల్ని ఉపయోగించుకుందామని నా కోరిక. దీనికి మేం ఇచ్చే డబ్బు ఒక కళాకారునికి మేం ఇచ్చే సన్మానం; జీతం కాదు. ఇది అర్థం చేసుకొని మీరు ఒక మాడెల్ గా ఉండవచ్చు. లేకపోతే మీరు వేరే ఉద్యోగానికి ప్రయత్నం చేద్దామని ఇక్కడకి తీసుకొని వచ్చాను. ఇప్పుడు లేకపోయినా భవిష్యత్తులో మీరు ఈ కళను అర్థం చేసుకుంటే మాకు తప్పక సహాయం చెయ్యగలరు . . . ” అని అతను అనగానే నేను ఒక క్షణంకూడా ఆలస్యం చెయ్యక ‘ఈ కళకి నావల్ల సేవ చెయ్యగలనంటే దాన్ని నేను గొప్పగా భావించి ఒక మాడల్గా ఉంటాను,’ అని అన్నాను.

అప్పుడు సర్వరు కాఫీ తెచ్చాడు. కాఫీని టేబులుమీద పెట్టి ముందు రాసిన బిల్లుని దిద్ది రాసిపెట్టాడు. రుక్కు మొహంలో తన పాత అనుభవాలు మాట్లాడిన ఆయాసంవలన చెమట కారుతోంది. ఆమె కాఫీని చల్లార్చి, సగాన్ని పట్టుకి గ్లాసులో అందించి మిగిలినది తను డబరాల్లో తాగింది. పట్టు, భ్రమతో, ఏమీ తోచనట్టు, అలాగే కూర్చొనివుంది. ఆమె మనసులో తను విన్న దృఢమైన, నిజమైన, పవిత్రమైన సంగతులు బరువుగా నొక్కడంతో ఆమెకి మాటలేం రాలేదు. రుక్కిని, తనలాగే, నీచంగా అనుమానించినందుకు పట్టు బాధపడింది. కాని రుక్కుకి తనమీద పగ,

ద్వేషం లేకపోవడం, ఆమె పెద్దతనం చూసి పట్టు ఆమెను మనసార పొగడింది. ఆమె సొంత ప్రశ్నలు ఆమెను ఇంకా పీడిస్తూనేవున్నాయి. ఈమెను చూసినతరువాత తను మళ్ళీ ఆ అంధకారంలోకి వెళ్ళాలంటే తన కర్మకోసం ఏడవాలని వాపోయింది. ఈ ఆలోచనలు మింగడంతో ఆమె మొహమంతా ఎఱ్ఱబడి నరాలు నిక్కపొడుచుకున్నాయి.

కాఫీ తాగుతూ రుక్కు చెప్పింది: “ఏదో పవిత్రమైన ఆలోచనతో ధైర్యంగా చెప్పానేకాని, మొదటిరోజు, పది పదిహేను ఆర్టిస్టులమధ్య, ఆ వేదికమీద నిలబడి, నా అంగిని విప్పి పారేయాలని  అనగానే నేను వొణికిపోయాను; పారిపోదామా అని అనుకున్నాను; కాని అది చేతకాదు. కాళ్ళు కదలుతేనా? అప్పుడే నాకు అతను చెప్పిన మాటలు గుర్తులోకి వచ్చాయి . . .

‘ఇక్కడ అందమే ఒక వస్త్రం; ఈ మహనీయ సేవలో నీచమైన తలపులకు చోటులేదు. అవన్నీ అగ్నిజ్వాలలో మండిపోతాయి. ఇదిగో, ఈ వేదికమీద నిలబడినవెంటనే మీరు ప్రకృతిలో ఒక అంశంగా మారిపోతారు!’ ఆ మాటలు మనసార, పూర్తిగా స్వీకరించిన తరువాత నా దేహం వొణకడం తగ్గింది. నేను చేసే పనిగురించి నాకు సిగ్గో, అవమానమో లేదు; అతను చెప్పినది నిజం. ఇది అగౌరవమైన పనికాదు; ఇది కళకి నేను చేస్తున్న సేవ!” అని చెప్పి రుక్కు మౌనంగా మరేం చెప్పాలో ఆలోచించింది.

ఇంతసేపూ ఏమీ అనక కూర్చున్న పట్టు గభీమని ఒక కొత్త వస్త్రాన్ని చింపుతున్నట్టు రుక్కుని ఎత్తిపొడిచింది: “అంతా పొట్ట నింపుకోడానికే కదా? నువ్వు కళా, సేవా అని పెద్దమాటలు చెప్పినాకూడా ఆఖరికి నీ పొట్టేకదా నిన్ను వివస్త్రగా చేసి వాళ్ళముందు నిలబడడానికి కారణం? . . . నువ్వు దానిగురించి గొప్పగా చెప్పుకోవచ్చు . . . నేనుకూడా అలాగే . . . ” అని చెప్పవలసిన మాటల్ని పట్టు మింగేసింది.

“అవును. నువ్వు చీకటిలో నిలబడతావు; నేను వెలుతురులో నిలబడతాను . . . ఐతే రాత్రి, పగలు అనే భేదం చెప్తే సరిపోతుందా? దీనికి అది పూర్తిగా విరుద్ధం కాదా? అందువలనే ఒకటి గౌరవమైనది, ఇంకొకటి అవమానకరమైనది. సరే, అంతా పొట్టకోసం అని అనుకోకు . . . కళాకారుడు తిండిలేక ఆకలితో చావవచ్చు, లేకపోతే తన

కళమూలం అతను కోటి కోటి రూపాయలు సంపాదించవచ్చు; అది అతని ఇష్టం . . . నన్నెవరూ నిర్బంధించలేదు . . . మరెవరి తృప్తికోసం నేను ఆ పని చెయ్యలేదు, చెయ్యలేను కూడా. దాన్ని ఆత్మార్థంగా నువ్వు అర్థం చేసుకోవాలి; అప్పుడే నీకు బోధపడుతుంది . . .

ఇప్పుడు నేను అక్కడే పని చేస్తున్నాను. ఇప్పుడుకూడా ఒక మాడల్గా అక్కడవెళ్ళి నిలబడడంలో నాకు చాలా సంతోషం ఉంది; ఎప్పుడూ ఉంటుంది. కారులోవచ్చి మాడల్గా పనిచేసేవాళ్ళుకూడా ఉన్నారు. నీకు పొట్టనింపడం ఒక ప్రశ్న అంటే అందుకు కళ సహాయం చేస్తుంది. కాని కళాకారునికి పొట్టనింపడం మాత్రం ఆదర్శం కాదు . . . " అని రుక్కు చెప్తూంటే పట్టు రుక్కుచేతులు గట్టిగా పట్టుకొని, బొలబొలమని కన్నీరు కార్చుతూ, "నాకేం తెలుసు? నేను తెలియకుండా ఏమైనా చెప్పివుంటే నన్ను క్షమించు!" అని బతిమాలింది. రుక్కు ఆమె చెయి గట్టిగా పట్టి "పిచ్చిదానా, . . . నువ్వేం అంటున్నావ్? నీకు బాగా బోధపడాలనే నేను ఇవన్నీ చెప్తున్నాను . . . నాకెందుకు నీ మీద కోపం చెప్పు?" అని తగ్గిన స్వరంతో అడిగింది.

"నువ్వెప్పుడైనా నీ పెళ్ళిగురించి ఆలోచించావా?" అని పట్టు సంభాషణ దిశ మార్చింది. రుక్కు ఒక నిమిషం ఆలోచించి "లేదు; నేనింకా అటువంటి మగవాడిని కలుసుకోలేదు" అని చెప్పింది.

రుక్కు మాటలూ, ఆమె పరిస్థితి చూసి పట్టుకి ఆమెపై మర్యాద కలిగింది.

"సరే, నువ్వు నాకు తోడుగా నాతో ఉండు; నేను చేసే పని నువ్వు సరిగా అర్థం చేసుకుంటే రేపే నిన్ను అక్కడికి తీసుకెళ్తాను, సరేనా?" అని రుక్కు అడిగింది.

పతిత ఐన తనముందు మగవాడి వాసనకూడా ఎరుగని ఒక యువతి చెయిచూపి ఆభయం ఇచ్చినప్పుడు దాన్ని పట్టు ఎలా నిరాకరించగలదు?

** ** **

అసాధారణమైన, పవిత్రమైన, ఆ చిత్ర శిల్పశాల మేడలో, విశాలమైన హాలులో, భయపడుతూ, తలవొంగి, పట్టు నడిచింది.

బాగా నెఱిసిన జుత్తు, కళ్ళద్దాలతో, ఒక అంగిని జిబ్బాలాగ ధరించిన ఒకతను - ప్రొఫెసరు రుద్రా - ఆమెను చిరునవ్వుతో ఆహ్వానించి హాలులోకి తీసుకెళ్ళారు. ఆ వేదిగ

దగ్గర, తెర వెనుక, గదిలో వస్త్రాలన్నీ తీసేసి అక్కడేవున్న అంగి వేసుకోవాలని రుక్కు పట్టుకి వివరంగా చెప్పింది.

అలాగే, ఆ తెర వెనుక పట్టు మాయమవగానే, ఒక గంట మోగింది.

విద్యార్థులు మెట్లెక్కి మీదకి వస్తున్నారు.

తెర వెనుక నిలుచున్న పట్టు తలెత్తి గోడమీదున్న కొన్ని చిత్రాలను చూసింది. ఆమెకి ఒకటే బిడియం; తన మొహం చూపడానికికూడా సిగ్గేస్తోంది. ఆ చిత్రాల్లో కనిపించే స్త్రీలు అందంగావున్నారు; తనకి అటువంటి అందమూ, హోదా లేదని పట్టు బాధపడింది. ఆమె రుక్కుని తలచుకుంది; పవిత్రమైన రుక్కుకి తన శరీరంలోవున్న హర్షణ తనకి తన శరీరంమీద లేదని పట్టుకి అనావశ్యంగా మొహమాటం కలిగింది.

అప్పుడు రుద్రా గది తలుపుని మెల్లగా తట్టారు.

పట్టు తన బట్టలు విప్పేసి, అంగిని వేసుకొనే సమయంలో వేదిక పక్కనుంచి ఆ పొటుగాటి దీపాలు వెలిగాయి. వాటిని నిలబెట్టి పనులన్నీ సాగుతున్నాయి.

"ఐయయ్యో, ఇంత వెలుతురా?" అని భ్రమించిపోయి పట్టు ఆ తెరమధ్య మొహం నొక్కి ఒక కన్నుతో బయటికి చూసింది; ఇరవైకి పైగా మగవారు అక్కడ కూర్చొనివున్నారు.

పట్టు దేహంలో వొణకడం, మనసులో కలవరం ఎక్కువైయ్యాయి. తను వాళ్ళ ఎదుట నిలబడలేను, ఆ శక్తి తనకి లేదని ఆమెకి నిశ్చితంగా తోచింది.

ఆ దీపాలని అమర్చిన తరువాత రుద్రా మళ్ళీ తలుపు తట్టారు.

పట్టు బయటికి వచ్చింది. లోపల వెళ్ళడానికి ముందు ధరించిన అవే బట్టలతో, తల వంచుకొని, ఆమె వచ్చింది.

"నన్ను క్షమించండి . . . ఇది నాకు చేతకాదు . . . " అని ఆమె అన్న మాటలు ఎవరికీ అర్థమవనట్లు గొణుకుతూ ఆ క్లాసునించి బయటకి వచ్చి గబ గబ మని మెట్లు దిగుతున్నప్పుడు రుక్కుని చూసింది.

"పట్టూ . . . పట్టూ . . . " అని పిలుస్తూ రుక్కు పతుగెత్తుకొని వచ్చింది.

"రుక్కు, నన్ను క్షమించు . . . నేను వెళ్తున్నాను . . . నా చేతకాదు . . . వెలుతురు ఎక్కువగా ఉంది . . . " అని అంటూ పట్టు పరుగెత్తింది.

"సరేలే, నీ చేత కాదు అంటే . . . మరి ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నావ్?"

"ఎక్కడికో వెళ్తాను . . . నా నెత్తిలో రాసిపెట్టినట్టు . . . " అని నిరుత్సాహంగా చెప్పి రుక్కు ఏమంటుందో అనికూడా ఎదురుచూడక పట్టు ఆ కాంపవుండు దాటి వీధిలోదిగి పరుగెత్తింది.

ఆమె వెనుక వెళ్ళడానికి ముందుకు నడిచిన రుక్కువెనుక అతను - రుద్రా - వచ్చి నిలబడ్డారు.

"Please help! అక్కడ students కాచుకొనివున్నారు . . . మీరైనా రావాలి . . ." అని అతను పిలవగానే రుక్కు మెట్లెక్కి మీదకి వెళ్ళింది.

కొంత సేపట్లో, అందాన్ని ఆరాధించే ఆ కళా సన్నిధిలో, రెండువైపులా ప్రకాశమైన కాంతి ప్రవాహంలో, అందాన్నే ఒక వస్త్రంగా ధరించి అందరిముందూ తన శరీరాన్ని చూపుతూ నిలబడింది రుక్కు.

అదే సమయం అంధకారంలో - ఆ కప్పులో తన్ను ఇంకొక మగవాడితో దాచుకోవాలనే ప్రయత్నంలో - నగరంలో వేరే ఒక మూల త్వరగా వెళ్తోంది పట్టు.

********

# లక్షాధిపతులు

ఇవాళ, ఆరు గంటల వరకూ, అతనోక లక్షాధిపతి.

సరిగ్గా, ఆరుగంటలు కొట్టి పదిహేను నిమిషాలకి, మిస్టర్ అయ్యంగార్ - అతని వకీలు, ఆర్థిక సలహదారి - నుదుటమీద పెద్ద నామంతో దర్శనమిచ్చాడు; ఇంటిలో కాలుపెట్టగానే అతని కళ్ళు కిందకి జారాయి.

ఆ సమయం ఆ ఇంటి యజమానుడు - యువకుడు - బాగా మత్తెక్కి ఉన్నాడు. గత రెండు రోజులుగా అతను తన గదిలో తలుపు మూసుకొని రోజంతా తాగుతున్నాడు. అప్పుడప్పుడు తనలో తనే మాటాడుకుంటూ, పెద్ద గొంతుకతో అర్థంలేని పిచ్చిమాటలు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నాడు.

ఈ రెండుమూడు రోజుల్లోనూ అతను స్నానం చెయ్యడానికిగాని, భోజనానికిగాని, తన గదిని వదలి బయటకి రాలేదు. అతన్ని అడగడానికి కాని, చెప్పడానికి గాని బంధువులో, మిత్రులో ఆ ఇంటిలో లేరు.

ఇక అతనొక భర్తయో, తండ్రియో కాదు, పిల్లలెవరూ లేరు. అతను ఆ ఇంటికి యజమాని, అంతే. ఇంటిలో ఉండేది అతని నౌకర్లు మాత్రమే. అందువలన ఒక భార్యలాగ అతను ఎది చెప్పితే అది చెయ్యడానికి వాళ్ళు సిద్ధంగావున్నారు.

అప్పుడప్పుడు ఆ ఇంటిలోని ముసలి సేవకుడు చిన్నదొర గది బయట నిలబడి, తడుముకుంటూ “తమ్ముడూ . . . తమ్ముడూ . . . ” అని పిలిచాడు; జవాబేమీ రాకపోవడంతో తన యజమానుని చిరాకు, ఆగ్రహం గ్రహించి చివాలున పాదం వెనక్కి తీసాడు.

యువకుని మిత్రులు, ఎప్పుడూ అతనిచుట్టూ తిరిగే గుంపు, ఇప్పుడు రావడం మానేసారు.

ఇంట్లోవున్న నౌకరులు రోజంతా తమ యజమానుని గురించి ఏమోమో కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఇవాళ సాయంకాలం యువకుడు కొత్తబట్టలతో తన గదినుంచి బయటకి వచ్చి తన వకీలుని కలుసుకోవడానికి గేటుదగ్గరకి వచ్చాడు. అతన్ని చూస్తే జాలి వేస్తోంది. ఆసుపత్రినుంచి వచ్చిన రోగిలాగ కనిపించాడు.

మిస్టర్ అయ్యంగార్ యువకుని గదిలో ప్రవేశించిన వెంటనే గది తలుపులు మూసుకున్నాయి.

కొంత సమయం ముందు ఆ ముసలి నౌకరు వచ్చిన అతిథికి కాఫీ ఇవ్వడానికి గదిలోపల వెళ్ళినప్పుడు ఒక మేజామీద చెదిరిన పత్రాలూ, కాగితాలూ చూసాడు. కూర్చోడానికి ఇష్టంలేక యజమానుడు గదిలో ఈ చివరనుండి ఆ చివరకు నడుసితున్నాడు.

ఆఖరికి వకీలు వచ్చిన పని ముగించుకొని వెళ్తున్నప్పుడు ఒక పాతకాలపు మిత్రుడని విడిచిపోతున్నట్లు భావించాడు. యువకుని భుజాన్ని తట్టుతూ అతను మాట్లాడాడు. కళ్ళద్దాలు తీసేసి, పొంగివస్తున్న దుఃఖంతో యువకుడ్ని ఒదార్చాడు:

“ఇదేమో ధనవంతుల జీవితంలో ఒక సర్వసాధారణమైన సంఘటన; నా ఉద్యోగంలో ఇది నాకేం కొత్త కాదు. కాని మీ నాన్నగారి యోగ్యత, నిష్కళంకమైన అతని హృదయం తలుచుకుంటే ఇటువంటి దుర్ఘటన అతని కుటుంబంలో ఎవ్వరూ, ముఖ్యంగా అతని పిల్లలు, అనుభవించకూడదు. ఇదంతా ఆ భగవంతుని లీల. నువ్వు ధైర్యంగా ఉండు.”

ఆ మాటలు యువకుని మతిలో, జ్ఞానంలో ప్రవేశించడానికి కొంత సమయం పట్టింది. ఏదో భ్రమలో కోల్పోయినట్టు అతని దృష్టి అంతా లోకప్పులో ఎక్కడోవుంది. వకీలు శెలవు తీసుకొని వెళ్ళిపోయిన తరువాతకూడా చాలాసేపు యువకుడు విగ్రహంలాగ ఇంటి గేటు పక్కనే నిలబడిపోయాడు.

తిరిగి ఇంట్లోకి ప్రవేశించినప్పుడే అతను తన నౌకరులను చూసాడు. అంతవరకూ వాళ్ళందరూ ఇంటి వెనుగ భాగంలో ఏదో స్తంజమో లేక తలుపు దగ్గర దాక్కొని చాటుగా తమ యజమానుని చేష్టలు చూస్తున్నారు; ఇప్పుడు అతను ఉన్నపాటున తమ్మల్ని చూడగానే కొందమంది అతని దృష్టినుంచి తప్పించుకోవాలని గభాలున దూకి తమ

తమ చోట్లకి పరుగెత్తారు; మరికొందరు ఏమీ తెలియనట్టు తమ తమ పనుల్లో మునిగియున్నట్లు నటించారు. ఇది చూసి ఆ చిన్నదొరకి విపరీతమైన కోపం వచ్చింది.

అతను వాళ్ళని నీచమైన బాషలో, పచ్చి బూతులతో తిట్టాడు. చివరికి ఇలా ముగించాడు: "మీరందరూ మురికిపట్టిన కుక్కలు! ఇంకాబతుకుతారేం, చచ్చిపోండి! తక్కినవారి డబ్బుతో బతకడమే మీ పని, పోండి, నేను పోతే మీకు ఇంకొకడు దొరుకుతాడు!" చివరికి ఆ ముసలి నౌకరును గుర్తుచేసుకొని "ఓ ముసలాడా! నేను చెప్పేది నీకు కూడాను!" అని అరిచాడు.

అలా పచ్చిబూతులూ, కేకలూ పెట్టుకుంటూ అతను మళ్ళీ తన గదిలోకి ప్రవేశించి తలుపు మూసుకున్నాడు. గదిలో ప్రవేశించగానే అతనికి గోడమీద వేలాడుతున్న తన తండ్రి ఛాయాచిత్రం కనిపించింది; వెంటనే యువకుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. ఒక మంచి కుటుంబంలో పుట్టిపెరిగిన తనకి ఇటువంటి చెడ్డ ప్రవర్తన ఏమాత్రం కూడదని కుంగిపోయాడు.

ఇక తను ఏంచెయ్యాలి? అతనికి దారేం తోచలేదు. ప్రస్తుతం తన అవస్థ చూస్తే, తన దగ్గర డబ్బేమీ లేదని తెలిసిన తరువాత, అతనికి తనమీదే జాలి కలిగింది; తన నౌకరులకంటే తన గతి విషాదకరమైనదని అతనికి బాగా బోధపడింది. ఏమైనా పనిచేసి సంపాదించగలడా? అదేం వీలుకాదు. అతనికి డబ్బు ఖర్చుపెట్టడమే తెలుసు; అప్పుడుకూడా ఇంకొకరు అతని అదుపులేని ఖర్చులకి కాపలా కాయాలి.

ఒకానొకప్పుడు అతనికి పిత్రార్జితమైన ఆస్తి లభించింది. అతను తాగుడు, రంకుతనంలాంటి దురలవాటులతో దుర్వినియోగం చేసిన తరువాతకూడా వంశపారంపర్యంగా తన కుటుంబంతోనూ, నౌకరులతోనూ, జీవించడానికి కావలసిన ధనం అతని దగ్గర ఉండేది; అతను అదంతా పోగొట్టుకున్నాడు. అందుకు ఒకటే కారణం, అతని బలహీనత: పేరాశ!

అతనికి డబ్బంటే అత్యాశ; అందుకు కారణముంది.

పది సంవత్సరాలముందు అతని భార్య అతన్ని తిరస్కరించింది. తన భర్త చేస్తున్న వివేకంలేని ఖర్చులు, అతని మొండితనం తాళలేక అతన్ని విడిచి వెళ్ళిపోయింది.

ఆమె ఒక మంచి, చదువుకున్న అమ్మాయి. భర్త ఇల్లు వదలిపెట్టి వెళ్ళినప్పుడు ఆమె ఆడిపోసిన మాటలు ఇప్పుడు ఆ భర్త హృదయాన్ని పొడిచాయి:

"ఏం మనిషివయ్యా నువ్వు? అన్యుల సొమ్ముతో కులుకుతున్నావ్! నీ ధనం పెరగడం లేదు; ఇంకా చెప్పాలంటే అదికూడా, నీకు తెలియకుండా, కరిగిపోతోంది! చూడు, కొన్నిరోజుల్లో నువ్వు అన్నీ పోగొట్టుకొని బికారిలో ఊరులో తిరుగుతావ్!"

ఆమె అంత నిష్ఠూరంగా అతన్ని నిందించడానికి కారణం ఆమె ఎంత ప్రయత్నం చేసినా ఆ భర్తలో మార్పు రాకపోవడమే; అన్ని ప్రయత్నాలు చేసిన తరువాతనే ఆమె అతన్ని విడిచి వెళ్ళిపోయింది. తానొక భర్త అనే అహంకారంతో అతను ఆమె మొరలను అలాగే తోసిపారేసాడు.

"నీకేం తెలుసు? చూడు, నేనెలాగ ధనం వృద్ధిచేస్తానో?" అని అతను గప్పాలుగట్టాడు. అనుమానస్పదమైన బేరాలూ, పెట్టుబడులూ చేసి చివరకి నష్టబోయాడు.

ఇప్పుడు అతను తనలో గొణుక్కున్నాడు: 'అది నిజంగానే ఒక ధర్మపత్ని! అది చెప్పినదంతా ఎంత నిజం! ఊరిలో తిరగడమా? అది మాత్రం జరగదు!"

హాలులో ఒక నౌకరు తన మిత్రులకి చెప్తున్నాడు: "మన చిన్నదొరగారు దివాలా తీసుకున్నారు!"

అది విని ఆ ముసలి నౌకరు తలవంచుకున్నాడు.

** ** **

కొన్ని గంటల తరువాత, అర్ధ రాత్రిలో - ఇంకా తెల్లవారలేదు - యువకుడు మనసులో ఏదో నిర్ణయం చేసుకొని తన గదిలోనుంచి బయటికి నడిచాడు. ఇంట్లోనున్న నలుగురు నౌకరులు హాలులోనూ, వసారాలోనూస నిద్రపోతున్నారు.

యువకుడు ఇంకా మైకంలోనేవున్నాడు. చీకట్లో తడుముకుంటూ ద్వారం దగ్గరకి వచ్చేసరికి అతని కాలు జారింది. అప్పుడు ఆ ముసలి నౌకరు పరుగెత్తుకొనివచ్చి యజమానుడు చెయి పట్టుకొని "తమ్ముడూ, ఎక్కడకి వెళ్తున్నావ్?" అని అభిమానంతో అడిగాడు.

"నువ్వింకా నిద్ర పోలా?" అని యువకుడు అతన్ని ఎగతాళి చేసాడు. "ఈ ముసలితనంలో నీకు చావంటే భయంగా ఉందా? మరెందుకీ జాగరం?" అని అర్థంలేని నవ్వుతో ఇగిలించాడు; అతని గర్జన ఆ మౌనరాత్రిని చెదరగొట్టింది.

అలా నవ్వుతూ. యువకుడు కారు గరాజు ఇనుప తలుపులు తెరిచాడు; పెద్ద ధ్వనితో అవి తెరుచుకున్నాయి. అతను కారు డ్రైవరు సీటులో దూకి, ఇంజను స్టార్ట్ చేసి, కారుని రివర్సులో నడిపి, బయట రోడ్డు మధ్య ఆపాడు.

దీనమైన ఆ యువకుడు కారులో ప్రయాణం చెయ్యడంచూసి ముసలి నౌకరు నివ్వెరపోయాడు; కలవరపడుతూ కారువైపు పరుగెడుతూ, చిన్నదొరతో బతిమాలాడు: "ఇప్పుడు వద్దు బాబూ! కావాలంటే పగటివేళ వెళ్ళండి, బాబూ!"

"పగటివేళా?" యువకుడు నిట్టూర్పుతో జవాబు చెప్పాడు; అతను రాత్రీ, పగలు అనే భేదం మరిచిపోయి చాలాకాలమైంది. నవ్వుతూనే, కారు కిటికీనుంచి ఆ పెద్ద గృహాన్ని, తను పుట్టి పెరిగి, తల్లిదండ్రులతో నివసించిన ఆ ఇంటిని చూసాడు. రెప్పవాల్చకుండా కొన్నినిమిషాలు అతని చూపు ఆ మేడింటి మీద పడింది. ఇదే తను దాన్ని ఆఖరుసారిగా చూడడం అని గుర్తుచేసుకొని ఇంకొకసారి బాగా చూసుకున్నాడు. తరువాత కన్నులు మూసుకోని ముసలి నౌకరికి "ఇక వాళ్ళు వచ్చి మిమ్మల్ని వెళ్ళగొట్టడానికి ముందే మీరందరూ ఇల్లు ఖాళీ చేసేయండి!" అని అంటూనే తన షర్టు పాకెట్ నుంచి పర్సు బయటకి తీసాడు.

పర్సులోవున్న డబ్బు తనకెక్కువే అని యువనికి అనిపించింది; అసలు డబ్బే తనకి అనావశ్యమని అతను గుర్తుచేసుకున్నాడు.

"ఇదిగో, ఇది తీసుకో . . . ఇందులో ఏమున్నా నువ్వూ, అందరూ పంచుకోండి!" అని ఆ పర్సుని అతనిమీద విసిరాడు.

"తమ్ముడూ . . . " అని ఆ ముసలివాడు ఏడుస్తూ, తన రెండు చేతులూ పైకెత్తి ఏదో చెప్పడానికి ముందే ఆ కారు ధూళి రేపుతూ స్మశానంలో అంత్యకర్మలో మన్ను పోస్తున్నట్లు త్వరగా వెళ్ళిపోయింది.

ఆ కారు రోడ్డుమీద దూసుకుపోవడం చూసి ఆ ముసలి నౌకరకి అర్థమైనదంతా ఒకటే; ఆ కారు గురి అంతా చావులోనేవుంది. ఇక తను ఏడవక మరేం చేస్తాడు?

** ** **

హెడ్ లైట్లు అంధకారాన్ని చీల్చుకుంటూ, దారీ, తెన్నూ, గమ్యం ఏవీ లక్ష్యం చెయ్యక తనకిష్టం వచ్చినట్టు ఆ కారు ప్రయాణం చేస్తోంది.

యువకుడు కారుని త్వరగా నడిపాడు. అతని గమ్యం ఏదో దిక్కుమాలిన ప్రదేశం. అక్కడ శిథిలావస్థలో తన కారుని, తన శవాన్ని ఎవరూ కనుక్కోలేరు. ఇప్పుడు అతని తాపత్రయమంతా తన బ్రతుకు గురించి కాదు; చావు గురించే.

గత సంవత్సరం ఈ కారుని తోలుతూ ఒక కొండలమయమైన రోడ్డులో, ఒక ఇరుకైన మలుపులో, తటాలున, హెచ్చరిక లేకుండా ఒక ఘోరమైన అపాయం నుంచి చలాకీగా చాలామందిని తను కాపాడిన సంఘటన అతనికి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆ నాడు, కొంత సమయం తరువాత, ఒక మెట్ట భూమిలో నిలబడి, యువకుడు కింద పల్లంలో, బండరాళ్ళనూ, ఎదిగిన వృక్షాలనూ చూసాడు; కారులోని ప్రయాణికులు, ఒక్కరు తప్పకుండా, భగవంతుని దయవల్ల చచ్చి బతికామని గ్రహించి గడ్డకట్టిపోయారు. యువకుడు గురి తప్పి, క్షణాల్లో కారు దొర్లిపడి పల్లంలో పడివుంటే ఎటువంటి ఘోరానికి అందరూ బలియై వుంటారని తలచినమాత్రం కలవరపడ్డాడు. కాని ఇప్పుడు ఆ ఘోరాన్ని తను నిజంగా నెరవేర్చబోతున్నానని ఆనందిస్తున్నాడు. కారుని ఇంగా వేగంగా నడిపాడు. అతను ఇల్లు వదలిన కొన్ని గంటలలోనే ఆ కారు వందమైళ్ళకి పైగా ప్రయాణం చేసింది.

'టైము ఎంత?' అని యువకుడు తనలో తనే అడుక్కున్నాడు. ఇంటినుంచి బయలుదేరినప్పుడు అతను తన వాచీ మరిచిపోయాడు. కారులోని టైమరు పనిచెయ్యలేదు; దానికి రెండుమూడు రోజులుగా కీ ఇవ్వలేదు.

'ఎంత టైమైతే మాత్రం ఏమిటి?' అని గొణుక్కుంటూ యువకుడు కారుని ఇంకా వేగంగా నడిపాడు. శీతలమైన గాలులు బలంతో కారుని అన్ని దిశాల్లో బాదాయి; ఆ రాజబాటలోని పొడుగాటి చెట్లు అంతులేని వరుసగా కనిపించాయి.

కారుని అతను కుడిపక్క తిప్పగానే దిగంతంలో ఒక రేఖ కనిపించింది. ఆ రహదారిలో, దూరంలో, ఒక నల్లని మచ్చ; ఒక మనిషి తన రెండు చేతులూ పక్కవాటుగా చాచి ఆ వస్తున్న కారుని ఆపడానికి సిద్ధమైనట్లు కనిపించింది.

మనుషులకి ఎంత నమ్మకం! ఆ ఒంటరి మనిషికి ఈ కారు ఆపగలనని ఎంత పొగరు! 'నేను ఇప్పుడు ఆత్మహత్యకి సిద్ధంగా ఉన్నాను; ఇంకొక చావుగురించి నాకేం కలత?' అని యపకుడు గొణుక్కున్నాడు. 'ఈ మనిషెవ్వరో నా కారుముందు పడి చావల్సిందే! దీనికి ఏం పేరు? హత్య? ఇంతవరకూ నేనెవరినీ హత్యచెయ్యలేదు. కాని ఇప్పుడు నా చావుకి అడ్డమొచ్చేవారు - ఎవరైనా సరే - నాతోపాటు నా గమ్యంకి రావడానికి నాకు అభ్యంతరం లేదు!'

కళ్ళు బాగా తెరిచి చూడగా ఆ రాజబాటలో తను చూస్తున్న ఆశావాది ఒక ముసలమ్మ అని అతనికి తెలిసింది. ఆమె చావుకు తను కారణమౌతానా అనే బెంగ అతనికి లేదు. దుర్బలురాలైన ఒక స్త్రీ ఒంటరిగా ఆ రాజబాటలో ఒక చేతికట్టితో సైగచేస్తూ ఒక వేగమైన యంత్రాన్ని ఆపడానికి సిద్ధంగావుంది. ఆమె నమ్మకమంతా ఆ కారు నడిపే వ్యక్తిమీదే . . .

సరళమైన ఆమె నమ్మకాన్ని వమ్ముచేయడానికి అతనికి మనసు రాలేదు. అదీకాక, ఇప్పుడు ఆమె చావు వలన తనకేం లాభం? తను ఆత్మహత్య చేసుకోడం తప్పదు; ఈ ముసలమ్మ కోసం కారుని ఆపితే ఏం నష్టం? యువకుడు కోపంతో బ్రేకుమీద కాలువేసాడు; కారు తటాలున రోడ్డుమధ్య కులికి, చక్రాల ఈడ్పు వలన కొన్ని అడుగులు ప్రయాణం చేసి, చివరకి ముసలమ్మ సమీపంలో వచ్చి ఆగింది.

యువకుడు కారు కిటికీనుంచి తొంగిచూసి ఆమెను తిట్టడానికి ముందే ముసలమ్మ అతనికొక దండంపెట్టి, ఒక చెయితో తన వెనుకన దూరంలోవున్న ఒక గుడిశెని చూపి కన్నడంలో ఏమో చెప్పింది; అతను ఆమెను వింతగా చూడగానే అతనికి తన బాష తెలియదని గుర్తించి ఒక చెయితో కృంగించిన తన పొట్టను చూపించింది.

యువకుడు కారునుంచి బయటకి వచ్చాడు. ముసలమ్మ అతని చెయి పట్టుకొని గుడిశెకి దారితీసింది.

యువకుని వాటం, ఆకారం చూసి ముసలమ్మకి భయమేమీ కలగలేదు కాబోలు. అతనితో ఏదో బేరం చేస్తున్నట్టు తన చీర కొంగు అందుకొని తను జాగ్రత్తగా దాచిపెట్టిన ఒక రెండురూపాయలనోటుని తీసి - అది ఎనిమిది మడతలతో ఉంది - అతనికి

అందిస్తూ అతని దగ్గర ఏతో ఉపకారం కోరుతున్నట్టు అతని గడ్డాన్ని ప్రేమతో తాకింది. ఆమె చేష్ట యువనికి విడ్డూరంగా కనిపించింది; నవ్వాలనికూడా అనిపించింది.

"సరే, ఈ తమాషా ఏదో చూద్దాం!" అని అతను ఆ రెండు రూపాయలనోటుని పుచ్చుకున్నాడు.

'ఈ ముసలమ్మకి ఎంత వయస్సుంటుంది?' అని యువకుడు తనలో తనే అడుక్కున్నాడు. ఇంత వయస్సులో అతను ఎవరినీ ఇంతకుముందు చూసివుండలేదు. బాగా సెఅసిన కనురెప్పలు; దృఢమైన ఎముకలతో నిక్కబొడుచుకున్న దేహం; ఆమె నడకలో మంచి పట్టు ఉంది.

ముసలమ్మ ముందుగా తన చేతికట్టను ఆనుకుంటూ దారంతా భగవంతుని వేడుకుంటూ అప్పుడప్పుడు వెనక్కి తిరిగి యువకునితో మాటాడుతూ నడుస్తూంటే అతను ఆమెను వెంబడించాడు.

అక్కడ ఒక గుడిశెలో ఒక స్త్రీ ప్రసవవేదనలో బాధపడుతోంది. పక్కన ఏ మొగవాడూ లేడనే నమ్మకంతో తన రెండు కాళ్ళనూ యధాలాపంగా విడదీసి, నేలమీద బోర్లపడివుంది. ఆమె దేహంనుంచి బొట్టు బొట్టుగా రక్తమూ, నీరూ కారుతున్నాయి.

ముసలమ్మ తన్నెందుకు ఆ గుడిశెకి రమ్మని చెప్పిందని ఇప్పుడు అతనికి బోధపడింది: నిశ్చయంగా ఆ స్త్రీ ఆ ముసలమ్మ కూతురుగాని, మనవరాలుగాని కాదు; వారిద్దరి సంబాషణ వింటే ఇద్దరికీ ఎటువంటి రక్తసంబంధం లేదని తెలిసింది. యువనికి ముసలమ్మ వైఖరిలో బోధపడిన సారాంశం ఇంతే: ఈ మాత్రం సహాయం చెయ్యడానికి మనసు రాకపోతే మానవజీవితానికి ఏమైనా అర్ధముందా?

యువకుడూ, ముసలమ్మ ఆ స్త్రీని తమ చేతులతో పట్టుకొని కారుకి దారితీసారు. కొంత దూరం నడచిన తరువాత అదేం లాభంలేదని యువకుడు ఆ స్త్రీన్ని తన రెండు చేతులతో ఒక బిడ్డలాగ పుంజుకొని కారుదగ్గరకి నడిచాడు. ముసలమ్మ అతనికి ముందే కారుని చేరుకొని స్త్రీకి కారువెనుక సీటులో కూర్చోబెట్టడానికి సిద్ధం చేసింది. ఇక ఆసుపత్రి ఏ దిశలోవుందని తెలియక యువకుడు ఆలోచనలో పడ్డాడు.

అతని కలతని అర్థం చేసుకొని ముసలమ్మ తన చేతికట్టెని కారు వెనుకవైపు చూపింది.

యువకుడు మళ్ళీ ఆలోచించాడు: 'ఈ స్త్రీలకి సహాయం చెయ్యడంవలన నేను కారు దిక్కు మార్చినాకూడా, నా ఆత్మహత్య తలపుని నేను మానుకోలేదు.' కొంత సమయంముందు చావుకోసం ప్రయాణం చేసిన ఆ కారు ఇప్పుడు దిక్కు మార్చి, కొన్ని అడుగులు వెనక్కి తిరిగి వేగంగా ముందుకు దూకింది.

ఊరూ పేరూ తెలియని ఒక గవర్నమెంటు ఆసుపత్రిని ఆ కారు చేరుకున్నప్పుడు బాగా తెల్లవారైపోయింది.

యువకునికి తన అవస్థ తలుచుకుంటే విచిత్రంగావుంది. తను ఎదురుచూసినది చావు. కాని ఇప్పుడు చూడబోయేది ఒక కొత్త జన్మ! 'సరే, ఈ తమాషా ఏదో చూడవలసిందే!' అని అనుకుంటూ అతను కారుసీటులో నడుం వాల్చాడు. చాలా రోజులుగా విశ్రాంతి, భోజనం, నిశ్చలమైన మనస్సు లేకపోవడం వలన అతని దేహం బాగా అలిసిపోయింది; కన్నురెప్పలు మూసుకున్నాయి; ప్రాతఃకాల పిట్టల కూతలు అతనికి జోలపాటలు పాడాయి; అతనలాగే నిద్రపోయాడు.

గభీమని అతను లేచాడు; అదేం బిడ్డ ఏడ్పా లేక ముసలమ్మ పిలుస్తోందా? ముసలమ్మ కొత్తబిడ్డని చూడమని అతన్ని పిలిచింది. నిగనిగలాడే సూర్యకాంతిలో కన్నులు చిలికించుకుంటూ యువకుడు ఒక నూతన ప్రపంచం దర్శించాడు. అతని చెయిపట్టుకొని ముసలమ్మ ఆసుపత్రి ప్రవేశించింది. ప్రసూతిశాలలో నడుస్తూ, ప్రతీ మంచం దగ్గర ఒక పెద్ద పూల కుండీలాగ ఒక బడ్డను అతను గమనించాడు.

ముసలమ్మ బిడ్డను  దాని తల్లి రొమ్మునించి విడదీసి యువకునికి అప్పగించింది. ఆ బిడ్డను చూసి యువకుడు తనలో చెప్పుకున్నాడు: 'ఈ బిడ్డ లక్షాధిపతి కాదు. అంతమాత్రాన దీనికి ఈ ప్రపంచంలో జీనించడానికి అర్హత లేదా?' బిడ్డని తన మొహంకి తీసుకొని అతను ఆశీస్సులు చెప్పాంటే ముసలమ్మ ఇంకొకసారి అతనికి తన కృతజ్ఞత చెప్పుకుంది.

యవకుడు బిడ్డని ముసలమ్మకి అప్పగించి ఆసుపత్రి బయటకి వచ్చాడు. ఉన్నపాటున అతనికి ఏడవాలనిపించింది, కాని ఆపుకున్నాడు. అతనికి ఇప్పుడు

మంచి ఆకలి; చాలా రోజులుగా తనేమీ తినలేదని జ్ఞాపకం వచ్చింది. పాకెట్టునుంచి ఆ రెండురూపాయలనోటు - ఆ ముసలమ్మ ఇచ్చినది - బయటకి తీసి ఆసుపత్రి పక్కనవుండే కొట్టుకి వెళ్ళాడు. అతని ఆకలి కొంతసేపట్లో తీరింది. ఇక ఆ బిడ్డ జన్మదినం మనసులో పెట్టుకొని కొన్ని మిఠాయలు కొన్నాడు.

తిరిగి ప్రసూతిశాలకి వెళ్ళి అక్కడున్న లేడీ డాక్టరు, నర్సు, ముసలమ్మ, ఆ నూతన తల్లి - అందరికీ మిఠాయిలు పంచాడు. మిగిలిన చిల్లరతో ఆసుపత్ర ఎదుటవున్న టీ దుకాణంకి వెళ్ళాడు.

ఇప్పుడే మొట్టమొదటిసారి అతను సామాన్యులతో, వారిమధ్య కూర్చుండి, టీ తాగుతున్నాడు. వారందరి ముఖాలు బాగా గమనించాడు. ఆ సామాన్య ప్రజలు - ఆడవారూ, మగవారు - సంతోషంగానే ఉన్నారు.

'వీరందరిలో ఎవరూ లక్షాధిపతులు కారు!' ఆ తలపే అతనికి ఊరటగా ఉంది; అందువలనే వాళ్ళు సంతోషంగా ఉన్నారు కాబోలు!

గడచిన కొన్ని గంటలలో జరిగిన సంఘటనలలో తను కలుసుకున్న మనుషులు అతనికి జ్ఞాపకంలో వచ్చారు: ఆ మసలమ్మ; ఆమె పోషణలో ప్రసవించిన ఆ స్త్రీ; ఇక ఈ ప్రపంచంలో నమ్మకంతోనూ, విశ్వాసంతోనూ జీవించబోయే ఆ శిసువు; మానవజీవితమనేది ఎటువంటి సామాన్యమైన గ్రామీణుల, పామరుల మధ్య వెలుగుతోందని యువకుడు అర్థం చేసుకున్నాడు.

'ఇక నాకూ, వీళ్ళకి భేదం ఏమిటి?' అని అతను తనలో అడుక్కున్నాడు. అకస్మాత్తుగా, జీవితమనే ప్రవాహం తన్ను తన సొంతభూమినుంచి పెళ్ళగించి వేరే పరాయి భూమిలో నాటి ఒక కొత్త మనుగడకి దారి చూపిస్తున్నట్లు అతను భావించాడు.

టీ తాగి లేచినప్పుడు అతను ఎదుటవున్న తన కారుని చూసాడు. ఎవడో గ్రామస్తుడు కారుదగ్గర నిలబడి డ్రైవరు సీటులో తన్ను వెదుకుతున్నట్లు అతనికి అనిపించింది; ఇంతలో ఇంకొక మనిషి ఆ గ్రామస్తుని చేరుకొని తన చెయితో మన యువకుని చూపాడు.

'ఏమిటి సంగతి?' అని అనుకుంటూ యువకుడు త్వరగా తన కారుదగ్గరకి వెళ్ళాడు.

ఆ గ్రామస్తుడు - ఆ ఖాదీ వస్త్రాల మనిషి - కారుపక్కన నిలబడి కన్నడంలో ఏదో చెప్తున్నాడు. యువకునికి బాష అర్ధం కాలేదని తెలుసుకొని ఇంకొకతను అతనికి తమిళంలో చెప్పాడు:

"ఇతను నర్సాపురం - ఇక్కడనుంచి పదిమైళ్ళ దూరంలో ఉంది - వెళ్ళాలంటున్నాడు. ఒక పేషంటు - ఆవిడకి పొట్టలో ఆపరేషన్ అయింది - ప్రయాణం చెయ్యాలి. చాలా జాగ్రత్తగా ఊరు చేరాలి. ఎంత కావాలి?"

యువకునికి ఏమీ బోధపడలేదు; అతని ముఖంలో కలతని చూసి ఆ గ్రామస్తుడు వెంటనే కొన్ని పదిరూపాయల నోట్లని యువకుని చెయిలో పడేసి ఆసుపత్రిలోకి మాయమయ్యాడు.

కొంత సమయం తరువాత ఆ గ్రామస్తుడు, మరొక యువతి - అమెకే ఆపరేషన్ ఐంది - కారులో ప్రయాణంకి సిద్ధమైయ్యారు. ఆ కారు డ్రైవరు కారుని నిదానంగా, అతి బాగ్రత్తగా నడపడం చూసినవారికి ఆ కారు ఒక నూతన జీవితంలో అడుగుపెట్టిందని అర్ధమౌతుంది.

అది ఆ యువకునికి బోధపడి చాలా సేపయింది.

********

# ఛందస్సు మీరిన పద్యం

1

రామనాధన్ కి అంటీముట్టనట్టు కవిత్వంలోకూడా ఆసక్తి ఉంది.

అతను నూటయాభై రూపాయల జీతంతో ఒక టైపిస్టుగా పని చేస్తున్న చిన్న కంపెనీకి ఎటువంటి సాహిత్య సంబంధమూ లేదు. ఐతేనేం, కవిత్వం అతని హాబీ అని, అతని రచనలు వారావారం పత్రికలలో ప్రచురమవుతున్నాయి అనే కారణంవల్ల సహోద్యులకూ, అతని లాడ్జిలోని నివాసులకూ అతనంటే చాలా మర్యాద; వాళ్ళ మెచ్చుకోలు తప్ప ఎటువంటి బహుమానమూ, లాభమూ అతనికి లభించదు. ఆ మాటకి వస్తే, రామనాధన్ ఏ పని చేసినా బహుమానం. లాభం ఎదురుచూడడు. అతను బాగా చదువుకున్నవాడని, అతనికి కవిత్వంలో అభిలాష ఉందని వాళ్ళు చెప్పుకునేవారు; కొంతమందికి అతని అవివేక ప్రవర్తన చూసి అసూయ, అసహ్యం కూడా కలిగాయి.

రామనాధన్ కి ఇప్పుడు ముప్పైఐదు నిండాయి. అతని తల్లిదండ్రులు -వాళ్ళు వేరే ఊరులో ఉన్నారు- తమ అబ్బాయిని కలుసుకున్నప్పుడెల్లా తను పెళ్ళి చేసుకొని అందరిలాగ కాపురం చెయ్యాలని బతిమాలేవారు. కాని రామనాధన్ మొండిగా పెళ్ళికి ఒప్పుకోలేదు.

కొడుకు బ్రహ్మచర్యం అనుచరిస్కున్నాడని తల్లిదండ్రులు బాధపడ్డారు. కాని అతని మిత్రులు విన్న వదంతి ఇదే: రామనాదన్ ఎప్పుడూ ఆడపిల్లల్ని వేటాడుతున్నాడని!

కొన్ని రోజులముందు అతను నిర్లక్ష్యంగా ఒక పని చేసాడు: అర్ధరాత్రి వేళలో తను సినిమా టాకీసులో కలుసుకున్న ఒక యువతితో లాడ్జికి

తిరిగివచ్చాడు. తెల్లవారడానికిముందు, ఐదు గంటలప్పుడు, లాడ్జి డాబాపై యోగాభ్యాసం చేస్తున్న కృష్ణయ్యర్ రామనాధన్ గదినుండి ఒక యువతి వెలుబడడం చూసారు. అంతే, పరిమళగంధంలో సారాయి కలిపినట్లు ఈ సంగతి లాడ్జిలో గబగబగా వ్యాపించింది.

ఆ రోజు సాయంత్రం రామనాధన్ లాడ్జికి తిరిగివచ్చినప్పుడు కొందరు రామనాధన్ వెనుకనే నడుస్తూ అతని గదిలో దూరారు. రామనాధన్ మాత్రమే ఆ గదిలో కాపురముంటున్నాడు. అతనికే సొంత రేడియో, అల్మారా నిండా పుస్తకాలు ఉన్నాయి. కొందరు తరచుగా వచ్చి అతని రేడియోలో వినడం లేక పుస్తకాలు అప్పుతీసుకోవడం మామూలే. కాని ఆ రోజు ఐదుగురు ఒకేసారి గదిలోకి వస్తున్నారే అని రామనాధన్ తల తిప్పి చూడగా చాలామంది వరండాలో కూడా గుంపుగా కనిపించారు. 'ఆ యువతి' గురించి అన్నివిధాల ప్రశ్నలూ వాళ్ళు అడిగి ఒకరి తరువాత ఒకరు రామనాధన్ కి పాఠం నేర్పాలని పూనుకున్నారు. కాని రామనాధన్ ఏదీ పట్టించుకోలేదు. బట్టలు మార్చుకున్నతరువాత నిశ్చింతగా ఒక కుర్చీలో కూర్చొని ఇప్పుడుకూడా తన మనసులో ఆలపించే ఆ యవతి గురించి వాళ్ళకి చెప్పడం ప్రారంభించాడు: ఆమె ఉత్తరదేశంకి చెందిన మనిషని, తన బంధువులతో మద్రాసుకి వచ్చి ప్రస్తుతం దగ్గరలో ఒక బంగళాలో మకాం ఉందని చెప్పాడు. ఆ తరువాత ఆమెను లాడ్జికి తీసుకురావడానికి తను ఎంత గట్టిగా ప్రయత్నం చేసి ఆమెను ఒప్పించానని వివరించాడు. ఆఖరికి తను ఆమెకు యాభై రూపాయలు ఇచ్చిన సంగతి చెప్పి ఆమె అందచందాలు క్లుప్తంగా వర్ణించాడు.

తన దుర్నడత బాహాటంగా వెలుబడిన తరువాత రామనాధన్ తను చేసిన పనికి అనుతాపంతో క్షమాపణ కోరుతాడని వాళ్ళందరు ఎదురుచూసారు. కాని రామనాధన్ సాహసం, మొండితనం చూసి

వాళ్ళు అదిరిపడ్డారు. ఆఖరికి ఒకతను ముందుకు వచ్చి, రెండు చేతులూ జోడించి, బతిమాలాడు: "నాయనా, నీకు చెడిపోవాలనివుంటే నువ్వు ఏం చేసినా మేం అడ్డురాం. కాని ఒకే ఒక మనవి: ఆడపిల్లల్ని తీసుకువచ్చి ఈ లాడ్జిని సానికొంపగా మార్చవద్దు!."

రామనాధన్ సిగరెట్ కాలుస్తూ నెమ్మదిగా బదులు చెప్పాడు.

"మనందరం ఈ లాడ్జిలో ఉంటున్నాం అని మీరు ఒప్పుకుంటారా? మరి, నా వ్యక్తిగత వ్యవహారం గురించి మీరెందుకు చికాకు పడుతున్నారు? కావాలంటే లాడ్జి యజమాని వచ్చి నన్నడగనీ. ఇక మీరు వెళ్ళవచ్చు."

రామనాధన్ పొగరు చూసి ఇక అతనితోవాదించడం చేతకానిపని అని అర్థం చేసుకొని వాళ్ళు లాడ్జి యజమానితో ఫిర్యాదు చెయ్యడానికి వెళ్ళారు.

జరిగిన సంఘటనకి ముఖ్యకారకుడైన కృష్ణయ్యర్ వాళ్ళతో వెళ్ళలేదు. రామనాధన్ని చూస్తూ అలాగే నిలబడిపోయాడతను. రామనాధన్ చెప్పినది నిజమేనా? ఆశ్చర్యం, అపనమ్మిక ఒకేసారి అతన్ని కలవరపరిచాయి.

కొన్నిరోజులముందు జరిగిన ఒక సంఘటన - రామనాధన్ని అతని ముసలి తల్లి కళ్ళ నీళ్ళతో తన కొడుకుని పెళ్ళి చేసుకోమని బతిమాలడం - కృష్ణయ్యర్ గుర్తుచేసుకున్నాడు. కృష్ణయ్యర్ కి ఒక పక్క దుఃఖమూ. మరో పక్క పట్టరాని కోపమూ వచ్చాయి. ఎందుకిలా అబ్బాయి డబ్బు దూబరా చేస్తూ చెడ్డపేరూ, వ్యాదులూ తెచ్చిపెట్టుకోవాలి? అడగడానికి అతనికి చాలా ప్రశ్నలున్నాయి, కాని అతని నోటినించి వచ్చిన మొదటి వాక్యం ఇదే: "మిస్టర్ రామనాధన్, మీరు నిజంగానే దానికి యాభైరూపాయలు ఇచ్చేరా?" అయ్యర్ అడక్కుండా ఉండలేకపోయాడు.

అతనికి తెలుసు, యాభైరూపాయలంటే ఎంతో. ఎలాగో కష్టబడి, ప్రతీనెలా అతను సేవించి తన ఊరుకి పంపించే రొక్కమది. అందుకోసమే అయ్యర్ హోటల్లో భోజనం చెయ్యడం ఆపేసి ఒక స్టవ్ కొనుక్కుని ఇంట్లోనే వండుకుంటున్నారు. ఎవరైనా ఒక రాత్రి ముచ్చటకోసం యాభైరూపాయలు తగలపెడతారా?

"నా మాట విను. నన్ను తప్పు పట్టకు. నీ మంచికే చెప్తున్నాను," అని అయ్యర్ మందలించారు. "భవిష్యత్తులో నువ్వు తప్పకుండా నీ ప్రవర్తన గురించి విచారపడతావు. జనులెందరో రోజుకి ఐదు రూపాయలు, పది రూపాయలు కూడా లేకుండా కష్టబడుతున్నారు. నాకు తెలుసు - నీకూ ఆ అనుభవం ఉంది. మరెందుకు నువ్వు కష్టబడి సంపాదించిన డబ్బు ఇలా తగలపెట్టాలి?" కృష్ణయ్యర్ ఎడతెగకుండా అడుక్కుపోతుంటే, రామనాధన్ కుర్చీనుంచి లేచి, పక్కనే అల్మారిలో ఉన్న ఒక పత్రికని అయ్యరికి అందించి, ఇలా అన్నాడు: "మిస్టర్ అయ్యర్, అసలు సంగతేమిటో నా దృష్టిలో చూస్తే మీరు నేను చేసినది సరే అని ఒప్పుకుంటారు."

"వ్యభిచారం సరే అని ఎవరూ ఎప్పుడూ ఆమోదించరు. నేను చెప్పేదదే: నువ్వు స్త్రీలోలుడుగా ప్రవర్తించడం అనాచారం!" అని అంటూ, అయ్యర్ ముఖం మళ్ళించుకోని ఒక చిట్టిక ముక్కుపోడి పీల్చారు.

"ఎందుకలా నిలబడతారు? ఇలా కూర్చోండి!" అని రామనాధన్ అతన్ని అర్థించాడు. సిగరెట్ పొగ అయ్యర్ని తాకకుండా పక్కనే ఉన్న కిటికి ద్వారా బయటకి వదిలాడు.

అయ్యర్ ఏమీ అనకుండా నిలబడ్డారు. రామనాధన్ ఏదో ఆలోచనలోపడి కొంతసేపు సిగరెట్ కాల్చుతూనే ఉన్నాడు. ఆఖరికి

సిగరెట్ మొన ఏష్ట్రేలో నలిపేసి, మాట్లాడాడు: "మిస్టర్ అయ్యర్, మీకెప్పుడు పెళ్ళయింది?"

"అదెందుకు ఇప్పుడు?" అని అయ్యర్ చికాకుపడ్డారు.

"ప్లీజ్, చెప్పండి."

“నాకు పెళ్ళైనప్పుడు నా వయసు ఇరవైరెండు." అయ్యర్ దృష్టి ఆ పత్రికమీద పడింది. దాని పేరు *పరిశోధన.* "ఇదేదో కొత్తగా ఉందే?," అని అయ్యర్ తనలో తనే గొణుక్కున్నారు. పేజీలు తిప్పుతుండగా అతనికి రామనాధన్ రాసిన పద్యం - అది కలంతో సూచించబడి ఉంది - కనిపించగానే దాన్ని చదవడం ఆరంభించారు. అతనికి తమిళంతో ఎక్కువ పరిచయం లేదు. రామనాధన్ కి కవిత్వంలో ఆసక్తి ఉందని మాత్రం అయ్యర్ కి తెలుసు; కాని ఇదివరకూ అతను రామనాధన్ రచన ఏదీ చదవలేదు. పద్యం పేరు - *ప్రేమ వెల ఎంత?* - అని చదవగానే అయ్యర్ వచ్చిన నవ్వుని అణుచుకున్నారు. రామనాధన్ అతనికి చెప్తున్నాడు: "మీకు పెళ్ళైనప్పుడు ఇరవైరెండు. నాకిప్పుడు ముప్పైయైదు." అయ్యర్ వెంటనే ఉద్రేకంతో ఎడతెగకుండా తన ఆక్షేపణ తెలియపరిచారు: "ఏం మనిషివయ్యా నువ్వు? పది రోజులముందు మీ అమ్మగారు వచ్చి నిన్ను పెళ్ళి చేసుకోమని బతిమాలాడారు. ఆవిడ లాడ్జిలో ఉన్నవారిని కలుసుకొని నీకు పెళ్ళి గురించి బుద్ధి చెప్పమన్నారు. నీకు ముప్పైయైదు నిండడంతో ఈ కొంటె చేష్టలు సరే అని అంటున్నావా?"

"దయచేసి కొంచెం ఓపికపట్టండి. నా మాట వినండి," అన్నాడు రామనాధన్. "మీరు నన్ను ఇలా ఎడతెగకుండా వాయించుతూంటే నేనేం చేయను?"

"సరేలే, చెప్పు, నేను వింటున్నాను."

అయ్యర్ నిదానంగా పత్రిక పేజీలు తిప్పారు. రామనాధన్ ఒక పెద్ద పుస్తకం టేబులుమీద పెట్టి, ఒక కుర్చీని లాగి, అందులో, అయ్యర్ కి ఎదురుగా కూర్చొని మాట్లాడాడు.

"నన్నడిగితే నూటయాభై రూపాయల జీతంతో బ్రతికే ఒక యువకుడు పెళ్ళికి బదులు ఆత్మహత్య చేసుకోవడం మంచిదంటాను. నాకు తెలుసు, ఈ లాడ్జిలో నలుగురు ఒకే గదిలో ఉంటున్నారు. అటువంటి జీవితం ఊహించడం కూడ నాకు చేతకాదు. నాకు గది పూర్తిగా కావాలి. రేడియో, చాలా పుస్తకాలూ కావాలి. ఇంకా ఎన్నో కావాలని నాకు మనసులో ఉంది. ప్రస్తుతం ఈ జీవితం అన్ని విధాలా నాకు అనుకూలంగా ఉంది. మరి ఇది వదిలేసి, పెళ్ళి చేసుకొని, ఏ కొంపలోనో ఎందుకు కష్టపడాలి? భార్యాపిల్లల్ని ఎందుకు పేదరికంలో, రోగాల్లో ముంచాలి?"

"మరి తరతరాలుగా జనులు అలాగే జీవిస్తున్నారుగా?" అన్నారు అయ్యర్ పత్రికనుంచి ముఖం తిప్పకుండా.

"అవును నిజమే. కాని నేను దానికి పూర్తిగా విరోధం. కుక్కలూ, పందెలుకూడా కుటుంబాలతో కాలం గడుపుతున్నాయి. మరి మనుషులు వేరే జీవితం ఆశించవద్దా? పెళ్ళి చేసుకుంటే నేను నా భార్య జీవితం పాడుచేసేసి నరకంలో దూకడంతో సమానం. ఇదంతా తెలిసినతరువాత నేను ఎందుకు ఆ సంకెళ్ళలో చిక్కాలి చెప్పండి! ప్రస్తుతం మన గవర్ణమెంటు కుటుంబ నియంత్రణ ప్రచారం చేస్తున్నారు. నన్నడిగితే వాళ్ళు వివాహ నియంత్రణ చెయ్యాలంటాను. దంపదలు పిల్లలు లేకపోయినా భార్యాభర్తలుగా జీవితం గడపడానికి మన చట్టం అనుమతి ఇస్తోంది కదా? మరి పెళ్ళనే అనుబంధం లేకుండా వాళ్ళు ఎందుకు ఒకరినొకరు ప్రేమించకూడదు?"

"భలే, బాగుంది నీ వాదం! ఎందుకని? ఎవరికెది ఇష్టమో దానికి ఎవరూ అడ్డు రాకూడదు, అంతేకదా?" అని అయ్యర్ ఆక్షేపించారు. "నీ ఆదాయం పెళ్ళికి అడ్డుంగా ఉందన్నావు. ఐతే ఒక రాత్రి ముచ్చటకి యాభై రూపాయలు ఖర్చు చెయ్యడం సరే అంటావా?"

"మీరన్నది నిజమే. కాని నేను ఖర్చు చేసిన డబ్బు నన్నే బాధిస్తుంది; అది మరెవరికీ హాని చెయ్యలేదే? నేను వీలయినంతవరకూ నా ఉదార గుణం చూపించడానికి పూనుకున్నాను. నేను మరేం వదులుకోడానికి ఒప్పుకోను. మా సంబంధంలో మేమిద్దరం పంచుకున్నది సుఖం మాత్రమే. కాని దంపదులుగా కాపురం చేస్తే మేం వేరువేరు వ్యక్తులుగా కష్టపడతాం. జీవితాన్ని కొంచెం తేటపరుచుకుంటే తప్పా?"

"తప్పా, తప్పున్నరా? అదేం రంకు జీవితం వువ్వు చెప్పేది? భార్యాభర్తలంటే సుఖదుఃఖాలు పంచుకొని దాంపత్య సుఖం అనుభవించాలి అని అర్థం. ఐతే నువ్వు చెప్పే నంబంధం దానికి పూర్తిగా విరుద్ధం. ఎటువంటి నీతీ, శీలం ఎరుగని జంతువుల్లాగ మెలగడమే గొప్ప అని నీవంటున్నావు. ఎంత అనర్థం! ఎటువంటి వక్రబుద్ధి!" అయ్యర్ అసంహ్యంగా రామనాధన్ ని వెక్కిరించుతున్నట్లు పళ్ళు బిగించి చూపారు.

రామనాధన్ కూడా అదే చేష్టతో అయ్యర్ కి బదులు చెప్పాడు: "సరేలెండి, దంపతులు జీవితం అనుభవించాలంటే ఇద్దరూకలిసి కష్టాలు కల్పించుకొని బాధపడాలన్నమాట!" అంటూ ఒక సిగరెట్ వెలిగించాడు.

"నేన్నది అది కాదు. మానవ జీవితానికి ఒక న్యాయమూ, ధర్మమూ కావాలని అంటున్నాను. దానికి 'ఒక మగవాడికి ఒక స్త్రీ',

అనే నియమం ఆధారం. ఆ పునాదిని పెళ్ళగించడానికి ఎవరైనా పూనుకుంటే అది ఒక వ్యాధిలాగ సమాజాన్ని అక్రమించి నాశనం చెయ్యక తప్పదు. మనం దాన్ని ఘాటుగా ఖండించాలి. ఇందులో మరేం న్యాయం ఉంది?"

రామనాధన్ అయ్యర్ లాగ ఆవేశపడకుండా, తను చెప్పదలచుకున్నదేమో ఏకబిగువగా వాయించకుండా, నెమ్మదిగా, ఓర్పుతో బదులు చెప్పాడు; అయ్యర్ వాదంలోని అన్ని అంశాలు తను అరుసుకున్న నమ్మకంతో మాట్లాడాడు. సమకాలిన సామాజిక ఆచారాల్లో అతనికున్న అసహ్యం ఊడిపడడంతో రామనాధన్ మాటల్లో కటోక్తి కలిసివచ్చింది. "మీకు షాజహాన్ తన భార్య స్మారక చిహ్నంగా కట్టిన తాజ్ మహల్ గుర్తుందా? ఆ చక్రవర్తి తన పెళ్ళి గురించి గొప్పగా చెప్పుకుంటే దానికేమైనా ఆర్ధముంది. కాని సాధారణ జనుల కుటుంబాల్లో మనం చూసేదేమిటి? ఒక భర్త తన భార్య కోరే నిత్యజీవితావసర వస్తువులు - ఒక చీర, ముక్కుపొడుక - ఇవ్వాలంటేకూడా గిజగిజలాడుతున్నాడు. ఆ దంపదుల దిక్కుమాలిన జీవితంలో ప్రేమ, ఒద్దిక అంటే ఏమైనా అర్ధముందా? అందరూ గొప్పగా పొగడే మానవ కుటుంబం అనే నిబంధనలో ఒక మోసం ఉంది. అందువలనే వ్యభిచారం ఒక వృత్తిగా పెరిగిపోయింది. తరతరాలుగా మనం గర్వంతో మెచ్చుకొనే నాగరికతే పడుపు వృత్తికి మూలకారణం. ఇక, కావాలనే సామాజిక ఆచారాలు లెక్కచేయకుండా వ్యభిచరించేవారిగురించి చెప్పాలంటే వాళ్ళకి మరేం గత్యంతరం లేదు. వాళ్ళ మనసులో నిత్యమూ పోరాటమే; తమ ప్రస్తుత కుటుంబగౌరవానికి ఏ హాని రాకూడదు; కాని ఇతర స్త్రీలతో లైంగిక సంపర్కం కావాలి. అదే వారి సమస్య. మీరు మానవ నీతీ, నియమం గురించి చెప్పారు. అది వింటే నాకు నవ్వు వస్తోంది. ఆ నియమం

సంఘంలో అందరికీ చెందాలి; ఒక వ్యక్తికి మాత్రం కాదు. మీరు 'ఒక మగవాడికి ఒక స్త్రీ', అనే నియమం ఉందన్నారు. మరి ఆ ఒక మగవాడు తన భార్యకి నిత్యజీవితావసర వస్తువులు ఇవ్వలేక తంటాపడుతుంటే మీరు చెప్పే నియమం అమలుపరచడం ఎలాగ?" 'ఒక మగవాడికి ఒక స్త్రీ', అనే వాక్యం మళ్ళీ తనలోతనే చెప్పుకొని రామనాథన్ నవ్వాడు. ఆ నవ్వు మౌనంగా ఆరంభించి చివరికి అందరికీ వినబడేలాగ ఏక ధ్వనిగా మారడంతో అతను తన వివరణ ముగించాడు: "నాలాంటి మగవాళ్ళు చాలామంది ఉన్నారు. వేశ్యలు కూడా చాలామంది ఉన్నారు. మీరు చెప్పే నియమం 'ఒక మగవాడికి ఒక స్త్రీ' సరే అని నేను ఒప్పుకోవలసిందే!"

"విను, మనం నీ ప్రవర్తన గురించి మాట్లాడుతున్నాం. అందుకే నువ్వు 'కుటుంబం' అనే పదం వాడడమే నాకు అసహ్యంగా ఉంది."

ఆయ్యర్ చేతిలోని పత్రికలో రామనాథన్ రాసిన పద్యం *ప్రేమకి వెల ఎంత?* చదవడం మొదలుబెట్టారు. రామనాథన్ ఏమీ అనకుండా అయ్యరు ముఖాన్నే చూస్తూ నిలబడ్డాడు. అయ్యర్ చదువుతూ పోతూంటే మొదట అతని ముఖం చిరచిరలాడింది. తరువాత అందులో క్రమంగా జుగుప్స, ఏవగింపు కనిపించాయి. అయ్యర్ ద్వేషం రామనాథన్ మీదనుంచి ఆ పద్యం ప్రచురించిన సంపాదకునిమీద పడింది. ఎందుకని? రామనాథన్ ఒక గొప్ప కవి అని పొగడిన తరువాత ఆ సంపాదకుడు *ప్రేమకి వెల ఎంత? లాంటి పద్యాలు ఇంకా పంపమని పాఠకులకు మనవి చేసుకున్నాడనే కారణంవలనే.*

*"నీ పద్యం నీలాగే ఉందయ్యా!" అని అయ్యర్ హేళన చేసారు. "నీ ప్రవర్తన సామాజిక ఆచారాలకి విరుద్ధం; నీ పద్యం కూడా అలాగే ఉంది! ఇందులో ఎటువంటి చందస్సూ నియమాలూ లేవు!" పత్రికని టేబులుమీద పడేసి అతను కుర్చీనుండి లేచారు.*

*"ఏం చందస్సు? నాకు చందస్సు తెలియదే!"*

*" చందస్సు తెలియదంటే మరెందుకు పద్యాలు రాయాలి?*

*"నాకు పద్యం రాయడం తెలుసుగా?"*

*"నీకేం మత్తెక్కిందా?* పద్యం *రాస్తున్నట్టు నువ్వు నిన్నే మోసగించుకుంటున్నావు!"*

*"అవునులెండి. ప్రేమ, దాంపత్యం, కళ, మన సంప్రదాయాలు, ఆచారాలు - ఇవన్నీ ఎందుకు? జనుల్ని మోసం చేయడానికేకదా?"* రామనాధన్ కిటికీదగ్గర నిలబడి మెల్లిగా మాట్లాడాడు, కాని అయ్యర్ చెవులకి అతని మాటలు స్పష్టంగా వినిపించాయి.

'ఇదంతా పిచ్చి పాండిత్యం!' అని *అయ్యర్ తనలోనే గొణుక్కున్నారు. 'అందువలనే అబ్బాయి ఇలాగ చెడ్డాడు!'*

*అతనికి* రామనాధన్ *మీద జాలి కలిగింది.* రామనాధన్ తల్లి - ఆ రోజు తన ముప్పైఐదేళ్ళ కొడుకు బుగ్గలు వాంఛతో పట్టుకొని "నాయనా, నీకు ఏ పిల్ల ఇష్టమో చెప్పు, దాన్నే పెళ్ళిచేసుకో," అని బతిమాలిన దృశ్యం అయ్యర్ గుర్తు చేసుకున్నారు. మౌనంగా, రామనాధన్ భుజం తాకి అతను మాట్లాడారు:

"మిస్టర్ రామనాధన్. మిమ్మల్ని చూస్తే నాకు చాలా బాధగా ఉంది. ఆ రోజు మీ అమ్మగారు నాకు హెచ్చరిక చేసారు, మీ మనసుని నేను ఎన్నడూ మార్చలేనని. అలాగే కానీ. ఒకే ఒక సంగతి నేను మీకు చెప్పితీరాలి. వినండి. మీకు కవిత్వంలో ఆసక్తి ఉంది. ఉన్నతమైన భావాలు, ఆదర్శజీవుల తలంపులు మీరు మీ రచనలో కూర్చారు. కాని వేశ్యలకు అవన్నీ కటువు. మీ జీవితంలో, కవిత్వంలో మీరు కొన్ని నియమాలూ, నిబంధనలూ అనుసరించి ఉంటారు; కాని వేశ్యలకి వేరే నియమాలూ, నిబంధనలూ ఉన్నాయి. వాళ్ళ ఆశయమంతా మీ డబ్బు దోచుకోవాలనే! వాళ్ళముందు కుబేరుడైనాసరే - డబ్బు లేకుండా

- వస్తే అతన్ని బయటకి వెళ్ళగొట్టారు. ఇది మీకు అర్ధమైతే వాళ్ళ మోసం బోధపడుతుంది. మీరు మర్యాదస్తులు, బాగా చదువుకున్నవారు. బాగా ఆలోచించి ఏం చెయ్యాలో నిర్ణయించండి." ఇంకా ఏమేమో చెప్పాలని అయ్యర్ కి తోచింది. 'సరే, ఇది చాలు,' అని మనసులో చెప్పుకొని అతను రామనాధన్ దగ్గర సెలవు పుచ్చుకొని గదినుండి వెలుబడ్డారు.

రామనాధన్ టేబులుమీదున్న పత్రికని తీసి, పేజీలు తిరగేసి, తన రచన చూసి 'చందస్సు మీరిన పద్యం' అని తనలో గొణుక్కున్నాడు.

"పద్యం అంటే వ్యాకరణశుద్ధి తప్పక ఉండి తీరాలా? అదేం అంత ముఖ్యమా?" అని రామనాధన్ తన్నే అడుక్కున్నాడు.

## 2

ఆ రోజు సాయంకాలం ఆఫీసునుంచి తిరిగివచ్చే దారిలో, రామనాధన్ ఒక బస్ స్టాప్ పక్కనేవున్న బుక్ షాప్ లో కడపాటి *పరిశోధన* పత్రిక చూసాడు. వెంటనే ఒక సంచిక కొని పేజీలు తిరగవేసాడు. "చందా ఐపోయింది, మళ్ళీకట్టాలి," అని అనుకుంటూంటే ఆ సంచికలో ఎవడో పాఠకుడు తన పద్యం గురించి విమర్శించిన ప్రత్యుత్తరం కనిపించింది. అక్కడే, రోడుమధ్యనే నిలబడి రామనాధన్ దాన్ని చదవడం ఆరంభించాడు.

రామనాధన్ పద్యంని ఘాటుగా ఖండించే ధోరణలో రాయబడిన ప్రతిస్పందన అది. "ఆధునిక కవిత్వంలో నవీకరణ, కొత్తమార్పులు అనే వంకలో *'ప్రేమ వెల ఎంత?' లాంటి రచనలు మన సమాజంకి హాని చేస్తున్నాయి," అని ఆ పాఠకుని వాదం. రచయితని హేళన చేసినతరువాత ఆ వ్యాసం అదే తీరులో ఇలాగ కొనసాగింది:*

*"గత వార సంచికలో ఒక రచయిత షాజహాన్ తన భార్య జ్ఞాపకార్ధంగా కట్టిన ఆ ప్రసిద్ధ తాజ్ మహల్ని ఒక భోగప్రియుడు తన*

*ఉంపుడుగత్తెకిచ్చిన బహుమానంతో పోల్చి రాసారు. ఇది మహాపాపం. దీన్ని తమిళులు ఎన్నటికీ క్షమించరు. ఈ అశ్లీల పద్యం (అసలు దీనికి కవిత్వంతో ఏమైనా సంబంధం ఉందా అన్న విషయం ఇంకొక సమయంలో మనం విమర్శించుదాం) ఎటువంటి వ్యాకరణ నిబంధన అనుసరించినట్టులేదు. చందస్సు, నిర్మాణక్రమం, ప్రమేయం అనే పరిమాణాలేవీ ఇందులో కనిపించవు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది పద్యం కాదు, వెర్రికూతల కలగాపులగం. తమిళులకు - పామరులకూ పండితులకూ - ఇది ఒక అపచారం. దీన్ని ప్రచురించడమేకాకుండా ఇదేదో నవీన తమిళ సాహిత్యంలో ఒక అపూర్వ సాధన అని పొగడే సంపాదకుడు తమిళుల అభిరుచిని అవమానించిన నేరానికి అర్హుడని చెప్పితీరాలి."*

*రామనాధన్ పెద్ద నవ్వు నవ్వాడు. గొంతుచించుకొని వచ్చిన నవ్వు అది. 'సమాజంని నేను హరం చేసేసాను,' అన్న గర్వంతోనూ, పక్కన ఎవరూలేరులే అనే భావంతోనూ కలిగిన స్పందన అది. ఆ నవ్వుకి ప్రతిధ్వని వినిపంచడంతో* రామనాధన్ తలతిప్పి చూసాడు. బస్ స్టాప్ చిహ్నం పక్కన ఒక యువతి తన్ను రెప్పవేయకుండా చూస్తూ నిలబడి ఉంది. ఆ చూపులోనే అతనికి అంతా బోధపడంది.

ఆమె కనుసైగతోనో లేక పెదిమల కదలికతో కలిసిన నవ్వుతోనో అతనికి తన ఉద్దేశం అందజేసింది. తన ఇచ్చను తెలిపి మెల్లగా అక్కడనుంచి జారుకుంది. రామనాధన్ ఆమెను నెమ్మదిగా వెంబడించాడు.

రామనాధన్ కి ముందు నడుస్తూ ఆమె సినిమారంగం వెనకనున్న ఒక సందులో ప్రవేశించి, రామనాధన్ తన్ను చేరేవరకు కాచుకొని నిలబడింది. సందులో అడుగుపెట్టినప్పుడు ఇద్దరూ అపరిచుతులుగానే

వెళ్ళారు కాని ఒకరినొకరు కలుసుకున్నతరువాత ఇద్దరూ జంటగా నడిచారు. ఆ చుట్టుపక్కలు చూసి రామనాధన్ ఆశ్చర్యపడ్డాడు: సినిమారంగం ప్రాంతంలో ఈ జనసమూహంలో ఒక ఏకాంత తోవ ఎలాగ ఏర్పడిందని. ఇటువంటి సందుగొందుల్లో తిరగడానికి అతనికి మొహమాటం లేకపోయినా తను ఇందకుముందు ఈ చుట్టుపక్కలు చూడలేదు అని రామనాధన్ గుర్తు చేసుకున్నాడు.

దారిలో వరుస వరుసగా గుడిసెలూ, సందు ముగింపులో పెంకులు కప్పిన ఇళ్ళూ కనిపించాయి. ఒక సాయిబు టీ షాపు, అంగడి చుట్టూ గుంపులు గుంపులుగా జనులు కూడి ఉన్నారు. వీధి చివరన ఒకావిడ ఫలాహారాలు అమ్ముతోంది; వాటి వాసన గాలిలో కలిసి వస్తోంది. కొందరు పిల్లకాయలు చెత్త, చెదారం కుప్పమీద నిలబడి దూరంలో, ఆకాశంలో గాలిపటాలు వదులుతున్నారు.

వీళ్ళందరినీ దాటి, యువతి, రామనాధన్ ఒక ఇంటిముందు ఆగారు. దాని ఎర్ర ఇటుకుల గోడ చూస్తే తాపీవాళ్ళు ఎన్ని సంవత్సరాలముందు ఆ ఇంటిలో పనిచేసి ఉంటారా అనే అనుమానం రామనాధన్ కి కలిగింది. యువతి తన నడుంనుంచి తాళంచెవి తీసి తలుపు తెరవబోతుంటే ఇరుగుపొరుగులనుంచి కొందరు స్త్రీలు రామనాధన్ని, యువతిని చురుగ్గా చూడసాగారు. వాళ్ళ మనోభావాలు వాళ్ళ ముఖాల్లో తెలియకపోయినా, ఆ స్త్రీలు కనుసైగతో ఒకరికొకరు మాట్లాడుకున్నారు.

తలుపు తెరవగానే యవతి, తిరిగి చూసి, చిరునవ్వుతో రామనాధన్ని లోపలికి ఆహ్వానించింది. యవతితోపాటు ఇంటిలోకి అడుగుపెట్టిన తరువాతే అకస్మాత్తుగా ఒక సంగతి రామనాధన్ కి జ్ఞాపకం వచ్చింది.

ఆ మాసాంతక రోజుల్లో అతనిదగ్గర డబ్బేమీ ఎక్కువగా లేదు. కొన్ని రోజుల ముందు ఆ ఉత్తరదేశం స్త్రీకోసం ఎక్కువగా ఖర్చు చేయడంవలన ఇప్పుడు రామనాధన్ దగ్గర కొంచెం చిల్లర మాత్రమే ఉంది. అది అతని బస్ ప్రయాణంకి సరిపోతుంది.

కృష్ణయ్యరు మాటలు అతను గుర్తు చేసుకున్నాడు; మరెవరూ వివరించకుండానే ఆ మాటలకి అర్థం అతనికి తెలుసు: *'కుబేరుడైనాసరే - డబ్బు లేకుండా - వస్తే అతన్ని వాళ్ళు బయటకి వెళ్ళగొట్టారు'.*

అతని సంకోచం చూసి యువతి నోరువిప్పి ఆహ్వానించింది: "లోపలికి రండి."

"సారీ, నేను ఇల్లెక్కడ అని తెలుసుకోడానికే వచ్చాను," అని మెల్లిగా రామనాధన్ చెప్పాడు. "మనం ఇంకొకసారి కలుసుకుందాం."

ఏదో ఒకలాగ ఆమెకు రామనాధన్ ఏమంటున్నాడో బోధపడంది. ఐనా, నవ్వుతూ అడిగింది: " ఏం, ఇది మంచి ముహూర్తం కాదా?"

రామనాధన్ తత్తరపాటులో పడ్డాడు. కాని ఆమె దగ్గర ఏమీ దాచడానికి ఇష్టంలేక, నిర్మోహమాటంగా నిజం చెప్పాడు: "నా దగ్గర డబ్బు లేదు." అతని మాటలేమీ లెక్కచేయనట్లు ఆమె మాట్లాడింది: "సరే, ఇక్కడ బయట నిలబడీ అందరిముందూ ఎందుకీ వాగుడు? లోపల్కి వెళ్దాం రండి." యువతి ఇంట్లోకి ప్రవేశించగానే రామనాధన్ ఆమె వెనుక నడుస్తూంటే ఆమె గభీమని తిరిగి తొందరగా తలుపు మూసేసింది. తలుపుమీద ఆనుకొని, రెండు చేతులూ రొమ్ముమీద పెట్టుకొని గట్టిగా నవ్వింది. ఒక మోటుమనిషిలాగ, అరేపించుకున్న కోపంతో రామనాధన్ చొక్కాయిని గుంజుకొని అతన్ని ఎగతాళి చేసే ధ్వనిలో అరిచింది: "ఏం మనిషయ్యా నువ్వు? ఎంత సాహసం నీకు డబ్బు లేకుండా ఇక్కడికి రావడానికి? నువ్వేం గొప్ప ప్రేమికుడనుకున్నావా?"

రామనాధన్ కి ఆమె దొంగకోపమూ, మోటుతనమూ బాగా నచ్చాయి. ఆ రెండుగుణాలూ సహజంగా ఆమెలో కానవచ్చాయి. ఆమె ధోరణి, నిర్లక్ష్యభావం అతన్ని ఆకర్షించాయి. తన చొక్కాయిని బిగపట్టుకున్న యువతి చెయ్యిని తాకి రామనాధన్ ఆమెను ఓదార్చాడు. "నన్ను తప్పు పెట్టకు. నేనేం మతిలేనివాడుగా, అమాయకుడుగా ఇక్కడికి రాలేదు. ఇలాంటి ఛాన్సు నేను ఎన్నటికీ వదలిపెట్టను. ఆ అలవాటువలనే నా దగ్గర డబ్బు లేదనే సంగతి మరిచిపోయి ఇక్కడికి వచ్చేసాను. ఇప్పుడు నన్ను పోనియ్యి. తప్పకుండా నేను ఇంకోరోజు వస్తాను." రామనాధన్ తలుపు తెరవడానికి ప్రయత్నించాడు.

"ష్! . . . మరేం మాట్లాడవద్దు, . . . . , " అని యువతి రామనాధన్ని హెచ్చరించింది. "మరి నా పరువు ఏం కావాలి?" ఆమె ఏమంటుందో అతనికి అర్ధం కాలేదు.

"నీకేం బోధపడలేదా? ఈ వీధిలో ఉంటున్న ప్రతీ ఆడదీ నన్ను చూస్తోంది. నువ్వు ఇప్పుడు బయటకి వెళ్ళావంటే మనిద్దరిలో ఏదో జగడంవల్ల బేరం తప్పిందని అనుకుంటుంది. వాళ్ళందరూ నీ వెనక పడతారు - చవుకైన బేరం కావాలని. అది నిన్ను బాధిస్తుంది. నువ్వు కొంతసేపు ఇక్కడ ఉండి వెళ్ళవచ్చు." రామనాధన్ ఇంకా నిలబడడం చూసి ఆమె ఒక చాప నేలపై పరిచింది. "ఇంకా నిలబడతావేం, కూర్చో. దీనికేం డబ్బు ఇవ్వక్కరలేదు." రామనాధన్ కూర్చున్నాడు. యువతి పక్కనే ఒక తాడులో వేలాడుతున్న చీరని అందుకొని, ఒక ఇంటి ఆమె ధోరణిలో, "ఉండండి, ఇప్పుడే వస్తాను," అని అనుమతి కోరి ఒక గదిలోకి దూరి తలుపు మూసుకుంది.

సిగరెట్ పేకెట్ లో ఒకటే మిగిలింది. దాన్ని ఏష్ట్రేగా వాడుకోవడానికి చాపమీద ఉంచి, రామనాథన్ సిగరెట్ వెలిగించాడు. అప్పుడే అతను తన చుట్టుపక్కలు గమనించాడు.

ఇంటిలోకి ప్రవేశించిన వెంటనే తలవాకిటి వసారా వెనకటితట్టుకి వ్యాపించింది. దానిపక్కన ఉన్న జాగావే వచ్చిపోయేవారు కూడే స్థలం. అక్కడే, మిట్టా పల్లంగా ఉండే ఆ సిమెంటు నేలమీద ఇప్పుడు రామనాథన్ కూర్చొని ఉన్నాడు. అదీ, యువతి కొన్ని నిమిషాలముందు ప్రవేశించిన గది - ఇల్లంటే అంతే. ఇంటి వెనుక ఉండే కాలువలోని మురుగునుంచే వచ్చే దుర్గంధం - ఆ మలినాలు కళ్ళకి కనిపించకపోయినా - అప్పుడప్పుడు పిల్ల గాలిలో కలిసి వచ్చింది. పెరడుకి దగ్గరగా కనపించే పెంకులు కాలక్రమంలో శిధిలమైపోయాయి. తరచుగా కురిసే వానలు గోడల్ని పాడు చేసేసాయి. పెరడులో, కాగితాలూ, చెత్తా చెదారం కాల్చడంతో ఆ పొగమసి చుట్టుపక్కల్ని కప్పేసింది. మొత్తానికి నేపధ్యం ఆధునిక చిత్రకళలో ఒక దృశ్యంలాగ కనిపిస్తోంది. ఆ గోడల్లోని అందవికారం చూస్తూంటే రామనాథన్ కి విధవిధమైన ఆకారాలూ, ముఖాలూ కనిపించి వెంటనే మాయమయ్యాయి. అవేం, ఇంతకు ముందు ఇక్రడ వచ్చినవారి ప్రతిబింబాలా?

రామనాథన్ దృశ్యాన్ని చూస్తూ ఆనందిస్తున్నాడు. గది తలుపు తెరచే ధ్వని వినగానే తలతిప్పి చూసాడు.

యువతి అతని ముందు వచ్చి, "కావాలంటే ఇవి చదవండి," అని కొన్ని తమిళ పత్రికలు ఆతని చేతికి అందించింది. రామనాథన్ ఆమె చిరునవ్వు చూసాడు; ఆమె చాచిన చెయ్యిలోని గాజుల గల గల ధ్వని

విన్నాడు. ఆమె దేహం తలుపు వెనుకన కమ్ముకొని ఉంది. తలుపు మళ్ళీ మూసుకుంది.

రామనాధన్ మౌనంగా పత్రికలు చదవసాగాడు. తను ఇప్పుడుండేది చాలా అలవాటుపడ్డ జాగాలాగ - ఎవరో మిత్రుడు, బంధువు ఇంట్లో ఉన్నట్టు - అతనికి అనిపించింది.

కొంచెం సేపు తరువాత వనిత తను తీసుకొని వెళ్ళిన చీర కట్టుకొని గదిలోనుంచి బయటకి వచ్చింది. ఒక స్తంభం పక్కన నిలబడి, చిరునవ్వుతో, లజ్జతో, రామనాధన్ని చూసి, "మీకు ఇంతకుముందు నన్ను చూసినట్టు గుర్తుందా?" అని అడిగింది.

రామనాధన్ కి ఒకటే ఆశ్చర్యం. ఈమెనా పది నిమిషాలముందు తన చొక్కాయిని పట్టుకొని బొబ్బలు పెట్టింది? ఆమె తన్ను ఇంటిలోకి ఆహ్వానించిన ధోరణి - ఒక పాత స్నేహితుడు, సహోద్యోగి లాగ - అతను ఇప్పుడు గుర్తు చేసుకున్నాడు. ఆమె చీర మార్చుకోవడానికి అనుమతి కోరినప్పుడు అందులో ఎంత ఒప్పు, ఎంత సొగసు! ఇప్పుడామె ఒక ఇల్లాలులాగ అతనిముందు కనిపించింది. ఇలాంటి మనిషిని అంచనా వేయడం ఎలాగ అని తెలియక రామనాధన్ కలవరపడ్డాడు.

జడ జుట్టు విప్పేసి భుజాలమీద పడిన తరువాత యువతి మాట్లాడింది: "నాకు మిమ్మల్ని బాగా తెలుసు. కొన్నిరోజులముందు మిమ్మల్ని సినిమా టాకీసులో చూసాను. మీ దృష్టికూడా నాపైనే ఉందని నాకు అనిపించింది. రెండుమూడుసార్లు గట్టిగా నవ్వాను కూడా, మీరు నన్ను చూస్తారేమో అని. తరువాతనే నాకు తెలిసింది, మీ మనసంతా ఆ ఉత్తరదేశ స్త్రీ మీద ఉందని. నేను మరేం చేయక ఊరుకున్నాను."

"ఓ, ఆ రోజా? నీకు ఆమె ఎవరో తెలుసా?"

"స్వయంగా తెలీదు. దానికీ ఈ ఊరే; చాలాసార్లు చూసివున్నాను."

"అదెలాగ? ఆమె తనుండేది బంబాయని చెప్పిందే!ఇక్కడ పక్కనే డాక్ బంగళాలో మకాం అని చెప్పిందే?"

యువతి తల వంచుకొని తనలో తనే నవ్వుకుంది, గొణుక్కుంది: "ఈ వృత్తిలో అందరూ వారంతటవారే మోసం చేసుకుంటున్నారు. మరి ఇతరులని మోసంచేస్తే అదేం పెద్ద తప్పా?" ఆమె మాటలు రామనాధన్ కి పూర్తిగా అర్ధమవకపోయినా ఆమె ఏమంటుందో అతను ఊహించగలిగాడు.

"మీరేమో అలవాటుమీద ఇక్కడకి వచ్చానన్నారు. మీరనడానికి ముందే మీకు ఇలాంటివి మామూలని నాకు తెలుసు."

"అవును, నిజం . . . నాకు నిన్ను చూస్తే బాధగావుంది . . . నువ్వు మళ్ళీ బయటకి వెళ్ళాలికదూ?" రామనాధన్ సిగరెట్ పీల్చుతూ అడిగాడు.

"ష్ . . . అదంతా మరచి పోండి . . . మీరు ఏదో అలవాటులో ఇక్కడికి వచ్చానన్నారు. నేనుకూడా అలవాటుప్రకారం మిమ్మల్ని ఇంట్లోకి రమ్మన్నాను. ఇవాళ నాకు బయటికి వెళ్ళడానికి ఇష్టం లేదు. ఈ వృత్తిలో ఒక ఆడది డబ్బు సంపాదించడానికి ఎటువంటి అవకాశం దొరికినా సరే, దాన్ని వదలిపెట్టదు. ఐనాకూడా ఇవాళ నేను ఎక్కడికీ వెళ్ళదలుచుకోలేదు. నా దగ్గర చాలా డబ్బు ఉంది . . . "

" డబ్బు చాలా . . .?" రామనాధన్ కి నవ్వొచ్చింది. తలెత్తి ఆమె ముఖం చూసాడు.

"చాలా అంటే వందలూ, నూరులూ కాదు. నాకెవరు ఇస్తారు అంత సొమ్ము? నిన్న ముప్పై రూపాయిలు దొరికాయి. నా ఖర్చుల తరువాత ఇప్పుడు నా దగ్గర ఇరవై రూపాయిలున్నాయి . . .

మీరెందుకు అడిగారు? . . మీకేం అప్పు కావాలా?. . . . నిజంగానే అడుగుతున్నాను, చెప్పండి! ఇదేం తమాషా కాదు . . ." రామనాధన్ కి ఆరంభంలో ఆమె ప్రశ్నించిన ధోరణి కొంటెతనంగా అనిపించినా ఆమె నిష్కళంకమైన మనసుతోనే అడుగుతోంది అని బోధపడింది.

తను నోరు విప్పి డబ్బు కావాలని అడిగితే ఆమె వెంటనే ఇస్తుంది అని రామనాధన్ అర్ధం చేసుకున్నాడు. ఒక చిరునవ్వుతో ఆమె మాటలు ఆమోదించి. సిగరెట్ని చాపమీద ఉన్న పేకెట్ లో నలిపి ఆర్పాడు.

"మీ దగ్గర ఎంత డబ్బుంది?"

"నువ్వింత సహజంగా ఆడుగుతున్నావు. నేనూ నిజం చెప్తున్నాను."

రామనాధన్ చొక్కాయి జేబులోనుంచి *పరిశోధన పత్రిక*, ఒక తాళంచెవి, చిల్లర నాణ్యాలు - సరిగ్గా పదిహేడు నయాపైసాలు - బయటకి తీసాడు.

"ఆదేంటి? తాళంచెవి . . . "

"నా రూము తాళంచెవి . . ."

"ఆలాగా? ఇవాళ పొద్దున్న కాఫీ తాగేరా?"

"లేదు. తాగాలనుకున్నాను . . . దానికి బదులు ఈ పత్రిక కొనేసాను."

"ఆవును, నేనూ చూసాను మీరు రోడ్డుమధ్య నిలబడి పిచ్చెక్కినట్టు నవ్వుకుంటున్నారు." అదేం పత్రికో చూద్దామని ఆమె దాన్ని అందుకుంది. కాని ఇంతలో ఏదో జ్ఞాపకం తెచ్చుకొని, పత్రికని చేతిలో పట్టుకొని, నడచి వెళ్ళి, తలుపు తెరిచి ఎవరినో పిలిచింది. ఆమె రామనాధన్ ఉన్న చోటుకి వచ్చినప్పుడు ఆమె వెనుక ఒక పన్నేండేళ్ళ చిన్నవాడు - ఒక ఖాకీ రంగులో లాగు మాత్రం తొడుక్కున్నాడు,

చొక్కాయి లేదు - వచ్చాడు. చీటికీ మాటికీ రామనాధన్ ముఖం చూస్తూ నిబడ్డాడు.

"వెళ్ళు . . . పరుగెత్తు . . . పక్కనే ఉన్న కాకా షాపుకి," . . . అని బాలకునికి ఆజ్ఞ ఇస్తూ యువతి రామనాధన్ పక్క తిరిగి ఆతని అనుమతి కోరినట్లు అడిగింది: "ఇక్కడ కాఫీ దొరకదు: టీ తెమ్మంటాను. సరేనా?" " వెళ్ళి రెండు స్ట్రాంగ్ ఛాయ్ కప్పులు - చాలా మీగడతో - తీసుకురా," అని చిన్నవాడికి చెప్పి, రామనాధన్ని మళ్ళీ అడిగింది: "మీకు చాయిలో స్పెషల్ మలాయ్ కావాలా?"

"అవును, తప్పకుండా!" అని రామనాధన్ బదులు చెప్పాడు. "నేనున్న పేటలో చాయ్ అలాగే అమ్ముతారు."

"ఓ, అలాగా?" అని నవ్వి రామనాధన్ని ఎగతాళి చేసే ధోరణిలో యువతి మాట్లాడింది: "ఇవాళ మన ఇంటికి వచ్చిన అతిధికి పెద్ద పెద్ద హోటళ్ళకే వెళ్ళడం అలవాటు కాబోలు . . . ఇవాళా రేపూ అన్ని టీ దుకాణ్ణాలో స్పెషల్ మలాయ్ చాయ్ మామూలే కదా?" పిల్లవాడిని చూసి, "ఇంకా నిలబడతావేం? వెళ్ళి టీ తీసుకురా . . . పిల్లవాడు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

"ఒక నిమిషం ఆగు . . . మీకు మరేమైనా కావాలా? . . . సిగరెట్లు ఐపోయాయా? " యువతి ఖాళీ పేకెట్టు చూపి అడిగింది.

"సిగరెట్లకి ఈ డబ్బు చాలదు . . . " అన్నాడు పిల్లవాడు.

"సగం పేకట్టు చాలు," అన్నాడు రామనాధన్.

"ఏం, ఎందుకు? పూర్తి పేకట్టు కొని తీసుకురా." యవతి పిల్లవాడికి ఇంకొక రూపాయి ఇచ్చింది.

పిల్లవాడు వెళ్ళగానే యువతి చాపమీద వేరే ఒక మూల కూర్చొని పరిశోధన పత్రిక పేజీలు తిరగవేసింది.

"ఇదేం పత్రికయ్యా?" అని విసుగ్గుంది. "బొమ్మలేం లేవుకదా, చదవడానికీ ఏదీ ముచ్చటగా లేదే? ఎవరైనా ఎనిమిదణాలు ఇచ్చి దీన్ని కొంటారా?"

"అలా అనకు. నీలాగా నాలాగా కొందరున్నారు, వాళ్ళు చదవడానికి ఇష్టపడతారు."

"నన్నెందుకు మీతో కల్పుతున్నారు? నేను ఇలాంటి పత్రికలకోసం నా డబ్బేం పాడుచెయ్యను. నాకు ఈ రెండు పత్రికలే ఇష్టం. ఇందులో ఒక సీరియల్ నవల చదువుతాను. ఏ సంచిక చదివినానరే 'దీని తరువాత ఏమౌతుందో?' అని ఆతురతతో ఎదురుచూస్తాను." ఆమె రెండు తమిళ పత్రికల పేర్లు రామనాధన్ కి చెప్పింది. ఆమె చూపిన పత్రికలమీద సరళ అన్న పేరు ఆంగ్ళ బాషలో అందమైన చేతివ్రాతలో కనిపించడంతో రామనాఘన్ "నీ పేరు సరళకదూ?" అని అడిగాడు. ఆమె అవునని తల ఊపి *పరిశోధన* పత్రిక పేజీలు తిరగవేస్తూ అందులో ఏముందో చదవడం ఆరంభించింది. కొన్ని నిమిషాలు ఎవరూ మాట్లాడలేదు. రామనాధన్ రెప్ప వేయకుండా ఆమెను చూస్తున్నాడు. ఆమె తలెత్తి చూడగాపే రామనాధన్ ఏమో అడగాలని నోరు విప్పి మాట్లాడాడు: "సరళా . . . నాకో సంగతి నిన్నడగాలని ఉంది . . . సరేనా?" అతను ప్రశ్నించడంతో సరళ అతని మనసులో ఏముందో గ్రహించింది. ఆమె ముఖం వెంటనే దుమదుమలాడసాగింది.

"ఏమీ అడగవద్దు! నాకు తెలుసు మీరేం అడగుతారని; నేనిలా ఇటువంటి స్తితికి వచ్చిచేరాను అనేకదా? ఇంతవరకూ నన్ను ఈ ప్రశ్న అడగని మగవాడిని నేను చూడలేదు. ప్రతీ మగవాడికీ అతని అభిరుచికి తగినట్టు నేను అబద్ధం ఆడితీరాలి! ఎందుకో తెలుసా? నామీద జాలి చూపించడమేకాక ఒక చోద్యమైన కథ వినాలి! చవటలు! మీరేం అడక్కండి, నేనూ అబద్దాలు చెప్పనక్కరలేదు!" సరళ రామనాధన్ని

బతిమాలుతున్నట్టు కనిపించినా ఆమె అనుభవించే ఉపద్రవం, వేదన స్పష్టంగా బయటకి వెలుబడ్డాయి. కాని అవి ఆమె ముఖంలో కొన్ని క్షణాలే మిగిలాయి.

"మరి నేనెవరో మీకు తెలుసుకదా? ఇదంతా ఉత్తి వ్యాపారం; సాదా వ్యాపారం. ఇందులో కలుసుకోడానికి ఇష్టం లేనివారు దూరంలో నిలబడి నన్ను తిట్టనీ, శపించనీ. కాని అన్నీ తెలిసి ఇక్కడకి వచ్చే మగాళ్ళు - నేనేం అమ్ముతానో అది కొనడానికి వచ్చిన మనుషులగురించి మాట్లాడుతున్నాను - ఎందుకీ కపటనాటకం ఆడాలి? వాళ్ళకెందుకు నామీద జాలీ, కనికరం?"

ఆమె మాటలు రామనాథన్ చెవులని ఉక్కు సుత్తితో కొట్టవచ్చినట్టు బాదాయి. కారణం - ఆతనుకూడా సరళ ఊహించినట్టే సంభాషణ మొదలుపెడదామనుకున్నాడు. కాని ఆమె వైఖరి ఇంత ఉగ్రంగా మారుతుందని అతను ఎదురుచూడలేదు.

"లేదు, లేదు . . . నేను ఆలాంటి ప్రశ్నలేవీ అడగదలచుకోలేదు, " అని రామనాథన్ ఆమెను ఓదార్చిన తరువాత హీనమైన స్వరంలో ఆడిగాడు: "సరళా, నీకు నా మీద ఎందుకు ఇంత ఆభిమానం, అతిధి మర్యాద అని నాకు అర్ధం కావడంలేదు . . . "

"ఎందుకా? నాకు మీరంటే ఇష్టం . . . " అని సరళ వెంటనే జవాబిచ్చింది. "నేను మిమ్మల్ని గౌరవనీయులు అని భావించి, ఇంట్లోకి ఆహ్వానించి ఆదరణ, మర్యాదా చూపిస్తే అది తప్పా? నేను ఏ పని చేసినా అది డబ్బుకోసమే చెయ్యాలి అని ఏమైనా నిబంధనవుందా? లేదు. ఈ క్షణం ఏ మగవాడైనా వంద రూపాయలతో ఇక్కడికి వచ్చినాసరే నేనతన్ని లెక్కచెయ్యను. అది నా ఇష్టం. డబ్బంట డబ్బు! ఎవరికి కావాలీ డబ్బు?" కోపమూ, చిరాకూ ఆమె మాటల్లో కలిసివచ్చాయి. ఆమె తల

వంచి చాపమీద కూర్చుంది. రామనాధన్ని చూస్తూ నెమ్మదిగా మాట్లాడింది. "అవును . . . ఆ మాటకు వస్తే అందరికీ డబ్బు కావాలి. కాని డబ్బుంటే అంతా సరిపోతుందా? అలాగైతే ఈ మగవాళ్ళు డబ్బుతో ఎందుకు ఇంటిపట్టున కూర్చోలేరు? ఇక్కడెంతుకు రావాలి? మరి, నా సంగతీ అదే కదా? నేనుకూడా నా డబ్బుతో ఏంకావాలో అది కొనుక్కుంటున్నాను. మరి 'డబ్బుకి లోకం దాసోహం' అని పెద్దలు ఎందుకు అన్నారు? అసలు సంగతి ఇది. నీకు కావలసింది నీ దగ్గర లేదు. నాకు కావాలన్నది నా దగ్గర లేదు. డబ్బుంటే అందరూ వాళ్ళకేంకావాలో అది కొనుక్కోవచ్చు. నేను చెప్పేది సరేనా?" సరళ అలా చెప్తూపోతుంటే రామనాధన్ సానుభూతితో ఆమె ముఖం చూస్తున్నాడు.

"మీరు అసలు డబ్బుతో ఇక్కడ వచ్చారనుకోండి; అప్పుడు నేను కూడా మీ దగ్గరనుంచి ఎలాగ డబ్బు ఊడబెరుకుదాం అని ఆలోచించేదాన్ని. ఇద్దరు కలుసుకొని కాలం గడపాలంటే అందులో ఒకరు డబ్బు ఖర్చుపెట్టాలి. ఇప్పుడు నాదగ్గర సొమ్ముంది. నేనివ్వకూడదా? చెప్పండి, మీకోసం నేను డబ్బు ఖర్చుపెట్టడం మీకు బాధగా ఉందా? అలాగైతే ఈ నిమిషం మీరు నిరాటకంగా బయటకి వెళ్ళవచ్చు! ఏమంటారు?"

"లేదు సరళా, అలాగేంకాదు . . . నాకూ నీ మీద ఆదరణ, మర్యాద ఉన్నాయి . . . " ఈ మాటలు చెప్తున్నప్పుడు రామనాధన్ కన్నులు తడిసిపోవడం చూసి సరళ దిగులు పడింది. అతని చెయ్యి లాగ్గొని బతిమాలింది: "నేనేం తప్పు చేసేనా? నా మాటలు విని మీరు నొచ్చుకున్నారా? నాకు మీమీద ఎటువంటి కోపమూ లేదు. ఇంతకుముందు జరిగిన సంఘటన గుర్తుకి రావడంతో నా మనసు ఏదోలా ఐపోయింది. నన్ను క్షమించండి . . . "

అప్పుడే టీ కొనితీసుకురావాలని బయటికి వెళ్ళిన చిన్నవాడు తిరిగి వచ్చి, ఇంట్లోకి ప్రవేశించడంతో సరళ, రామనాధన్ తమ తమ భావాలని అదుపుకి తెచ్చుకున్నారు.

పిల్లవాడు ఒక తట్టలో రెండు చాయ్ కప్పులు వాళ్ళముందు ఉంచి, రామనాధన్ కి ఒక సిగరెట్ పేకెట్, కొంచెం చిల్లర సొమ్ము అందించాడు. రామనాధన్ సిగరెట్ పేకెట్ తీసుకొని చిల్లర చాపమీద పెట్టాడు. పిల్లవాడు రామనాధన్ ముఖం చూస్తూ అక్కడే నిల్చున్నాడు.

"వాడికేమైనా టిప్ ఇవ్వండి," అని సరళ చెప్పగానే రామనాధన్ చిల్లరలోనుంచి 15 పైసాలు తీసి పిల్లవాడికి అందించాడు.

"ఎంత?" అని పిల్లవాడిని అడుగుతూ సరళ రామనాధన్ కి కనుసైగ చేసింది. "భలే, నీకివాళ మంచి అదృష్టం; ఇతనికి చాలా పెద్ద మనసు . . . ఇక వెళ్ళు, కప్పులకోసం మళ్ళీ రా!" అని చెప్పింది. పిల్లవాడు రామనాధన్ కి కృతజ్ఞత చెప్పి వెళ్ళాడు.

సరళ రామనాధన్ కి టీ కప్పు అందించింది. తరువాత తన కప్పులో తేలుతున్న మీగడని అతని కప్పులోకి మార్చింది,

"ఏం, నీకు మీగడంటే ఇష్టం లేదా?" అని రామనాధన్ అడిగాడు.

"మీకు నాకంటే ఇంకా ఎక్కువ ఇష్టంకదా?" అని సరళ నవ్వింది.

టీ తాగుతూనే సరళ అతన్ని అడిగింది. "మీరు నా పేరడిగారు. మరి మీ పేరు నేను తెలుసుకోవచ్చా?"

"రామనాధన్."

"మీరు లాడ్జులో ఉంటున్నారని చెప్పారు. మీకు ఇప్పుడు డబ్బుకి ఇబ్బంది అన్నారు. మరెందుకు ఈ దూబరదండి ఖర్చులు?"

"ఎవరన్నారు నేను వృధా ఖర్చులు చేస్తున్నానని?"

"ఎవరూ చెప్పనక్కరలేదు. నేను చూస్తున్నానుగా . . . మరి ఇప్పుడు డబ్బుకి ఇబ్బందంటే రాత్రి భోజనంకి ఏంచేస్తారు."

"అదేం పరవాలేదు. నేను ముందే అడ్వాన్స్ ఇచ్చేసాను."

"ఒక చిన్న మనవి. ఈరాత్రి మీరు నా గెస్టుగా ఇక్కడ భోజనం చెయ్యాలి. దయచేసి కాదనకండి. నేను చాలా బాగా వండుతాను." సరళ ఇంకా ఏమో చెప్పతలుచుకంది, కాని ఊరుకుంది. ఆమె అంతరాత్మలో తక్షణమే అగుపడిన ఒక ఆలోచనే ఆ మౌనంకి కారణం. ప్రతీ మనిషికి గతకాలం అని ఒకటి ఉంటుందికదా?

"ఇక ఇవాళ మీ రాత్రి భోజనం ఇక్కడే . . . చాలా రోజులయింది నేను వండి," అని అంటూ సరళ వంటింట్లోకి ప్రవేశించింది.

వసారాలో ఉన్న గిన్నెలు తీసి తోమడానికి సరళ సిద్ధమౌతుండగా రామనాధన్ స్తంభం దగ్గర నిలబడి ఆమెను అడిగాడు: "ఈ గిన్నెలు చూస్తే నువ్వు మామూలుగా ఎప్పుడూ వండుతున్నట్లు కనిపించదు. ఔనా?" అని అడిగాడు.

గిన్నెలు తోమడానికని సరళ బూడిదలో చింతపండు కలపడం ఆపి, తల ఎత్తి రామనాధన్ని చూసింది. "నాకోసం వండుకోడం నాకు అసహ్యంగా ఉంది. నా వంట రుచి చూసి నన్నుమెచ్చుకోడానికి ఎవరూ లేనప్పుడు నేనెందుకు వండాలి? ఆరణాలిచ్చి హోటల్లోనుంచి భోజనం తెమ్మంటే చాలదా? నేను వండి ఇంకోకరికి కంచంలో - కూర, పులుసు, పచ్చడి - ఇవన్నీ నా చెయ్యితో వడ్డించడంలోవున్న తృప్తికి మించి ఏమైవావుందా? కాని ఇవాళ మీవలన నాకు ఆ ఛాన్సు దొరికింది," అని చెప్పి నవ్వింది. ఆ నవ్వులో ఆమె తన మనసులోని బాధ దాచుకుంది.

గిన్నెలు తోమి, పొయ్యిలో నిప్పు ముట్టించిన తరువాత సరళ రామనాధన్ దగ్గరవచ్చి ఆతురతో అడిగింది: "మీకు ఇష్టమైనదేదో వండుతాను. మీకేం కావాలో చెప్తారా?"

రామనాధన్ సంకోచంతో ఏమీ చెప్పలేకపోయాడు.

"ఇదేంటి? నేనేమో ఉత్తికే మీతో ఏదో మాట్లాటదాం అంటే మీకు ఇష్టం లేనట్టుంది . . . మీకేం ఇష్టమో చెప్పరేం?"

" రాత్రులు నా భోజనం పులుసు, అప్పడం . . . అంతే . . . "

"ఓ, అలాగా? సరే, ఇవాళ మీ భోజనం - టమోటా పులుసు, అప్పడాలూ. వాటితోపాటు బంగాళదుంప ముక్కలు, చారు, పెరుగు . . . మీ ఎంపిక నాకు బాగా నచ్చింది."

సరళ ఒక కాగితంలో వంటకి కావలసినవన్నీ రాసినతరువాత తలుపు తెరిచి ఎవరినో పిలిచింది.

"అక్కయ్యా, ఇదుగో వస్తున్నాను," అని అంటూ ఆ ఖాకీ రంగు లాగు పిల్లవాడు సరళవెంట ఇంట్లోకి ప్రవేశించాడు. సరళ వాడికి ఒక సంచి అందించింది.

"వెళ్ళు, ఐదు నిమిషాలలో ఇవన్నీ కొని తీసుకురావాలి."

పిల్లవాడు సంచిని గుంజుకొని బయటకి పరుగెత్తాడు.

ఆ రాత్రి ఒక యువతి ఇల్లాలులాగ తన చేతులతో వడ్డించిన భోజనం రామనాధన్ అనుభవించాడు. వైవాహిక స్తితిలోని శ్రేష్టత్వం అతనికి కొంచెం అర్ధమైంది.

'సరేలే, అవన్నీ ఇప్పుడు ఆలోచించి ఏం లాభం?'

రామనాధన్ కి షాజహాన్ చక్రవర్తిమీద ఈర్ష్య ఇంకా ఎక్కువగా పెరిగింది.

'ఇలాంటి శాశ్వతమైన అనుభవాలకి నేను పెట్టిపుట్టలేదు,' అని రామనాధన్ తనలోతనే చెప్పుకున్నాడు. సరళ మనసుకూడా అదే గ్రహించింది.

ఆ రాత్రి వాళ్ళిద్దర అనుభవంలోని శోకాన్ని ఇద్దరూ తమ తమ హృదయాల్లో లోతుగా పాతుకున్నారు. అప్పుడప్పుడు పరస్పర భావాలను ఒకరికొకరు బహిరంగంగా పంచుకున్నారు.

ఆ మరునాడు తెల్లవారడానికిముందే రామనాధన్ సరళ దగ్గర సెలవు తీసుకొని బయలుదేరాడు. సరళ అతన్ని సాగనంపడానికి వచ్చి అతనితో తలుపుదగ్గర నిలబడింది. రామనాధన్ వీడ్కోలు చెప్పాడుకాని అతని నోటిలోనుంచి ఏ మాటా రాలేదు. తను కృతజ్ఞత తెలియజేస్తే ఆమె ఏమంటుందో అని ఆరాటం అతనికి కలిగింది. కాని గుమ్మం దాటడానికిముందు తల వంచి 'థాంక్సు!' అని అనేసాడు. సరళ అతని పక్కనే కొన్ని మెట్లమీద నిలబడివుంది. రామనాధన్ సిగ్గుపడడంచూసి ఆమె ఆప్యాయతతో అతని ఉంగరాలజుత్తుని లాలించుతూ సానుభూతితో మాట్లాడింది: "మీరెందుకు నాకు థాంక్సు చెప్పాలి? నాకే పెళ్ళైయుంటే నా భర్త దగ్గర డబ్బు అడిగేదాన్నా?" అతని ముఖాన్ని తన రెండు చేతులతో లాక్కొని సరళ బతిమాలింది.

"మనం మళ్ళీ కలుసుకుందాం," అని రామనాధన్ అన్నాడు. సరళ చేతులు ఇంకా రామనాధన్ ముఖంమీదే ఉన్నాయి.

ఆ ముందు సాయంకాలం సరళ చెప్పిన ఎత్తిపొడిచిన మాటలు ఇద్దరికీ గుర్తు వచ్చాయి: *"నువ్వేం గొప్ప ప్రేమికుడనుకుంటున్నావా?"* మరి ఇప్పుడు వాళ్ళ హృదయాలు ఏమంటున్నాయి? వాళ్ళ మనోభావం ఎలా ఉంది? దాన్ని ప్రేమ అని వర్ణించవచ్చా?

"ఛీ ఛీ, అలాగేం కాదు . . . " అని సరళ తనలో చెప్పుకుంది. ఆమె చేతులు ఇంకా రామనాధన్ ముఖంమీదే ఉన్నాయి. ఒక ప్రేమికుడు తన

ప్రియురాలికి మాట ఇచ్చే ధోరణిలో 'మళ్ళీ కలుసుకుందాం' అని రామనాధన్ పలికిన మాటలు ఆమెకు వినిపించాయి. గభీమని ఎగసిపడుతున్నట్టు సరళ మాట్లాడింది: "మనం మళ్ళీ కలుసుకుందాం అని మాట ఇవ్వడానికి మీకూ, నాకూ ఎటువంటి అగత్యమూ లేదు. నేను మీరెప్పుడు వస్తారని కాచుకొని ఉండాలా? నేను ఎవరికోసమూ కాచుకోదలుచుకోలేదు." సరళ కంట తడిపెట్టుకోవడంచూసి రామనాధన్ అల్లకల్లోలంలో పడ్డాడు.

సరళ ముఖం మళ్ళించుకొని మాట్లాడింది: "రేపటి సంగతి గురించి ఎందుకు ఆరాటం? మీరు మళ్ళీ నాకోసం వచ్చినప్పుడు నేనెవరితో ఉంటానో ఎవరికి తెలుసు? అంతేకాదు. నేనే కావాలని అడగడానికి మీకేం హక్కు ఉంది?" రామనాధన్ కి ఏం చెప్పాలో తెలియలేదు. ఇద్దరూ మాట్లాడకుండా నిలబడిపోయారు; వదిలి వెళ్ళిపోవడానికి ఇద్దరికీ ఇష్టం లేదు. అప్పుడే ఎదుట వరుసలో ఉన్న ఒక ఇంటినుండి ఒక యువతి బయటకి మచ్చి వసారాలో నిలబడింది.

"దాన్ని చూసారా?" అని సరళ రామనాధన్ని అడిగింది. "ఆమెను చూస్తే నిన్ననే తన్ను అలంకరించుకున్నట్టు కనిపిస్తోంది. ఆమె జుట్టులోని పువ్వులేవీ నలిగినట్టు కనిపించడం లేదు. అంటే ఈ రోజంతా ఆమె ఆకలితో నకనకలాడుతుందన్న మాట. ఇదే మా అందరి గ్రహచారం. ఆమె, ఆమె స్నేహితులు ఇక్కడ చాలా రోజులుగా ఉంటున్నారు. నేను ఈ పల్లెకి కొత్తగా రావడంవలన నేను వాళ్ళతో పోటీ పడుతున్నానని వాళ్ళకి నా మీద కోపం. నేనెవరితోనూ పోటీపడను. ఎలాగైతేనేం, మీరు తప్పకుండా మళ్ళీ రావాలి. నేను లేకపోతే దాని దగ్గర వెళ్ళండి. అంతే, సరేలెండి, మీకు సలహా ఇవ్వడానికి నేనెవ్వరు?" ఆ ఎదురింటి యువతి దుర్దశ చూసి సరళ చాలా నొచ్చుకున్నట్టు కనిపంచింది.

సరళ మరేం మాట్లాడడానికి ఇష్టం లేక  రామనాధన్ని చూసి, కొట్టవచ్చినట్టు "ఇక మీరు వెళ్ళవచ్చు," అని అంటూ దడీలుమని తలుపు మూసేసింది.  రామనాధన్ రెప్పలు ఆర్పకుండా మూసిన తలుపును కొన్ని నిమిషాలు చూసిన తరువాత మెట్లు దిగి సందు వీధిలో కాలుపెట్టాడు.

యిరుకైన తోవలో నడుస్తూ మెయిన్ రోడ్డు చేరడానికిముందు రామనాధన్ వెనక్కి తిరిగి చూసాడు. సరళ ఇంటిబయటకి వచ్చి తన్ను చూస్తూ నిలబడి ఉంది. చెయ్యి ఊపుతూ అతను ఆమెకు శుభాకాంక్షలు చెప్పాడు. సరళకూడా అలాగే బదులుగా తన శుభాకాంక్షలు వెల్లడించింది.

రామనాధన్ సరళ తన అంతర్గత భూతాలతో అవస్త పడుతోందని, ఆ పోరాటంలే ఓడిపోతోందని గ్రహించాడు.  చివరికి అతన్ని ఎక్కువగా బాధ పరచిన సంగతి సరళ తన ఎదురింటి యువతిని వర్ణించిన మాటలు - ఆమె అలంకారం, నలిగిపోని పుష్పాలు; అవి ఆమె ఆకలిని, అసహాయతని బహిరంగపరిచాయి. ఈ జ్ఞానం అతని హృదయంలో పొంచివున్న సత్యాన్ని బలపరచడంతో రామనాధన్ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.  రామనాధన్ అరచేతితో కళ్ళు తుడుచుకున్నాడు.

ఇక సరళ మాటకు వస్తే రామనాధన్ని వీడ్కోలు చెప్పిన ఆమె చెయ్యి క్రమంగా కుంగిపోవడంతో, ఆమె ఇంటిలోకి ప్రవేశించి, తలుపు మూసి, దానిమీద ఆనుకొని ఒక నిట్టూర్పు విడిచింది. మనసులో దుఃఖం మిగిలివున్నా ఆమె ముఖంలో  చిరునవ్వు కనిపించింది.

** ** **

రామనాధన్ లాడ్జిని చేరుకున్నప్పుడు  అతని మిత్రుడు కృష్ణయ్యర్ లాడ్జి డాబాపై  యోగాభ్యాసం చేస్తున్నారని తెలిసింది. వెంటనే అతన్ని కలుసుకొని, గొంతు చించుకొని  కేకలు పెట్టాలని రామనాధన్

అనుకున్నాడు. "మిస్టర్ అయ్యర్! మీకు జ్ఞాపకం ఉందా ఆ రోజు నాతో మీ వాదన? 'వేశ్యలకు వాళ్ళకని వేరే నియమాలూ, నిబంధనలూ ఉన్నాయి,' అని మీరు వక్కాణించి చెప్పారు. ఐతే దానికి వ్యతిరేకంగా నాకు తెలిసిన ఒక వేశ్య ఉంది." తన గదికి వెళ్ళడానికి బదులు రామనాథన్ ముందు డాబాకి పరుగెత్తాడు.

కాని అయ్యరుతో మాట్లాడానికి అతనికి అవకాశం దొరకలేదు. అయ్యరు అ సమయంలో శిరసాసనం చేస్తున్నారు. తలని నేలమీద ముంజేతులతో ఆనుకొని రెండు కాళ్ళూ మీదకి ఎత్తిన భంగిమలో అతను కనిపించారు. ఆ సమయంలో అతన్ని తొందర పెట్టవద్దని రామనాథన్ డాబాలో ఒక మూల తూర్పుదిశలోని ఆకాశాన్ని చూస్తూ నిలబడ్డాడు. ఇంకా కొంచెం సమయంలో ప్రాతఃకాలం పోయి పగలు రాబోతుంది. రాత్రి నిద్ర లేకపోయినా రామనాథన్ దేహమూ, మనసూ అల్లాడుతునే ఉన్నాయి.

అమె వేశ్య అనే నియమాన్ని అన్నివిధాలా కొట్టిపారేసింది. తన్నుపోలిన వర్గలోనుంచి ఎంత విరుద్ధమైన వ్యక్తిగా కనిపిస్తోంది! మరి తనో? కృష్ణయ్యర్ చెప్పినట్టు తను విటుడు మాత్రమా లేక ఇంకా అధ్వాన్నమా? అప్పుడప్పుడు సరళ మోటుతనం చూపినా ఆమె ఎంత అమరికతతో అతిధి మర్యాద చూపించింది! ఆమె విశాలభావాలూ, సానుభూతి చూస్తే . . . తను స్త్రీలోలుడుమాత్రం కాదు . . . ఆమెకు ఆప్పుపడ్డాడుకూడా . . . రామనాథన్ ఆత్మ విచారణలో తన్ను కఠినంగా నిందించుకున్నాడు: ఆమె ప్రవర్తనతో తన నడత పోల్చిచూస్తే, తనలోని చిన్నతనం ఎంత స్పష్టంగా కనబడుతోంది!

రామనాథన్ అంతరాత్మలో సరళ తన్ను పిసినారి అని ఏనాడూ భావించదు అనే నమ్మకం ఉంది. కాని అదే సమయంలో తను ఒక

నీచమైన విటుడని, సరళ ఒక గౌరవప్రదమైన వేశ్య అని ఆతను నిర్ణయించుకున్నాడు. ఒక మహత్తైన ఆకృతి కాళ్ళముందు తను అల్ప బుద్ధితో పాకుతున్నట్టు అతనికి తోచింది.

"దేవుడా! నా భంగపాటు నేనెందుకు ఇప్పుడు అయ్యరుకి ఎత్తిచూపాలి?" అని రామనాధన్ మనసు అతన్ని హెచ్చరించింది; రామనాధన్ వెనక్కాడాడు.

మరి అయ్యరు వాదన - 'కవిత్వంలాగే వేశ్యలందరూ ఒకే నియమానికి కట్టుబడి ఉంటారు,' అనే అతని మొండి అభిప్రాయం తను ఎదిరించవద్దా?

"అవును; తప్పక ఎదిరించాలి! కాని అతను నన్ను హేళన చెయ్యనివ్వకూడదు. ఇవాళ జరిగినదంతా వివరంగా చెప్పినతరువాతనే అతనేమంటారో చూడాలి. అతనికీ మంచి మనసుంది. ఇతరుల భావాలపై మర్యాద ఉంది. అతను కళ్ళు తడిపెట్టుకుంటారేమో, ఎవరికి తెలుసు? . . . ఇప్పుడు నేనేం చెయ్యాలి . . ఈ నెల పోనీ . . . మళ్ళీ జీతం వచ్చేవరకూ నేను కాచుకోవలసిందే! . . . "

"సరే, అలాగే చేద్దాం," అని తృప్తితో తల ఊపుతూ రామనాధన్ తన గదికి వెళ్ళాడు.

కృష్ణయ్యరుకి రామనాధన్ చేష్టలేవీ తెలియరాలేదు. అతను తన యోగాభ్యాసంలో మునిగిపోయివున్నారు.

అతను కసరత్తు ముగించడంతో చాలా గంటలతరువాత పగలు నిగనిగమని వికసించి నిత్యజీవితంలో మానవుల కీర్తి, అద్భుత కృత్యాలకు దారి చూపింది.

ఇంతమరకూ రామనాధన్ తన హృదయం ఏ స్త్రీకోసమూ కోల్పోలేదు. కాని ఇప్పుడు సరళ, ఆమె మంచి హృదయం, అతన్ని బాగా ఆకర్షించాయి. ఆ తరువాతి పదిరోజులూ అతని మనసులోని భావాలూ, కల్పనలూ అన్నీ సరళ గురించే.

ఆశ్చర్యకరంగా అతనికి తరువాతి జీతంలో బహుమానంగా ఎక్కువ ఆదాయం రావడంతో రామనాధన్ చేతికి మూడువందలు రూపాయలు అందాయి. ఈ అదనపు లాభంతో తను త్వరగా సరళని కలుసుకోవాలని అతను తొందరపడ్డాడు.

అవును. త్వరగా వెళ్ళి ఆమె ముఖం చూడాలి. ఈ సారి తను ఆమెను 'తాకడానికికూడా' ప్రయత్నించకూడదు. అవును, . తను కూడా ఒక విటుడనే నియమాన్ని దాటాలి; తన పాత దుర్బడతకి వ్యతిరేగంగా ప్రవర్తించాలి.

బజారు వీధిలో నడుస్తుంటే అతనికి లటుక్కున ఒక ఆలోచన కలిగింది. వెంటనే ఒక చీరల షాపు ప్రవేశించాడు. అరవై రూపాయలకి నీలరంగులో, సన్నని అంచుతో - సరళ చామన ఛాయికి తగినట్టుగా - ఒక చీర కొన్నాడు. షాపునుండి బయటకు వస్తూంటే అతనికి తన ప్రవర్తన చూసి నవ్వొచ్చింది. తన జీవితంలో ఏ రోజైనా ఒక ఆడదానికి తను చీర కొనడంగాని, ఒక ఆడది తన హృదయాన్ని ఆక్రమించుకుంటుందనిగాని రామనాధన్ కలలోకూడా ఊహించలేదు. అతనికి తన భావాలూ, అభిరుచులూ దాచుకునే అలవాటు లేదు. అందువలన ఇతరులు నవ్వి, ఎగతాళి చేస్తారేమో అన్న భయం ఎప్పుడూ లేదు. ఆ కారణంవలనే ఆ రోజు అతను సరళను బస్ స్టాండులో కలుసుకున్నాడు. ఇప్పుడతను ఉండేది అదే మానసికావస్థ; ఇంపైన భావాలు నెమరు వేస్తూ రామనాధన్ ముందుకు నడిచాడు.

"ఈ చీర చూసి ఆమె ఎంత ఆనందిస్తుంది! ఎవరికి తెలుసు, ఏదోలా మొహం పెడుతుందేమో? కాని సరళ ఏం చేసినా, ఏం చెప్పినా, బాగుంటుంది. ఆమె ఈ చీర ఇప్పుడే కట్టుకోవాలని నేను పట్టుబడతాను. సరళ వెంటనే త్వరగా తన గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంటుంది. అప్పుడు నేను ఆ ఖాకీ రంగు లాగు పిల్లవాడిని పిలిచి కాకా షాపునుంచి స్పెషల్ చాయి తెమ్మంటాను . . . "

"ఆ తరువాత నేను సరళకి మంచి హోటల్లో విందు ఏర్పాడు చేస్తాను. రకరకాల భోజన పదార్థాలు ఆమెకు పరిచయం చేస్తాను. ఆమె 'హోటలెందుకు, నేను ఇంట్లోనే వండుతాను', అని అంటుందేమో? అ రోజు ఆమె చేసిన టమోటా పులుసు అసలు మా అమ్మ చేసినట్టే ఉంది. సరళకి అతిథి మర్యాద ఎంత బాగా తెలుసు! ప్రతీ స్త్రీకి - తల్లికానీ, వేశ్య కానీ - లోలోపల పుత్రవాత్సల్యత ఉంటుందేమో? సరళలో ఆ గుణం బాగా కనిపిస్తోంది. ఈ సారి ఆమె 'నేను వండుతాను' అంటే నేను ఒప్పుకోను. 'నువ్వు ఇవాళ నా గెస్టు' అని నేరుగా చెప్తాను."

"రేపు ఉదయం మేమిద్దరం తృప్తిగా, నిర్మలమైన హృదయాలతో విడిపోవలసినప్పుడు సరళ నా మీద కోపంతో, "మీరెందుకు నా కోసం ఈ దూబరా ఖర్చులు చెయ్యాలి?" అని అడగవచ్చు. అప్పుడు నేనుకూడా ఆమెలాగే జాలి పుట్టించే కంఠధ్వనితో, "ఏం, నీ భర్త చీర, డబ్బు ఇస్తే నువ్వు వొద్దంటావా?" అని అడుగుతాను. దానితో ఆమె కోపం చల్లారుతుంది. నాకు తెలుసు. సరళకి ఏనాడూ నామీద కోపం రాదు ."
రామనాధన్ కలల్లో తేలుకుంటూ సరళ ఇల్లు చేరుకున్నాడు . . .

అక్కడ అతనికి నిరాశ కాచుకొని ఉంది. ఇంటి తలుపుమీద పెద్ద తాళం వేలాడుతోంది!

ఏం, ఎందుకు, ఏమైంది?

ఆ ఖాకీ రంగు లాగు పిల్లవాడు ఒక వాఖ్యంలో చెప్పాడు: "పోలీసులు వచ్చి అక్కయ్యను తీసుకుపోయారు . . . "

రామనాధన్ జీవితంలో ఇటువంటి ఆశాభంగం ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదు. అతను విచారంతో కన్నులలో గుమిగూడుతున్న నీళ్ళను ఆపుకోడానికి అవస్థపడ్డాడు. అక్కడే నిలబడి సరళకి జోహార్లు చెప్పాడు.

"అతన్ని ఇక్కడ రమ్మను," అని ఆ పిల్లవాడికి ఎవరో చెప్పడం విని రామనాధన్ తల తిప్పిచూసాడు. ఎదిరింటిలోని స్త్రీ మాటలవి. రామనాధన్ని చూసి ఆమె చిరునవ్వుతో తన ఇంటికి ఆహ్వానించింది.

రామనాధన్ సరళ ఆరోజు చెప్పిన మాటలు, "మనం మళ్ళీ కలుసుకుందాం అని మాట ఇవ్వడానికి మీకూ, నాకూ ఎటువంటి అగత్యమూ లేదు . . . మీరు తప్పకుండా మళ్ళీ రావాలి. నేను లేకపోతే దాని దగ్గర వెళ్ళండి, . . ." గుర్తుచేసుకుంటూ ఎదురింటికి వెళ్ళాడు.

అతను ఏమీ మాట్లాడపోవడంతో ఆ స్త్రీ మొదలుపెట్టింది: "మొన్ననే పోలీసులు వచ్చి సరళని తీసికెళ్ళారు. జరిగినదంతటికీ సరళే కారణం. దానివలనే సామాన్య జనులకుకూడా ఇక్కడ రావడమంటే పెద్ద గొడవైపోయింది. ఎది ఎలాగున్నా పోలీసంటే ఆమె మర్యాద చూపవద్దూ? మా అందరికీ పోలీసంటే గౌరవం, మర్యాదా ఉన్నాయి; ఎలాగో ఇలాగో సద్దుకొని పోతాం. కాని సరళ ఎప్పుడూ తను ఒక మహారాణీ అన్నట్టు తిరిగేది. అందువలనే పోలీసులు దానికి మంచి పాఠం నేర్పాలని ఇన్ని రోజులూ కాచుకొని ఆఖరికి అంత పనీ చేసేసారు. మీకు తెలుసా సరళ మొండితనం ? వాళ్ళు రమ్మని చెప్తుంటే ఆమె తిట్టడం ఆరంభించింది. అందువలనే దాన్ని బలాత్కారంగా తీసుకెళ్లారు; ఆఖరికి అందరు ముందూ సరళ నవ్వులపాలైపోయింది . . . "

"చాలు . . . అని రామనాధన్ ఆమెను ఆపాడు. మరేం అనకుండా చేతిలోని పెట్టెనుంచి చీర బయటకి తీసాడు.

"సరళగాని ఇప్పుడు ఉంటే నన్ను ఈ చీరతో నిన్ను చూడమని చెప్పివుండేది. ఇది నీకే . . . సరళకి మీరందరిమీద మంచి మనసు; నువ్వంటే జాలి. మరి నా గురించి చెప్పాలంటే, . . ." రామనాధన్ మరేం అనలేక ఊరుకున్నాడు. ముందు కొంచెం కాతరపడినా సర్దుకొని ఆ స్త్రీ చీరని తీసుకుంది.

ఆ ముందు రోజు ఆ స్త్రీ వసారాలో కనిపించినప్పుడు సరళ ఆమెను వర్ణించిన మాటలు - "జుత్తు చెక్కుచెదరకుండా, పువ్వులు నలగకుండా ఆమె రూపం, ఆమె లాగే అవస్థ పడే తక్కిన వేశ్యలు . . . " - రామనాధన్ గుర్తుచేసుకున్నాడు. అక్కడనుంచి మెల్లగా కదిలాడు.

చెయిలో చీరతో ఆమె చూపు వెనక్కి దూరంగా పోతున్న రామనాధన్ని వదిలి సరళ ఇంటి తలుపుమీద పడింది. సరళ అక్కడ నిలబడి తన్ను చూస్తున్నట్టు ఆమెకు తోచింది.

గతకాలంలో సరళ ముఖంలోని ముసిముసి నవ్వు, సరళ తనకు చేసిన ఉపకారం ఆమెకు జ్ఞాపకంలో వచ్చాయి. ఆ చావిడిలోవున్నవారందరూ సరళకి జరిగిన దుర్ఘటనకోసం విచారించాలి అని ఆమెకు తోచింది.

## 4

సరళ గురించి రామనాధన్ చెప్పినదంతా విని కృష్ణయ్యరు ఆశ్చర్యం, దిగ్భ్రమ, చెందారు. ఒక వేశ్య దురవస్థ అయ్యరు హృదయాన్ని ఇంత లోతుగా బాధిస్తుందని రామనాధన్ ఎదురుచూడలేదు.

సమాజంకి నీతీ, నియమాలని ఉన్నాయి. కాని సామాజిక పద్ధతిలో దంభాచారం, నటన, మొండితనం అన్నీ కలిసి ఉన్నాయి. ఐతే

కృష్ణయ్యరు అభిప్రాయం సామాజిక ధోరణికి వ్యతిరేకంగా ఉందని రామనాధన్ అతన్ని శ్లాఘించాడు; నిరుత్సాహం, అలసతో వంగిపోయి పక్కనేవున్న కుర్చీలో వాలాడు. అతని తల కుడి చెయ్యిని ఆనుకొని ఉంది. కుడిచేతి వేళ్ళమధ్య ఉన్న నిగరెట్టు బూడిద నేలమీద కొంచెం కొంచెంగా పడుతూ రేఖలు రాసింది.

కృష్ణయ్యరు రామనాధన్ కోమల హృదయంచూసి బాధపడ్డారు. రామనాధన్ భజంమీద చెయ్యివేసి అతను చెప్పారు: "రామనాధన్, మీ జివితంలో, మీరు రాసే కవిత్వంలో, వేశ్యలలో ఎటువంటి నియమాలూ లేకపోవచ్చు. కాని ఈ సమాజంకని కొన్ని లక్షణాలూ, ఆచారాలూ ఉన్నాయి, అవి మనం పాటించాలని మీరు ఒప్పుకుంటారా? అదే మన అనుభవంలో మనం తెలుసుకోవలసిన పాఠం. నేను చెప్పేది మీకు బోధపడిందా?" అయ్యరు కుర్చీనుండి లేచి రామనాధన్ని చూస్తూ నిలబడ్డారు.

"సాంఘిక విధానం అని ఏదో ఉందనా మీ వాదం? మీరు ఎగతాళి చేస్తున్నారు! సమాజంకి నిరంతరమైన లక్షణాలు ఏవీ లేవుగా?" అని చెప్పి రామనాధన్ నవ్వాడు.

వాళ్ళిద్దరూ ఏమేమో మాట్లాడుకుంటూ వాదనలో పడ్డారు. నేలమీద వాలిన బూడిద వాళ్ళు గమనించనే లేదు. మరి వాళ్ళు మేధావులు కదా? ఈ ప్రపంచంలో ఏ ప్రశ్న ఐనాసరే దాన్ని వివేకంతో, తర్కరీతిలో అర్ధంచేసుకోవచ్చు అని నమ్మే వ్యక్తులు కదా?

క్రమంగా వాళ్ళ నంభాషణలో అన్ని విధాల నియమాలూ, నిబంధనలూ వెల్లడి అవుతాయి. ఏ నియమం, లక్షణం పాటించతగినది, ఎది ఉల్లంఘించతగినది అని వాళ్ళ వాదం. కాని ఈ బౌతిక ప్రపంచంలో ప్రేమ, సుఖానుభావం అనేవి వేరే వర్గానికి చెందినవి.

అవి చర్చకూ, విశ్లేషణకూ లొంగిన ప్రశ్నలు కావు! యథార్థజీవితంలో అవి వేరే వేరేగా ప్రకటితమవుతాయి!

**********

*(మూలం ప్రచురణ: తామరై, 1963)*

# పాత జ్ఞాపకాలు

అనంత శర్మ కారునించి దిగి సముద్రతీరానికి దారిచూపే సెమెంటు బాటలో అడుగు పెట్టారు. కారు వెనక సీటులో కూర్చొనివున్న అతని మనవలు - ఇక వాళ్ళందరూ ఏదో సినిమాకి వెళ్ళబోతున్నారు - ఉత్సాహంగా చేతులూపుతూ అతనికి వీడ్కోలు చెప్పారు. డ్రైవరు, శర్మకోసం తలుపు తెరచిన తరువాత, కారు ఎడంపక్క నిలబడి, అతన్ని మర్యాదతో "నేను పిల్లల్ని సినిమాలో ఎక్కించుకున్నతరువాత ఇక్కడకి వస్తే మీకు సరిపోతుందా?" అని అడిగాడు.

సముద్రతీరంలో వీచే ఆ పెనుగాలిలో శర్మకి అతని మాటలు సరిగ్గా వినబడలేదు; ఇటీవల అతనికి కొంచెం చెముడుకూడా.

"తాతగారూ, మణి మీకేమో చెప్తున్నాడు!" అని పాచ్చా - అతని దౌహిత్రుడు - మెల్లగా ఒక చెయ్యెత్తి, పెదవులని అణచుకొని, గట్టిగా, వడగాట్పుని మించే గొంతులో, అరిచాడు.

శర్మకి పట్టరాని కోపం వచ్చింది. "ఎందుకురా అలా అరుస్తావ్?" అని మనవడ్ని మందలిస్తూ, డ్రైవరు పక్కన తిరిగి, నిదానంగా, మర్యాదతో, "ఏమిటయ్యా, నీకేం కావాలి?" అని ఆడిగారు.

"మరేంలేదు . . ." అని క్షమాపణ కోరుతున్నట్టు డ్రైవరు మాట్లాడాడు: "పిల్లల్ని తీసుకురావడానికి సినిమాకి వెళ్ళేదారిలో నేను మీకోసం రానా? అలాగైతే తొమ్మిది గంటలవుతుంది. లేకపోతే అంతకుముందే రమ్మంటారా?"

"అలాగేం వద్దు! పిల్లల్ని ఇంట్లో దింపేసి ఇక్కడకి రా; వాళ్ళతో సినిమాకీ, షాపులకీ, నేను తిరగలేను!"

డ్రైవరు అడగడానికి కారణముంది. ఇల్లు మాంబలంలో ఉంది; అక్కడనుంచి బీచు చాలా దూరం. వీలైతే అ ప్రయాణం తప్పించుకోవాలని అతని ఆశ. కాని ఇప్పుడు శర్మ ఆజ్ఞ విని అతను కొంచెం నిరుత్సాహపడ్డాడు; డ్రైవరు పండ్లిగించడం శర్మ చూసారు.

"ఇలాగ చెయ్. పిల్లల్ని ఎక్కించుకొని ఇక్కడకి రా . . . "

". . . ఆలాగైతే తొమ్మిది దాటి అరగంట అవొచ్చు . . . "

"పరవాలేదు. నువ్వు అందకుముందు రావగలవేమో చూడు. ఇది వేసవికాలం కదా, బయటనుంటే నాకు మంచిదే," అని శర్మ అన్నారు. కాని అతని మనస్సులో, 'వీడికి ఈ ముసలాడికోసం ప్రత్యేకంగా బీచుకి రావడానికి ఇష్టం లేదేమో? సరే, అదీ న్యాయమేకదా? ' అని అనుకున్నారు.

కారు సెలవు తీసుకున్న తరువాత శర్మ తన నున్నని చేతికర్రతో మెల్లగా, నిశ్చలంగా కాలిబాటలో నడవసాగారు. అతని ఎర్ర, మృదువైన కాళ్ల, చెప్పుల మధ్య ఒక చిన్నచలువరాయి చిక్కుకున్నా అతనికి భరించలేని బాధ కలిగింది.

"వెధవలు! ఏదురుగున్నట్టు ఎందుకు ఈ రోడు పక్కన సెమెంటు గచ్చు వెయ్యలేదు? ఆ పనేదో అలాగే వొదిలేసారు! నాకు అడుగుపెట్టడమే బ్రహ్మప్రయత్నంగా ఉంది!" అని కోపంతో ఊరులోని మునిసిపాలిటి అధికారులని తనలో తిట్టుకున్నారు.

అతను తొడుక్కున్నది ఉడికిపోయిన ఒక పంచె. అదికూడా మామూలుగా అందరూ వాడే పదిహేను అడుగుల పంచెని రెండు భాగాలుగా చేసి వాడినది. అతను నడుస్తూంటే అతని కాళ్ళమధ్య వేలాడుతున్న కౌపీనం మొన అతని పంచె ద్వారా కనిపిస్తోంది. ఆకృతిలో వొదులుగా ఒక పెద్ద చొక్కా కనబడినా అది అతని కరాలని పూర్తిగా కప్పుతుందా లేదా అని చెప్పలేం. చొక్కా జేబులో ఏమేవో ఉన్నాయి: జలుబు పట్టిన ముక్కు తుడుచుకోడానికి ఒక రుమాలు; కళ్ళద్దాలకి తోలుతో చేసిన ఒర; ముక్కుపొడికి ఒక వెండి డబ్బీ. మెరుస్తున్న అతని బోడితల వెనుక అర్ధచంద్రుడులాగ కొన్ని నెరసిన వెండ్రుకలు కనిపిస్తున్నాయి. ముందుజాగ్రత్తగా బీచులో గాలి తీవ్రంగా వాయించుతే అందుకు అండగా ఒక భారీ శాలువ కూడా అతని భుజంమీద వేలాడుతోంది.

ఐదు నిమిషాలు నడచినతరువాత శర్మ ఆ కాలిబాట బీచు ఇసుక నేలని కలుసుకునే జాగా చేరుకున్నారు. అక్కడనుంచి మరోపది నిమిషాలలో అతని గమ్యస్థానం - బీచు లోతట్టుని చుట్టూ ఆక్రమించిన తోవ కనిపించింది. తలయెత్తి అక్కడ జనసమూహంలేని ఒక మూలను అతను చూసారు.

అది అతని జాగా; బీచుకి వచ్చినప్పుడెల్లా అతనికి అదే కావాలి! అప్పుడప్పుడు మరెవరైనా అక్కడ కనిపిస్తే - వాళ్ళు అనుకోకుండా అక్కడ రావడమైనా - శర్మ ముఖంలో గభీమని అర్థంలేని కోపం కనిపిస్తుంది; అంతే, ఆ సాయంకాలమంతా వ్యర్థమైనట్టు అతను చిరాకు పడతారు. ఐతే, ఇవాళ, మంచివేళ, అక్కడ మరెవరూ లేరు!

ఇసుకనేలపై కుదురుగా కూర్చున్నతరువాత శర్మ తలయెత్తి ఆకాశాన్ని, చుట్టుపక్కల్ని చూసారు. పిల్లకాయలు కొందరు ఇలా అలా పరుగెడుతున్నారు; ఆడపిల్లలు చురుగుకా ఇసుకతో చిన్న చిన్న ఇళ్ళు కట్టుకుంటున్నారు; యువకులు తమ ప్రియురాళ్ళ ఆదరణకోసం అవస్థ పడుతున్నారు; బాహటంగా ఉన్న ఆ బీచు జనసమూహంలో ఏకాంతం కోరుతూ కొందరు ఆడమగ జంటలు కనిపిస్తున్నారు. శర్మకి ఇవన్నీ మరిగిన దృశ్యాలే! ఇక ఎన్నిరోజులు ఇవి సాగుతాయి? మరి ఈ ప్రపంచంలో ఎదీ శాశ్వతం లేదుకదా? ఇప్పుడు ఈ బీచులో ఉన్నవాళ్ళందరూ తమ తమ పనుల్లో లోబరచుకొని కాలం గడుపుతున్నారు, కాని చివరికి తప్పకుండా వాళ్ళకీ విసుగ్గు పట్టేస్తుంది! 'మానవ జీవితంలోని యధార్థం ఇదేకదా?,' అని శర్మ తనలో గుర్తుచేసుకున్నారు. ఆ ఆలోచనతోబాటు అతని మనస్సులో చప్పగా, సానుభూతి లేని ఒక సంతృప్తి కలిగింది.

ఈ ఆటాపాటలూ, కలలూ, ఆశలూ, ముచ్చటలూ - అన్నీ ఇక వచ్చే తరాల్లో పునరాగమనం చేస్తాయి . . .

అసలు విషయమేమిటంటే జీవితంలో విసుగ్గు, అలుపుకి చోటు లేదు. ఐతే తమ తమ అనుభవాలని సర్వసాధారణంగా ఊహించడంవలనే ప్రజలు మగ్గిపోయి, సారంలేకుండా, నీరసంగా రోజులు గడుపుతున్నారు. జీవితమనేది ప్రతీ క్షణమూ వికశించేదే. కాలక్రమంలో వాడిపోయేది పువ్వే కాని దాని జన్మకి ఆధారమైన శక్తి కాదు. ఇదే జీవితంలో - పరమాత్మా (దేవుడు), జీవాత్మా (మానవుడు) మధ్య మనం దర్శించే ఐక్యం, వైరుధ్యం. పువ్వు మానవుడు, శక్తి దేవుడు!

అదిగో, అక్కడ ఆ పిల్లవాడికి తన చిన్ని చేతులతో ఇసుకనేలని పదే పదే తవ్వడంలో ఎంత ఆనందం! కొంచెం దూరంలో ఒక యువకుడు - నల్ల కళ్ళద్దాలతో

కనిపిస్తున్న మనిషి - ఒక యువతి తనమీద ఎప్పుడైనా ఒక చూపు విసురుతుందా అని తహతహలాడుతున్నాడు. లజ్జ వదలేసి ఆ బీచురోడ్డులో తన మోటరుబైకులో ఏమేమో కూతలు పెట్టుకుంటూ కిందకీ మీదకీ తిరుగుతున్నాడు. ఇక, ఆ పక్కనే ఒక జంట తమ ప్రేమానుభావాలని - ఆ బీచులో మరెవరికీ తెలియనట్టు - ఒకరితో ఒకరు రహస్యంగా పంచుకుంటున్నారు. అది వాళ్ళకి ఎంత ఆహ్లాదం! 'ఇవన్నీ భ్రమలే!' అని శర్మ తనలో చెప్పుకున్నారు. ఈ ముచ్చటలన్నీ తెరమరుగులో మాయమవుతాయి; తన గత జీవితంలోనూ ఇటువంటి అనుభవాలు కలిగాయనే జ్ఞాపకం రాగానే అతనికి తన బోళాతనం అర్థమైంది. మరి అతని తాతగారు చెప్పిన జానపద కథలన్నీ పూర్తిగా నిజమని శర్మ నమ్మలేదూ? తను మళ్ళీ ఆ పాతరోజులు గడుపుతున్నట్టు అతనికి అనిపించింది; దానితోబాటు కొంచెం విచారమూ కలిగింది.

'అంతే! అంతా ఐపోయింది! . . . !' అని శర్మ తనలో తనే చెప్పుకున్నారు. 'నాకిప్పుడు చాలామంది మనవలున్నారు. నాలాగే వాళ్ళు జీవితం గడుపుతున్నారు. ఇక నా అబ్బాయిలూ, అమ్మాయిలూ ప్రేమించడం, పెళ్ళిచేసుకోడం, ఒకరితో ఒకరు దెబ్బలాడడం, ఆచారాలు అనుష్టించడం - ఇవన్నీ క్రమంగా చేస్తున్నారు. అవన్నీ పాత కథలే! ఆఖరికి నేను మాత్రం మిగిలాను; దిక్కులేని ఒక మూడోమనిషిలాగ ఈ నాటకమంతా చూస్తున్నాను. . . . .

అదిగో, ఆ ఇసుకనేలలో, రెండు కాలిబాటలమధ్య, ఆ బెంచి చూసారా? రెండు సంవత్సరాలముందు నేనూ, నా ఫ్రెండు రాఘవాచారీ దానిమీద కూర్చుండేవాళ్ళం. అది మాకు రోజూ అలవాటే. అతనుండేది లజ్ లో. నేను బీచుకి వచ్చినప్పుడెల్లా అతను నా కారులో వచ్చేవారు. ఆ తరువాత అతని కారులో మేమిద్దరం తిరిగి వెళ్తాం. అతని డ్రైవరు నన్ను నా ఇంట్లో దిగబెట్టి వెళ్తాడు. గత రెండు సంవత్సరాల వరకూ అది నియమానుసారంగా జరిగేదే. మొట్టమొదట్లో అతని కొడుకు . . . అతని పేరు . . . అది మంచి పేరు . . . దేవుడా, నాకు పేర్లు జ్ఞాపకమున్న మనుషులందరూ పోయారు! . . .తక్కిన పేర్లు విన్నవేంటనే, అప్పుడప్పుడే మంచిపోతున్నాను! . . నాకు రానూ రానూ మరుపు ఏక్కువైపోతోంది . . . దృష్టి కూడా అంత బాగా లేదు

. . . కొన్ని సమయాల్లో 'ఎందుకు ఈ బ్రతుకు?' అని ఒకటే చీదర . . . జీవితం అంటే అసహ్యత . . . వెంకటాచారీ, నేనూ ఇక్కడకి వచ్చి ఈ సిమెంటు బల్లమీద కూర్చుంటాం . . . వేసవి కాలంలో నాలుగు గంటలకెల్లా వచ్చేస్తాం, రాత్రి తొమ్మిది గంటలవరకూ ఏమేమో మాటాడుకుంటాం . . . .

'నీకు జ్ఞాపకం ఉందా? . . 1926 లో ' అనే ప్రశ్నతో మా సంబాషణ ఆరంభిస్తాం . . . . లేకపోతే ఇటీవల మా బృందంలో కన్నుమూసిన ఒక స్నేహితుడు గురించి మాట్లాడతాం . . . కొన్నిరోజులు ఏమీ మాట్లాడకుండా ఇద్దరూ అలాగే - పరంపరగా కాలం గడిపే భార్యా భర్తలలాగ - కూర్చుంటాం.

'సరే, ఇంటికి వెళ్దాం!' - ఇవే మా ఆఖరి మాటలు. కోన్నిరోజులు చావు గురించి చర్చ. అదెలా వస్తుందంటే, 'ఏది ఎలాగున్నా సరే, ఒక వయఃపరిమితి దాటి జీవించడమనేదీ మంచిదికాదు' అని ఒక నిట్టూర్పు విడిచి మేం చెప్పుకున్నతరువాత. అప్పుడప్పుడు మా కడుపుమంటని ఈ కాల నవతరాల యువతీయువకులపై చూపించుకుంటాం. గొంతుచించుకొని కేకలు పెట్టాం: 'రోజులు ఇంత హీనస్తితికి ఎలాగ వచ్చేసాయి?' అని. కొన్నిరోజులు మాలో మేమే జోరుగా దెబ్బలాడుకుంటాం. కాని, ఆ మరునాడే నేను వెంకటాచారి ఇంటిముందు దర్శనమిస్తాను. అవును మరి! అతనితో నా స్నేహితం వొదులుకుంటే నా ఇక్కట్లూ, బాధా గొణుక్కోడానికి నాకు మరెవరున్నారు?

ఇది రెండు సంవత్సరాల ముందు సంగతి. మసకచీటీలో వెంకటాచారి కారు తలుపు తెరిచి నేలమీద చేతికర్ర ఆనుకొని కారునుంచి బయటపడ్డారు. నాపక్క తిరిగి "సరే, రేపు మళ్ళీ కలుసుకుందాం," అన్నారు. ఆ రోజు మేం ఒకరికొకరు చెప్పుకున్న ఆఖరి మాటలు అవి . . . ఎప్పుడూలాగే . . .

ఆ రాత్రి - రెండు గంటలనుకుంటాను - శటగోపన్, అవును, అతని పేరు ఇప్పుడు నాకు గుర్తుకి వస్తోంది . . . అతను వెంకటాచారి పెద్ద కొడుకు, చార్టెడ్ ఎక్కవుంటంటు, నాకు ఫోను చేసాడు: "నాన్నగారు పోయారు . . . ఎటువంటి చిక్కులూ లేకుండా . . . అర్ధరాత్రివరకూ నిద్రపట్టలేదన్నారు . . . . గభీమని

గుండెపోటన్నారు . . . నేను డాక్టర్కి ఫోన్ చేసాను, అతనూ వచ్చారు . . . నాన్నగారు పన్నెండరకి పోయారు . . ."

అదేదో వార్త చదివినట్టనిపించింది నాకు అతని ధోరణి. అవును, వెంకటాచారికి అప్పుడు అరవైయెనిమిది నిండాయి . . . .ఇప్పుడు నాకూ అదే వయసు . . . .

ఇవాళా రేపూ నేను బీచుకు ఒంటరిగా వస్తున్నాను; ఈ ఇసుకనేలమీద కదలకుండా పడుకుంటాను; కూర్చుంటే వీపంతా మంట! ఈ సిమెంటు బెంచి చర్మాన్ని గుచ్చుతోంది. ఇసుకకూడా దేహంలో అంటుకొని నాలుగైదు నిమిషాలు నిప్పులాగ కాల్చుతోంది. అందుకే నేను శాలువ కింద పరిచి దానిమీద వాలుతాను. మామూలుగా ఒక తలగడ కూడా వాడుతాను, కాని ఇవాళ తీసుకురావడం మరిచిపోయాను. తలగడని అణచుకొని, రెండు కాళ్ళూ చాచి, తలయెత్తి ఈ ఆకాశాన్ని ఒకసారి చూస్తే 'మానవ జీవితానికి నిజంగా ఏమైనా ప్రాధాన్యం ఉందా?' అని నాకనిపిస్తోంది . . .

ఇరవై సంసత్సరాలముందు మేం ఆయిదుగురం - నేను, వెంకటాచారి, రఘోత్తమరావు, శివం, పట్టణ్ణా - చేతికర్రలతో చురుకుగా ఈ కాలిబాటలో వాహ్యాళి వెళ్ళేవాళ్ళం. నేనూ, వెంకటాచారి అప్పుడు ఉద్యోగంలో ఉన్నాం; తక్కినవాళ్ళందరూ రిటరైపోయారు. ఒక మైలు నడిచినతరువాత ఈ బెంచిలో వచ్చి కూర్చుంటాం. పట్టణ్ణా జోక్సు చెప్తూంటే మేమందరం విరగబడి నవ్వేవాళ్ళం. అంతేకాదు; పక్కన కనిపించే ప్రేక్షకునికూడా లాగిపట్టుకొని పట్టణ్ణా అతన్ని ఎగతాళి చేసేవారు. అప్పుడప్పుడు దారాళంగా అసభ్యంగా కూడా మాటాడేవారు. శరీరంకి చేతకాకపోతే దానికి చెల్లుగా మనసుంది కదా? అదే అతని చాపల్యం; అతనూ ఇప్పుడు పోయారు . . . .

అందరూ అదేమాటన్నారు: "మళ్ళీ కలుసుకుందాం - రేపు" అని. అయిదుగురం నలుగురయ్యాం . . . తరువాత ముగ్గరు . . . తరువాత ఇద్దరు . . ఇప్పుడు నేనొక్కడినే మిగిలాను . . . ఇక్కడ కూర్చొని ఒంటరిగా నేను నా పాతరోజుల్ని నెమరువేస్తున్నాను . . . .

'నేను ముసలాడైపోయాను; నాకు జీవితంపై ఆసక్తి లేదు!' అని ముక్కుతో ఏడవడం, చీదరపడడం . . . ఇవన్నీ పిచ్చిమాటలే! జీవితాన్ని ఉద్రేకంతో

అనుభవించి తీరాలి అని అత్యాకాంక్షతో మెలిగే ఒక వ్యక్తి జీవితం అర్పించే ప్రసన్నతలు ఎప్పుడూ వదిలిపెట్టడు. అది అసాధ్యం! ఇంతెందుకు? ఇప్పుడు అకస్మాత్తుగా ఒక అమ్మాయి మనోరంజకంగా చీర కట్టుకొని నన్ను దాటి వెళ్ళిందనుకోండి. నేను కనుబొమ్మలెత్తి రెప్పలార్పకుండా అమెను చూడనూ . . .?

కాని నేను నా భావాలు వశంలో పెట్టుకుంటాను. 'ఎవరమ్మా నువ్వు? . . . ఓ, నువ్వు . . . . ఆయనగారి కూతురుకదూ?" అని ఓదార్చే మాటలతో పిలుస్తాను. ఆమెకు సమీపంగా చేరుకొని ముట్టుకోడానికి ప్రయత్నం చేస్తాను . . . ఇదేం ఘోరం! దేవుడా, నాకేం మతిపోయిందా?. . .చపలచిత్తమంటే ఇదే . . . .అవును, మనసన్నది ఎప్పుడూ చంచలంతోనే పని చేస్తుంది! . . .

ఇంతకన్నా మరేం అవమానం ఉందా? . . . కొన్ని సమయాల్లో నాకు చావాలనిపిస్తోంది . . . .

నేను పోతే ఒక అధ్యాయం ఐపోతుంది . . . . ఎవరో వచ్చి నా పక్కన నిలబడుతున్నారు . . . . .'

శర్మ వెంటనే తిరిగిచూసారు; అందిపొందని ఒకతను కనిపించాడు.

అతనికి శర్మవయసే ఉంటుంది. కాని అతని ధోరణి, బట్టలు అనుచితంగా కనిపించాయి. జుబ్బాచెయ్యిలతో కనిపించే ఆ పెద్ద చొక్కాయిలో రకరకాలుగా పెద్ద చారలు - ఆ మోటరుబైకులో కనిపించిన యువకుడిలాగే - ఉన్నాయి; పాలిస్టరు పంట్లాము తొటుక్కున్నాడు; చురకుగా సిగరెట్ కాల్చుతూ కనిపించాడు.

'ఇదెవరు సిగ్గుమాలిన మనిషి?' అని శర్మకి రోత కొట్టుతూ వచ్చింది. 'ఈ వయసులో ఇదేం వేషం? . . . ఆ పొట్ట, ఛాతీవరకూ యీడ్చుకున్న ఆ పంట్లాము . . ఆ సిగరెట్టు . . . . చూడడానికే అసహ్యంగా ఉంది!' అని విసుగ్గుంటూ తల తిప్పుకున్నారు.

అప్పుడే అతను "క్షమించండి . . . మీరు అనంతశర్మకదూ?" అని ప్రశ్నించాడు.

"అవును . . . " అని ముసురుకుంటూ శర్మ జవాబు చెప్పారు.

"నేనెవరని మీరు పోల్చుకోలేరా?" అని అడుగుతూ అతను నవ్వుతుంటే అతని కట్టుడు పళ్ళు బాగా కనిపించాయి. శర్మపక్కనే వచ్చి బెంచిలో అతను కూర్చున్నాడు.

శర్మ రెప్పలార్పకుండా అతన్ని చూసారు; ఎలాగైనా అతనడిగిన ప్రశ్నకి జవాబు చెప్పాలని తహతహలాడారు.

"చూడండి . . . సాయంకాలంలో నాకేమో దృష్టి అంత బాగా లేదు . . ." అని శర్మ మొదలుపెట్టగానే అతను పెద్దగా నవ్వుతూ "ఓ అలాగా? నేను ముసలివాడ్డైపోయానేమో, అందుకే మీరు గుర్తుపట్టలేకపోయారనుకొని గాభరా పడిపోయాను!" అని కేకలు పెట్టాడు.

'ముసలితనంలో ఇదేం హాస్యం?' అని శర్మ చికాకుపడ్డారు.

"నేను రంగమణి . . . .'

"రంగ . . . అరెరే, నేను నమ్మలేకున్నాను! . . . మనం కలుసుకొని చాలా సంవత్సరాలయ్యాయి . . . సరిగ్గా నలభైఆరు నంవత్సరాలు! . . . ఇప్పిప్పుడే నేను మన పాతస్నేహితులగురించి ఆలోచిస్తున్నాను; వాళ్ళందరూ నాతరంవారే, కాని ఇప్పుడు ఎవరూ లేరు. ఆఖరికి ఒక రాఘవాచారి మిగిలారు - నీకతను తెలియదు, అతను మనతో చదవలేదు; అతను నాకు ఉద్యోగం మూలంగా పరిచయమయ్యారు - అతన్నిగురించే ఇంతసేపూ నా ఆలోచన . . . రంగమణి, దేవుడి కటాక్షమంటే ఇదే అనాలి . . . నువ్వెలా నన్ను కనిపెట్టావ్?" అని ఉత్సాహంతో శర్మ ఇంకా కొన్ని ప్రశ్నలడిగారు.

రంగమణి దీర్ఘంగా పీల్చి సిగరెట్టుని పీకి పారేసారు. శర్మ పళ్ళు బిగపట్టుకొని "నీలో నాకేం మార్పు కనిపించడం లేదు. వయసు పెరిగినా నువ్వేమో ముందులాగే కనిపిస్తున్నావ్ . . . నీకు మనవలున్నారా? ఎంతమంది?" అని అడిగారు.

రంగమణి నవ్వారు; "నాలో మార్పు కనిపించలేదన్నావుగా? మరి నాకు మనవలెక్కడనుంచి వస్తారు? నువ్వు ముందు నన్నెలాగ చూసావో అలాగే ఉన్నాను నేను," అని అన్నారు.

అతని మాటలు శర్మ అర్ధం చేసుకునేముందే శర్మ పళ్ళన్నీ పోగొట్టుకున్నారని రంగమణికి బోధపడింది.

"నువ్వు అసలు పెళ్ళే చేసుకోలేదా?" అని శర్మ తడబడుతూ అడిగారు. ఆ ప్రశ్నలో కనిపించిన భావం ఎలా వర్ణించడం - అభివందనా లేక జాలియా?

"లేదు. ఐతేనేం, అందువలన నాకేం నష్టం లేదు. నేను జీవితాన్ని అన్ని పరిమాణాల్లో అత్యాధికంగా  అనుభవించాను." ఆ మాటలు చెప్తుంటే రంగమణి గాలిలో తేలుతున్నట్లు కనిపించారు.

నలభైసంవత్సరాల తరువాత కలుసుకున్నా ఏమో కొత్తగా కలుసుకున్న పాత మిత్రులలాగ కాకుండా శర్మ, రంగమణి  పలకరింపులూ, విశేషాలూ వదలిపెట్టి ప్రస్తుతం ఏం జరుగుతుందో మాటాడారు.

"నీకెందమంది మనవలు? ఇంతకుముందు మనం కలుసుకున్నప్పుడు మీ ఆవిడ కానుపుకోసం వాళ్ళ ఇంటికి వెళ్ళిందికదూ?" అని రంగమణి అడిగారు.

శర్మకి గుండెలో ముల్లు గుచ్చుకున్నట్లనిపించింది; ఎందుకు రంగమణి తన భార్య ప్రసవంకి ఊరుకి వెళ్ళడంగురించి అడిగాడు? వాడి మనసులో ఏముందని? శర్మ కొంచెం జంకారు. కాని వెంటనే సర్దుకొని "అవును, నా పెళ్ళి తరువాత నువ్వు డెల్లీ వెళ్ళావుకదూ?" అని అన్నారు. అతని మనసులో అసత్యంగా ఒక అనుమానం తోచింది. కాని ఇప్పుడొక ప్రశ్నగా దాన్ని ఉపయోగించారు.

"ఒరేయ్ అనంతు! నీకేం మతి పోయిందా . . . ? నువ్వు నిజంగానే ముసలాడైపోయావ్! నీ పెళ్ళిలో మేమందరం కలిసి నిన్ను ఎలాగ ఏడ్పించాం! అవేం నీకు గుర్తులేదా . . . ?"

"అవును . . . అవును . . . నాకిప్పుడే మెల్లమెల్లగా జ్ఞాపకం వస్తోంది . . . వయసు రాగా రాగా  నేనన్నీ మరిచిపోతున్నాను . . . "

"నీ వయసెంత? . . . అరవైఎనిమిదికదూ? . . . అదీ నా వయసే . . . అనంతూ, మన దేశంలో ముసలితనం రాగానే ప్రజలు ఏకాంతవాసం అంగీకరిస్తున్నారు. పశ్చిమదేశాల్లో చూడు! ముసలాడు ఇరవైదేళ్ళ అమ్మాయిని పెళ్ళిచేసుకొని మరుసటి సంవత్సరంలో ఒక బిడ్డకి తండ్రి అవుతున్నాడు! నీకు తెలుసా, కన్యలకి మనలాంటి ముసలివాళ్ళంటే చాలా మోజు! . . . "  రంగమణి కంఠధ్వని తగ్గించి,  కన్నుకొట్టుతూ శర్మనిచూసి గట్టిగా నవ్వారు. అతని చేష్ట బీచులో ఉన్న కొందరు జనులని ఆకర్షించింది.

"రామ రామ . . రంగమణి, మెల్లిగా మాటాడు. . . . " అని దిగులుతో శర్మ తన రెండు చెవులు మూసుకున్నారు. కాని తన మనసులో 'వీడిలో ఇంత చురుకుతనం ఎలాగ కనిపిస్తోంది!' అని విస్తుబోయారు.

"అనంతు, మన పట్టణ్ణా ఇప్పుడేం చేస్తున్నారు?" అని రంగమణి అడిగారు.

శర్మ పెదవులు బిగించుకున్నారు: "అతనుపోయి పది సంవత్సరాలైపోయాయి."

ఇద్దరూ అకస్మాత్తుగా కలుసుకున్నామనే భావనతో ఒకరినొకరు చూసి నవ్వారు. రంగమణి తన జేబులోనుంచి ఒక సిగరెట్టు తీసి శర్మకి అందించారు. "No, Thanks," అని అంటూ శర్మ తన జేబునుంచి పొడిడబ్బీ తీసి "ఇటీవల నాకిది బాగా అలవాటైపోయింది . . . తప్పకుండా మానేయాలి . . . " అని అన్నారు.

"నాకూ నీ వయసే . . . . నువ్వన్నీ మరిచిపోతున్నావ్ . . . కాని నేనేదీ మరిచిపోలేను! . . . నేను నిన్ను బీచులో చూసి నీ దగ్గరకి వచ్చినతరువాతకూడా నువ్వు నన్ను గుర్తుపట్టలేదు! నేను ఇక్కడ నిన్ను ఎలా అనవాలుపట్టేనో తెలుసా? నేను నా కారు ఆ కాలిబాట పక్కన పార్కు చేసాను . . . నేను మద్రాసుకివచ్చి ఒక వారమైంది . . . "

"ఇంతవరకూ ఎక్కడున్నావ్?"

"చాలా చోట్ల . . . ఇక్కడా, అక్కడా అని చెప్పడం కష్టం . . . గత పది సంవత్సరాలుగా బెంగళూరులో ఉంటున్నాను . . . ముందు నేనేం చెప్పదలచుకున్నానో విను . . . నువ్వు కార్లోనుంచి దిగడం చూసాను . . నాకు ముసలివాళ్ళంటే - అంటే మనలాంటి మగాళ్ళపై - ఆడవాళ్ళుకాదు! (రంగమణి ఇక్కడ కొంటెనవ్వు నవ్వారు) - ఆసక్తి ఎక్కువ. తెలిసినవారెవరైనా కనిపించవచ్చుకదా? . . . అప్పుడే నీ మనవడ్ని చూసాను. వాడికి అసలు నీ పోలికే! ఆ పిల్లవాడిని చూడగానే 'సరే, ఇది మన అనంతే!" అని నిశ్చయం చేసుకున్నాను."

తన మనవడు తన పోలికలో కనిపించాడని వినగానే శర్మ ఉప్పొంగిపోయారు. ఒక విట్టూర్పు విడిచి "అవును, ఇక వచ్చే తరాల్లో మనల్ని మన మనవలమూలంగానే అందరూ పోల్చుకోవాలి! రంగమణి, దేవుడిదయవల్ల నేను నిన్ను ఈ రోజు

కలుసుకున్నాను. నేను నా గతకాల స్నేహితులగురించి వ్యసనపడుతుంటే నువ్వు వచ్చావు. ఈ ఒంటరిపాటు నేను భరించలేకున్నాను," అని అన్నారు.

"పాత స్నేహితులెందుకు? వయసులో నీకంటే చిన్నవాళ్ళు బోలెడుమంది ఉన్నారుగా? వాళ్ళతో స్నేహం చేసుకో; నేనదే చేస్తున్నాను. నా వయసులో నువ్వొక్కడివే నా స్నేహితుడువి . . . ఇదెలా సాగుతుందో చూద్దాం . . . సరే, ఇప్పుడు మనం నా జాగాకి వెళ్దాం," అని రంగమణి తన వాచీ చూసుకున్నారు.

"నీకు కారుందా. . .?"

"అదిగో . . . .ఆ Ambassador చూసావా? నా డ్రైవరుకూడా నాతో ఉన్నాడు. విను, మనం నా జాగాకి వెళ్ళగానే మీ ఇంటికి ఫోను చేద్దాం - మీ ఇంట్లో ఫోను ఉందికదా? - నీకోసం బీచుకి కారు పంపవద్దు అని చెప్పేద్దాం . . అనంతు, సరే, పద, మనం ఇక వెళ్దాం!" అని రంగమణి తొందరగా తనేదే సభకి వెళ్తున్నట్టూ, ఆలస్యం చేయకూడదని ఆతురత పడుతునట్టూ కనిపించారు. "నాకు నీతో ఎన్నో సంగతులు మాటాడాలి. ముందు drinks, తరువాత talking! సరేనా?" అని అడిగారు.

'Drinks!' అనే మాటవినగానే శర్మ రంగమణితో వెళ్ళడానికి కొంచెం జంకారు. 'సరే, ఆ పాతరోజుల్లోనే రంగమణి పెద్ద తాగుబోతు ' అని అతనికి జ్ఞాపకంలో వచ్చింది.

ఆ పాతరోజులలాగే - ఇన్ని సంవత్సరాల తరువాతకూడా - రంగమణిలో అదే యౌవనం కనిపించడం చూసి శర్మకి ఆశ్చర్యం కలిగింది. రంగమణిలో దేహం, మనసు, ఉత్సాహం అన్నీసమన్వయంగా జతచేసుకున్నాయి. రంగమణి చురుకుగా నడుస్తూంటే తను వెనకంజ వెయ్యకూడదనే ఆవేశంతో శర్మ ఆ ఇసుకనేలమీద చేతికర్ర ఆనుకొని, అప్పుడప్పుడు గుక్క తిప్పుకుంటూ రంగమణిని వెంటబడ్డారు.

** ** **

రంగమణి ఒక హోటలు భాగంలో - కుటీరంలో - ఉంటున్నారు. అక్కడ అన్ని విధాల వసతులు - A.C, ఫోను, సోఫా, Fridge, రెండు గదులు, ఒక double bed, bathroom - అన్నీ ఉన్నాయి. అక్కడ చేరుకున్నవెంటనే శర్మ ఆ కుటీరం, అక్కడ ఉన్నవీ, చుట్టుముట్లూ అన్నీ పరిశీలన చేసారు. రంగమణి వాడిన విలువైన బట్టలు

చిందరవందరగా కనిపించాయి. రంగమణి ఉపయోగించే అలంకార వస్తువులు, అతను తాగి పారేసిన ఖాళీ సారా బుడ్డీలు చూసి శర్మ ఈసడించుకున్నారు.

రంగమణి దుస్తులు మార్చుకోడానికి ముందే అతని డ్రైవరు - అతను రంగమణికి అత్యంత సేవకుడుగా కనిపించాడు, రంగమణితో కన్నడంలో మాటాడాడు - ఒక టీపాయ్ మీద ఒక సారా బుడ్డీ, రెండు గ్లాసులు అమర్చాడు.

రంగమణి దుస్తులు మార్చుకొని, అద్దంముందు నిలబడి, తల దువ్వుకున్నారు; ముఖానికి పవుడరు పూసుకున్నారు. ఆ తరువాత సంచిలోనుంచి ఒక సిరింజ్ బయటకి తీసి, అందులో మందు వూడదీసుకొని దాన్ని వెలుతురులో ఒక డాక్టరులాగ పరిశోధించారు. "నువ్వేం చేస్తున్నావ్? నాకు ఇంజెక్షన్ ఇవ్వబోతున్నావా?" అని శర్మ ఎగతాళి చేసారు.

"లేదు, ఇది నాకు నేనే ఇచ్చే ఇంజెక్షన్ . . . " అని అంటూ పక్కనేవున్న ఒక సోఫాలో కూర్చొని రంగమణి తన తొడలో ఇంజెక్షన్ తీసుకున్నారు. "ఇవాళ మధ్యాహ్నం నేను మామిడిపండు తిన్నాను. నాకు diabetes ఉంది . . . " అని కారణం చెప్పారు.

శర్మ చేతికర్రని నేలమీద ఆనుకుంటూ రంగమణిని వింతగా చూసారు. రంగమణి ఒక అత్తరుబుడ్డీ తీసుకొని తన దేహంమీద జల్లుకున్నారు. అతను ఆ బుడ్డీని శర్మపక్క చూపగానే శర్మ బెదిరిపోయి "వద్దు! వద్దు!" అని ఏదో కల్మషం ఆవరించినట్టు ఉలిక్కిపడ్డారు; ఏదో అంటు తగులుకున్నట్లు తన చొక్కాయిని జోరుగా దులుపుకున్నారు. రంగమణి నవ్వుతూ "ఇది మనదేశంలో దిగుమతి చేసిన అత్తరు. చూడు, ఎంత ధీమాగా ఉందో?" అన్నారు.

"చాలు, చాలు, నాకేం వద్దు. నేను అత్తరు పూసుకుంటే నవ్వులపాలైపోతాను," అని శర్మ చొక్కాయిలో ఉన్న సువాసన పోగొట్టుకోవాలని ప్రయత్నించారు.

రంగమణి శర్మతో ముందుగదికి వెళ్ళి టీపాయ్ పక్కనే ఒక సోఫాలో కూర్చున్నారు. శర్మ సోఫా ఒక మూల నక్కి కూర్చున్నారు.

"సరే, దీనికి అద్దె ఎంత?" అని లోకప్పుని ఒక సారి తలయెత్తిచూసి శర్మ అడిగారు.

రంగమణిని డ్రైవరుని కన్నడంలో అడిగారు.

"Seventy-five, Sir!"

"డెబ్బైయైదా? . . . ఒక రోజుకా?" శర్మకి చెమట పట్టుకుంది. "ఇంత ఖరీదా? దూబరదిండితనం అంటే ఇదే! . . . నువ్వు ఎన్నిరోజులుగా ఇక్కడ ఉంటున్నావ్?"

"నేను తొమ్మిదిరోజులుగా ఉంటున్నాను . . . ఇవాళకి పదవ రోజు . . ."

"అబ్బా, ఏడువందలయాభైరూపాయలా?"

డ్రైవరు గ్లాసులో సారాయి కలిపి రంగమణికి అందించాడు. అతను రంగమణికి డ్రైవరుమాత్రమే కాదు అని శర్మకి బోధపడింది; డ్రైవరు రంగమణి చెవిలో ఏదో గుసగుసలాడాడు.

"అలాగా. . . ? ఇవాళ రాత్రి ఎనిమిది గంటలకా?" అని అడిగి రంగమణి శర్మపక్క తిరిగారు. శర్మని చూడగానే అతనిలో పునర్యౌవ్వనం చోటుచేసుకుంది. కన్నుకొట్టుతూ డ్రైవరుకి చెప్పారు: "సరే, ఆవిడని రమ్మను . . . ఈ పక్కగదిలో ఉండమను; ఇతను నా ఫ్రెండే; ఇతనికి అన్నీ తెలుసు . . . ఆవిడ రానీ . . .మరేం చిక్కులేదు . . . . "

శర్మకి అంతా బోధపడింది.

'వీడు ఎలాగ . . . .?' అనే రహస్యంగా ఒక అనుమానం శర్మ మనసులో లేచింది. దానితోబాటు చీదర కలిపించే తలపులు, అర్థంలేని అసూయ అతన్ని ఆకట్టుకున్నాయి. గుండె దడదడమని జోరుగా కొట్టుకుంది; దేహమంతా వొణికింది.

"నీకోసమే ఈ soft drinks, తాగు," అని రంగమణి సూచించగానే శర్మ డ్రైవరు అందించిన గ్లాసును పుచ్చుకున్నారు. ఓరెండుసార్లు వాసన ఎలావుందని పరీక్షించినతరువాతనే ఒక గుక్కెడు మింగారు.

చేతికర్రను నేలమీద ఆనుకొని, తనలో నవ్వుకుంటూ శర్మ రంగమణి ప్రవర్తన గురించి ఆలోచించారు.

"అనంతు! నీకు జీవితంలో విసుకు పుట్టేసిందన్నావుకదూ? . . " అని రంగమణి మొదలుపెట్టారు. "అందువలనే నువ్వు ముసలాడైపోయానని అంటున్నావ్. అవును మరి, నువ్వు గడిపిన జీవితం చూస్తే మరెలా ఉంటుంది? నేను నీ జీవితశైలిని

తప్పుపెట్టడంలేదు. బహూశ జీవితంపై నీకున్నదృక్పధం గురించి చెప్తున్నాను. మనసు భయానికి బానిస అవడంలో పెద్ద ప్రమాదముంది. భయంలో ఎన్నిరకాలు! సమాజం ఏమంటుందో? భార్య ఏమంటుందో? దేవుడేమంటాడో? మన శాస్త్రాలు ఏమంటాయో? ఏ వ్యాధి పట్టుకుంటుందో? చావంటే భయం! తనంటేనే భయం! తన నీడంటే భయం! . . . .మరి బతుకంతా ఇలా సాగితే విసుకు పుట్టదూ? అనంతు, నేను చెప్పేది సరేనా?"

శర్మ కళ్ళు ఇరుక్కొని రంగమణిని చూసారు. అతని మాటలు వివదాస్పదంగా కనిపించకపోయినా రంగమణి తన మనసుని మారుబాటలో గుంజుతున్నట్టు అతనికి అనుమానం కలిగింది; భయం కప్పుకుంది.

"రంగమణి . . . నీవన్నది నిజం . . . ఐతేనేం, అయిపోయిందేదో ఐపోయింది; అది తప్పో, సరియో - ఇక మనం చేసేదేముంది చెప్పు? ఇక మనం కళ్ళుమూసేముందు మనకున్న రోజులు లెక్కపెడుతూ బతకడమేకదా మనం చెయ్యగలిగినది . . . ?"

"అయ్యో, ఎంత శోచనీయం! నువ్వు రోజులు లెక్కపెడుతున్నావా? నన్నడిగితే రోజులుకాదు, సంవత్సరాలు లెక్కపెడుతున్నావంటాను! . . . 'అయిపోయిందేదో ఐపోయింది!' అని అన్నావ్. అదెప్పుడు ఐపోయిందని చెప్తావా? నువ్వే దాన్నిముగించేసావా? నిజం చెప్పాలంటే అది అలాగేవుంది, పూర్తికాలేదు! ఇంతకాలమూ - నలభైఐదు సంవత్సరాలుగా - నువ్వు రోజులు లెక్కపెడుతున్నావ్; నువ్వేకాదు, నీలాగే చాలామందున్నారు! అనంతు, నువ్వు మరేం చేసావ్? మరేం అనుభవించావో చెప్తావా?"

"రంగమణి, నువ్వు నన్ను బాగా అర్థం చేసుకోలేదంటాను. నాకు నిండుగా అనుభవం లేదని ఎవరనగలరు? నేను నలభై సంవత్సరాలు ఉద్యోగంచేసి మంచి డబ్బు సంపాదించాను; నా పిల్లలని బాగా చదివించాను; అమ్మాయలకి మంచి సంబంధాలు కుదిర్చాను. నా షష్టిపూర్తి కల్యాణంలో నా భార్య కలుసుకుంది; ఐదు సంవత్సరాలముందు ఆమె కన్నుమూసింది. అందరు హిందూ స్త్రీలలాగే నాముందు

తనూ పోవాలని ఆమె ప్రార్థించేది; అలాగే అయింది. నాకు ఒక డజను మనవలున్నారు. మరి నాకు అనుభవంలేదని ఎలా అంటున్నావ్?"

"సరేలే, నీ గొప్ప అనుభవం!" అని నవ్వుతూ రంగమణి ఎగతాళిచేసారు. అతని గ్లాసు ఖాళీయైపోయింది.

"నువ్వు ఇంకా తాగు!" తన ముఖం పక్కన తిప్పుకొని శర్మ రంగమణి గ్లాసులో సారాయి పోసారు.

"Thank you! అని అంటూ రంగమణి శర్మచెయ్యి పట్టుకొని " నువ్వు ఇవాళ నాతో డిన్నర్ చేస్తావా?" అని బతిమాలాడారు.

శర్మ ఆశ్చర్యంతో "నా డిన్నరంతా ఓరెండు పళ్ళూ, కొంచెం పాలు - అంతే!" అన్నారు.

"అది సరే, మనం ఇవాళ లైట్ గా భోంచేద్దాం; మనమిద్దరం కలిసి భోంచేయాలి, అదే ముఖ్యం . . . నువ్వెన్ని గంటలకి ఇంటికి వెళ్ళాలి? ఇప్పుడు ఏడున్నర అయింది."

"నేను తొమ్మిది, తొమ్మిదిన్నరకి నిద్రపోతాను. కాని ఇవాళా రేపూ నాకు బాగా నిద్రపట్టడంలేదు . . . .పడకలో ఇలా అలా దొర్లుతాను . . . వీపంతా ఒకటే నొప్పి . . . చాలాసార్లు నిద్రలేచి పడకమీద కూర్చొని ఎప్పుడు ఉదయం వస్తుందా అని కాచుకొనివుంటాను . . . "

రంగమణి నవ్వుతూ "ఇవన్నీ వయసు చెల్లడంతో వచ్చే గుర్తులు . . . " అని అన్నారు. "సరే, నువ్వు ఇప్పుడు మీ ఇంటికి ఫోను చేస్తావా? చాలా రోజులతరువాత ఒక పాత స్నేహితుడిని కలుసుకున్నావని, అతనింట్లోనుంచి ఫోను చేస్తున్నావని చెప్పు . . . నువ్వు ఇంటికి రావడానికి ఆలస్యం అవుతందని చెప్పు . . . "

"ఫోను ఎక్కడ?" శర్మ కుర్చీనుంచి లేచారు.

"లేవొద్దు. అలాగే కూర్చో . . . ఫోను నీ చేతికి వస్తుంది . . . "

రంగమణి డ్రైవరు ఫోను తెచ్చి శర్మముందు పెట్టాడు. శర్మ - తన్ను ఎవరో బలవంతపెడుతున్నట్టు, రంగమణిని తృప్తిచెయ్యాలనే ధోరణిలో - ఫోనులో

మాటాడారు. డయలు చేసినప్పుడు అతనిలో ఎటువంటి ఆతురతా, ఉత్సాహమూ కనిపించలేదు.

"హల్లో, ఇదెవరు? గీతా? ఓ సులో? నాకు మీ ఇద్దరు గొంతుకలో ఏం భేదం కనిపించడం లేదు! డ్రైవరు ముందు పిల్లల్ని సినిమాలో పోగుచేసుకొని తరువాత బీచుకి వస్తానని చెప్పాడు. అతను నాకోసం రానక్కరలేదు. నేనిప్పుడు నా ఫ్రెండు హోటల్ నుంచి మాటాడుతున్నాను . . . అవును, మేమిద్దరం నలభై సంవత్సరాలతరువాత కలుసుకున్నాం . . . అతను నన్ను తనతో డిన్నర్ చెయ్యాలంటున్నాడు . . . లైట్ గానే . . . .నాకు మామూలైన రాత్రిభోజనమే . . . .ఈ రాత్రి నాకోసం పాలు ఉంచవద్దు . . . .ఏమిటంటున్నావ్? . . . మన ఇంట్లో డిన్నర్ కా? సరే, నేను పిలుస్తాను . . . " ఫోనులో మాటాడుతూనే శర్మ రంగమణిని చూసారు. రంగమణి ఒక పిల్లవాడులాగ ఆతురతో శర్మదగ్గరకివచ్చి రిసీవరు అందుకున్నారు.

"ఇదిగో, అతను నా పక్కనే ఉన్నారు . . . నువ్వే అతన్ని పిలు!" అని అంటూ శర్మ రిసీవరు రంగమణికి అందించారు. ఇప్పుడు రంగమణి ఫోనులో మాట్లాడారు.

"హల్లో, ఇదెవరు? . . . అనంతశర్మగారి కోడలా? . . . అతని పెద్దకొడుకు భార్యా? మనవలెందరున్నారు? పిల్లలెంతమంది అని అడగడానికి too late కదా? హ . . హ నేను మనవల్ని బీచులో చూసాను . . . .పాచ్చాని చూసినతరువాతనే శర్మని - మీ మామగారిని గుర్తు పట్టాను . . . .ఇద్దరూ కలుసుకొని చాలా సంవత్సరాలైపోయాయి . . . .అన్ని దేశాలు తిరిగిచూసాను . . . .ఇప్పుడు బెంగళూరులో ఉంటున్నాను . . . .ఓ, తప్పకుండా . . నాకు రేపు ఒక ముఖ్యమైన పని ఉంది . . . మరెప్పుడైనా కలుసుకుందాం! . . . . మీ invitation కి చాలా thanks!" అని రంగమణి సంభాషణ ముగించారు.

శర్మ ముఖం సిగ్గుతో మాడిపోయింది. రంగమణి తన బంధువులతో - స్త్రీలతో - చనువు చేసుకొని ముచ్చటలాడడం అతనికి అసహ్యంగా తోచింది. తను రంగమణికి ఫోనులో మాటాడానికి అవకాశం ఇచ్చినందుకు అతను తన్నే నొచ్చుకున్నారు.

అయితేనేం, రంగమణి తన ఇంటికి రావడమో, తన కోడళ్ళని చూడడమో భవిష్యత్తులో నిశ్చయంగా జరగదనే భావనతో శర్మ తన్ను ఓదార్చుకున్నారు.

రంగమణి మత్తెక్కినట్టు కనిపించారు. అతని ముఖం ఎర్రగా మారిపోయింది. అతను తనలో తనే వల్లించుకుంటున్నారు:

*"నాకోసం రోజూ ఒక కొత్త పువ్వు వికసించుతోంది!*

*నేనూ నీకోసం రోజూ కాచుకొనివుంటాను!"*

** ** **

బయట ఒక టాక్సీ వచ్చి ఆగిన శబ్దం వినిపించింది. రంగమణి డ్రైవరు వెళ్ళి కారు తలుపు తెరిచాడు. అతనితో ఒక స్త్రీ, నీలరంగు చీరతో, తలని కొంతవరకు కప్పుకొని ఇంట్లోకి ప్రవేశించింది. డ్రైవరు ఆమెతో లోపల గదుల్లోకి అడుగులు పెట్టాడు. శర్మ తల వంచి దొంగతనంగా ఆమెను చూసారు.

అతనికి చెమట పట్టుకుంది: 'ఇప్పుడు నేనేం చెయ్యను? ఎటొచ్చీ ముసలితనంలో నాకెందుకీ అవస్త?' అని విచారం కలిగింది.

"మనం ఆఖరిగా కలుసుకున్నది నీకు జ్ఞాపకం ఉందా?" అని కన్నుకొడుతూ రంగమణి అడిగారు. "దాని పేరు . . . నీకు గుర్తుందా?"

గోమతి! ఆ పేరు శర్మ నోటిలోనే కూరుకుపోయింది. పలకడానికి అతను జంకారు.

"గోమతి," అని రంగమణి తనే చెప్పారు. తను ఆమెతో పంచుకున్న అనుభవాలూ, ఆమె అందమైన ముఖమూ అతని మనసులో చోటుచేసుకున్నాయి.

"అదెక్కడో చప్పనాతిగా ఉందో లేక చచ్చిపోయిందో ఎవరికి తెలుసు? మన ప్రజలమాటకొస్తే రెండూ ఒకటే . . . " అని అతను విసుగ్గున్నారు. ఒక నిట్టూర్పు వదిలి "అనంతు! నువ్వేం మారలేదు!" అన్నారు.

"రంగమణి, నీకు నాకంటే చాలా అనుభవముంది. నీకన్నీ తెలుసు. అన్నిదేశాలూ తిరిగిచూసావు. కాని నేను నీకు ఒక చిన్న సలహా ఇవ్వదలచుకున్నాను . . ." కాని శర్మ వాక్యం ముగించడానికి ముందే రంగమణి గట్టిగా నవ్వారు.

"అనంతు, చూసావా? . . . నీలో ఏ మార్పూ లేదు! . . . ఎప్పుడూ ఇతరులకి సలహా ఇవ్వడం నీకు అలవాటైపోయింది . . . "

"నువ్వు తాగు, నీకెది ఎది ఇష్టమో అది చెయ్ . . . అవన్నీ నీ వ్యక్తిగత సమాచారాలు . . నేనేం చెప్పదలచుకోలేదు . . . . కాని వయసు రాగా రాగా నిన్ను చూసుకోడానికి కాని నీ ఆస్తికి వారసులు కాని లేరని నువ్వు ఎప్పుడైనా కొంచెమైనా ఆలోచించావా?" అని శర్మ ఆవేశంగా ప్రశ్నించినప్పుడు డ్రైవరు ఒక పక్క గదినుంచి బయటకు రావడం గమనించారు. ఆలోచన లేకుండానే అతని చూపు గదిలోకి వెళ్ళింది. శర్మ ఆ స్త్రీని బాగా చూసుకున్నారు.

"నాకెవరూ లేరని నీకెవరు చెప్పారు? నాకు బోలెడుమంది ఉన్నారు. చట్టరీత్యా నేనెవరినీ పెళ్ళిచేసుకోలేదు. అందువలన నా శష్టిపూర్తి కల్యాణంలో పాల్గొనాలని ఏ స్త్రీ నన్ను అడగలేదు. కాని నాకు అనేక స్త్రీలతో అంత్యంత సంబంధముంది. నేను పోతే నా ఆస్తిని చూసుకోడానికి ఎవరైనా ఉంటారు." శర్మ ప్రశ్నని రంగమణి అలక్ష్యంగా తోసిపారేసారు.

శర్మ చీపాయ్ మీద ఉన్న సారాయిబుడ్డి లేబెలు చూసారు. "Scotch whiskey. ఇదేం పేరుమోసిన సారాయా?" అని అడిగారు.

"అవును; చాలా బాగుంటుంది . . . కొంచెం మచ్చు చూస్తావా?"

"వొద్దు . . . నాకు heart problem ఉంది . . . ."

"అలాగా, నిజంగానా? heart కి ఇది మంచి మందని నీకు తెలుసా? . . . .ఈ మందే నీ నోటిలో పోయడానికి బదులు డాక్టరు దీన్ని చర్మంద్వారా నీ దేహంలోకి ఎక్కించుతాడు . . . ."

"ఒకసారి నా ఫ్రెండు - ఒక దొర - నన్ను చూడడానికి వచ్చాడు. నాకతని పేరు జ్ఞాపకం లేదు. అప్పుడు కొంచెం వైను రుచి చూసాను. నా బుర్ర గిర్రుమంది, వెంటనే ఆపేసాను . . . "

"అలాగా? . . . ఐతే నేను ముందు చూసినతరువాత నీలో కొంచెం మార్పు వచ్చిందన్నమాట! మనం కలుసుకొని చాలా సంవత్సరాలయ్యాయి; ఈ విందు మన ఇద్దరం పంచుకోవాలి . . . "

"సరే, కొంచెం పొయ్ . . . ." రంగమణి కొంచెం వైను పోసారు.

కొత్తపెళ్ళికూతురులాగ భయమూ, ఆతురత, సిగ్గూ శర్మని ఆకట్టుకున్నాయి; వైను తాగడానికి పూనుకున్నారు.

అప్పుడే తొమ్మిదిగంటలైంది.

శర్మ నిదానంగా, జాగ్రత్తగా గ్లాసులోని వైను రుచిచూసారు. అప్పటికే అతని మనసు అతన్ని ఊహాలోకంకి తీసుకుపోయింది; కనురెప్పలు బరువయ్యాయి; తల గిరగిర తప్పింది.

బాగా మత్తెక్కిపోవడంతో త్వరలో రంగమణి స్థితి ఆలోహస్థాయిని చేరుకుంది. అతనిలో అలుముకున్న సంతోషం, హాస్యం, స్వేచ్ఛ - ఇక వీటికి ఎదీ అడ్డు రాదనిపించింది. మేజామీదున్న అల్పభోజనం - తినుబండారాలూ, పళ్ళూ - చెల్లాచెదిరిపోయి డిన్నరైపోయిందని తెలిసింది.

శర్మకి స్థిరబుద్ధి ఉంది; అతను స్పృహలోనే ఉన్నారు. కాని మత్తెక్కినట్టు ఉత్తికే నటించారు.

"ఏయ్ రంగమణి . . . నువ్వనుకున్నట్లు నేనేం ఉత్తి అమాయకుడినికాను! . . . జనులు బాహటంగా, ఎటువంటి కట్టుబాట్లు లేకుండా జీవించాలనా నీ ఉద్దేశం? . . . ప్రతీ వ్యక్తీ మెడలో ఒక ప్రకటన పత్రం తొడుక్కొని తిరగాలంటున్నావా? . . . . నువ్వు నీ జీవితాన్ని గందరగోళం చేసుకొని బాధపడుతున్నావ్ . . . . నన్నడిగితే నీ తాగుడికి కారణం నువ్వు అనుభవించిన నిరాశ, ఆశాభంగమే అంటాను . . . సరేనా?"

"అవును. నిజం . . .కాని నేను ఏ mood లో ఉన్నాసరే - సంతోషంకానీ, దుఃఖం కానీ - ఇలాగే ఉంటాను! నేను అనుభవించేది సంతోషమా, దుఃఖమా అని నాకు తెలియదు! నేను కాంక్షిందేదంతా స్వాతంత్ర్యం . . . నువ్వన్నట్టు నా మెడలో ఎటువంటి ప్రకటన పత్రమూ లేదు, కాని ఇతరులు నాకు అన్నివిధాల పేర్లూ పెడుతున్నారు . . . ఐతేనేం, I don't care!" రంగమణి ఒక సిగరెట్టు వెలిగించుకున్నారు.

చర్రుమని శర్మ అడిగారు: "రంగమణి, . . . గోమతి నాగురించి నీకేమైనా చెప్పిందా?"

"గోమతి నాతో చాలా సంగతులు మాటాడింది . . . తను నాకోసం అన్నీ త్యాగంచేసి నాతో లండనికి వచ్చేస్తానని చెప్పింది; ఈ ప్రపంచంలో నేనక్కడికి వెళ్ళాలన్నా సరే నాతోబాటు రావడానికి ఇష్టపడింది. నాకు తెలుసు గోమతి మనసు; ఆమె చెప్పినదంతా నిజం . . . ఆమె నిజంగానే నన్ను ప్రేమించింది . . . "

"నాగురించి ఏమైనా నీతో చెప్పిందా . . . ?

"నీగురించా? చెప్పడానికి ఏముంది? నువ్వొక మందమతి అని అందరికీ తెలుసుగా?"అని రంగమణి నవ్వారు. శర్మకూడా అతనితోకలిసి ఏదో హాస్యం పంచుకున్నట్టు నవ్వినా అది కృత్రిమంగా కనిపించింది; కొంచెం గట్టిగా నవ్వి సగంలో ఆపుకున్నారు.

"రంగమణి, నీవెన్నటికీ మరిచిపోలేని అనుభవం ఏమైనావుందా?"

"ఏం, ఎందుకు అడుగుతున్నావ్?"

"అటువంటి ఘటన ఒకటి నీ జీవితంలో ఉంది . . . కాని అది నీకు రవంతైనా జ్ఞాపకం ఉందా అని తెలుసుకోవాలని నేను తహతహలాడుతున్నాను . . . "

శర్మ గొంతు సవరించుకొని - రంగమణిని కలవరపెట్టాలనే ఉద్దేశంతో -మాటాడారు.

"ఇది చాలా పాతకథ . . . .ఒక స్త్రీ కథ . . . నువ్వు నీ యౌవన హృదయంగురించి గొప్పగా చెప్పుకున్నావ్; రోజూ నీకోసం ఒక కొత్తపువ్వు పూస్తోంది అని పాడావ్; అందుకే నిన్ను ఈ ప్రశ్న అడుగుతున్నాను: గోమతికి నువ్వు చేసినది పెద్ద అన్యాయంకాదా? కాదు అని అన్నావంటే నీ పాటా, నీ ధోరణీ అన్నీ ఉత్తి వేషాలే అని అంటాను." రంగమణిని ఉద్రేకపరచాలనే ఉద్దేశంతోనే శర్మ ఈ మాటలు పలికారు.

“అనంతు, నువ్వేమంటున్నావో నాకు బోధపడింది. కాని నీవనుకున్నట్టు - లేకపోతే, గోమతి ఊహించినట్టు - నేను గోమతిని నిరాకరించలేదు. ఆమె కులగోత్రాలు నేను లెక్కచెయ్యలేదు. నేను స్వేచ్ఛగా జీవించాలని, అందుకు పెళ్ళి ఆటంకంగా ఉంటుందని తీర్మానించాను. ఇన్ని సంవత్సరాల తరువాతకూడా నేను ఆ అభిప్రాయం మార్చుకోదలచుకోలేదు. ‘ప్రేమ’, ‘ప్రేమ’ అని అందరూ అంటున్నారే, అందులో నాకు

నమ్మకం లేదు. 'ప్రేమ' అని నేననేది ఆడ మగవారి మధ్య మాత్రం కాదు. ప్రేమ పల రకాలు - తండ్రి, కొడుకుల మధ్యప్రేమ, సహోదరత్వం, మాతృత్వం, జాలి, దయ, కరుణ, దేశభక్తి- వీటికోసం నేను నా స్వాతంత్ర్యం త్యాగం చెయ్యలేను!" రంగమణి కళ్ళు మూసుకునే ఈ మాటలు పలికినా అతను ఇలాగా అలాగా చెయిలూపుతూ తన అభిప్రాయాలు వక్కాణించారు.

"అంటే నీకు అందరికంటే నీ మీదే అభిమానం ఎక్కువ అనవచ్చా? Narcissism అంటే అదే కదా?"

"కాదు . . . నాలో స్వయంమోహం లేదు. అది మీ అందరిలోనూ నేను చూస్తున్నాను. మీ మీ మనోభావాలని ఇతరులమీద అంటగట్టుకొని మీరు వాళ్ళని ప్రేమిస్తున్నారు. నేనలాంటి మనిషిని కాను. ఇక గోమతి మాటకొస్తే, నాకోసం తను అన్నీ త్యాగం చేస్తానని ఆమె చెప్పింది; ఆ కారణంవలనే నేను ఆమెను తిరస్కరించాను. నీకివన్నీ బోధపడవు. నువ్వు నీ భార్యని ప్రేమించడంకి కారణం - నువ్వు ఆవిడమీద ఆశలు పెట్టుకున్నావు కనుక; నీకేదో కావాలని ఎదురు చూస్తున్నావు కనుక. నేను నీ గురించి వ్యక్తిగతంగా మాటాడడం లేదు. ప్రజల్లో చాలామంది అలాగే ఉన్నారు. నా మనోభావం వేరు. నాకది ఎలా వచ్చిందో నాకు తెలియదు. అది నేనే స్వానుభవంగా అలవాటు చేసుకున్నాను. అనాది విలువలు, సంస్కృతి - ఈ పదాలు నాకు కటువుగా కనిపిస్తాయి. ఇవన్నీ పాటించడంలో ఏదో బిచ్చగాడికి కొన్ని పైసాలిచ్చి తృప్తి పడుతున్నట్టు నాకనిపిస్తుంది. ఒక తల్లి తన బిడ్డమీద అపరితమైన ప్రేమ చూపడం నాకు అసహ్యంగా కనిసిస్తుంది. నా తల్లి నేను పుట్టిన మూడో రోజే కన్ను మూయడంవలన నాకు ఆ భావన కలిగిందేమో? నాకు అమ్మ లేదని నేనెప్పుడూ తాపత్రయ పడలేదు. నాన్నగారి సంగతీ అంతే . . . అతను లండన్ లో ఉండేవారు. సంవత్సరానికి ఒక్కసారి వచ్చేవారు. అతను వచ్చినప్పుడల్లా నాకు ఒక అతిథి వచ్చనట్లనిపించేది. అతను వెయ్యి మైళ్ళ దూరంలోనుంచి వచ్చినా నాలో ఏటువంటి ఉద్రేకమో, అపరిమితమైన భావాలూ కనిపించవు. బాల్యంనుంచి నాకదే అలవాటైపోయింది. నీకు తెలుసుగా, నేను మా Estate Manager మురళీరావుగారి సంరక్షణలో పెరిగాను. నాకు చాలామంది స్నేహితులున్నారు - మగవారు, ఆడవారు, సహోద్యోగులు - కాని వాళ్ళెవరూ నా జీవితశైలిని రూపుదిద్దలేదు. నా జీవితంలో ఎటువంటి పరిమితులూ లేవు; అదే నా లక్ష్యం. మానవుడి మొదటి ధర్మం

స్వాతంత్ర్యం!” రంగమణి పూర్తిగా ఆవేశంలో మునిగిపోయారు. అనర్గళంగా మాటాడడంవలన అప్పుడప్పుడు కొన్ని ఫ్రెంచు పదాలు అతని వివరణలో చోటుచేసుకున్నాయి. రంగమణి తనతో వ్యాఖ్యానం మాత్రం చెయ్యలేదు, అతను మనసులో తర్కవితర్కంలో పొల్గొంటున్నారని శర్మకి అర్థమైంది.

“అవును, నిజం. మీ నాన్నగారు ధనవంతులు, నీకు విదేశాలలో పెరిగిన అనుభవముంది. నీ జీవితశైలి నాకు బోధపడింది . . . మరి మా సంగతో? రంగమణి, మేం సామాన్యులం . . . మాకు మా ఇల్లూ, మా సంస్కృతి, జాతీ - ఇవన్నీ ముఖ్యమైపోయాయి. ఎలాగో చదివి, ఉద్యోగం చేసి, కష్టపడి, కుటుంబాన్ని పోషింటడం మా కర్తవ్యం ఐపోయింది,” అని శర్మ అన్నారు.

“అసలు మా నాన్నగారి ఆస్తి నాకు ఎటువంటి సాయమూ చెయ్యలేదని చెప్తే నువ్వు ఆశ్చర్యపడతావు,” అని రంగమణి ఆరంభించారు. “నేను లండన్ కి వెళ్ళిన కొంత కాలంలోనే మా నాన్నగారి పిత్రార్జిత ఆస్తి పోయింది. అతను నా ఆదరణలో - నేను నౌకావ్యాపారంలో సంపాదించిన ఆదాయంతో - కాలం గడిపారు. ఆ తరువాత కన్ను మూసారు. అంత గొప్ప మనిషి నా దయలో ఉండడం నాకు అసహ్యంగా తోచింది. చావు దగ్గరకి వస్తుందని తెలిసి అతనికి ఉద్వేగం ఎక్కువైంది. అదెలాగంటే ఖైది తనకి చెఱనుంచి విడుదల అని సంతోషపడినట్టు. ఆ తరువాత నేను అమెరికా వెళ్ళాను. నా చదువూ, ఆస్తిమీద ఆధారపడి జీవించడానికి నేను ఇష్టపడలేదు. నా Estate Manager నన్ను లంటన్ లో కలుసుకొని ఇండియాకి తిరిగివచ్చేయమని సలహా ఇచ్చారు. నేనొక నలుగురు వకీళ్ళని కలుసుకొని, కోర్టుమూలంగా మా నాన్నగారి ఆస్తిని మళ్ళీ స్వాధీనం చేసుకోగలనని అతను చెప్పారు. కాని నేనందుకు ఒప్పుకోలేదు. ‘ఇది నాకొక మంచి అవకాశం - ఒక golden opportunity’ - అని నేను గుర్తు చేసుకున్నాను. ‘వ్యక్తిగతంగా నా విలువ ఎంత?’ అని నాలో నేనే ప్రశ్నించుకున్నాను. ఆ ప్రకారం నా జీవితశైలి తీర్చిదిద్దుకున్నాను;చాకలికొట్టులో పని చేసాను; హోటళ్ళలో గిన్నెలు తోమాను; టాక్సీలు నడిపాను. మానవ జీవితంలో అన్ని కోణాలూ, అంశాలూ, నాకు బోధపడ్డాయి. ఆ తరువాత ఇరవై సంవత్సరాలు హాంగ్ కాంగ్ లో వ్యాపారంలో గడిపాను. World War II ముగింపులో మా నాన్నగారి పిత్రార్జిత ఐశ్వర్యంకి సమానంగా సంపాదించాను. అప్పుడే నాకొక ఆలోచన తట్టింది; ఒక పందెం ఆడాలనిపించింది. హాంగ్ కాంగ్ లో నాకు ఒక పెద్ద బంగళా, బేంకులో డబ్బూ,

వివిధవస్తువల దుఖాణం, అన్నీ ఉన్నాయి. 'సరే, ఇవన్నీ పోగొట్టుకున్నతరువాత నేను మళ్ళీ ఇవన్నీ స్వాధీనం చేసుకోగలనా?' అని ఒక ప్రశ్న నాకు తోచింది. 'సరే, అలాగే కానీ', అని నా జీవితంతో పందెమాడాను. అది ఎంత సరసమైన ఆట అని నీకు తెలుసా?"

** ** **

"త్వరలోనే నేను సొత్తులేనివాడుగా మారిపోయాను. అప్పుడు ఎంత మనశ్శాంతీ, హాయీ అనుభవించానో నీకు తెలుసా? జీవితంలో ఒక రాజులాగ అన్నిరకాల వినోదాలూ, సుఖాలూ, అనుభవించిన తరువాత పేదవాడుగా మారుతే అందులోనూ ఒక విధమైన ఆనందం వుంది. కాని అ పరివర్తన అంత సులభంగా జరగదు. అప్పుడే నేను నా జీవితంలో మరపురాని ఒక రహస్యం తెలుసుకున్నాను . . .

ఒక దరిద్రుడు ధనవంతుడుగా మారాలంటే ఎంత కష్టమో, అలాగే ఒక ధనవంతుడు పేద అవడం సులభం కాదని నేను గ్రహించాను. ఉన్న ఐశ్వర్యాన్ని, దానధర్మం చెయ్యడమో, లేక ఏ సముద్రంలో ఉత్తికే పారేయడమో, ఆత్మహత్యకి సమానం. 'సరే, ఏదో సంశయమైన - మరెవరూ కోరని - వ్యవహారంలో పెట్టుబడి చేసిచూద్దాం. మనకేం డబ్బు వద్దు' అనే తలపుతో చేసిన అన్ని పధకాల్లోనూ డబ్బు మొదలూ, వడ్డీతో తిరిగివస్తే పేదరికం ఎలా వస్తుంది చెప్పు? నాకదే జరిగింది. 'ఐశ్వర్యం అనేది స్త్రీ లాగ; ఎవరు దాన్ని అనుభవిస్తారో, వాళ్ళనే అది తీవ్రంగా పట్టుకుంది,' అని చైనా బాషలో ఒక సామెత ఉందని నీకు తెలుసా?" అని రంగమణి అడిగారు.

స్త్రీ అన్నమాట వినగానే, శర్మకి ఆ పక్కగదిలో ఒంటరిగావున్న ఆ స్త్రీ జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆ గదివైపు తలతిప్పి చూసారు. ఆమె ఇద్దరి మగవాళ్ళనీ చూస్తూనేవుంది. ఇప్పుడు శర్మచూపు తనమీద పడగానే, లేచివచ్చి తలుపుని బాగా మూసేసింది. శర్మ కళ్ళు కొంతసేపు ఆతలుపుమీద నాటుకొనివుండడం రంగమణి గమనించారు.

"నాకు పిల్లలు - అన్ని ఛాయలలోనూ - విదేశాలలో ఉన్నారు," అని అతను ఆరంభించారు. "నేనెవరినీ పెళ్ళి చేసుకోలేదు. నా బాధ్యతలు అంగీకరించడానికి ఇష్టపడక నేను పెళ్ళి చేసుకోలేదని నువ్వు అపార్థం చేసుకోవద్దు. నేను ఏ దేశంలో పని చేసినా అక్కడ నేను సంపాదించినది ఆ పిల్లలకీ, లేక ఆ తల్లులకే పూర్తిగా ఇచ్చేసాను. నేను ఇండియాకి తిరిగివచ్చినప్పుడు నా చేతుల్లో ఏమీ లేకపోయినా, నా

హృదయంలో వాళ్ళ ప్రేమానురాగాలు చోటుచేసుకున్నాయి. అసలు, మానవ జీవితంకి అర్థమేమిటి? మధురమైన జ్ఞాపకాలు మనం నిత్యమూ అనుభవించాలి. అదే ముఖ్యం. నా పిల్లలు నాతో లేరని నాకు విచారం లేదు. వాళ్ళూ నాలాగే ఉండనీ . . .

నాకు చావంటే భయం లేదు. తక్కినవారి మరణం విని నేను దుఃఖించను. అసలు దుఃఖమంటే ఏమిటో నాకు తెలియదు. నీకు తెలుసా? నేను ఎప్పుడూ ఏడవలేదు. చాలామంది ఏడ్చి అందులో ఒకవిధమైన సంతోషం అనుభవిస్తారు. కాని నీకు ఒక సంగతి చెప్పాలి. నేను బెంగళూరులో స్థిరపడాలని నిశ్చయించాను. మదరాసుకి వెళ్ళినప్పుడు మా పాత ఇల్లు - పది సంవత్సరాలముందు నేనక్కడ ఉండేవాడిని - చూసాను. అది చూసినవంటనే ఎందుకో నాకు ఏడ్పు వచ్చేసింది. నాకేం అర్థం కాలేదు. ఆ జాగాలో ఇప్పుడొక బాంకు ఉంది. నేను డ్రైవర్ని ఆపమని కొంతసేపు అక్కడ నిలబడ్డాను. నా భావాలన్నీ ఉక్కిరిబిక్కిరి ఐపోయాయి. ఎందుకలాయిందో నాకు తెలీదు . . . ."

"అప్పుడుకూడా నీకు గోమతి జ్ఞాపకం రాలేదా?"

"కరెక్ట్, గోమతిని గుర్తుచేసుకున్నాను, కాని ఆమె పట్ల జాలి, లేక నేనేదో ద్రోహమో చేసాననే తలపు రాలేదు. నాలో ఏంజరిగిందో నీకు చెప్పాను, అంతే. మరేవిధమైన యాతనా, దుఃఖమూ అందులో లేదు. అనంతు, నీకు ఇంకో సంగతి చెప్పాలి. నేను చాలా దేశాలు తిరిగాను. చాలామందిని చూసాను. కాని నాకు పరిచయమైన స్త్రీలని గుర్తు చేసుకున్నప్పుడెల్లా, గోమతే నా మనసును ఆకట్టుకుంటుంది. అంటే గోమతి నా మనసులో చెక్కుచెదరగా ఒక స్థానం అలవరించుకుందనికాదు. బహూశా నాకు పరిచయమైన మొట్టమొదటి స్త్రీ గోమతి అనే కారణమేమో? మా అమ్మకూడ ఆ తరువాతే . . . నా లాగే గోమతికూడా నన్ను గుర్తుచేసుకుంటుందేమో, ఎవరికి తెలుసు?"

సమయం పది గంటలయింది.

"టైమైంది. నేను వెళ్ళాలి," అని శర్మ లేచారు.

రంగమణి కన్ను గీటుతూ, "అనంతు, నీకు పాతివ్రత్యంలో విశ్వాశం ఉంటే, నేను మరేం సలహా ఇవ్వదలచుకోలేదు," అని చెప్పి నవ్వారు.

శర్మ ఏమీ అనక ఊరుకున్నారు.

"అనంతు, ఇది నీ వ్యక్తిగత ప్రశ్న. నీవెప్పుడైనా, నీ పాతివ్రత్యంకి విరుద్ధంగా . . .?"

రంగమణి వాక్యం ముగించడానికి ముందే శర్మ గట్టిగా జవాబిచ్చారు.

"లేదు, ఎప్పుడూ లేదు! ఏం, నీకు నమ్మకం లేదా? అవును మరి, నీ జీవిత శైలి వేరే కదా?"

"నమ్మకం లేదని నేనన్నానా . . . నీకెందుకు అనుమానం? . . .. సరే, నీకు టైమైంది . . . నువ్వూ తొందరపడటతున్నట్లుంది . . ."

"అవును, నేను వెళ్ళడానికి రెడీగా ఉన్నాను . . . "

"సరే. డ్రైవర్ని పిలుస్తాను," అని రంగమణి అన్నారు. గది ద్వారంముందు నిలబడివున్న స్త్రీని చూసి "డ్రైవరు నిద్రపోతున్నాడేమో, అతన్నిపిలు," అని అన్నారు. ఆమె డ్రైవరుని వెతుక్కుంటూ బయటికి వెళ్ళింది.

ఇప్పుడే తనకేదో జ్ఞాపకం వచ్చినట్టు శర్మ మాటాడారు.

"రంగమణి, ఆ తరువాత గోమతి ఏమైందో నీకు తెలుసా? అది నిన్నే నమ్ముకొని అన్నీ త్యాగం చేసేసింది. దానికి కావలసినదంతా నీ సమ్మతి, అంతే. అందుకోసమే కాచుకొనివుంది. నువ్వెక్కడ వెళ్ళినా నీకు తోడుగా ఉండాలని ఆశపడింది. ఆఖరికి దాని గతి ఏమైందో తెలుసా?"

"చెప్పు, . . . ."

"ఆఖరికి ఒక సామాన్య వేశ్యగా, అందరి జీవితాలూ పాడుచేసి, తన జీవితమూ నాశనం చేసుకుంది. ఆమె విషాద ముగింపుకి నువ్వే కారణం. నువ్వుకాని ఆమెను తిరస్కరించకపోతే గోమతి నీ ఆదర్శపత్నిగా ఉండిఉంటుంది."

రంగమణి నవ్వారు. తలవంచి, మాటాడారు.

"గోమతికూడా అలాగే అనుకుందేమో, ఎవరికి తెలుసు? నా మీద పగ తీర్చుకోవాలని అటువంటి మోటుతనంతో ఆత్మనిందకి పూనుకుందేమో? నామీదున్న కోపం, అన్యాయంతోపాటు తన్ను తనే శిక్షించుకోవడంలో కలిగే సంతోషం - ఇవన్నీ గోమతి ప్రవర్తనకి కారణం. ఆమె దుర్ఘటనకి నాకెటువంటి బాధ్యతా లేదు. తన జీవితాన్ని గోమతి తనే తీర్చిదిద్దుకుంది. మొట్టమొదట నా హృదయంలో గోమతి నిజంగానే చోటుచేసుకుంది, అది తప్పిస్తే మా ఇద్దరికీ మరేం బంధుత్వం లేదు. ఆ కారణంవలనే నేను ఏ స్త్రీతో ఉన్నా నా మనసులో ఏవేవో భావాలు తోచినప్పుడు, గోమతి నా జ్ఞాపకంలో వస్తుంది. నేను హిరోషిమా వెళ్ళి ఆ ఘోరం చూసినప్పుడుకూడా కళ్ళు

తడబెట్టుకోలేదు. కాని, ఎందుకో, గోమతి ఇల్లు చూడగానే నాకెలాగో ఐపోయింది. అదే నాకర్థం కాలేదు. ‘ఇదేదో పిచ్చితనం,’ అని నాలో నేనే చెప్పుకున్నాను.”

“నీకోసం అన్నీ త్యజించి - తన జీవితం నీకు ఆమె పూర్తిగా సమర్పణ చేసేసిందనికూడా అనవచ్చు - ఆఖరికి ఒక అనాధిగా, నిరుపేదగా, దిక్కుమాలిన అవస్థలో కన్నుమూసిందని విన్నతరువాత నీకు ఆమెమీద జాలీ, దయా మచ్చుకైనా లేవా?”

“నిజం చెప్పాలంటే నాకు అటువంటి పిచ్చి భావాలేవీ లేవు. ఒక స్త్రీ ఒక మగవాడ్ని సంతోషపెడుతుంది, తనూ అతనితో సుఖం పంచుకుంటుంది. దానికి మించి ఒక మగవాడు లేక స్త్రీ పెట్టి ఆలోచనల్లోపడి, ఏమేమో కల్పించుకొని, తన భవిష్యత్తుని ఇంకొకరికోసం పందెయమాడితే ఏమవుతుంది? చికాకూ, ద్వేషమే ఇద్దరి బ్రతుకుల్లో చోటుచేసుకుంటాయి. అనంతు, కొంచెం ఆలోచించు: ఎవరైనా సరే, ఇంకొకరు - అతనితో ఎటువంటి బాంధవ్యం ఉన్నా - తన భవిష్యత్తుని నిర్ణయించడానికి ఒప్పుకుంటారా? ఒక మగవాడు తన ప్రియురాలిని చూసి ‘నేను నిన్ను వదలి వుండలేను,’ అని వాగ్దానం చెయ్యడం నాకు చాలా అసహ్యంగా, అసభ్యంగా కనిపిస్తోంది. గోమతి ఆ విధంగా ప్రవర్తించడంతో నాకు ఆమెపై ఉన్నఆత్మీయత, భావాలూ, తొలగిపోయాయి.”

ఇంతలో, రంగమణి డ్రైవరు కారుని షెడ్డునుంచి బయటకి తీసుకొచ్చాడని తెలిసింది.

“కారు రెడీగా ఉంది,” అని అంటూ స్త్రీ లోపలికి వచ్చింది; శర్మ లేచి నిలబడ్డారు. తన్ను పంపించేయాలని రంగమణి ఎందుకు ఆతురతగా ఉన్నాడని శర్మకి ఇప్పుడు బోధపడింది. రంగమణి సోఫానుంచి లేచి శర్మకి వీడ్కోలు చెప్పాలనుకున్నారు కాని బాగా మత్తెక్కివుండడంవలన అతను సోఫానుంచి లేవలేకపోయారు.

“నేను బాగా తాగేసాను. అనంతు, ఇన్నిరోజులతరువాత నిన్ను కలుసుకున్నందుకు నాకు సంతోషంగా ఉంది. మనం పాత జ్ఞాపకాలన్నీ పంచుకున్నాం. మళ్ళీ రేపు కలుసుకుందామా? నిన్నెక్కడ మళ్ళీ చూడడం?” అని రంగమణి అడిగారు.

“అదే జాగాలో . . . .బీచ్ లో . . . రేపు నాలుగన్నరకి కలుసుకుందాం . . . నువ్వేం ఇప్పుడు లేచివచ్చి నాకు వీడ్కోలు చెప్పనక్కరలేదు. గుడ్ బై . . .” అని అంటూ శర్మ బయటకి నడిచారు. ఆ స్త్రీ ద్వారం దగ్గర, శర్మ వెళ్ళగానే తలుపు మూయడానికి,

సిద్ధంగా నిలబడివుంది. శర్మ రెప్పవాల్చకుండా ఆమెను చూసారు. తను వెళ్ళినతరువాత, రంగమణిముందు ఆ స్త్రీ రూపు, వాలకం ఆతని ఊహలో కలిసి వచ్చాయి. దానితో 'వీడెలాగ . . ? ' అనే ప్రశ్నకూడా అతని మనసులో లేచింది.

ఆ స్త్రీకూడా కొంచెం తాగినట్టుంది. శర్మని చూసి నవ్వింది,

"ఏం, ఎందుకు నవ్వు?" అని శర్మ ఆమెపక్క నిలబడ్డారు. గభీమని తన దేహంలో త్రాణ వచ్చినట్టు శర్మకి తోచింది.

"ఏమీ లేదండీ." అని ఆమె జవాబు చెప్పింది; ఇంకా నవ్వుతూనేవుంది.

"ఏం నవ్వు, బోసి నవ్వు!" అని ఎగతాళి చేస్తూ శర్మ తల తిప్పి రంగమణిని చూసారు. రంగమణి సోఫాలో వెల్లవెలికల పడుక్కొని, జోరుగా సిగరెట్టు కాల్చుతున్నారని తెలిసింది.

"ఎందుకే ఈ నవ్వు?" అని మళ్ళీ అడుగుతూ శర్మ ఆ స్త్రీ బుగ్గని చెయితో దువ్వుతూ గిల్లారు. తన శరీరాన్ని ముందుకు తోసి అమె దేహాన్ని ముట్టుకున్నారు.

"ఆ . . . ఆ . . . " అని స్త్రీ కీచుమంది. కాని అందులోనూ కొంచెం సరసం చోటుచేసుకుంది.

శర్మ వెంటనే ఆమెను పదులుకొని వెనక్కి జరిగారు. "నేనెందుకలా చేసాను? అది పొరబాటే . . . ." అనిమూల్గుతూ, తలెత్తకుండా కారుకి వెళ్ళారు.

స్త్రీ తలుపు మూసినతరువాత తన బుగ్గని చెయితో తుడుచుకుంది. "అల్పబుద్ధంటే ఇదే. కొందరు చెడిపోవాలన్నా డబ్బేం ఖర్చు చెయ్యడానికి ఇష్టపడరు," అని తనలో గొణుక్కుంది.

** ** **

ఆ రాత్రంతా శత్మకి నిద్ర పట్టలేదు.

చాలా రోజులుగానే శర్మకి రంగమణిపట్ల విరుద్ధ భావాలున్నాయి. అతనికి రంగమణితో దృఢమైన స్నేహమూ, చనువూ కలిసివున్నా తనింటికి రంగమణిని శర్మ ఎప్పుడూ ఆహ్వానించలేదు. రంగమణి స్త్రీలోలుడని అతనికి భయం. రంగమణి మూలంగా తన ఇంట్లోని ఆడవాళ్ళకి ఏమైనా అపవాదం వస్తే? రంగమణి స్త్రీలని ఆకర్షించడంలో నిపుణుడని శర్మకి తెలుసు. కాని ఇప్పుడు రంగమణి గురించి తను అలాగ సంశయించినందుకు అతను సిగ్గు పడ్డారు. ఆ మాటకు వస్తే. రంగమణి కాదు, తనే కపటంగా ప్రవర్తించుతున్నట్టు అతనికి అంతరాత్మ తెలియజేసింది. ఇన్ని

సంపత్సరాల తరువాతకూడా రంగమణిలో ఎటువంటి మార్పూ లేదు. తనపై రంగమణికున్న భావాలుకూడా అలాగే ఉన్నాయి. ఆ పరిజ్ఞానమే శర్మని బాధించింది.

ఒకప్పుడు శర్మ, రంగమణి ఒకే కాలేజీలో చదివారు. రంగమణి పూర్వీకులు ధనవంతులు. అతను పుట్టిన మూడవరోజే తల్లి పోయింది. అతన్ని Estate Manager మురళీరావు Estate కి వారసుడుగా, స్వేఛ్ఛగా, తన సొంత కొడుకులాగ పెంచారు. రంగమణికి అతనే తల్లీ, తండ్రి అనాలి. పదేళ్ళవరకూ రంగమణి చిత్తూరులో ఒక Retired Principal దగ్గర చదివాడు. ఆ తరువాత మద్రాసుకి వచ్చి, ముందు ఒక Convent లో, తరువాత కాలేజీలో చదవాడు. అక్కడే అనంత శర్మకి మిత్రుడయ్యాడు. శర్మలో కనిపించే సామాన్యత, పిలక, నుదిటిలో చందనబొట్టు, తలపాగ, అమాయకత్వం అతన్ని బాగా ఆకర్షించాయి.

కాలేజీలో చదువుతున్న రోజుల్లో మురళీరావు ఒక ఇంటి రెండవ మిద్దెలో రంగమణి, శర్మకి జాగా అమర్చారు. ఆ ఇల్లు అతని ఉంపుడుగత్తె చెల్లత్తమ్మాళ్ కి చెందినది. ఆమెకి గోమతి అని ఒక కూతురు. గోమతి మురళీరావుగారి వ్యభిచార సంబంధమైన కూతురని కొందరు అనేవారు. అది ఎంతవరకూ నిజమో తెలియదు. కాని గోమతిలో కనిపించే గాంభీర్యం, రాజఠీవి అందరినీ ఆకర్షించింది. తన పదిహేనేళ్ళ వయసులో గోమతి రంగమణిని ప్రేమించింది. కాని అతను అదేం తెలియక తన చదువుల్లోనూ, దైనిక వ్యవహారాల్లోనూ మునిగిపోయాడు. గోమతికి రంగమణిమీదున్న వ్యామోహం మొట్టమొదట గుర్తించినది శర్మే. అతనికి స్త్రీల దుర్బలం బాగా తెలుసు. అతనికి తొమ్మిదేళ్ళప్పుడు తల్లిదండ్రులు ఆచారప్రకారంగా పెళ్ళి చేసారు. కాని అందకుముందే అతను తన రాబోయే బార్యతో రహస్యంగా సంబంధం పెట్టుకున్నారు. ఆది అతనికి మొదట తను అపరాధం చేస్తిన్నట్టు అనిపించినా, ‘సరే, ఆమె మన రాబోయే భార్యేకదా?’ అని తన్ను ఓదార్చుకునేవారు. శర్మ జీవితమంతా ఇలాగే సాగింది: తప్పు చేసానని బాధ పడడం, వెంటనే ఏదో చెప్పుకొని దాన్ని తోసిపారేయడం; ఇదే అతనికి అలవాటైపోయింది. అటువంటి నిక్షిప్త భావాలు ఇప్పుడు మళ్ళీ బయటికి రావడంతో, అతనిలో లేచిన ప్రశ్న ఒక్కటే: ‘నేనెందుకు ఈ రంగమణిని కలుసుకున్నాను?’

“సరే, ఏదో అకస్మాత్తుగా ఇద్దరం కలుసుకున్నాం. రంగమణితో కొంచసేపు బీచ్ లో మాటాడితే చాలదా? ఎందుకు వాడితో, హోటలుకి వెళ్ళి, ఇదీ అదీ తాగి, మాటాడి

మనసు పాడుచేసుకోవాలి? అంతేకాదు . . .. నేనక్కడ ఒక పిచ్చిపనికూడా చేసాను. ఆ స్త్రీ బుగ్గ గిల్లాను! . . . ఆమె నాగురించి ఏమనుకుందో? . . . .ఏం, ఎందుకు? నేనేం తప్పు చేసాను? . . . ముసలివాడు ప్రేమతో ఆడపిల్లల బుగ్గలు తాకితే తప్పా? నేనదే చేసాను . . . అదేకదా జరిగింది?"

శర్మ నిద్ర పట్టక మళ్ళీ లేచి కూచున్నారు. వీపంతా దురద . . . చెయిని ఇలాగో అలాగో తిప్పుకొని వీపు గోకుకున్నారు. చివరికి ఎలాగో ఒక విసినకర్ర తెచ్చుకొని వీపుని రుద్దుకున్నారు.

పక్కగదిలోనుంచి ఏదో సందడి. శర్మ చెవులు నిక్కపొడుచుకొని విన్నారు. అంతా తన కల్పన కాబోలు . . . .అతని మనసు త్వరగా రంగమణి ఉన్న హోటలుకి వెళ్ళింది. తలుపుని దాటి కళ్ళు గదులన్నీ తొంగి చూసాయి.

'రంగమణి ఎంత మోటుగా పాతివ్రత్యం గురించి నన్ను అడిగాడు! అపును, నేను చెప్పినది నిజం. రంగమణికి గర్వం ఎక్కువ, అందుకే నన్ను ఆ ప్రశ్న అడిగాడు వెధవకేమైనా తెలుసా? ఆ రోజు గోమతి ఏమైనా చెప్పి ఉంటుందా? కాని ఇన్ని రోజులతరువాతకూడా వీడేమీ మాటాడడే? నన్ను నంగనాచి అని అనుకున్నాడేమో? కానీ, I don't care! ఆ యముడూ, చిత్రగుప్తుడు వచ్చి అడిగినా నేను ప్రమాణం చేస్తాను . . . నా జీవితంలో మంగళం తప్ప మరే స్త్రీకి చోటులేదు . . . .'

'నాకు మంగళం మూలంగా నలుగురు పిల్లలు. అందరూ మంగళం ఊరులోనే పుట్టారు. ఆమె తల్లిదండ్రులు మంగళం ని ముద్దుగా పెంచారు. మంగళం కానుపుకోసం ఏడవ మాసం వెళ్తుంది. బిడ్డకి నాలుగు మాసాలనగా తిరిగి వస్తుంది. అటువంటి సమయంలోనే ఒకొఒకనారి నేను గోమతితో చిక్కులో పడ్డాను. నేనెప్పుడూ గోమతిని కలలోకూడా కల్పన చేసేవాడినికాను. ఆమెకున్న హోదా, గౌరవం, అందం, రంగమణిమీద ఆమెకున్న ప్రేమ - ఇవన్నీ ఎలాగ వర్ణించడం? రంగమణిని కలుసుకోవాలనే నెపంతో నేను గోమతిని వెళ్ళి చూసేవాడిని. ఆమె నా పిలక చూసి నవ్వేది; 'పిలక సార్!' అని ఎగతాళి చేసేది. ఆ తరువాత మర్యాదగా 'పిలక మాస్టర్!' అని పిలిచేది. రంగమణి వ్యాపారం మీద విదేశాలు వెళ్ళినప్పుడు గోమతి అతనికోసం కాచుకొనివుంటానని వాగ్దానం ఇచ్చింది. ఇప్పుడు రంగమణి ఎంత వాదించినా సరే - అతను గోమతికి పెద్ద ద్రోహం చేసాడన్నది నిజం. ఆమె వినవి అలాగే కొట్టిపారేసాడు. ఆమెతో ఆఖరివరకూ మాటాడనూ లేదు. తను విదేశానికి వెళ్ళడానికి ఒక వారం

ముందు వీడ్కోలు పార్టీలలో పాల్గొని ఇలాగా అలాగా తిరిగాడు; నేనూ అతనితో ఆ పార్టీలకి వెళ్ళి  ఏ మూలనో నిల్చొని తమాషా చూసేవాడిని. గోమతికూడా తను రంగమణికి ఒక పార్టీ ఇవ్వదలచుకొని నన్నూ ఒక Special Guest గా రమ్మంది; నేనూ వెళ్ళాను. తన ఇంటి మేడ ఎంత చక్కగా గోమతి అలంకరించింది! ఆ రోజుల్లో Electricity లేదు; అందువలన  గంటలూ, లాంతరులూ అమర్చింది. ఆ రాత్రంతా రంగమణి వస్తాడని కాచుకొని కూర్చుంది. వాడు రానేలేదు. రెండు చేతులు టేబులుమీద ఆనుకొని, ధార ధారగా కన్నీరు కార్చుతున్న గోమతిని నేను చూసాను. నేనూ రంగమణి తప్పక వస్తాడని ఎదురుచూసాను. నాకు ఆకలేసింది. గోమతి నన్ను ఆహారం రుచి చూడమని అనడంతో నేను భోజనం చేసాను. త్వరలో నా ఆకలి పోయింది. ఆ తరువాత నేనలాగే వాలాను, సోఫాలో నిద్రపోయాను. మళ్ళీ లేచి చూసేసరికి అర్ధరాత్రి బాగా దాటిపోయింది. గోమతి ఏదో తాగుతున్నట్టు కనిపించింది. కొంతసేపుముందు ఏదో గంధర్వలోకంలో అప్సరసగా గోమతి కనిపించింది; కాని, ఇప్పుడేమో పిచ్చిభ్రమతో, దుడుకుగా కనిపించింది. గభీమని నన్ను పట్టుకొని తనవైపు లాక్కుంది . . .

‘అబ్బా, ఆ సుఖం ఎలా వర్ణించడం? . . . స్వర్గమంటే అదే! . . . అలాంటిది నేను మరెప్పుడూ అనుభవించలేదు! . . . ఎందరు మగవాళ్ళు గోమతికోసం ఆమె ఇంటి వాకిలిముందు కాచుకొనివున్నారు? . . . వాళ్ళతో పోల్చుతే నేనెవరు?’

“నేను ఊరు వదిలి వెళ్ళడానికిముందు గోమతిని కలుసుకున్నాను. ‘గోమతీ, మన మధ్య జరిగిన ఈ ఘటన మరెవరికీ చెప్పవద్దు . . .  నువ్వు నాకు మాట ఇవ్వాలి,’ అని అడిగాను. గోమతి నవ్వింది. అప్పుడే నా భయానికి ఎటువంటి కారణమూ లేదని గ్రహించాను. ‘నేనందుకు చెప్తానోయ్? చెప్తే నాకేకదా నింద?” అని అంది. గోమతి ఎప్పుడూ అలాగే మాటాడుతుంది. దానికి నిజంగానే గర్వం ఎక్కువ. అదే ఆమెకి అందం కూడా . . . రంగమణి అవన్నీలెక్కచెయ్యలేదు . . . .ఆమెను తిరస్కరించాడు.”

శర్మ రెండుసార్లు ఆవలించారు. పడకమీద దొర్లారు.

నిద్ర రావాలని ప్రార్ధించారు. టైము అర్ధరాత్రి దాటిపోయింది.

‘దేవుడా, నేనెప్పుడు నిద్రపోతాను . . . .అసలు, మానవజీవితం అంతేకదా? మనుషులు చపలబుద్ధితో ఏమేమో చేస్తుంటారు, తోవతప్పుతారు, అది సహజమే

కదా? దాని గురించి ఈ రంగమణి గొప్పగా అడుగుతున్నాడు . . . సరేలే, వాడిగురించి నాకెందుకు గోల? నేనెందుకు నా నిద్ర పాడుచేసుకోవాలి?'

'. . . కాని అలాగ అలక్ష్యం చేస్తే సరైపోతుందా? . . . రంగమణి ఎది చేసినా దాన్ని నిష్కామ కర్మగా భావిస్తున్నాడని అనవచ్చా? అదేకదా మన పురాణాలు వక్కాణించి చెప్తున్నాయి? అదే రంగమణి జీవితశైలి అనవచ్చా? 'నీరు తామరాకుమీద అంటదు; అలాగే ఫలాపేక్ష లేకుండా కర్మయోగులు జీవిస్తారు' అని పెద్దలు అన్నారుగా? ఐతే మరి, రంగమణి మద్రాసులో గోమతి ఇల్లుచూసి ఎందుకు ఏడ్చాడు? అదే నాకు అర్థం కావడంలేదు . . . .'

'రంగమణి జీవితం నిండుగా అభీలాషతో అనుభవిస్తున్నాడు. అతని మనసూ, శరీరమూ సమగ్రంగా పని చేస్తున్నాయి . . . . దేవుడా. నేను నిద్రపోయేదెప్పుడు?'

** ** **

"డ్రైవర్, ఇవాళ బీచ్ వొద్దు. కపాలీశ్వరస్వామి కోవిలకి వెళ్దాం."

"సరే సార్ . . . "

కారు త్వరగా సాగింది.

సావధానంగా, తొందరపడకుండా శర్మ కోవిల ద్వారంముందు నిలబడి, తన చేతికర్రని నేలమీద ఆనుకొని, జనసమూహాన్ని చూస్తూ నిలబడ్డారు.

గుడిగంటలు మోగుతున్నాయి. గుంపులు గుంపులుగా స్త్రీలు రకరకాల పట్టుచీరలతో శర్మని దాటి కోవిలలోకి ప్రవేశిస్తున్నారు. అనంత శర్మ తల ఎత్తి, ఒక చెయితో కనుబొమ్మలు చాటుచేసుకుంటూ ఆ జనసమూహం వెనుక నడిచారు.


'అరే, శర్మగారు ఇక్కడేం చేస్తున్నారు? . . . అక్కడ బీచ్ లో రంగమణి కాచుకొని ఉన్నారే?'

"కాచుకోనీ . . . . ఎవరు కాచుకొని ఉండలేదు?"

**********

*(మూలం ప్రచురణ: ఆనంద వికటన్, 1967)*

# తన పాత్రలగురించి జయకాంతన్ . . .



నేను నా పాత్రలని నా పాఠకులకే వదిలేస్తాను.
వాళ్ళు వారిగురించి మాటాడనీ, విమర్శించనీ; నేను
మరేం చెప్పదలచుకోలేదు. నేను సృష్టించిన పాత్రలు సమాజంలో
వాస్తవంగా ఎక్కడా కనిపించరని కొందరనడం నాకు తెలుసు.
నా పాత్రలు మన పురాణగాధల్లో, ఇతిహాసాల్లో వచ్చే పాత్రలలాగ.
అవి సాంకేతిక భాషలోనే మనకి వ్యక్తమవుతాయి.